
'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 17 | సంచిక: 335

మంగళవారం 25-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కివీస్‌తో కలిసి సెమీస్‌కు భారత్

చాంపియన్స్ ట్రోఫీ నుంచి బంగ్లాదేశ్, పాకిస్తాన్ అవుట్


-14లో



స్త్రీ శక్తి.. ఇంధనమై

నారాయణపేట జిల్లాలోని తొలి మహిళా పెట్రోల్ బంక్‌పై కథనం

-13లో



ప్రపంచం చూపు భారత్ వైపు..

దేశ ఆర్థిక ప్రగతిపై ప్రపంచం ఆశాభావంతో ఉందని, ఇలాంటి పరిణామం మన దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



'ఢిల్లీ' స్పీకర్‌గా విజేందర్‌గుప్తా

ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు సోమవారం మొదలయ్యాయి. స్పీకర్‌గా బీజేపీ ఎమ్మెల్యే విజేందర్ గుప్తా ఎన్నికయ్యారు.

వివరాలు 6లో ▸



కూటమిదే జర్మనీ..

జర్మనీ ఎన్నికల్లో సీడీయూ, సీఎస్‌యూ కూటమి విజయం సాధించింది. ఫ్రెడరిక్ మెర్జ్ తదుపరి చాన్స్‌లర్ కావడం ఖాయమైంది.

వివరాలు 6లో ▸



ఖైదీల పరస్పర బదిలీకి సిద్ధం

రష్యాతో యుద్ధాన్ని ముగించేందుకు, ఇరు దేశాల్లో ఉన్న మొత్తం ఖైదీల మార్పిడికి తాను సిద్ధంగా ఉన్నట్టు జెలెన్‌స్కీ ప్రకటించారు.

వివరాలు 6లో ▸




బీపీకి మందు బీ హ్యాపీ..

హై బీపీ కారణంగా పక్షవాతం, గుండెపోటు, మూత్రపిండాలు దెబ్బతినడం, కంటి చూపు కోల్పోవడం లాంటి అనర్థాలతోనూ, అలాగే కిడ్నీల వంటి ఎండ్ ఆర్గాన్స్ వైఫల్యంతో ఏటా ఎంతో మంది మరణిస్తున్నారు. ఇది ఉన్న విషయమే బయటకు తెలియకపోవడం, అది దెబ్బతీసే అవయవాలైన కిడ్నీ వంటివి పూర్తిగా చెడిపోయేవరకు వాటి లక్షణాలేమీ బయటకు కనిపించకపోవడంతో ఇది నిశ్శబ్దంగా మరణాలకు కారణమవుతుంటుంది. అందుకే దీన్ని సైలెంట్ కిల్లర్ అని కూడా అంటారు. హైబీపీ తెచ్చిపెట్టే సమస్యలపై ప్రత్యేక కథనం..

సాక్షి ఫ్యామిలీలో

ఫ్రెషర్స్‌కు జాబుల జాతరే!



కొత్తగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన, పూర్తి చేసుకోబోతున్న వారికి శుభవార్త. కొత్తగా ఇంజనీరింగ్, ఇతర డిగ్రీలు పూర్తిచేసిన వారికి ఉద్యోగాలు దొరకడం కష్టమనే అభిప్రాయాన్ని పటాపంచలు చేస్తూ.. ఫ్రెషర్లకు ఉద్యోగ అవకాశాలు పెరగనున్నట్టు టీమ్‌లీజ్ నివేదికలో వెల్లడైంది. దేశంలోని నాలుగింట మూడొంతుల కంపెనీలు ఫ్రెషర్లను రిక్రూట్ చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు తేలింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)తోపాటు ఇతర టెక్నాలజీ కంపెనీలు, సంస్థలు తమ ప్రాజెక్టు డిమాండ్లకు అనుగుణంగా ఫ్రెషర్ల నియామకానికి మొగ్గుచూపుతున్నట్టు తెలిపింది.

వివరాలు 16లో

మళ్లీ కూలింది!

సొరంగంలో మరో మీటర్ మేర పెరిగిన మట్టి, శిథిలాల ఎత్తు

మూడో రోజూ చిక్కని కార్మికుల జాడ

- ➤ పైకప్పు కూలిపడిన చోట 15-20 మీటర్ల ఎత్తులో పేరుకుపోయిన బురద
- ➤ సొరంగం లోపల ఐదో రెస్క్యూ ప్రయత్నం కూడా విఫలం..
- ➤ ఐదో బృందంతో లోపలికి వెళ్లిన జీఎస్ఐ నిపుణులు, డ్రోన్ సాయంతో పరిశీలన
- ➤ పెద్దగా ఫలితం ఇవ్వని సోనార్ టెక్నాలజీ, స్నిఫర్ డాగ్స్.. 'ర్యాట్ హోల్ మైనింగ్' బృందంతో మరో రెస్క్యూ టీం ఆపరేషన్
- ➤ భూఉపరితలం నుంచి సొరంగంలోకి తవ్వకాలకు జీఎస్ఐ నిపుణులు నో
- ➤ ఒకవేళ అలా తవ్వితే సొరంగం మరింతగా కూలుతుందని హెచ్చరిక
- ➤ ఆగకుండా టన్నెల్‌లో చేరుతున్న ఊట నీటితో సహాయక చర్యలకు విఘాతం
- ➤ సొరంగం వద్దకు చేరుకున్న ఇద్దరు కార్మికుల కుటుంబ సభ్యులు
- ➤ లోపల చిక్కుకుపోయిన వారి యోగక్షేమాలపై నేడు ప్రభుత్వం ప్రకటన చేసే అవకాశం



లోకో ట్రైన్ ద్వారా సొరంగం లోపలికి తీసుకెళ్లేందుకు సిద్ధం చేసిన జనరేటర్

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, నాగర్‌కర్నూల్: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) ఒకటో సొరంగం పైకప్పు మళ్లీ కూలింది! లోపల పేరుకుపోయిన మట్టి, శిథిలాల ఎత్తు మరో మీటరు మేర పెరిగిపోయింది. దానికితోడు నీటి ఊట ఆగకుండా కొనసాగుతోంది. దీనితో సహాయక చర్యల కొనసాగింపు మరింత కష్టంగా మారింది. సొరంగంలో చిక్కుకుపోయిన వారి కోసం చేపట్టిన ఐదో రెస్క్యూ ప్రయత్నమూ విఫలమైంది. దీనితో బాధితుల కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఒక్కసారిగా కూలిపడటంతో..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4.15 లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ

మిగతా 2వ పేజీలో ▶

టీబీఎం ముక్కలు చెక్కలు!

- సొరంగం కూలడంతో ముక్కలుగా విరిగిన టన్నెల్ తవ్వే యంత్రం.. శిథిలాల్లో చెల్లాచెదురుగా విడిభాగాలు
- మళ్లీ పనిచేసే అవకాశాలు లేవంటున్న ఉన్నతాధికారులు

- వివరాలు 3లో

నేటి నుంచి ఎల్ఆర్ఎస్ షురూ

ఆమోదించిన దరఖాస్తులకు ఫీజులు చెల్లించేందుకు అవకాశం

- ఏర్పాట్లు పూర్తి చేసిన పురపాలక శాఖ.. రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్‌తో ఎల్ఆర్ఎస్ పోర్టల్ అనుసంధానం
- మొత్తం 25.67 లక్షల దరఖాస్తుల్లో 9.21 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తి
- నీటి వనరులకు 200 మీ. లోపు స్థలాలకు నో చాన్స్

పూర్తిస్థాయి విధివిధానాలు నేడు ప్రకటించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. మంగళవారం నుంచి ఇప్పటికే ఆమోదించిన దరఖాస్తులకు ఫీజులు చెల్లించడం ద్వారా క్రమబద్ధీకరించుకునేందుకు పురపాలక శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ శాఖ పరిధిలో ఉన్న ఎల్ఆర్ఎస్ పోర్టల్‌ను ఫీజు చెల్లింపులకు వీలుగా రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్‌కు అనుసంధానం చేసే ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు సంబంధించి పూర్తి విధి విధానాలతో కూడిన ప్రభుత్వ ఉత్తర్వులు ఒకటి, రెండురోజుల్లో విడుదలయ్యే అవకాశం ఉంది.

ఆన్‌లైన్ పద్ధతిలోనే చెల్లింపులు

ఆమోదం పొందిన వెంచర్లకు సంబంధించి ప్లాట్ల వారీగా ఫీజులను రిజిస్ట్రేషన్ల శాఖకు ఆన్‌లైన్‌లో నేరుగా చెల్లించేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పట్టణాభివృద్ధి సంస్థలు, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, గ్రామ పంచాయతీల్లో.. ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన 25.67 లక్షల దరఖాస్తుల సమాచారంతో కూడిన ఎల్ఆర్ఎస్ పోర్టల్‌తో రిజిస్ట్రేషన్ శాఖ



మిగతా 16వ పేజీలో ▶

ప్రభుత్వాన్ని ఏం చేద్దాం అనుకుంటున్నారు?

- ఉన్నతాధికారులపై ఇటీవలి సమీక్షలో మంత్రుల ఆగ్రహం!.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై మండిపాటు
- సమన్వయం లేకపోతే ఎలా అని నిలదీత

16లో

కరీంనగర్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్. పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు.. బీజేపీని బొంద పెట్టాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

- బీజేపీ, బీఆర్ఎస్‌లు చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాయి
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత ఎవరికి ఓటేస్తారో చెప్పాలి
- వండిన అన్నంలో ఉప్పు పోసేందుకు బీజేపీ ప్రయత్నం
- బండి సంజయ్‌వి వీధి నాటకాలు
- 'మెట్రో, రింగ్‌రోడ్డు'లకు కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని ధ్వజం
- నరేందర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి

సాక్షి ప్రతినిధులు నిజామాబాద్/కరీంనగర్/మంచిర్యాల: 'లోక్‌సభ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టలేని బీఆర్ఎస్ రాష్ట్రంలో ఉప ఎన్నికలొస్తే గెలుస్తుందట. అధికారంలో ఉన్న పదేళ్లలో చాలామంది ఎమ్మెల్యేలను చేర్చుకోవడంతోపాటు కాంగ్రెస్ నుంచి గెలిచిన సబితకు, టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌కు మంత్రి పదవులిచ్చినప్పుడు రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయి? బీఆర్ఎస్‌ది గతమే.. భవిష్యత్తు లేదు. పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీని బొంద పెడితేనే.. తెలంగాణ ప్రాజెక్టులకు

మిగతా 12వ పేజీలో ▶

కృష్ణా జలాలపై రాజీ మార్గం!

- తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అంగీకారం.. రెండు రాష్ట్రాల సీఈలతో కమిటీ ఏర్పాటు
- 27న కృష్ణా బోర్డు తదుపరి భేటీలో కేటాయింపులపై ఉత్తర్వులు

16లో

ఉద్యోగానికి 'ఇంటర్న్' బాట

- క్షేత్రస్థాయిలో నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కోసం పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్..
- మొదటి దశలో భారీగా దరఖాస్తులు
- శిక్షణ పొందుతున్న 28,141మంది
- రెండో దశ దరఖాస్తుల స్వీకరణ షురూ

2లో

లైఫ్ సైన్సెస్ రంగంలో విస్తృత అవకాశాలు

- దిగ్గజ సంస్థలను ఆకట్టుకోవడానికి 'చైనా ప్లస్ వన్' వ్యూహం
- ఆమ్జెన్ ఇన్నోవేషన్ టెక్నాలజీ ఫెసిలిటీ సైట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

3లో

ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి

- అప్పుడు ఆ కేసు ఎలా ముందుకెళ్లదో మేమూ చూస్తాం
- ఫోన్ ట్యాపింగ్‌పై చర్యలు తీసుకోని అసమర్థుడు రేవంత్
- బీఆర్ఎస్‌తో కుమ్మక్కై కేసును నిర్వీర్యం చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపణ



సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అప్పుడు ఆ కేసు ఎలా ముందుకెళ్లదో తామూ చూస్తామని సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్‌పై చర్యలు తీసుకోని అసమర్థుడు రేవంత్ అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన అసమర్థతను బీజేపీపైన రుద్దే ప్రయత్నం

మిగతా 12వ పేజీలో ▶



'ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ' నగారా

మార్చి 3న వెలువడనున్న నోటిఫికేషన్

తెలంగాణ మండలిలో 5 స్థానాలకు మార్చి 20న పోలింగ్

ఏపీలోని 5 స్థానాలకు కూడా అదేరోజు పోలింగ్.. కౌంటింగ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల నగారా మోగింది. ఏపీ, తెలంగాణలో 10 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 29న ఖాళీ అయ్యే ఈ స్థానాలకు గాను మార్చి 3న నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ఈసీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అదే నెల 20న ఎన్నికలు జరుగుతాయని పేర్కొంది. అదేరోజు ఓట్ల లెక్కింపు ఉంటుంది. కాగా ఏపీలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు కూడా ఇదే సమయంలో ఎన్నికలు జరుగుతాయని ఈసీ ప్రకటించింది. మార్చి 24 లోపు ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తి అవుతుందని తెలిపింది.

ఇదీ ఎన్నికల షెడ్యూల్	
నోటిఫికేషన్ విడుదల	: మార్చి 03
నామినేషన్లకు చివరి గడువు	: మార్చి 10
నామినేషన్ల పరిశీలన	: మార్చి 11
ఉపసంహరణకు గడువు	: మార్చి 13
పోలింగ్ తేదీ (ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు)	: మార్చి 20
ఓట్ల లెక్కింపు (సాయంత్రం 5 నుంచి)	: మార్చి 20



తెలంగాణలో మండలి ఎన్నికల సందడి

- మొత్తం 8 స్థానాలకు ఎన్నికలు
- 27న రెండు టీచర్, ఒక పట్టభద్రుల కోటా స్థానానికి పోలింగ్.. తాజాగా 5 ఎమ్మెల్యే కోటా స్థానాలకు షెడ్యూల్
- నేటితో ముగియనున్న 'పట్టభద్రులు, ఉపాధ్యాయ కోటా' ప్రచారం..
- గెలుపు వ్యూహాలపై పార్టీల దృష్టి

3లో



ఉద్యోగానికి 'ఇంటర్న్' బాట

క్షేత్రస్థాయిలో నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కోసం పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్..

- మొదటి దశలో భారీగా దరఖాస్తులు.. 82,077 మందికి ఇంటర్న్‌షిప్ ఆఫర్లు
- శిక్షణ పొందుతున్నవారు 28,141 మంది
- దేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం
- శిక్షణకు ఎంపికైతే వన్ టైమ్ గ్రాంట్‌గా రూ.6 వేలు.. ప్రతినెలా రూ.5 వేలు స్టైపెండ్
- రెండో దశ కోసం దరఖాస్తుల స్వీకరణ షురూ..

సాక్షి, ఎడ్యుకేషన్: దేశంలోని యువతకు ఉద్యోగ సాధన కోసం అవసరమయ్యే క్షేత్రస్థాయి నైపుణ్యాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది అమల్లోకి తెచ్చిన ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ (పీఎంఐఎస్)కు ఆదరణ లభిస్తోంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ వంటి కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఆన్ జాబ్ ట్రెనింగ్ అవకాశం కల్పించడంతోపాటు నెలకు రూ.5 వేలు చొప్పున స్టైపెండ్ కూడా అందించడం ఈ పథకం ప్రత్యేకత. ఏడాది పాటు ఉండే ఈ ఇంటర్న్‌షిప్‌ను పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీల్లోనూ పూర్తి చేసే అవకాశం ఉండటం గమనార్హం. దీనివల్ల తగిన నైపుణ్యాలు సమకూరి, మంచి ఉద్యోగంలో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.

కేంద్రం గతేడాది బడ్జెట్‌లో ఆమోదం లభించి, అక్టోబర్ నుంచి అమల్లోకి వచ్చిన పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ తొలి దశలో 28,141 మందికి ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభించాయి. ఈ స్కీమ్ కింద దేశంలో ఏటా 1.25 లక్షల మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా భాగస్వామ్య సంస్థల నుంచి 1.27 లక్షల ఆఫర్లు వచ్చాయి. వాటి కోసం 6.21 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. 82,077 మందిని కంపెనీలు ఎంపిక చేసుకుని ఇంటర్న్‌షిప్ ఆఫర్ చేశాయి. అయితే 28,141 మంది మాత్రమే ఆఫర్లను తీసుకుని ఆయా సంస్థల్లో శిక్షణకు హాజరయ్యారు.

28,141 మందికి శిక్షణ

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌లో భాగంగా 24 రంగాలకు చెందిన సంస్థలు అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్‌ను అందిస్తున్నాయి. బీఎఫ్ఎస్ఐ, హాస్పిటాలిటీ, ఆటోమోటివ్, ఎఫ్ఎంసీజీ, మాన్యుఫాక్చరింగ్ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు కూడా ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలతోపాటు హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి బ్యాంకింగ్ రంగ సంస్థలు, పలు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఉండటం గమనార్హం.

24 రంగాల సంస్థల్లో అవకాశాలు

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ తొలిదశ గణాంకాలివీ..	1,25,000	6,21,000	1,27,000	82,077	28,141
	మందికి తొలిదశలో శిక్షణ కోసం పెట్టుకున్న లక్ష్యం	దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు	అందుబాటులోకి వచ్చిన అవకాశాల సంఖ్య	వివిధ సంస్థలకు ఎంపికైన అభ్యర్థులు	ఇందులో శిక్షణకు హాజరైనవారు

ట్రెయినీలకు స్టైపెండ్ కూడా..

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ కింద ఎంపికై వివిధ సంస్థల్లో చేరినవారికి కేంద్ర ప్రభుత్వం స్టైపెండ్ ఇస్తుంది. తొలి దశలో 28,141 మంది ఇంటర్న్ ట్రెనీల బ్యాంకు ఖాతాల్లో వన్ టైమ్ గ్రాంట్ కింద రూ.4.38 కోట్లు, 2024 డిసెంబర్ వరకు రూ.1.3 కోట్ల స్టైపెండ్‌ను జమ చేసినట్లు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ ప్రకటించింది.

జాతీయ స్థాయిలో అమలు చేస్తున్న ఈ స్కీమ్‌లో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 4,973 మందికి, తెలంగాణలో 7,913 మందికి ఇంటర్న్‌షిప్ ఆఫర్లు వచ్చాయి. మొత్తంగా తమిళనాడుకు చెందిన వారికి అత్యధికంగా 14,585 మందికి ఇంటర్న్‌షిప్ ఆఫర్ లభించింది. మహారాష్ట్ర (13,664 ఆఫర్లు), గుజరాత్ (11,690 ఆఫర్లు), కర్ణాటక (10,022 ఆఫర్లు), ఉత్తరప్రదేశ్ (9,027) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి 1,27,508 ఆఫర్లు అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్న కంపెనీలు.. 82,077 మందిని ఇంటర్న్‌షిప్ కోసం ఎంపిక చేశాయి.

ఏపీలో 4,973, తెలంగాణలో 7,913 మందికి చాన్స్



రెండో దశకు దరఖాస్తులు షురూ..

- పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ రెండో దశ దరఖాస్తుల ప్రక్రియ కూడా మొదలైంది. ఇందులో 1,26,557 అవకాశాలు అందుబాటులో ఉంచారు. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు 4,715; తెలంగాణకు 5,357 కేటాయించారు. అభ్యర్థులు httpr://pminternrhip.mca.gov.in/fuideiner/ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి. తమ అర్హతలు, ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవాలి.
- ఈ స్కీమ్‌లో అర్హతల వారీగా అవకాశాల సంఖ్యను సైతం పేర్కొన్నారు. డిగ్రీ పూర్తిచేసిన వారికి 36,901, టెన్త్ చదివిన వారికి 24,696, ఐటీఐ ఉత్తీర్ణులకు 23,269, డిప్లొమా ఉత్తీర్ణులకు 18,589; ఇంటర్మీడియెట్ / 12వ తరగతి ఉత్తీర్ణులకు 15,412 అవకాశాలను అందుబాటులో పెట్టారు. రెండో దశలో అభ్యర్థులకు ఇవి అందుబాటులో ఉంటాయి.

పీఎంఐఎస్‌కు అర్హతలివీ..



పీఎం ఇంటర్న్‌షిప్ పథకం కోసం దరఖాస్తు చేసుకునేవారు 21 ఏళ్ల నుంచి 24 ఏళ్ల మధ్య వయసులో ఉండాలి. వారి కుటుంబ వార్షికాదాయం రూ. 8 లక్షల లోపు ఉండాలి. ఎలాంటి ఉద్యోగం లేని యువతకు వారి విద్యార్హతలకు తగినట్టుగా ఏడాది పాటు ఆన్ జాబ్ ఆన్ ట్రెనింగ్/ఇంటర్న్‌షిప్ కల్పిస్తారు. ఐదేళ్ల వ్యవధిలో కోటి మంది యువతకు దేశంలోని టాప్-500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనవారికి నెలకు రూ.5 వేలు స్టైపెండ్ ఇస్తారు. ఇందులో రూ.4.5 వేలను కేంద్ర ప్రభుత్వం, మరో రూ.500ను ఆయా సంస్థలు సీఎస్ఆర్ కింద భరిస్తాయి.

విస్తృతం చేయాలి..

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌ను టాప్-500 సంస్థలకే కాకుండా ఇతర సంస్థలకు కూడా విస్తరింపజేయాలి. దీనివల్ల ఔత్సాహికులు తమ సమీప ప్రాంతాల్లోని సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం మెరుగవుతుంది. సుదూర ప్రాంతాల్లోని సంస్థల్లో ఇంటర్న్ ట్రెనీగా అవకాశం లభించినా.. నివాస ఖర్చులు, ఇతర కోణాల్లో ఆసక్తి చూపని పరిస్థితి ఉంది. మరోవైపు విద్యార్థులు కూడా వ్యక్తిగత హద్దులు ఏర్పరచుకుని మెలగడం కూడా సరికాదని, అవకాశమున్న చోటికి వెళ్లాలని గుర్తించాలి. – టి.మురళీధరన్, టీఎంఐ నెట్‌వర్క్ ఛైర్మన్

మళ్లీ కూలింది!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా 43.93 కిలోమీటర్ల పొడవైన భారీ సొరంగాన్ని నిర్మిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట (ఇన్‌లెట్) వద్ద నుంచి 13.94 కిలోమీటర్ల లోపలి వరకు తవ్వకం పూర్తయింది. అక్కడ పనులు చేస్తుండగా శనివారం ఉదయం 8.30 గంటలకు సొరంగం పైకప్పు కూలి 8 మంది కార్మికులు/ఉద్యోగులు గల్లంతయ్యారు. వారిని రక్షించడానికి ఆదివారం మధ్యాహ్నం వరకు చేసిన 3 ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. నాలుగో ప్రయత్నంగా ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంటకు సొరంగం లోపలికి వెళ్లిన రెస్క్యూ బృందం సోమవారం ఉదయం 7 గంటల సమయంలో బయటికి వచ్చింది. ఐదో ప్రయత్నంగా సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మరో రెస్క్యూ బృందం సొరంగంలోకి వెళ్లింది. సొరంగం కూలిన ప్రాంతంలో ఆదివారంతో పోల్చితే సోమవారం నాటికి మట్టి, శిథిలాల ఎత్తు, పరిమాణం గణనీయంగా పెరిగాయి. దీనితో అక్కడే మరోసారి సొరంగం పైకప్పు కూలి ఉంటుందని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు అంచనాకు వచ్చారు. సొరంగం లోపల 200–250 మీటర్ల మేర 15–20 అడుగుల ఎత్తులో మట్టి, శిథిలాలు పేరుకుపోయి ఉన్నట్టు చెబుతున్నారు.

నేడు మరో ప్రత్యేక బృందం

ప్రస్తుతం జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలతో పాటు ఆర్మీ, నేవీ, సింగరేణి, ఇతర సిబ్బంది మొత్తం కలిపి మొత్తం 584 మంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున విపత్తుల నిర్వహణ, ఉపరితల రవాణా శాఖలకు చెందిన నిపుణులతో కూడిన ఒక ప్రత్యేక బృందం మంగళవారం ఉదయానికల్లా టన్నెల్ వద్దకు చేరుకునే అవకాశం ఉంది.



కన్వేయర్ బెల్ట్ సహాయంతో టన్నెల్‌లోకి వెళ్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

పైనుంచి రంధ్రం చేయడానికి జీఐఎస్ నో

ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని భూగర్భంలో 400 మీటర్ల దిగువన నిర్మిస్తున్నారు. దీనితో ఆ మేరకు భూఉపరితలం నుంచి సొరంగం వరకు రంధ్రం చేసి కార్మికులను బయటికి తీసుకువచ్చే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పరిశీలన జరిపింది. కానీ సొరంగాన్ని పరిశీలించిన జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) నిపుణుల బృందం ఈ ఆలోచనకు నో చెప్పింది. సొరంగంపై తీవ్ర ఒత్తిడి ఉందని, భూఉపరితలం నుంచి సొరంగం దాకా రంధ్రం వేసేందుకు ప్రయత్నిస్తే మరింతగా కుప్పకూలుతుందని ఐదో రెస్క్యూ బృందంతో కలిసి లోపలికి వెళ్లి వచ్చిన జీఎస్ఐ జియాలజిస్టులు తేల్చారు. మట్టి, శిథిలాల తొలగింపుపై రెస్క్యూ బృందానికి వీరు చేసే సూచనలు కీలకంగా మారనున్నాయి.

సొరంగంలోకి రాకపోకలకే 4 గంటలు..

గల్లంతైన కార్మికుల జాడ దొరక్కపోయినా సొరంగం లోపలి పరిస్థితులపై ఇప్పుడు స్పష్టమైన అవగాహన ఏర్పడిందని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న అధికారులు తెలిపారు. తొలుత కేవలం లోపలి పరిస్థితిని దూరం నుంచి మాత్రమే అంచనా వేయగలిగామని.. నాలుగు, ఐదో ప్రయత్నంలో సొరంగం కూలిన చోట శిథిలాల సమీపం వరకు రెస్క్యూ బృందాలు చేరుకోగలిగాయన్నారు. లోకో ట్రెన్ ద్వారా సొరంగం లోపలికి వెళ్లిరావడానికే మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతోందని వెల్లడించారు.

సొరంగంలోకి 'ర్యాట్ హోల్ మైనర్స్'



సొరంగంలో సహాయక చర్యల్లో మరో ప్రయత్నంగా మరో రెస్క్యూ బృందం 'ర్యాట్ హోల్ మైనర్స్'తో కలసి లోపలికి వెళ్లింది. ఉత్తరాఖండ్‌లోని సిల్క్యార సొరంగం 2023 నవంబర్‌లో కుప్పకూలింది. దానిలో లోపల చిక్కుకుపోయిన 41 మంది కార్మికులను 17 రోజుల తర్వాత ర్యాట్ హోల్ మైనర్స్ బృందం బయటికి తీసుకురాగలిగింది. దీంతో ఎస్ఎల్‌బీసీ వద్ద సహాయక చర్యల కోసం 'ర్యాట్ హోల్ మైనర్స్'ను ప్రభుత్వం రప్పించింది. ఈ బృందం సొరంగంలో, పేరుకుపోయిన మట్టిలో ఎలుక బొరియల తరహాలో రంధ్రాలు చేసి లోపలికి వెళ్లి కార్మికులను బయటకి తీసుకువచ్చేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించింది. అయితే సొరంగం రెండో వైపు పూర్తిగా మూతబడి ఉండటం, పెద్ద మొత్తంలో ఊట నీరు ఆ ప్రాంతాన్ని ముంచెత్తి ఉండటంతో 'ర్యాట్ హోల్' విధానంలో రెస్క్యూ ఆపరేషన్ శ్రేయస్కరం కాదనే భావన వ్యక్తమవుతోంది. అయితే ర్యాట్ హోల్ మైనర్లు సొరంగంలో ఏ వ్యూహాన్ని అమలు చేస్తారన్నది ఆసక్తిగా మారింది. వారు సొరంగం నుంచి బయటికి వస్తే ఈ అంశంపై స్పష్టత రానుంది. ఇక మంగళవారం ఉదయానికల్లా మరో 'ర్యాట్ హోల్ మైనర్స్' బృందం టన్నెల్ వద్దకు చేరుకోంది.

పైనుంచి రంధ్రాలు వేసి తీసుకురావడం కుదరదు



గతంలో ఉత్తరాఖండ్ టన్నెల్ ప్రమాదంలో 41 మందిని కాపాడాం. ఇక్కడి సొరంగంలోని కార్మికులను కాపాడాలని మమ్మల్ని తీసుకువచ్చారు. ఇక్కడి పరిస్థితులను బట్టి పైనుంచి రంధ్రాలు చేసి బయటికి తీసుకురావడం కుదరదు. టన్నెల్ లోపలి నుంచే వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తాం. తీసుకురాగలుగుతామని అనుకుంటున్నాం. – ఖలీల్ ఖురేషీ, ర్యాట్ హోల్ మైనింగ్ రెస్క్యూ టీం సభ్యుడు

కొనసాగుతున్న నీటి ఊట

సొరంగంలో నీరు నిరంతరం ఊరుతూ, కూలిన ప్రాంతాన్ని నింపేస్తోంది. ఇన్‌లెట్ నుంచి లోపలికి వెళ్లే నీరు గ్రావిటీ ద్వారా అవుట్‌లెట్ వైపు వెళ్లేలా సొరంగాన్ని వాలుగా నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు తవ్విన మేరకు సొరంగం కూలిన ప్రాంతమే చివరిది కావడంతో.. ఊట నీళ్లు అక్కడే పేరుకుపోయి సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నాయి.



సొరంగం లోపల సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

8 మంది కార్మికులను రక్షిస్తాం

- టన్నెల్‌లో వారు ఇంకా బతికున్నారనే ఆశలు ఉన్నాయి
- కేటీఆర్ విమర్శలు మాని సలహాలు ఇవ్వాలి
- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్/ అచ్చంపేట/ చందంపేట: 'ప్రపంచంలో టన్నెళ్లను నిర్మించడంలో నిపుణులైనవారిని పిలిపించి 8 మంది కార్మికులను రక్షిస్తాం. ఉత్తరాఖండ్‌లో 41 మందిని 17 రోజుల్లో బయటికి తీశారు. ఇప్పుడు కూడా అదే తరహాలో కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేశ, విదేశాల్లో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు పరిష్కారం చూపిన వారిని ఇక్కడికి రప్పించాం'అని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడికి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు రాలేదని కేటీఆర్ విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం, మంత్రులు ఇక్కడే ఉన్నారని, సీఎం రావడం వల్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతుందనే ఉద్దేశంతోనే రాలేదని అన్నారు. 'కాళేశ్వరం కట్టినప్పుడు ఏడుగురు జలసమాధి అయితే మీరు వెళ్లి చూశారా?'అని ప్రశ్నించారు. 'మీ నాన్నలా ఫాంహౌస్‌లో పండుకోలేదు'అని దుయ్యబట్టారు. 26 మంది పసిపిల్లలు ట్రెన్ కింద పడి ముద్దలైతే పక్కనే ఫాంహౌస్‌లో ఉండి కూడా వెళ్లి చూడలేకపోయారని, కొండగట్టు ఘాట్‌రోడ్డు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో 66 మంది చనిపోతే ఎవరైనా వెళ్లి పలకరించారా..? అని నిలదీశారు. 'ప్రతిపక్ష నాయకులుగా మీరు ఎవరైనా వచ్చి పరామర్శించారా? మీకు బాధ్యత లేదా? ఇలాంటి ఘటనలపై విమర్శలు మాని.. సలహాలు, సూచనలు ఇవ్వండి'అని మంత్రి హితవు పలికారు.

టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం..: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. సొరంగంలో చిక్కుకున్న 8 మంది ఇంకా బతికి ఉన్నారనే ఆశలు ఉన్నాయన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వారిని బయటకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. లోపల ఉన్న కార్మికుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడామన్నారు. టన్నెల్‌లో చిక్కుకుపోయిన జావీద్‌కు తాను, అధికారులు ఫోన్ చేశామని, రింగ్ అయి తర్వాత స్విచ్‌ఆఫ్ వస్తోందని తెలిపారు. అమెరికాకు చెందిన రాబిన్స్ కంపెనీ నిపుణులను పంపించాలని ఆ సంస్థ యజమానిని కోరామన్నారు. రేపటి కల్లా నీళ్లు తగ్గితే కన్వేయర్ బెల్టు ద్వారా మట్టిని బయటకు పంపించే పనులు మొదలుపెడతామన్నారు. ఈ చర్యలను సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని చెప్పారు. కాగా, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ కూడా ఘటనా ప్రాంతంలో సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

కార్మికుల కుటుంబాల్లో ఆందోళన.. నేడు సర్కారు కీలక ప్రకటన?

ప్రమాదం జరిగి సోమవారం అర్ధరాత్రి సమయానికి సుమారు 65 గంటలు దాటింది. కానీ సొరంగంలో గల్లంతైనవారి జాడ తెలియరాలేదు. దీనితో కార్మికుల కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉంది. సోమవారం ఇద్దరు కార్మికుల కుటుంబ సభ్యులు సొరంగం వద్దకు చేరుకుని.. తమవారి సమాచారం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కార్మికుల యోగక్షేమాలపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

సొరంగం లోపలికి డ్రోన్, మినీ జేసీబీ..

నీళ్ల కింద ఉన్న వస్తువులను గుర్తించే సోనార్ టెక్నాలజీ ఆధారంగా కార్మికుల జాడను తెలుసుకునేందుకు ఆదివారం ప్రయత్నించగా.. ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు. నీటిలో మనుషుల రక్తం, అవశేషాలను గుర్తించే పోలీసు జాగిలాలు (స్నిఫర్ డాగ్స్)ను సొరంగంలోకి తీసుకెళ్లినా.. ప్రమాద స్థలంలో నీరు, బురద ఉండటంతో ముందుకు వెళ్లలేకపోయాయి. చివరిగా ఐదో రెస్క్యూ బృందంతో ఒక అత్యాధునిక డ్రోన్, ఇద్దరు ఆపరేటర్లను సొరంగం లోపలికి పంపించారు. రెస్క్యూ బృందాలు వెళ్లలేని చోట్ల దీనితో జరిపే పరిశీలన ఆధారంగా లోపలి పరిస్థితులపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక సొరంగం కూలిన చోట పేరుకుపోయిన మట్టి, శిథిలాలను తొలగించడానికి సోమవారం లోకో ట్రెన్ సాయంతో మినీ జేసీబీని లోపలికి పంపించారు. దీనితో మట్టి, శిథిలాల తొలగింపు చర్యల్లో వేగం పెరిగే అవకాశం ఉంది. ఇక ప్రమాదంలో దెబ్బతిన్న కన్వేయర్ బెల్ట్‌కి సైతం మరమ్మతులు ప్రారంభించారు. మట్టి, శిథిలాలను కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సహాయక చర్యల్లో ఉన్నతాధికారుల బృందం

రాష్ట్ర రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ నేతృత్వంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, నాగర్‌కర్నూల్ జిల్లా మాజీ కలెక్టర్ ఇ.శ్రీధర్‌లతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతాధికారుల బృందం మూడు రోజులుగా సొరంగం వద్ద మకాం వేసి నిరంతరంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ, నేవీ, సింగరేణి రెస్క్యూ బృందాలతో నిరంతరం సమీక్షిస్తూ.. సహాయక చర్యలపై దిశానిర్దేశం చేస్తోంది.

కార్మికుల ఫోన్ ఆన్‌లోనే ఉందా?

టన్నెల్ లోపల చిక్కుకున్న కార్మికుల్లో ఒకరి ఫోన్‌కు కాల్ చేయగా సోమవారం ఉదయం సైతం రింగ్ అయిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో వెల్లడించారు. ఆ తర్వాత స్విచ్ఛాఫ్ అయిందని అంటున్నారు. అయితే సొరంగంలో 13 కిలోమీటర్ల లోపల, భూమి ఉపరితలం నుంచి 400 మీటర్ల లోతులో సెల్‌ఫోన్ సిగ్నల్‌కు అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. సదరు కార్మికుడు ఆ ఫోన్‌ను బయటే ఎక్కడైనా పెట్టి ఉంటాడా, లేక లోపలే ఉందా? అన్న దానిపై ఆసక్తి నెలకొంది.

అడుగుపెడితే బురదలో కూరుకుపోవడమే..



ప్రమాదస్థలంలో భారీగా బురద పేరుకుని ఉంది. అక్కడికి ఎవరూ వెళ్లలేకపోతున్నారు. అడుగుపెడితే బురదలో కూరుకుపోయే అవకాశం ఉంది. నేవీ అధికారులు కూడా ప్రయత్నించినా ఫలితం లేదు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న రెస్క్యూ టీమ్‌ల భద్రత కోసం సైతం చర్యలు తీసుకుంటున్నాం. – హరీశ్, ఎన్డీఆర్ఎఫ్ సూపర్‌వైజర్

చివరి వంద మీటర్లు డేంజర్ జోన్..



టన్నెల్ లోపలికి 12 కిలోమీటర్ల వరకే లోకో ట్రెన్‌లో వెళ్లగలం. ప్రస్తుతం సీపేజీ, బురదనీరు మరో కిలోమీటర్ ముందుకు వచ్చింది. ఇంకో కిలోమీటర్ వరకు కన్వేయర్ బెల్టు మీదుగానే వెళ్లాలి. ఓ 50 మీటర్ల వరకు ఫ్లోటింగ్ బోట్ల ద్వారా చేరుకోగలిగాం. కానీ చివరి వంద మీటర్ల దూరమే చేరుకునేందుకు అవకాశం లేక డేంజర్ జోన్‌గా ఉంది. – కుదూష్, ఆర్మీ అధికారి

కార్మికులను కదిలిస్తే.. కన్నీటి గాథలే!

- రోజుకు 10 గంటలు పనిచేస్తే రూ.600 మాత్రమే కూలీ ఇస్తున్నారన్న కార్మికులు



తమగోడు చెబుతున్న కార్మికులు

అచ్చంపేట: ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో పనిచేస్తున్న కార్మికులను కదలిస్తే కన్నీటి గాథలే వినిస్తున్నాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, జమ్మూకశ్మీర్‌లకు చెందిన కార్మికులే ఎక్కువగా ఉన్నారు. వారిని మూడు షిఫ్టుల్లో పనిచేయిస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. సాయంత్రం 3 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు.. రాత్రి 11 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు పది గంటల చొప్పున పని చేస్తున్నామని కార్మికులు వాపోతున్నారు.

ప్రమాదమని తెలిసినా



టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదంలో ఇప్పటికే ఎనిమిది మంది లోపల చిక్కుకున్నారు. పరిస్థితి ఉందో మాకు తెలియదు. మమ్మల్ని టన్నెల్‌లో మట్టి తొలగించేందుకు రమ్మని బలవంతం చేస్తున్నారు. మేం లోపలికి వెళ్లాక ప్రమాదం మళ్లీ జరిగితే మా పరిస్థితి ఏంటి? – అనిల్‌సాబ్ సాహు, కార్మికుడు, జార్ఖండ్

3 నెలలుగా కూలి లేదు..



మాకు 3 నెలలుగా కూలి డబ్బులు ఇవ్వడం లేదు. అడిగితే ఇష్టముంటే పనిచేయండి, లేదంటే వెళ్లిపోండి అంటున్నారు. తప్పని పరిస్థితుల్లో ఇంటికి ఫోన్ చేసి డబ్బులు తెప్పించుకుని సరుకులు, బియ్యం, ఇతర వస్తువులు కొనుకుంటున్నాం. – ఇంద్రదేవ్ సాహు, కార్మికుడు, జార్ఖండ్

'నీటి ఊట'పై నిర్లక్ష్యమే కొంప ముంచింది

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగిన చోట నాలుగేళ్ల కిందటే సీపేజీ (నీటి ఊట)ను గుర్తించారు. ఇలా సీపేజీ ఉన్నప్పుడు నిరంతరం మోటార్లతో నీటిని బయటికి తోడేస్తూ డీవాటరింగ్ చేయాలి. కానీ నాలుగేళ్లుగా డీవాటరింగ్ ప్రక్రియ సరిగ్గా చేపట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నిసార్లు టన్నెల్ పనులు నిలిపివేసినప్పుడు కరెంట్ సరఫరాను కూడా రోజులు, నెలల పాటు నిలిపివేశారని చెబుతున్నారు. ఈ క్రమంలోనే నీటి ఊటకు ధారలు ఏర్పడి మట్టి వదులుగా మారి ఉంటుందని.. సుమారు 60 మీటర్ల లోతులో బిగించిన రాక్‌బోల్ట్ సహా కాంక్రీట్ సెగ్మెంట్లు ఒక్కసారిగా కుప్పకూలాయని మాజీ ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అలాగే ప్రమాద స్థలం సమీపంలో 13.460 కిలోమీటర్ పాయింట్ నుంచి 13.839 కిలోమీటర్ పాయింట్ వరకు షీర్ జోన్‌లో ఉందని.. అక్కడ భూమిని ప్రతి 100 మీటర్లకు ఒకసారి రాక్ టెస్టింగ్ చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ సీపేజీకి, ప్రమాదాలకు విస్తృత అవకాశాలు ఉంటాయని స్పష్టం చేస్తున్నారు. ఇక ఈ సొరంగానికి ఆడిట్, ఎస్కేప్ టన్నెల్స్ లేవని.. లోపల 10–12 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్మికులకు ఆక్సిజన్ కోసం వెంటిలేషన్ ట్యూబ్ ఒక్కటే ఆధారమని గుర్తు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు అది పనిచేయకపోయినా లోపలున్న వారికి ఆక్సిజన్ అందదని పేర్కొంటున్నారు. ఇన్ని ప్రతికూలతలు, క్లిష్ట పరిస్థితులు ఉన్నా కూడా టన్నెల్ లోపల భద్రతా ప్రమాణాలపై నిర్లక్ష్యం వహించారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నీటి ఊట అరికట్టి ఉంటే ప్రమాదం తప్పేది!

నల్లగొండ: ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సీపేజీ (నీటి ఊట)ని పూర్తిగా అరికట్టిన తర్వాత పనులు ప్రారంభిస్తే ప్రమాదం తప్పేదని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం అధ్యక్షుడు శ్యాంప్రసాద్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సొరంగంలో వదులైన మట్టి నుంచి నిమిషానికి ఏడెనిమిది వేల లీటర్ల నీరు వస్తోందని.. రెండేళ్లుగా నిర్మాణ సంస్థ దాన్ని అరికట్టే చర్యలు చేపట్టకుండా, నీటిని తొలగిస్తూ వచ్చిందని పేర్కొన్నారు.

ప్రజాపాలన అంటే ఓట్లు, నోట్ల వేటనా?: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ గట్టు (ఎస్ఎల్‌బీసీ) సొరంగం కుప్పకూలి ఎనిమిది మంది ఆచూకీ తెలియని విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగితేలడం దిగజారుడు రాజకీయానికి పరాకాష్ట అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విరుచుకుపడ్డారు. ఘోర దుర్ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రికే పట్టింపు లేనపుడు అధికార యంత్రాంగం ఎలా పనిచేస్తుందని 'ఎక్స్'లో ప్రశ్నించారు. 'ప్రజాపాలన అంటే నోట్ల వేట.. ఓట్ల వేట మాత్రమేనా? ఓట్ల కోసం జిల్లాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్న ముఖ్యమంత్రికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు వెళ్లే సమయం లేదా? ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ప్రాణాలకు ఇచ్చే విలువ ఇదేనా? ఓవైపు సహాయక చర్యలు కొలిక్కి రాకముందే అందులో చిక్కుకుపోయిన కార్మికులు బతికి ఉండే అవకాశం కనిపించడం లేదని సర్కారు చేతులెత్తేస్తోంది. మరోవైపు సహాయక చర్యలను పర్యవేక్షించి, బాధితుల కుటుంబాలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత మరిచారు. ఎన్నికలే తమ తొలి ఎజెండా అనే రీతిలో సీఎం, ప్రభుత్వం కనీసం మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారు. ఎనిమిది మంది కార్మికులను బలిపీఠం ఎక్కించి పట్టభద్రులకు ఓట్ల గాలం వేసేందుకు సిద్ధమైన సీఎం తీరును తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. సరైన సమయంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెడతారు'అని కేటీఆర్ హెచ్చరించారు.

కార్మికుల ప్రాణాలు కాపాడటంలో ప్రభుత్వం విఫలం: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకున్నా వారి ప్రాణాలు కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో బయట రాష్ట్రాల కార్మికుల పాత్ర ఎంతో ఉందని, ప్రస్తుతం టన్నెల్‌లో చిక్కుకున్న వారంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారేనన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.భాస్కర్ రావు, కె.భూపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు జి.దేవీప్రసాద్‌తో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కార్మికుల ప్రాణాలు కాపాడటంకంటే ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారమే ముఖ్యంగా మారిందని, సీఎంకు మానవత్వం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఎస్ఎల్‌బీసీలో ప్రమాదం జరిగిందని, అందులో చిక్కుకుపోయిన కార్మికుల ప్రాణాల పట్ల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం తోలు మందంతో వ్యవహరిస్తోందని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. ప్రమాద ఘటనపై ప్రధాని, సీఎం నడుమ సంభాషణ ఏంటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

టూరిజం శాఖ 'శివరాత్రి' టూర్లు

సాక్షి, హైదరాబాద్: శివరాత్రి సందర్భంగా తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ శైవ క్షేత్రాలకు ప్రత్యేక టూర్లు నిర్వహిస్తోంది. ప్రత్యేక బస్సులు హైదరాబాద్ యాత్రీ నివాస్ నుంచి బయలుదేరతాయి. ఈనెల 25న కాళేశ్వరం-రామప్ప-లక్నవరం, 26న కీసరగుట్ట, వేములవాడ-కొమటిచెరువు ట్రిప్పు, కొమురవెల్లి, కొత్తకొండ, రామప్ప దేవాలయం ఆఫ్ డే ట్రిప్పు, శ్రీశైలానికి బస్సులు నడుపుతోంది. ఇతర వివరాలకు 9848540371 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పర్యాటకాభివృద్ధి సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది.

మోడల్ స్కూల్ దరఖాస్తు గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలతోపాటు 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువును మార్చి 10వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు మోడల్ స్కూల్స్ అదనపు సంచాలకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలలో ఆరోతరగతిలో వంద సీట్లు ఉన్నాయన్నారు. ఓసీ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్‌సీ విద్యార్థులకు ఫీజు రూ.125గా నిర్దేశించినట్లు తెలిపారు.

మార్చి 1 నుంచి లా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

జూన్ 6న ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రవ్యాప్తంగా న్యాయకళాశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు జూన్ 6న లాసెట్, పీజీలాసెట్‌కు ఎంట్రన్స్ టెస్ట్‌లు జరగనున్నాయి. మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు మంగళవారం టీజీ లాసెట్ (3, 5 వైడీసీలు ఎల్ఎల్‌బీ), పీజీ లాసెట్-2025 (ఎల్ఎల్ఎం) నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు కన్వీనర్ విజయలక్ష్మి సోమవారం తెలిపారు. మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో 25 వరకు, రూ.1,000 అపరాధ రుసుముతో మే 5వ తేదీ వరకు, రూ.2,000 అపరాధ రుసుముతో మే 15 వరకు, రూ.4,000 అపరాధ రుసుముతో మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు లాసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు టీజీ ఈసెట్-2025 నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): టీజీఈసెట్ (ఇంజినీరింగ్ సెట్) నోటిఫికేషన్ మంగళవారం విడుదల కానుంది. బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు మార్చి 3 నుంచి ఏప్రిల్ 19 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చు. డిప్లొమా, బీఎస్సీ మ్యాథ్స్ డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈసెట్‌కు అర్హులని కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష మే 12న జరగనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు ఈసెట్-2025 వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కాలేజీ లాగిన్‌లో ఇంటర్ విద్యార్థుల హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లను ఇంటర్మీడియెట్ విద్యా కార్యదర్శి సోమవారం జారీచేశారు. ఈ హాల్‌టికెట్లు కాలేజీ లాగిన్‌లో అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు వారి హాల్‌టికెట్లను కాలేజీ యాజమాన్యాన్ని సంప్రదించి పొందాలి. ఈ హాల్‌టికెట్లలో ఏవైనా పొరపాట్లు, అక్షరదోషాలుంటే వెంటనే కాలేజీ ప్రిన్సిపాల్‌ను సంప్రదించి ఇంటర్మీడియెట్ బోర్డు దృష్టికి తీసుకెళ్లాలి. విద్యార్థులకు వారి హాల్‌టికెట్లను వ్యక్తిగతంగా అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్మీడియెట్ విద్యా కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు.



ఆ ఊళ్లు.. 'రెండు కళ్లు'

నేత్రదానంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు

ఆదర్శంగా నిలుస్తున్న ముచ్చర్ల, సర్వాపూర్ గ్రామాలు

'మరణించిన వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా వారి కళ్లు జీవించే ఉంటాయి. మరణానంతరం కూడా మన కళ్లు మరో ప్రపంచాన్ని చూస్తాయి. మట్టిలో కలిసిపోయే ముందు మరొకరి జీవితంలో వెలుగు నింపితే.. వారి ఆనందాన్ని మన నయనాలు నింపుకుంటాయి'. అనే సిద్ధాంతంతో ఓ రిటైర్డ్ ఇంజనీరు మొదలెట్టిన ప్రయత్నం సక్సెస్ అయ్యింది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో మొదలైన నేత్రదాన ఉద్యమం.. పరకాల డివిజన్ సర్వాపూర్‌కు వ్యాప్తి చెందింది.

సాక్షి ప్రతినిధి, వరంగల్: నీటిపారుదల శాఖలో డిప్యూటీ ఈఈగా పనిచేసిన మండల రవీందర్ 12 ఏళ్ల క్రితం ముచ్చర్లలో నేత్రదాన ఉద్యమం మొదలెట్టారు. 'అంధులకు కార్నియా ఆపరేషన్లు చేయడం ద్వారా కంటిచూపును ప్రసాదించవచ్చు' అనే ఉద్దేశంతో చనిపోయిన వారి కళ్లతో సప్తవర్ణాలను చూపేందుకు ఆ రోజే బాటలు పడ్డాయి. ఒక్కరితో మొదలైన బృహత్‌కార్యంలో గ్రామస్తులు మనసారా భాగస్వాములయ్యారు. నేత్రదానం చేస్తామని ప్రతినబూని ముందుకు సాగుతున్నారు. మూడువేల పైచిలుకు జనాభా కలిగిన ముచ్చర్ల (వరంగల్ నగర పాలక సంస్థలో విలీనమైంది)లో ఇప్పటివరకు 46 మంది నేత్రదానం చేశారు.

ముచ్చర్ల బాటలో సర్వాపూర్

హనుమకొండ జిల్లా కేంద్రానికి 23.2 కి.మీ. దూరంలో ఉన్న చిన్న గ్రామం సర్వాపూర్‌కు నేత్రదాన ఉద్యమం పాకింది. 630 మంది జనాభా ఉన్న ఆ గ్రామం పరకాల డివిజన్ నడికుడ మండలం కిందకు వస్తుంది. ముచ్చర్లకు చెందిన మండల రవీందర్‌కు బావ వరుసైన తాజా మాజీ వార్డు సభ్యుడు భోగి రాములు నేత్రదాన ఉద్యమానికి శ్రీకారం చుట్టగా.. సర్వాపూర్ గ్రామస్తులు సైతం సై అన్నారు. సర్వాపూర్‌లో రెండేళ్లలో 12 మంది నేత్రదానం చేయగా.. మరో 8 మంది హామీ పత్రాలు ఇచ్చినట్లు గ్రామస్తులు చెప్పారు. లయన్స్ క్లబ్ హనుమకొండ, తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ (వరంగల్)కు సమాచారం ఇస్తే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ నిపుణులు నేత్రాలను స్వీకరిస్తున్నారు. ముచ్చర్లను ఆదర్శంగా తీసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలూ అదేబాటను అనుసరించారు. మృతిచెందిన 15 మంది కళ్లను దానం చేసేందుకు ఆయా గ్రామాల్లో వారి కుటుంబసభ్యులు ముందుకొచ్చారు. పెంబర్తి, నాగారం, పలివేల్పుల, భీమారం, పెగడపల్లి, జమ్మికుంట, బావుపేటలో నేత్రదానంపై అవగాహన సదస్సులు ఉధృతంగా సాగుతున్నాయి.



ముచ్చర్ల గ్రామం



కళ్లు సేకరిస్తున్న దృశ్యం

సామాజిక బాధ్యత కూడా..



మరణానంతరం నేత్రదానం చేస్తే ఇద్దరికి చూపు ఇచ్చిన వారమవుతామని అవగాహన కల్పిస్తూ నేత్రదాన ఉద్యమం చేస్తున్నాం. ఈ మహత్కార్యం సామాజిక బాధ్యత కూడా. మా తల్లిదండ్రుల నేత్రదానం ద్వారా మిగతా వాళ్లలో కూడా అవగాహన కల్పిస్తున్నాం. చాలా పల్లెలకు ఈ ఉద్యమం పాకడం సంతోషంగా ఉంది.

–మండల రవీందర్, ఉపాధ్యక్షుడు, తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్

మా ఆయన కళ్లు దానం చేసినం..



మా ఆయన భోగి కొమురమల్లు (92) రెండేళ్ల కింద చనిపోయిండు. మా ఊళ్లోనే ఉండే భోగి రాములు, ఇంకొంత మంది కళ్ల దానం గురించి చెప్పిండ్రు. ఇంట్లోళ్లం మాట్లాడుకుని కళ్లు వట్టిగ మట్టిల పోవుడు ఎందుకని దానం చేసినం. మా ఊళ్లో ఎవరు చనిపోయినా కళ్లను దానం చేస్తమని ముందుకు వస్తను.

–భోగి సమ్మమ్మ, సర్వాపూర్

లైఫ్ సైన్సెస్ రంగంలో విస్తృత అవకాశాలు

- దిగ్గజ సంస్థలను ఆకట్టుకోవడానికి 'చైనా ప్లస్ వన్' వ్యూహం
- ఆమ్జెన్ ఇన్నోవేషన్ టెక్నాలజీ ఫెసిలిటీ సైట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



ప్రారంభోత్సవానికి ఇచ్చిన పెద్ద కత్తెరను చూపిస్తూ నవ్వుతున్న సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఇప్పటికే లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయో టెక్ రంగాల్లో అగ్రగామిగా ఉందని.. రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ట్రిలియన్ డాలర్ల జీడీపీ సాధన లక్ష్యంగా తెలంగాణ అడుగులు వేస్తోందన్నారు. 'చైనా ప్లస్ వన్' వ్యూహంతో దిగ్గజ సంస్థలను ఆకర్షించడం ద్వారా హైదరాబాద్‌ను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చి ప్రపంచంలోని గొప్ప నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దే సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అమెరికాలోనే అతిపెద్ద బయోటెక్నాలజీ కంపెనీ ఆమ్జెన్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన టెక్నాలజీ, ఇన్నోవేషన్ ఫెసిలిటీ సైట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆమ్జెన్ కార్యకలాపాల విస్తరణతో హైదరాబాద్ బయోటెక్ హబ్‌గా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటుందన్నారు.

తెలంగాణకు రావాలని గతేడాది ఆమ్జెన్‌ను ఆహ్వానించా..

'గతేడాది శాన్‌ఫ్రాన్సిస్కోకు వెళ్లినప్పుడు ఆమ్జెన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించా. ఔషధాలపై పరిశోధన, కొత్త ఔషధ ఆవిష్కరణల ద్వారా ప్రజల జీవితాలను మార్చేందుకు ఆమ్జెన్ చేస్తున్న ప్రయత్నాలను అడిగి తెలుసుకున్నా. తెలంగాణతో భాగం పంచుకోవాలని.. రాష్ట్ర ప్రభుత్వం తరపున తగిన సహకారం అందిస్తామని అప్పుడే ఆహ్వానించా. అందుకు అనుగుణంగా ఆమ్జెన్ ఇప్పుడు హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ సెంటర్ నెలకొల్పడం ఆనందంగా ఉంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆమ్జెన్ భాగస్వామ్యంతో మానవవనరుల అభివృద్ధికి చర్యలు: మంత్రి శ్రీధర్‌బాబు

లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ రాజధానిగా మార్చడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా నైపుణ్యంగల మానవవనరుల హబ్‌గా తెలంగాణను మార్చేందుకు స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఆమ్జెన్ భాగస్వామ్యంతో బయోటెక్నాలజీ రంగంలో నైపుణ్యమున్న మానవవనరులను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణలోని విశ్వవిద్యాలయాలు, స్టార్టప్స్, పరిశోధన సంస్థలతో కలిసి పనిచేయాలని ఆమ్జెన్ ప్రతినిధులను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. ఆమ్జెన్ చైర్మన్, సీఈఓ రాబర్ట్ ఎ. బ్రాడ్‌వే మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రపంచవ్యాప్తంగా తమ సాంకేతిక నెట్‌వర్క్‌ను విస్తరించే ప్రయత్నంలో భాగంగా హైదరాబాద్‌లో క్యాంపస్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, అమెరికా కాన్సుల్ జనరల్ (హైదరాబాద్) జెన్నిఫర్ లార్సెన్, ఆమ్జెన్ ఇండియా ప్రతినిధి సోమ్ ఛటోపాధ్యాయ, ఆమ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుల్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాదిలో రూ. 1,600 కోట్ల పెట్టుబడితో..

ఔషధశ్రేణిని సాంకేతికంగా మరింత అభివృద్ధి చేసేందుకు ఆమ్జెన్ హైదరాబాద్‌లో ఏఐ, డేటా సైన్స్ డిజిటల్ సామర్థ్యాలతో ఇన్నోవేషన్ సైట్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఏడాదిలో దాదాపు రూ. 1,600 కోట్ల పెట్టుబడి పెట్టడంతోపాటు భవిష్యత్తు పెట్టుబడులకు ప్రణాళికను కూడా సిద్ధం చేస్తోంది. సుమారు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆమ్జెన్‌లో 28 వేల మంది ఉద్యోగులున్నారు. కేన్సర్, గుండెజబ్బులు, బోలు ఎముకలు, అరుదైన వ్యాధుల చికిత్స కోసం ఇప్పటికే ఉన్న ఔషధాలతోపాటు విస్తృత పరిజ్ఞానంతో ఉత్పత్తులను అభివృద్ధి చేస్తోంది.

రేవంత్‌ది అబద్ధాల ప్రసంగం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందన్న భయం ఆయనలో కన్పిస్తోంది
- సర్కార్‌కు ధోకా లేకుంటే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి ఎందుకొచ్చినట్లు?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపాటు



సాక్షి, హైదరాబాద్/కరీంనగర్ టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం పచ్చి అబద్ధాలు, అర్ధ సత్యాలతో నిండిపోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి ఖాయమనే భయం ఆయనలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇంటెలిజెన్స్ సహా సర్వే సంస్థలన్నీ బీజేపీ గెలుపు తథ్యమని తేల్చడం.. కాంగ్రెస్ 3వ స్థానానికి పడిపోతుందని నివేదికలు ఇవ్వడంతో ముఖ్యమంత్రికి దిక్కుతోచట్లేదని ఎద్దేవా చేశారు. అందుకే ఆయన హడావుడిగా ఒకేరోజు మూడు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చి మూడు సమావేశాల్లో అబద్ధాలాడారని మండిపడ్డారు. ఓటర్లను బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

అధికార బలంతో గెలవాలని చూస్తున్నారు..

'గెలిచినా ఓడినా ప్రభుత్వానికి ధోకా లేదు... నాకేం ఫరక్ పడదని బుకాయిస్తున్నడు. అంత ధీమా ఉంటే ఎన్నికల ప్రచారానికి సీఎం ఎందుకు వచ్చినట్లు? ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు, అధికార బలంతో ఎలాగైనా గెలవాలని చూస్తున్నారు. ఓడిపోతే సమస్యలను పరిష్కరించబోనంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు' అని బండి సంజయ్ ఆ ప్రకటనలో ఆరోపించారు. సీఎంకు నిజంగా నిజాయితీ ఉంటే ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ-రేస్, గొర్రెల స్కాం, కాళేశ్వరం, కేటీఆర్ బావమరిది డ్రగ్స్ వ్యవహారంపై సీబీఐ విచారణ కోరుతూ లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ఆయా కేసుల్లో దోషులెవరైనా వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపే బాధ్యత కేంద్రం తీసుకుంటుందన్నారు.

మండలి ఎన్నికల సందడి

- మొత్తం 8 స్థానాలకు జరగనున్న ఎన్నికలు
- 27న రెండు టీచర్, ఒక పట్టభద్రుల కోటా స్థానానికి పోలింగ్
- తాజాగా ఐదు ఎమ్మెల్యే కోటా స్థానాలకు షెడ్యూల్ విడుదల
- గెలుపుపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం వర్గాల్లో చర్చ
- నేటితో ముగియనున్న 'పట్టభద్రులు, ఉపాధ్యాయ కోటా' ప్రచారం



సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల కోటా స్థానాలకు జరగనున్న ఎన్నికల ప్రచార గడువు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ముగియనుంది. మరోవైపు శాసనమండలిలో ఎమ్మెల్యేల కోటాలో వచ్చే నెల 29న ఖాళీ అయ్యే ఐదు స్థానాల్లో ఎన్నికకు సంబంధించి సోమవారం షెడ్యూల్ విడుదలైంది. 40 మంది సభ్యులు ఉన్న శాసనమండలిలో 8 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనుండటంతో రాష్ట్రంలో రాజకీయ సందడి జోరందుకుంది. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ముమ్మర ప్రచారం జరుగుతోంది. మంగళవారం చివరిరోజు కావడంతో పార్టీలు ఆఖరి నిమిషంలో చేయాల్సిన ప్రయత్నాలతో పాటు, పోలింగ్‌కు అవసరమైన సన్నద్ధత, ఓటర్లను ఆకర్షించే ఎత్తుగడలపై దృష్టి పెట్టాయి. ఇక ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయ్యే ఐదు స్థానాల్లో ఎవరికి ఎన్ని సీట్లు దక్కే అవకాశం ఉందనే దానిపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మండలిలో బలాబలాలు

కాంగ్రెస్	13
బీఆర్ఎస్	21
ఎంఐఎం	02
బీజేపీ	01
టీజేఎస్	01
పీఆర్‌టీయూ	01
స్వతంత్ర	01

రిటైరవుతున్నది వీరే..

కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన శాసనమండలి ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మార్చి 29న ఎమ్మెల్యే కోటాలో ఐదుగురు ఎమ్మెల్సీలు రిటైర్ అవుతున్నారు. వీరిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, యెగ్గె మల్లేశం (ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు)తో పాటు ఎంఐఎంకు చెందిన మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ ఉన్నారు. ఎమ్మెల్యే కోటాలో ఒక్కో ఎమ్మెల్సీ ఎన్నికకు 24 మంది శాసనసభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. అసెంబ్లీలో ప్రస్తుతం కాంగ్రెస్‌కు 65, బీజేపీకి 8, ఎంఐఎంకు 7, సీపీఐకి ఒక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తోంది. ఎంఐఎం మద్దతుతో కాంగ్రెస్ మూడు స్థానాలను సునాయాసంగా దక్కించుకునే అవకాశముంది. మరోవైపు బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న 28 మంది ఎమ్మెల్యేలతో ఒక ఎమ్మెల్సీ పదవి కచ్చితంగా దక్కుతుంది. ఐదో ఎమ్మెల్సీ పదవి ఎన్నికలో బీఆర్ఎస్‌ను వీడిన ఎమ్మెల్యేలు, బీజేపీ శాసనసభ్యులు అత్యంత కీలకంగా మారనున్నారు. గతంలో బీఆర్ఎస్ మద్దతుతో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ సీటును దక్కించుకున్న ఎంఐఎం ప్రస్తుతం ఎలాంటి వైఖరి అనుసరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

టీచర్, గ్రాడ్యుయేట్ కోటా ఈ ముగ్గురు..

శాసనమండలిలో మార్చి 29న ఉపాధ్యాయ కోటాలో 'మెదక్ -ఆదిలాబాద్- నిజామాబాద్ -కరీంనగర్' ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి (పీఆర్‌టీయూ), 'వరంగల్- ఖమ్మం -నల్లగొండ' ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి (స్వతంత్ర), పట్టభద్రుల కోటాలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి (మెదక్- నిజామాబాద్ -ఆదిలాబాద్- కరీంనగర్) రిటైర్ అవుతున్నారు. ఈ మూడు స్థానాల్లో ఎన్నికకు సంబంధించి ఈ నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. 'మెదక్ -నిజామాబాద్ -ఆదిలాబాద్- కరీంనగర్' పట్టభద్రుల స్థానంలో 56 మంది, 'మెదక్ -నిజామాబాద్ -ఆదిలాబాద్- కరీంనగర్' ఉపాధ్యాయ స్థానంలో 15, 'వరంగల్ -ఖమ్మం- నల్లగొండ' ఉపాధ్యాయ స్థానంలో 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పట్టభద్రుల కోటా స్థానంలో కాంగ్రెస్, బీజేపీ తరఫున అభ్యర్థులు పోటీలో ఉండగా, బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉంది.

ఆగస్టులో మరొకటి ఖాళీ

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా నుంచి మండలికి ఎన్నికైన ఎంఎస్ ప్రభాకర్ రావు పదవీ కాలం ఆగస్టు 6న పూర్తవుతోంది. బీఆర్ఎస్ నుంచి మండలికి ఎన్నికైన ప్రభాకర్ ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు. గవర్నర్ కోటాలో మండలికి నామినేట్ అయిన బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్, గోరటి వెంకన్న వచ్చే ఏడాది నవంబర్‌లో రిటైర్ అవుతారు. మండలిలో స్థానిక సంస్థల కోటాలో 14 మంది సభ్యులకు గాను 2028లో ఏకంగా 12 మంది పదవీ కాలం పూర్తవుతుంది. మొత్తంగా 2027లో 9, 2028లో 14 మంది, 2029లో ఐదుగురు, 2030లో ఇద్దరేసి ఎమ్మెల్సీల చొప్పున రిటైర్ అవుతారు. ప్రస్తుతమున్న మండలి సభ్యుల్లో గవర్నర్ కోటాలో నామినేట్ అయిన అమేర్ అలీఖాన్ (కాంగ్రెస్), ప్రొఫెసర్ కోదండరాం (టీజేఎస్) ఆరేళ్ల పదవీ కాలం 2030లో పూర్తి చేసుకుంటారు.

క్వీన్స్‌ల్యాండ్‌తో మైనింగ్ ఎంఓయూ

- కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. 11 కీలక ఖనిజాల ఉత్పత్తికి పరస్పర సహకారం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్ర మంత్రి బృందం భేటీ



డిప్యూటీ సీఎం భట్టితో క్వీన్స్‌లాండ్ మంత్రి రోస్‌బేట్స్

సాక్షి, హైదరాబాద్: మైనింగ్ రంగంలో పరస్పర సహకారం, సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటు కోసం ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ సర్కారు జట్టుకట్టింది. కీలకమైన 11 ఖనిజాల ఉత్పత్తికి సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఇందుకు సింగరేణి సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఈ మేరకు సోమవారం సింగరేణి భవన్‌లో డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య, ఉపాధి శిక్షణ శాఖ మంత్రి రోస్‌బేట్స్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. రోస్‌బేట్స్, అక్కడి అధికారుల బృందంతో కీలక ఖనిజాల ఉత్పత్తి, వ్యాపార విస్తరణ అవకాశాల గురించి భట్టి చర్చించారు. రాష్ట్ర మైనింగ్ చరిత్రలో ఈ ఎంఓయూ కీలక మైలురాయి కానుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణతోపాటు దేశంలో విద్యుత్ వాహనాలు, సోలార్ విద్యుత్, బ్యాటరీలకు భారీ డిమాండ్ ఉన్న నేపథ్యంలో వనడియం, కోబాల్ట్, ఇండియం, క్రోమియం, టైటానియం వంటి 11 రకాల ఖనిజాలు ఎంతో అవసరమన్నారు. ఈ ఖనిజాల లభ్యత క్వీన్స్ ల్యాండ్‌లో అధికంగా ఉన్నందున వాటి ఉత్పత్తి, విక్రయానికి పరస్పర లబ్ధి చేకూరే వ్యాపార ఒప్పందంపై ప్రాథమికంగా అవగాహనకు వచ్చామన్నారు.

20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యం...

తెలంగాణ రాష్ట్రం 2029-30 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఏర్పాటు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించడం ద్వారా దేశానికే ఆదర్శప్రాయంగా నిలవాలని ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. ఈ విషయంలో క్వీన్స్ ల్యాండ్ సహకారం తీసుకొనే అవకాశం ఉందన్నారు. సింగరేణి సంస్థ ఇప్పటికే క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్ర ప్రభుత్వంతో మైనింగ్‌లో రక్షణకు సంబంధించి సిమ్టార్స్‌తో, మైనింగ్ టెక్నాలజీకి సంబంధించి సీఎస్ఐఆర్ఓ తదితర సంస్థలతో ఒప్పందాలు చేసుకుందని ఆయన గుర్తుచేశారు. తాజాగా ఖనిజాల వెలికితీత, భారీ ఖనిజ ఉత్పత్తి యంత్రాల సాంకేతికత, గనుల్లో మెరుగైన రక్షణ తదితర అంశాలపై వ్యాపార ఒప్పందం కోసం ముందుకు వెళ్తోందన్నా రు.

మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ

క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్ర మంత్రి బేట్స్ ఆధ్వర్యంలోని బృందం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ విశేషాలను మంత్రి వారికి వివరించారు.

టీబీఎం ముక్కలు చెక్కలు!

- మళ్లీ సొరంగం పనులు చేసే అవకాశాలు లేవంటున్న ఉన్నతాధికారులు
- ఎస్ఎల్‌బీసీ సొరంగ తవ్వకాలకు టీబీఎం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) ఒకటో సొరంగం కుప్పకూలడంతో శిథిలాలు పడి టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) ముక్కలైంది. టీబీఎం విడిభాగాలు సొరంగంలో చాలా దూరం వరకు చెల్లాచెదురుగా పడిపోయి ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. పైకప్పు నుంచి టన్నుల కొద్దీ బరువున్న భారీ రాళ్లు పడటమే దీనికి కారణమని భావిస్తున్నారు. ఈ క్రమంలో టీబీఎం పనికి వస్తుందో, లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 120 మీటర్ల పొడవు ఉండే టీబీఎంకు ముందు భాగంలో ఉండే బ్లేడ్ భాగం కీలకమైనది. 8 మీటర్ల పొడవు, 10 మీటర్ల వ్యాసంతో ఉండే ఈ బ్లేడ్ భాగం దెబ్బతిని ఉంటే టీబీఎం పనికి రానట్లేననే భావన వ్యక్తమవుతోంది.

వెనక్కి తీసుకురావడమూ సాధ్యంకాదు..

టీబీఎం సొరంగాన్ని 10 మీటర్ల వ్యాసంతో తవ్విన తర్వాత.. లోపల అంతా కాంక్రీట్ సెగ్మెంట్లను రక్షణగా అమర్చుతారు. దీనితో సొరంగం వ్యాసం 9.2 మీటర్లకు తగ్గిపోతుంది. అందువల్ల 10 మీటర్ల వ్యాసం ఉండే బ్లేడ్ భాగాన్ని మరమ్మతుల కోసం వెనక్కి తీసుకురావడం సాధ్యం కాదు. అంతేకాదు సొరంగం పనులు కొనసాగించడానికి కొత్త టీబీఎం కొన్నా ప్రయోజనం ఉండదని, దాని బ్లేడ్ భాగం 10 మీటర్ల వ్యాసం ఉండటంతో సొరంగంలోకి పంపే అవకాశం ఉండదని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఒకవేళ ఇలాంటి పరిస్థితే ఏర్పడితే ఇన్‌లెట్ వైపు నుంచి సొరంగం తవ్వకం పనులు నిలిచిపోతాయని.. రెండో వైపు నుంచే పనులను కొనసాగించాల్సి ఉంటుందని అంటున్నారు. దానివల్ల ప్రాజెక్టు పూర్తి కావడానికి ఎక్కువకాలం పడుతుందని స్పష్టం చేస్తున్నారు.

వెనుక భాగంలోని పరికరాలకు మరమ్మతు చాన్స్

టీబీఎం యంత్రానికి వెనుక భాగంలో ఉండే పరికరాలు దెబ్బతింటే.. వాటిని విడదీసి, బయటికి తీసుకెళ్లవచ్చని, మరమ్మతు చేసి తిరిగి బ్లేడ్ భాగానికి బిగించి పనులు చేయవచ్చని ఇంజనీర్లు చెబుతున్నారు. ఆ పరికరాలకు మరమ్మతులు సాధ్యంకాకున్నా కొత్తవి అమర్చవచ్చని వివరిస్తున్నారు. అయితే సొరంగంలో పైకప్పు టీబీఎం వెనుకభాగం పైనే పడి ఉండవచ్చని, బ్లేడ్ భాగం సురక్షితంగానే ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. సొరంగం లోపల కనిపిస్తున్న శిథిలాలు సైతం టీబీఎం వెనక భాగానికి సంబంధించినవేనని అంటున్నారు.

జీఎస్ఐ ఓకే అన్నాకే పనులు చేపట్టినట్టుగా..

సొరంగం కూలిన ప్రాంతంలో కొన్ని రోజుల కిందటి వరకు నిమిషానికి 7 వేల లీటర్ల నీటి ఊట ఉండగా.. నిర్మాణ సంస్థ పీయూ గ్రౌటింగ్ చేయడంతో 3 వేల లీటర్లకు ఊట తగ్గిందని అధికారవర్గాలు తెలిపాయి. అనంతరం జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) నుంచి జియాలజిస్టు వచ్చి పరిశీలించి, పనులు కొనసాగించవచ్చని చెప్పాకే టన్నెల్ పనులు పునః ప్రారంభించినట్టు అధికారులు తెలిపారు.

ఆర్డర్ ఇస్తేనే తయారు చేస్తారు

గతంలో ఈ టీబీఎంను రూ.250 కోట్లతో కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఇలాంటి పరికరాలను తయారీదారు రాబిన్స్ ఉత్పత్తి చేయడం లేదు. ఆర్డర్ ఇస్తేనే కొత్త టీబీఎంను గానీ, దానికి సంబంధించిన ఇతర పరికరాలనుగానీ తయారు చేసి సరఫరా చేస్తుంది. ఇప్పుడు కొత్త టీబీఎం కోసం ఆర్డర్ ఇచ్చినా.. సరఫరా కావడానికి ఏళ్లు పడుతుందని అంటున్నారు.

టీబీఎం తప్ప మరో మార్గం లేదు..

సొరంగాల నిర్మాణాన్ని డ్రిల్లింగ్ లేదా బ్లాస్టింగ్ ద్వారా కూడా చేపడతారు. అయితే ఎస్ఎల్‌బీసీ సొరంగాలను అమ్రాబాద్ అభయారణ్యం దిగువన నిర్మిస్తుండటంతో బ్లాస్టింగ్ పనులకు సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వలేదని తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం అధ్యక్షుడు ఎం.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో టీబీఎంతో తవ్వకాలు జరపడం తప్ప మరో మార్గం లేదని వెల్లడించారు. అంతేకాదు అడవిలో సర్వేలు, ఆడిట్ టన్నెల్స్, షాఫ్ట్ వంటి నిర్మాణాలకు సైతం సుప్రీంకోర్టు అనుమతించలేదని వివరించారు.

టీబీఎం పనిచేసేది ఇలా...

టీబీఎంకు ముందువైపు బ్లేడ్ భాగం చక్రం తరహాలో ఉండి, దానిపై భారీ ఇనుప దంతాలు (టీత్స్) ఉంటాయి. టీబీఎం వెనుక భాగంలో ఉండే భారీ మోటార్లు, ఇతర పరికరాలు విద్యుత్ సహాయంతో బ్లేడ్‌ను గుండ్రంగా తిప్పుతాయి. బ్లేడ్ భాగం గుండ్రంగా తిరుగుతున్న కొద్దీ.. ముందున్న ఇనుప దంతాలతో మట్టి, రాళ్లు కోతకు గురై కన్వేయర్ బెల్ట్‌పై పడతాయి. సొరంగం బయటి వరకు ఆ కన్వేయర్ బెల్ట్‌పైనే ప్రయాణించి డంపింగ్ ప్రాంతంలో పడిపోతాయి. అలా టీబీఎం నేలను తొలుచుకుంటూ మెల్లగా ముందుకు సాగుతుంది. తొలిచిన సొరంగం భాగంలో మట్టి కూలిపడకుండా కాంక్రీట్ సెగ్మెంట్లను అమర్చుతూ వెళతారు. సొరంగం ఏర్పాటైన కొద్దీ.. విద్యుత్ సరఫరా, ఆక్సిజన్ సరఫరా, సీపేజీలను అరికట్టే గ్రౌటింగ్, లైట్ల ఏర్పాటు, కన్వేయర్ బెల్ట్ పొడిగింపు వంటి పనులను కార్మికులు, ఇంజనీర్లు కొనసాగిస్తూ ఉంటారు.



పెళ్లి చేసుకోవడమంటే హక్కుల్ని సగం చేసుకోవడం, బాధ్యతల్ని రెట్టింపు చేసుకోవడం.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 25 ఫిబ్రవరి 2025

జెలెన్‌స్కీ విషాదయోగం!

'కర్ర గలవాడిదే బర్రె' నానుడి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి చాలా ఆలస్యంగా అర్థమైనట్టుంది. మూడేళ్లుగా అరువు తెచ్చుకున్న బలంతో రష్యా సేనలను ఢీకొడుతూ రేపో మాపో విజయం తన దేనన్న భ్రమల్లో బతికిన ఆయన, శాంతి కోసం పదవీత్యాగానికైనా సిద్ధమని తాజాగా ప్రకటించారు. అంతేకాదు... ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం కావాలట! జో బైడెన్ హయాంలో ఆయనకు అటు డాలర్లూ, ఇటు మారణాయుధాలూ పుష్కలంగా వచ్చిపడ్డాయి. ఆ కాలంలో ఆయనకు ఎవరన్నా లెక్కలేకుండా పోయింది. నిరుడు ఆగస్టులో ప్రధాని నరేంద్ర మోదీ శాంతి సాధనలో భాగంగా తొలుత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలిశారు. ఆ తర్వాత ఉక్రెయిన్ వెళ్లి జెలెన్‌స్కీతో చర్చించారు. మోదీ వచ్చి వెళ్లిన వెంటనే ఆయన్ను హేళన చేస్తూ మాట్లాడారు. నియంతతో చేతులు కలిపి నీతులు బోధిస్తారా అంటూ విరుచుకుపడ్డారు. దౌత్య మర్యాదల్ని అతిక్రమించారు. ఏడాది తిరగకుండా అంతా తలకిందులైంది. అణకువ ఒంటబట్టినట్టుంది. దురుసుగా, కఠినంగా, అవమానకరంగా మాట్లాడుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోవటానికి నానా పాట్లూ పడుతున్నారు. అందులో భాగంగానే తాజా ప్రతిపాదనలు చేశారు. వీటిని ట్రంప్ అంగీకరిస్తారని జెలెన్‌స్కీ ఎలా అనుకున్నారో అర్థంకాదు. 'ఎన్నికల్లేకుండా అధికారం చలాయిస్తున్న నియంత'గా తనను నిందించిన ట్రంప్ పదవీ పరిత్యాగ ప్రకటనల్ని ఖాతరు చేస్తారనుకోవటం, మెచ్చుకోలు మాటలు మాట్లాడుతారనుకోవటం తెలివితక్కువతనం. నాటోకు తిలోదాకాలిచ్చేందుకు సిద్ధపడుతున్న ట్రంప్‌ను ఆ సంస్థ సభ్యత్వం ఇప్పించమనటం మూర్ఖత్వం.

ఈ మూడేళ్ల యుద్ధంలో రష్యాను ఉక్రెయిన్ ముప్పుతిప్పలు పెట్టిన మాట వాస్తవం. అమెరికా, పాశ్చాత్య దేశాలు అందించిన క్షిపణులతో, డ్రోన్‌లతో రష్యా నగరాలపై దాడులు చేసి నష్టపరిచిన ఉదంతాలూ కోకొల్లలు. పర్యవసానంగా నేడో రేపో విజయం ఖాయమని భావించి దురాక్రమణకు దిగిన పుతిన్ అయోమయంలో పడిన సంగతి కూడా నిజం. ఒకపక్క అమెరికా, పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆంక్షలూ, మరోపక్క నేల రాలుతున్న సైనికుల ఉదంతాలూ, ధ్వంసమవుతున్న కీలక సైనిక స్థావరాలూ ఆయనకు కంటిమీద కునుకులేకుండా చేశాయి. ఉత్తర కొరియా నుంచి సైన్యాన్ని తీసుకొచ్చి రణరంగంలో ముందుకు నడిపించినా పెద్దగా ఫలితం దక్కలేదు. ఇక దీన్నుంచి గౌరవప్రదంగా బయటికి రావాలనుకున్నా అన్ని దారులూ మూసుకు పోయాయి. చివరకు అణ్వాయుధాలనే నమ్ముకోక తప్పదన్న నిర్ణయానికి కూడా వచ్చారని కథనాలు వెలువడ్డాయి. నిజానికి ఆ ఒక్క భయమే అమెరికా, పాశ్చాత్య దేశాలను ముందుకు అడుగేయ నీయలేదు.

మాటలకేం... కోటలు దాటేలా చెప్పారు. ఆచరణలో మాత్రం ఎంతసేపూ ఉక్రెయిన్‌ను ముందుకు తోసి లబ్ధి పొందుదామన్న ధ్యాస తప్ప అమెరికాకు మరేం పట్టలేదు. ఉక్రెయిన్ తీవ్ర నష్టాలు చవిచూసింది. గణనీయంగా భూభాగాన్ని కోల్పోయింది. తిరిగి స్వాధీనం చేసుకున్నవి సైతం అనంతర కాలంలో రష్యా సేనలకు చిక్కాయి. పట్టణాలు, నగరాలు శిథిలమయ్యాయి. ఒక దశలో సైన్యం చాలటం లేదని యువతీ యువకులకు సైనిక శిక్షణనిచ్చి ఉరికించారు. అయితే అదేమంత ఫలితం ఇవ్వలేదు. మొత్తంగా 3,80,000 మంది ఉక్రెయిన్ పౌరులు, సైనికులు గాయాల పాలయ్యారు. కాళ్లూ చేతులూ పోగొట్టుకున్న సైనికులు లక్షల్లోనే ఉంటారు. 46,000 మంది సైనికులు మరణించగా, వేలాదిమంది ఆచూకీ లేకుండా పోయారు. అనేకులు బందీలుగా చిక్కారు.

ట్రంప్ దృష్టంతా ఉక్రెయిన్ నేలలో నిక్షిప్తమైవున్న అపురూప ఖనిజాలు, ఇతర సహజ వనరులపై ఉంది. మూడేళ్లుగా తాము 50,000 కోట్ల డాలర్లు ఖర్చుచేశామని అమెరికా లెక్కలు చెబుతోంది. కానీ అది 12,000 కోట్ల డాలర్లు మించదని ఉక్రెయిన్ మొత్తుకుంటున్నది. పది తరాల ఉక్రెయిన్ పౌరుల్ని పీల్చిపిప్పిచేసే అమెరికా ఒప్పందం ససేమిరా సమ్మతం కాదన్న జెలెన్‌స్కీ మొర వినే నాథుడే లేడు. ఇన్నాళ్లూ అమెరికా సలహాతో ఉక్రెయిన్‌కు అన్నివిధాలా అండదండలందించిన పాశ్చాత్య దేశాలు సైతం ట్రంప్‌ను ధిక్కరించదల్చుకుంటే తమతో మాట్లాడొద్దని చెప్పటం ఆయనకు మింగుడుపడటం లేదు. ఒకపక్క అమెరికా రూపొందిస్తున్న ముసాయిదా ఒప్పందం ప్రతిపాదనల్ని పదిరోజులుగా ఉక్రెయిన్ వరసబెట్టి తిరస్కరిస్తుండగానే దాదాపు అంతా పూర్తయిందని, తుది దశ చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ అనటం జెలెన్‌స్కీని ఊపిరాడనివ్వటం లేదు. అమెరికా ప్రతిపాదన ఒప్పుకుంటే చమురు, సహజవాయువు, ఖనిజాలతోపాటు పోర్టులు, ఇతర మౌలిక సదుపాయాల ద్వారా వచ్చే ఆదాయంలో సగం సమర్పించుకోవాలి. తామిచ్చిన ప్రతి ఒక్క డాలర్‌కూ రెండు డాలర్లు చెల్లించాలన్నది అమెరికా డిమాండ్. ఇంత చేసినా ఉక్రెయిన్ రక్షణకు గ్యారెంటీ ఇవ్వటానికి తిరస్కరించటం, ముసాయిదా ఒప్పందంలో తొలుత ఉన్న ఆ మాటను తొలగించటం జెలెన్‌స్కీకి మింగుడుపడని అంశాలు.

ఎవరో ప్రోత్సహిస్తే అక్రమంగా సింహాసనం అధిష్ఠించటం, ఎవరికోసమో పొరుగు దేశంపై తొడగొట్టడం ఎంత ఆత్మహత్యా సదృశమో వర్తమాన ఉక్రెయిన్‌ను చూసి అన్ని దేశాలూ గుణపాఠం నేర్చుకోవాలి. స్వీయప్రయోజనాలే సర్వస్వం అయిన యుగంలో బతుకుతూ అపరిపక్వతతో, అనాలోచితంగా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే అవి చివరకు తననే కాటేస్తాయని జెలెన్‌స్కీ గ్రహించలేక పోయారు. ఒకనాడు అమెరికన్ కాంగ్రెస్‌లో యుద్ధ యోధుడిగా నీరాజనాలందుకున్న మనిషే ఇవాళ దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మూడేళ్లలో ఎంత మార్పు!

అత్యవసరంగా నేర్చుకోవాల్సింది!

కామెంట్



కరణ్ థాపర్

రాజకీయ నాయకుడి సత్తా ఏమిటో గుర్తించాలంటే వాళ్లు ఇబ్బందికరమైన పరిస్థితులను ఎలా ఎదుర్కొంటారో గమనించాలి. పార్టీ, కుటుంబం, లేదా వ్యక్తిగతమైన తప్పులను ఒప్పుకొంటారా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పేటప్పుడు ఇది మరీ ముఖ్యమవుతుంది. ఈ విషయంలో రాహుల్ గాంధీ... ఆ మాటకొస్తే ఆయన కుటుంబం, నాయనమ్మ కూడా బలహీనులనే చెప్పాలి.

కొన్నేళ్ల క్రితం కార్నెల్ యూనివర్సిటీలో జరిగిన చర్చ సందర్భంగా ఆర్థికవేత్త కౌశిక్ బసు ఎమర్జెన్సీ గురించి రాహుల్ గాంధీని ఒక ప్రశ్న వేశారు. ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని 'పొరబాటు'గా అభివర్ణించారనీ, "కాంగ్రెస్ పార్టీ ఏ దశలోనూ దేశంలోని వ్యవస్థలను ఆక్రమించే ప్రయత్నం చేయలేదనీ" రాహుల్ వివరించారు. రెండు విషయాల్లోనూ రాహుల్ తప్పే చెప్పారు. ఎందుకంటే, అత్యవసర పరిస్థితి కాలంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలు సుమారు లక్ష మందిని అరెస్ట్ చేసింది. పత్రికలపై నిషేధాజ్ఞలు విధించారు. న్యాయ, అధికార వ్యవస్థలను ఇష్టారీతిన వాడుకున్నారు. అత్యంత దారుణమైన రీతిలో రాజ్యాంగాన్ని మార్చేశారు. అప్పుడు ఆయనకు ఐదేళ్లు అయినప్పటికీ, రాహుల్ గాంధీ ఇవన్నీ తెలుసుకొని ఉండాలి!

వ్యూహాత్మక సమర్థనలు

అత్యవసర పరిస్థితిని 'పొరబాటు' అని ఇందిరా గాంధీ అన్నారనడం కూడా అబద్ధమే. ఆమె స్వయంగా దానికి బాధ్యత వహించారు. అందులో సందేహం లేదు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారు. కానీ దాన్ని 'పొరబాటు' అన్నారనడం అవాస్తవం. ఎమర్జెన్సీ అకృత్యాలను సమర్థించుకునేందుకు ఇందిర రకరకాల ఎత్తులు వన్నారు. ఆమె మాటల్లో దానిపట్ల సమర్థింపే కనిపించేది.

ఇందిరా గాంధీ అనుసరించిన వ్యూహాల్లో ఒకటి, అవసరానికి మించి జరిగిన ఘటనను అంగీకరించడం. 1978 జూలైలో మేరీ కరాస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో "పత్రికలను అణచివేయడం మరీ గట్టి చర్య" అని వ్యాఖ్యానించారు. ఇంకోలా చెప్పాలంటే, కట్టడి చేసేందుకు ఇంకొంచెం తేలికైన పద్ధతి ఉంటే బాగుండేదని అర్థం. అంతేతప్ప, పత్రికలను నియంత్రించడం పొరబాటైతే కాదు.

ఇంకో వ్యూహం ఉంది. ఇతరులు తప్పులు చేశారు... నేను మాత్రం వాటికి బాధ్యత తీసుకుంటున్నాను అని చెప్పడం. 1978 జనవరి 24న 'ది ఇండియన్ఎక్స్‌ప్రెస్' పత్రిక ఇందిరా గాంధీ యవత్మాల్ (మహారాష్ట్ర)లో ఇచ్చిన ఒక ప్రసంగంపై కథనాన్ని ప్రచురించింది. "తప్పులు చేసిన ఇతరులు తమ అతిని ఒప్పుకొనేందుకు సిద్ధంగా లేరు. నేను మాత్రం జరిగిన తప్పులకు బాధ్యత తీసుకుంటున్నాను' అని ఇందిరాగాంధీ చెప్పారు" అని ఉంది అందులో.

ఇక మూడో వ్యూహం: ఏ రకమైన తప్పులు జరిగినా వాటిని చాలా చిన్నవిగా చూపించి ఒప్పుకోవడం. మేరీ కారస్ ఇంటర్వ్యూలోనే ఇందిరా గాంధీ "రాజకీయ నాయకులను అదుపులోకి తీసుకోవడం, పత్రికా స్వాతంత్ర్యాన్ని హరించడం మినహా అసాధారణమైనవి ఏవీ లేవు" అని వ్యాఖ్యానించారు. తుర్క్‌మాన్ గేట్ (ఢిల్లీ) వద్ద కొంతమంది మరణించిన విషయాన్ని ప్రస్తావించినప్పుడు, "హింస జరగలేదు... అవి ఒకట్రెండు విడి ఘటనలు" అని తేల్చేశారు. దేశ ప్రజలందరినీ ఆందోళనకు గురి చేసిన బలవంతపు కుటుంబ నియంత్రణ కూడా పెద్దగా జరగలేదంటారు ఇందిర. "తప్పుడు ప్రచారమే మమ్మల్ని ఓడించింది. అలాగని మేమేమీ తప్పులు చేయలేదని అనడం లేదు. అయితే వాటిని కొండంత చేసి చూపించారు. బలవంతపు కుటుంబ నియంత్రణ విషయంలోనూ ఇదే జరిగింది. విషయాలను వాళ్లు ఎట్లా ప్రచారం చేస్తారంటే... చెప్పాలంటే నా దృష్టిలో అవి అసలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లే కాదు. ప్రచారం మాత్రమే. వారు చెప్పేంత స్థాయిలో జరగలేదు. కొన్ని కేసులున్నాయి కానీ... చాలా కేసుల గురించి వాకబు చేసినప్పుడు తప్పని తేలింది" అని ఇందిర 1978 మార్చి 26న పాల్ ఆర్ బ్రాస్‌తో జరిపిన సంభాషణలో స్పష్టం చేశారు.



◆ ఎమర్జెన్సీ విధించడం తప్పు అని ఇందిరా గాంధీ అన్న దాఖలా ఎక్కడా కనిపించలేదు.

◆ ఆర్ఎస్ఎస్ అన్ని వ్యవస్థల్లో తనవాళ్లను ప్రవేశపెడుతోందని ఆరోపిస్తున్న రాహుల్ గాంధీ... ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ ప్రవర్తన మాత్రం 'మౌలికంగా భిన్నం' అంటారు. ఇది తప్పు.

ఇప్పటివరకూ చెప్పుకొన్న ప్రతి అంశంలోనూ ఇందిరాగాంధీ కొన్ని నిర్దిష్ట అంశాల గురించి అంటే... నిషేధాజ్ఞలు, అరెస్టులు, తుర్క్‌మాన్ గేట్, బలవంతపు కుటుంబ నియంత్రణ వంటి వాటి గురించి మాట్లాడారే కానీ... అత్యవసర పరిస్థితి గురించి నేరుగా మాట్లాడలేదు. అత్యవసర పరిస్థితిలోంచి ఈ తప్పులను వేరుగా చూపే ప్రయత్నం చేశారు. దీన్నిబట్టే అత్యవసర పరిస్థితి విధింపుపై ఇందిరా గాంధీకి ఎలాంటి ఇబ్బందీ లేదన్నది ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది.

క్షమాపణ చెప్పలేదు!

1978 జనవరి 24న 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రకారం, అత్యవసర పరిస్థితి సమయంలో ఇతరులు చేసిన తప్పులు, అక్రమాలకు ఇందిరా గాంధీ బాధ్యత వహిస్తూనే, "ఎమర్జెన్సీ ప్రకటించిన సమయంలో దేశంలోని పరిస్థితి ఏమిటో ఆలోచించాలి" అని శ్రోతలను కోరారు. "అన్నివైపులా గందరగోళం నెలకొని ఉండింది. పరిస్థితి అలాగే కొనసాగి ఉంటే భారత్ పరిస్థితి బంగ్లాదేశ్‌లా అయ్యేదని వ్యాఖ్యానించారు." "రోగానికి చికిత్స చేసేందుకు ఇచ్చిన ఔషధమే ఎమర్జెన్సీ" అని అన్నారు.

ఎమర్జెన్సీకి సంబంధించి మీరేదైనా భిన్నంగా చేసేవారా? అని పాల్ బ్రాస్ అడిగినప్పుడు ఇందిర ఇచ్చిన సమాధానం 'లేదు' అని. సూటి ప్రశ్నకు వచ్చిన మొట్టమొదటి స్పందన అది. ఆ తరువాత... ఎమర్జెన్సీ కష్టాలను, బాధలను 'వ్యక్తిగతంగా' చూడలేకపోవడం తన తప్పు అని అన్నారు. "నా తప్పేమిటి అంటే... ఆ విషయాలను వ్యక్తిగతంగా చూడకపోవడం, చర్చించకపోవడం." ఇవీ ఆమె మాటలు!

కాబట్టి విషయమైతే స్పష్టం. ఎమర్జెన్సీ ఒక పొరబాటు అని ఇందిరా గాంధీ ఎప్పుడూ అనుకోలేదు. అందుకు క్షమాపణ కూడా చెప్పలేదనడం నిస్సందేహం. 1977 ఎన్నికల్లో ఓటమికి బాధ్యతను మాత్రం అంగీకరించారు. దానికి అతిపెద్ద కారణం ఎమర్జెన్సీ అన్నారే గానీ, అది తప్పు అని మాత్రం అనలేదు. నా పరిశోధనలో ఎంతో సాయం చేసిన, ఇందిరా గాంధీ ఆత్మకథ రాసిన సాగరికా ఘోష్ కూడా దీనితో ఏకీభవిస్తారు. ఎమర్జెన్సీ విధించడం తప్పు అని ఇందిరా గాంధీ అన్న దాఖలా నాకు ఎక్కడా కనిపించలేదు.

మౌలికంగా భిన్నమా?

ఆర్ఎస్ఎస్ అన్ని వ్యవస్థల్లో తనవాళ్లను ప్రవేశపెడుతోందని ఇప్పుడు ఆరోపిస్తున్న రాహుల్ గాంధీ... ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ ప్రవర్తన మాత్రం 'మౌలికంగా భిన్నం' అంటారు. ఇది కూడా తప్పే. అప్పట్లో ఓ జూనియర్ న్యాయమూర్తిని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా చేయడంతో హెచ్.ఆర్.ఖన్నా రాజీనామా చేయాల్సి వచ్చింది. హోంశాఖ కార్యదర్శి నిర్మల్ ముఖర్జీ వంటి నిబద్ధత కలిగిన అధికారులను పదవుల నుంచి తప్పించారు.

రాహుల్ గాంధీ ఎక్కడ పప్పులో కాలేశారో ఇప్పుడు నాకు అర్థమవుతోంది. ఇప్పుడున్న పరిస్థితినీ, ఎమర్జెన్సీ పరిస్థితినీ వేరుగా చూపాలని ఆయన భావించారు. తద్వారా ఇప్పటితో పోలిస్తే అప్పటి పరిస్థితి మెరుగు అన్న భావన కల్పించాలని అనుకున్నారు. అందుకే "కాంగ్రెస్ పార్టీ ఏ రోజూ వ్యవస్థలను వశపరచుకోవాలని అనుకోలేదు" అని వ్యాఖ్యానించారు. ఇంకో అంశం... ఎమర్జెన్సీని నానమ్మ 'పొరబాటు' అన్నారని చెప్పడం ద్వారా ఆ అంశంపై మరిన్ని ఇబ్బందికరమైన ప్రశ్నలు ఎదురు కాకుండా జాగ్రత్తపడ్డారు. చర్చను ముగించేందుకుగానూ, కొంత నష్టపోవడం అన్నమాట.

అయితే రాహుల్ మాటలు అప్పట్లోనే వివాదాన్ని సృష్టించాయి. ఆయన జ్ఞానం, తీర్పరితనం, నిజాయితీ, ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం... అన్నింటిపై సందేహాలు వచ్చాయి.

ఈ విషయాలన్నింటిలోనూ ఆయన చాలా తేలికగా ఓడిపోయారేమో అనిపిస్తుంది. ఇదో గూగ్లీ అనుకుంటే రాహుల్ బౌల్డ్ అయ్యారు. దీన్ని ఒక పరీక్షగా అనుకుంటే రాహుల్ దీంట్లో పాస్ కాలేదు. జనాలను ఆకట్టుకోవాలన్నది రాహుల్ ఉద్దేశమైతే అది కూడా జరగలేదు. రాహుల్ ఈ దేశ ప్రధాని అయితే... ఇబ్బందికరమైన పరిస్థితులను, మరీ ముఖ్యంగా తన కుటుంబ గత చరిత్ర గురించి ఎదుర్కోవడం ఎలాగో ఏదో ఒక రోజు కచ్చితంగా నేర్చుకోవాల్సి ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

అండగా ఉంటాం!



మూడేళ్ల క్రితం, ఉక్రెయిన్ మీద రష్యా పూర్తి స్థాయి అన్యాయమైన దురాక్రమణకు దిగింది. అధ్యక్షుడు జెలెన్‌స్కీని కలవడానికి ఇవ్వాళ(ఫిబ్రవరి 24) నేను కీవ్‌లో ఉన్నాను–– ఇప్పుడూ, ఎప్పుడూ ఉక్రెయిన్‌కు కెనడా అండగా ఉంటుందని చాటడానికి!

– జస్టిన్ ట్రూడో, కెనడా ప్రధాని

వేర్వేరుగా ఓట్లేశారు!



34 ఏళ్ల ఏకీకరణ తర్వాత కూడా జర్మనీ ఒక దేశం, రెండు జాతులుగానే ఉంది: అధికంగా 83.1 ఓటింగ్ శాతం నమోదైనప్పటికీ (ఏకీకరణ తర్వాత ఇదే అత్యధికం), ఎన్నికలు లోతైన తూర్పు– పశ్చిమ విభజనను ఎత్తిచూపాయి. జాతీయంగా తన ఓట్లను రెండింతలు చేసుకున్న 'ఏఎఫ్‌డీ' పార్టీ తూర్పు జర్మనీని ఊడ్చేసింది.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

రంగు మారుతోందా?



మోదీ ప్రభుత్వాన్ని ఫాసిస్టుగా ముద్ర వేయడానికి కేరళ సీపీఎం సిద్ధంగా లేదు. కేరళలో ఆర్ఎస్ఎస్‌ను స్వాగతించడానికి అది తన ఎర్రజెండానే ఎర్ర తివాచీగా పరుస్తోందా? ఎరుపు కాషాయం అవుతోందా?

– తుషార్ గాంధీ, రచయిత

హృదయ శుద్ధి



రమదాన్ సమీపిస్తున్నది కాబట్టి, మన హృదయాలను, ఉద్దేశాలను శుద్ధి చేసుకుందాం. మీరు ఎంత ధనికులైనా అణకువగా జీవించండి. సానుకూలంగా ఆలోచించండి. జనాన్ని క్షమించండి. ఎల్లప్పుడూ మంచి జరగడం కోసం ప్రార్థించండి.

– ముఫ్తి మెంక్, ఇస్లాం బోధకుడు

నిశ్చల మనసులోనే...



మనసు ఎల్లవేళలా సంచరిస్తూనే ఉంటుంది. ప్రాణాయామం, జపం లాంటివి మనసును నిశ్చలంగా ఉంచడానికి ప్రాచీన కాలం నుంచి సూచించిన మార్గాలు. అది స్థిరత్వం సాధించినప్పుడు ఇక ఏ పద్ధతీ అక్కర్లేదు. నిశ్చల మనసులోనే దైవం ప్రత్యక్షం కాగలదు.

– శ్రీ ఎం., ఆధ్యాత్మిక గురువు

ఇన్ బాక్స్

సోదరభావం పెరగాలి!

దేశంలో రోజు రోజుకూ ఎస్సీ, ఎస్టీ, బీసీలపై ఆధిపత్య కులాల దాడులు పెరిగిపోతున్నాయి. ప్రతి సంఘటనలో దళి తులే... అందులోనూ మహిళలే ప్రధాన బాధితులుగా ఉన్నారు. అయితే ఒక్కోసారి బీసీ కులాలవారే దళితుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తూ హత్య చేయడమూ కాదనలేని సత్యం. దీనికి కారణం మనువాదం బీసీల్లోని కొందరికి తలకెక్కడం.

తెలుగు నేలపై ఆ మధ్య చోటు చేసుకున్న పరువుహత్య సంచలనం సృష్టించింది. దేశంలో కుల దురహంకార హత్యలు, పరువు హత్యలు పెచ్చుమీరుతున్నాయి. పెళ్లి ఊరేగింపుల్లో దళితులు గుర్రంపై ఎక్కారని దాడులు జరుగుతున్నాయి. కులాంతర వివాహం చేసుకున్న వారిని హత్యలు చేసే కుటుంబాల వారిని దేశద్రోహులుగా ప్రకటించాలి. వారి ఆస్తులను జప్తు చేసి బాధిత కుటుంబానికి అప్పగించాలి. ఈ దుశ్చర్యలకు కారణమైన కులాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం చట్టం చేయాలి. దళితులను హీనులుగా భావించి తమ ఆడపిల్లలను పెళ్లి చేసుకున్నవారిని చంపేస్తున్నారు ఆధిపత్య వర్గాలవారు. అలాగే తక్కువ చూపు చూస్తూ దళిత యువతులను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించే ఆధిపత్య కులాలవారు వారిపై లైంగిక దాడులకు నిస్సిగ్గుగా పాల్పడుతున్నారు. ఇంతా చేస్తూ... 'దళితులు హిందువులే' అని ముక్తాయింపు ఇస్తున్నారు. మరి మతం ఒకటే అయితే సొంత మతస్థులనే ఎలా చంపగలుగుతున్నారు? దీనికంతటికీ కారణం మనువాదమే.

మతోన్మాదులు – రాజ్యం... ఈ రెండూ మిళితమై కుల కట్టుబాట్లు విధ్వంసం కాకుండా సింహద్వారాల దగ్గర వేచి ఉన్నాయి. హిందూమతానికి కులవ్యవస్థ ముఖద్వారం అయితే... ఆ కుల వ్యవస్థకు స్త్రీయే ముఖ ద్వారం. ఈ భావజాలాన్ని రక్షించేది రాజ్యం. కులవ్యవస్థ నిర్మూలనకు తక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. తరగతి గదులలో, సామాజిక మాధ్యమాలలో, గ్రామాలలోని అన్ని కులాల్లో సోదరభావాన్ని, కుల నిర్మూలనా దృక్పథాన్నీ ప్రచారం చేయాల్సి ఉంది. ముఖ్యంగా ఆ యా కుల హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు తీవ్రంగా కృషి చేయాలి.

– పాపని నాగరాజు, కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు

నిరుద్యోగులను ముంచేశారు!

అభిప్రాయం




వెలిచాల రాజేందర్ రావు

తాము అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014లో ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోదీ పదేపదే ఎన్నికల ప్రచారంలో చెప్పి, యువత ఓట్లను పొందారు. కానీ, 11 ఏళ్ల పాలనలో ఇప్పటి వరకూ ప్రధాని... ఉద్యోగాల కల్పనలో చేసిందేమీ లేదు. దేశంలో రోజు రోజుకూ నిరుద్యోగం పెరిగిపోతోంది. దీనికి కేంద్ర ప్రభుత్వ వైఖరే ప్రధాన కారణం. నిరుద్యోగాన్ని తగ్గించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు శూన్యమే. పైగా తమ పాలనలో పాతిక కోట్ల మందికి పైగా జనాన్ని పేదరికం నుంచి బయటి పడేశామనీ, అందువల్లే భారత దేశం ప్రపంచపు అతి పెద్ద ఐదో ఆర్థిక వ్యవస్థగా మారిందనీ ఢంకా బజాయిస్తున్నారు.

అప్పట్లో నిర్వహించిన కేంద్ర ప్రభుత్వానికి చెందిన పీరియాడిక్ లేబర్ సర్వే ప్రకారం దేశంలో ఇంటర్ వరకు చదివి, ఆ తర్వాత చదివే స్తోమత లేక, ఏ ఉపాధి లభించని వారి సంఖ్య 13.2 శాతంగా ఉంది. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ చేపట్టిన సర్వేలో 25 ఏళ్ల వయస్సున్న డిగ్రీ పూర్తిచేసిన వారిలో 42.3% నిరుద్యోగులుగా మారారని లెక్క తేల్చింది. మరోవైపు ఉన్నత విద్య పూర్తిచేసిన వారిలో 21.4% మందికి తగిన ఉపాధి లభించలేదని కూడా ఈ సర్వే వెల్లడించింది. 2014 మే నెల నుంచి 2023 సంవత్సరాంతానికి దేశంలో నిరుద్యోగ రేటు 10.05% మేర పెరిగిందని, రెండున్నర కోట్లమంది తమ కొలువులు కోల్పోయారని గణాంకాలు చెబుతున్నాయి. నేషనల్ సర్వే గణాంకాల ప్రకారం, 2012లో 2.1%గా ఉన్న నిరుద్యోగ రేటు, 2018 నాటికి 6.1% అయింది. 2014లో దేశ జనాభాలో 22.4% మంది నిరుద్యోగులుగా ఉండగా, గత 9 సంవత్సరాల సగటు 24.74%కి పెరిగింది. ప్రధానమంత్రి ఎంతో ఆడంబరంగా ప్రారంభించిన 'ప్రధాన మంత్రి కౌశల్ యోజన' దేశంలోని నిరుద్యోగుల కౌశలాన్ని మెరుగుపరచి ఉద్యోగాలు కల్పించే పథకంగా మారలేకపోయింది. ఇవన్నీ ఇలా ఉండగా తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాత్రం వాటి గురించి ఉసే ఎత్తడం లేదు. నిత్యం కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారు. ప్రతి విషయంలో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో నిరుద్యోగులను ఎంత వాడుకోవాలో అంత వాడుకున్నది బీఆర్ఎస్. తెలంగాణ కోసం పుట్టిన తమ పార్టీ అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని మభ్యపెట్టారు. పాపం వారు నిజమే అనుకుని నిరుద్యోగులు నమ్మారు. తీరా అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ నిరుద్యోగులను గాలికి వదిలేసింది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయాన్నే మరిచిపోయారు. తర్వాత వారి ప్రాధమ్యాలు మారిపోయాయి. ఈ విధంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగులను నిలువునా ముంచారు. చివరికి పాపం వారు నిరసన తెలిపే హక్కును సైతం కోల్పోయారు. అధికారంలోకి రావడంలో కీలకంగా వ్యవహరించిన వారిపై ఉక్కుపాదం మోపింది బీఆర్ఎస్ ప్రభుత్వం. దీంతో నిరుద్యోగులు, యువకులు, విద్యార్థులు బీఆర్ఎస్ నేతలపై రగిలిపోతున్నారు. వారికి ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగానే ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా కేవలం 12 నెలల కాలంలోనే 55 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. నిరుద్యోగంతో బాధపడుతున్న యువత, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉందనేందుకు ఇంతకంటే ఏం సాక్ష్యం కావాలి? బీఆర్ఎస్ నేతలకు ఆ సోయి కూడా లేదు. తెల్లారి లేస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కడం మాత్రం నేర్చుకున్నారు. సింగరేణి సంస్థల్లోని దాదాపు తొమ్మిది వేల పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఇలా అనేక డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగ అవకాశాలు కల్పించింది ఈ సర్కారు. ఈ ఉద్యోగాలు కూడా తమ గొప్పతనమేనని చెప్పుకుంటున్నది బీఆర్ఎస్.




రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్నా 10 ఏళ్ల తర్వాత తెలంగాణలో ఏడు లక్షల కోట్ల అప్పులు చేసిన ఘనత కేసీఆర్‌ది. ఇష్టారాజ్యంగా అప్పులు చేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు అసలు మిత్తితో కలిపి ఏడు వేల కోట్లు చెల్లిస్తున్నది. అత్యంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా క్రమపద్ధతిలో రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరంతరం కృషి చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తున్నదీ ప్రభుత్వం. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అవాస్తవ ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరు. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్బండవర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుంది. ప్రజా ప్రభుత్వానికి కావాల్సింది ప్రజల దీవెనలే!

వ్యాసకర్త కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ‌। 98490 61481

అందరి గీత

శ్రేష్ఠులు అంటే ఎలా ఉంటారో స్పష్టంగా చెబుతాడు శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత ఆరవ అధ్యాయములోని 'సుహృన్మిత్రార్యు దాసీ' అనే 9వ శ్లోకంలో. దాని అర్థం – సుహృదయుల పట్ల, మిత్రుల పట్ల, శత్రువుల పట్ల, ఉదాసీనుల పట్ల, మధ్యస్థుల పట్ల, ద్వేషింపదగిన వారి పట్ల, బంధువుల పట్ల, ధర్మాత్ముల పట్ల, పాపుల పట్ల సమబుద్ధి కలిగి ఉండువాడు మిక్కిలి శ్రేష్ఠుడు. భగవద్గీత కేవలం భారతీయులదీ, అదీ కేవలం హిందువులకే చెందిన గ్రంథం కాదని ఈ శ్లోకాన్ని బట్టి చెప్పవచ్చు.



జ్యోతిర్మయం

భారత దేశంలో జన్మించిన వారే, అదీ హిందువులే శ్రేష్ఠులని కాని; భగవద్గీతను నిత్యపారాయణం చేసేవారే మిక్కిలి శ్రేష్ఠులని కానీ శ్రీకృష్ణుడు చెప్పలేదని మనం గ్రహించాలి. జన్మించిన కులానికి ఆయన ప్రాధాన్యం ఇవ్వక... గుణాలకు ప్రాధాన్యమిచ్చాడని సుస్పష్టమవుతుంది. సహృదయుడై అందరినీ సమానంగా గౌరవించేవాడు ఏ కులస్థుడైనా, ఏ దేశస్థుడైనా, ఏ మతావలంబి అయినా ఏ రంగానికి చెందినవాడైనా శ్రేష్ఠుడే.

శ్లోకాలు భగవద్గీతలో ఎన్నో ఉన్నాయి. అందుకే అది మతాతీత గ్రంథమై ప్రపంచ మేధావులతో కొనియాడబడింది. అటువంటి పవిత్ర, నిత్యసత్యమైన గ్రంథం ఉద్భవించిన మట్టిలో పుట్టిన మనం ఆ గుణగణాలను అలవరచుకొని, నిజ జీవితంలో అనుష్ఠించి ఆ శ్రీకృష్ణ పరమాత్ముని నుంచే 'వీరు మిక్కిలి శ్రేష్ఠులు' అనే ధృవపత్రాన్ని (సర్టిఫికెట్) పొందాలి. మనం చేసే ప్రతి గీతా పారాయణం, గీతా జ్ఞాన యజ్ఞం, గీతా జయంతి, కృష్ణాష్టమి ఉత్సవం మనల్ని ఆ దిశలో పరుగులిడటానికి ప్రేరణ ఇవ్వాలి, ప్రోత్సహించాలి.

– రాచమడుగు శ్రీనివాసులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.ద్వాదశి ఉ.10.32 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: ఉత్తరాషాఢ సా.4.52 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: రా.8.51 నుండి 10.23 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.46 నుండి 9.34 వరకు, తదుపరి రా.11.02 నుండి 11.50 వరకు, అమృత ఘడియలు: ఉ.10.20 నుండి 11.55 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.26, సూర్యాస్తమయం: 6.01.

● ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను మార్చి 21వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించిన తర్వాత స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన సోమవారం బీఏసీ సమావేశం జరిగింది. ఈనెల 25న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ, 26, 27 తేదీలు సెలవులిచ్చి, తిరిగి 28న సభ నిర్వహిస్తారు. ఆ రోజు ఆర్థిక మంత్రి పయ్యావుల రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

డిప్యూటీ సీఎం కార్యాలయ వెబ్‌సైట్‌పైనా సైబర్ ఎటాక్

● జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్‌ఆర్ట్స్ కళాశాల సహా పలు ప్రభుత్వ సైట్లు కూడా...
● వెల్లడించిన తెలంగాణ సైబర్ థ్రెట్ రిపోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర డిప్యూటీ సీఎం కార్యాలయ వెబ్‌సైట్‌పై కూడా సైబర్‌ఎటాక్ జరిగినట్టు తెలంగాణ సైబర్ థ్రెట్ రిపోర్ట్-2025 వెల్లడించింది. డిప్యూటీ సీఎం వెబ్‌సైట్‌లోని పలు కీలక డాక్యుమెంట్లు, గోప్యమైన డేటాను సైతం సైబర్ ఎటాకర్లు బహిర్గతం చేసినట్టు పేర్కొంది. పలు ప్రభుత్వరంగ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలను సైతం సైబర్ ఎటాకర్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆ నివేదిక పేర్కొంది. సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన సెక్‌రైట్ సంస్థ రూపొందించిన తెలంగాణ సైబర్ థ్రెట్ రిపోర్ట్-2025లోని కీలక విషయాలను సంస్థ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అందులో పేర్కొన్న ప్రకారం..సైబర్ దాడులు మరింత పెరుగుతున్నాయని, సరికొత్త సైబర్ మోసాలు తెరపైకి వస్తున్నట్టు చెప్పింది. దేశవ్యాప్తంగా 2024లో జరిగిన సైబర్‌దాడుల్లో 23 శాతం తెలంగాణలోనే జరిగినట్టు వెల్లడించింది. టెలిగ్రామ్ వంటి వాటిద్వారా సైబర్ నేరగాళ్లు హ్యాకింగ్ పాల్పడుతున్నట్టు తెలిపింది. ప్రధానంగా data.telangana.gov.in వంటి ప్రభుత్వ పోర్టల్‌లను, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వంటి విద్యా సంస్థలను లక్ష్యంగా చేసుకున్నట్టు పేర్కొంది. పౌరులకు సంబంధించిన సున్నితమైన డేటా, లాగిన్ వివరాలు, ప్రభుత్వ పత్రాలు ఆన్‌లైన్‌లో లీక్ అయినట్టు తాము గుర్తించినట్టు పేర్కొంది. ఆయా సంస్థల ప్రతిష్ట దెబ్బతీసే లక్ష్యంతోనే సైబర్ ఎటాకర్లు ఇలా డేటా చోరీ చేస్తున్నట్టు తెలిపింది.

రాష్ట్రంలో గతేడాది నమోదైన మోసాల ఘటనలు ఇలా..	
ఐడెంటిటీ థెఫ్ట్	30,000
పోలీసులు, ప్రభుత్వ అధికారుల పేరిట	18,647
బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్	26,000
లోన్ ఫ్రాడ్స్	12,589

'మేడిగడ్డ'పై కేసులో తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: 'మేడిగడ్డ' అంశంపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఫిర్యాదుదారు మృతిచెందినా ప్రజాప్రయోజనం ఉన్న నేపథ్యంలో విచారణ కొనసాగించాలని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదించగా అలా విచారణ చేపట్టడం సరికాదని కేసీఆర్ తరఫు న్యాయవాది టీవీ రమణారావు వాదనలు వినిపించారు. ఇరుపక్షాలు ఆ మేరకు సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పుల కాపీలను సమర్పించారు. వాదనలు పూర్తి కావడంతో న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని.. భూపాలపల్లికి చెందిన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు.

బ్లేడ్‌తో గొంతుకోసుకుని ఆత్మహత్య

● మృతుడు పవర్‌గ్రిడ్ సంస్థలో చీఫ్ మేనేజర్
● మానసిక రుగ్మత, కుటుంబ కలహాలే కారణం


నర్సింగరావు

చిలకలగూడ (హైదరాబాద్): ఘట్‌కేసర్ పవర్‌గ్రిడ్ సంస్థలో చీఫ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సింగరావు బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సికింద్రాబాద్ చిలకలగూడ ఠాణా పరిధి మేడిబావిలో సోమవారం ఉదయం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావికి చెందిన నర్సింగరావు (52) శ్రీలతలు భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. నర్సింగరావు కొన్నేళ్లుగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. కుటుంబసభ్యుల మధ్య చాలాకాలంగా ఆస్తి తగాదాలు కూడా కొనసాగుతున్నాయి. నర్సింగరావు సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో బాత్‌రూమ్‌కు వెళ్లి గడియపెట్టుకున్నాడు. కొంత సమయం తర్వాత పిలిచినా పలకకపోవడంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా బ్లేడ్‌తో గొంతు కోసుకుని రక్తపు మడుగులో విగతజీవిగా పడున్నాడు. భార్య వేధింపులు తాళలేకే ఆత్మహత్యకు పాల్పడ్డాడని నర్సింగరావు సోదరి, బంధువులు ఆరోపించారు. అయితే మానసిక రుగ్మతలతోనే ఆత్మహత్యకు పాల్పడ్డారని భార్య వెల్లడించారు. ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్ ఘటన స్థలాన్ని సందర్శించారు. నర్సింగరావు మానసిక స్థితి సరిగా లేదని తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అడిషనల్ డీసీపీ తెలిపారు.

27 నుంచి కాళేశ్వరం క్రాస్ ఎగ్జామినేషన్ పునరుద్ధరణ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈనెల 27 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను పునరుద్ధరించనుంది. గతంలో క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరై ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారమిచ్చి తప్పుదోవపట్టించేందుకు ప్రయత్నించిన పలువురు ఇంజనీర్లను ఈ దఫా క్రాస్ ఎగ్జామినేషన్‌లో కమిషన్ ప్రశ్నించనుంది. ఓ ఈఎన్సీ, పలువురు మాజీ ఈఎన్సీలు, ప్రస్తుత, మాజీ చీఫ్ ఇంజనీర్లతో పాటు ఓ ఐఏఎస్ అధికారిని ఈ క్రమంలో కమిషన్ ప్రశ్నించనున్నట్టు సమాచారం.

ప్రపంచం చూపు భారత్ వైపు

మనపై ప్రపంచ దేశాలకు ఎన్నో ఆశలు, ఆకాంక్షలున్నాయి ● పెట్టుబడిదారుల సదస్సులో ప్రధాని మోదీ వెల్లడి

భోపాల్: భారతదేశ ఆర్థిక ప్రగతి పట్ల ప్రపంచం మొత్తం ఎంతో ఆశాభావంతో ఉందని, ఇలాంటి పరిణామం మన దేశ చరిత్రలో ఇదే మొదటిసారి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. భారత్ నుంచి సామాన్య ప్రజలతోపాటు ఆర్థికవేత్తలు, ప్రపంచ దేశాలు, సంస్థలు ఎంతో ఆశిస్తున్నాయని అన్నారు. మనపై ఎన్నో ఆశలు, ఆకాంక్షలు పెట్టుకున్నాయని తెలిపారు. సోమవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో 'ఇన్వెస్ట్ మధ్యప్రదేశ్–గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2025'లో ప్రధాని మోదీ మాట్లాడారు. ప్రపంచం భవిష్యత్తు భారత్‌లో ఉందనడంలో సందేహం లేదన్నారు. రాబోయే రోజుల్లోనూ ఇండియా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని ప్రపంచబ్యాంక్ సైతం ఆశాభావం వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. 'సోలార్ పవర్‌లో ఇండియా సూపర్ పవర్' అని వాతావరణ మార్పులపై ఏర్పాటైన ఐక్యరాజ్యసమితి సంస్థ ప్రశంసించిందని తెలిపారు. చాలా దేశాలు కేవలం మాటలకు పరిమితం అవుతుండగా, ఇండియా మాత్రం కార్యరంగంలోకి దిగి, ఫలితాలు సాధించి చూపుతోందని స్పష్టంచేశారు. అంతర్జాతీయంగా ఏరోస్పేస్ సంస్థలకు మన దేశమే అతిపెద్ద సరఫరాదారుగా మారిందన్నారు. రాబోయే కొన్నేళ్లలో టెక్స్‌టైల్, టూరిజం, టెక్నాలజీ వంటి రంగాల్లో యువతకు కోట్లాది ఉద్యోగాలు దక్కబోతున్నాయని వివరించారు.

గ్రీన్ ఎనర్జీ రంగంలో దూసుకెళ్తున్నాం

గత దశాబ్ద కాలంలో ఇంధన రంగంలో మునుపెన్నడూ లేని ప్రగతి సాధించామని ప్రధానమంత్రి మోదీ వివరించారు. ముఖ్యంగా గ్రీన్ ఎనర్జీ రంగంలో ముందుకు దూసుకెళ్తున్నామని చెప్పారు. పదేళ్లలో పునరుత్పాదక ఇంధన రంగంలో 70 బిలియన్ డాలర్ల(రూ.6 లక్షల కోట్లు) పెట్టుబడులు వచ్చాయన్నారు. క్లీన్ ఎనర్జీ రంగంలో గత ఏడాది 10 లక్షలకుపైగా ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో పెట్టుబడులకు అద్భుతమైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని దేశ విదేశీ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. ఎలక్ట్రిక్ వాహనాల విప్లవంలో మధ్యప్రదేశ్ ముందంజలో ఉందని తెలిపారు. రాష్ట్రం అతిపెద్ద తయారీ కేంద్రంగా ఎదుగుతోందని ప్రధానమంత్రి వివరించారు. పెట్టుబడుల ఆకర్షణ కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన 18 నూతన విధాన నిర్ణయాలను మోదీ ఆవిష్కరించారు.

విద్యార్థుల కోసమే ఆలస్యంగా వచ్చా


భోపాల్‌లో పెట్టుబడిదారుల సదస్సుకు ప్రధాని మోదీ కొంత ఆలస్యంగా హాజరయ్యారు. దీనిపై ఆయన సదస్సులో మాట్లాడుతూ వివరణ ఇచ్చారు. ఈ రోజు పది, పన్నెండో తరగతుల విద్యార్థులకు పరీక్షలు ఉన్నాయని చెప్పారు. రాజ్‌భవన్ నుంచి తాను బయలుదేరే సమయానికే వారు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉందని తెలిపారు. తాను బయటకు వస్తే రోడ్లపై ట్రాఫిక్ నిలిపివేస్తారు కాబట్టి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయన్న ఉద్దేశంతో దాదాపు 15 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరానని వెల్లడించారు. తన వల్ల విద్యార్థులు నష్టపోవడాన్ని తాను భరించలేనన్నారు. వారు సరైన సమయానికే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.



ప్రపంచ రికార్డు సాధనే లక్ష్యంగా గౌహతిలో సోమవారం రాత్రి 'ఝుమోయిర్ బినందిని' పేరుతో చేపట్టిన గిరిజన సంప్రదాయ నృత్యంలో దాదాపు 9 వేల మంది కళాకారులు పాల్గొన్నారు. (ఇన్‌సెట్) ఈ కార్యక్రమాన్ని డోలు వాయించి ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

భారత్‌ను ఓడించకపోతే నా పేరు షెహబాజ్ షరీఫే కాదు

పాకిస్తాన్ ప్రధానమంత్రి భీకర ప్రతిజ్ఞ



ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ భీకర ప్రతిజ్ఞ చేశారు. ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి, దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమంలో పొరుగుదేశం భారత్‌ను ఓడిస్తానని, లేకపోతే తన పేరు షెహబాజ్ షరీఫే కాదని తేల్చిచెప్పారు. ఆయన తాజాగా పంజాబ్ ప్రావిన్స్‌లోని డేరా ఖాజీ ఖాన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పిడికిలి గాల్లో విసురుతూ, పోడియం బల్ల చరుస్తూ ఆవేశంగా మాట్లాడారు. సామాన్య ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని అన్నారు. వారి కనీస అవసరాలు తీర్చడం తమ బాధ్యత అని చెప్పారు. దేశంలో అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక పరిస్థితిని సక్రమ మార్గంలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. భగవంతుడి ఆశీస్సులు పాకిస్తాన్‌కు ఎల్లవేళలా ఉంటాయని వ్యాఖ్యానించారు. అభివృద్ధిలో ఇండియాను వెనక్కి నెట్టేయకపోతే తన పేరు షెహబాజ్ షరీఫే కాదని స్పష్టంచేశారు. ఇండియాను అధిగమించడానికి చివరి క్షణం దాకా కష్టపడుతూనే ఉంటామని, అందరం కలిసికట్టుగా పని చేస్తామని పేర్కొన్నారు. మరోవైపు షెహబాజ్ షరీఫ్ ప్రతిజ్ఞపై సోషల్ మీడియాలో జనం వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. ఆచరణ సాధ్యం కాని ప్రకటనలు చేశారని విమర్శిస్తున్నారు. కేవలం మాటల చెప్పడం కాదు, దమ్ముంటే సాధించి చూపండి అంటూ డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను గుర్తించకుండా ప్రధానమంత్రి ఇష్టానుసారంగా నోరుపారేసుకున్నారని కొందరు తప్పుపట్టారు.

ఆఫీసులకు రాకుంటే.. లీవు తప్పదు!

ప్రభుత్వ సిబ్బందికి మస్క్ హెచ్చరిక



వాషింగ్టన్: అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ఈ వారం నుంచి తప్పనిసరిగా తిరిగి విధులకు హాజరు కావాల్సిందేనని ఆయన సలహాదారు ఎలాన్ మస్క్ స్పష్టం చేశారు. హాజరు కాని వారందరినీ పరిపాలనా పరమైన లీవుపై సాగనంపుతామని హెచ్చరించారు. వారికిక వేతనాలుండవన్నారు. ఆయన సోమవారం 'ఎక్స్'లో ఈ మేరకు పలు పోస్టులు చేశారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక వేగంగా జరుగుతున్న పరిణామాలతో ఫెడరల్ ప్రభుత్వ విభాగాల్లో అయోమయం, ఉద్యోగుల్లో ఆందోళన పెరిగిపోయాయి. యంత్రాంగాల్లో విభేదాలు పొడచూపుతున్నాయి. ఉద్యోగులు ఎవరికి వారు తమ పనితీరును వివరించాలంటూ మస్క్ రెండు రోజుల క్రితం చేసిన హెచ్చరికలపై స్పందించాలంటూ హెల్త్, హ్యూమన్ రిసోర్సెస్, డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్, ఫెడరల్ కమ్యూనికేషన్ కమిషన్ తమ ఉద్యోగులకు సూచించగా ఆ అవసరం లేదంటూ డిఫెన్స్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, ఇంధన, వాణిజ్య విభాగాలు సూచించాయి. ఇప్పటికే కన్జూమర్ ఫైనాన్షియల్ ప్రొటెక్షన్ బ్యూరో ఉద్యోగులను మస్క్ యంత్రాంగం ఇళ్లకు పంపించేసింది.

యూఎస్‌ఎయిడ్‌లో 1,600 ఉద్యోగుల తొలగింపు

వాషింగ్టన్: ట్రంప్ అధ్యక్షుడయ్యాక అమెరికా ప్రభుత్వ విభాగాలైన ఫెడరల్ ఏజెన్సీలు, అనుబంధ విభాగాల్లో సిబ్బంది కోత పరంపర కొనసాగుతోంది. తాజాగా యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్‌ఎయిడ్) విభాగంలోని 1,600 మంది ఉద్యోగులను ట్రంప్ ప్రభుత్వం తొలగించింది. ప్రపంచవ్యాప్తంగా యూఎస్‌ఎయిడ్‌కు సంబంధించిన కీలక విధులు, ప్రత్యేక కార్యక్రమాల్లో నిమగ్నమైన సిబ్బందిని సోమవారం నుంచి సెలవులపై పంపుతున్నట్లు ట్రంప్ సర్కార్ ప్రకటించింది.

మొత్తం ఖైదీల పరస్పర బదిలీకి సిద్ధం

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆఫర్



కీవ్: రష్యాతో యుద్ధాన్ని ముగించేందుకు, ఇరుదేశాల్లో ఉన్న మొత్తం ఖైదీల మార్పిడికి తాను సిద్ధంగా ఉన్నట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం ప్రకటించారు. ఉక్రెయిన్‌పైకి రష్యా దండయాత్ర మొదలెట్టి సోమవారంతో మూడేళ్లు పూర్తయిన సందర్భంగా రాజధాని కీవ్ నగరంలో జరిగిన సమావేశంలో జెలెన్‌స్కీ మాట్లాడారు. యుద్ధాన్ని ముగించే ప్రయత్నంలో భాగంగా యుద్ధ ఖైదీల మార్పిడిని ఆయన ప్రతిపాదించారు. ' రష్యా జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఉక్రేనియన్లను విడుదల చేయాలి. మా జైళ్లలోని రష్యన్లను మేం విడుదలచేస్తాం. యుద్ధ ఖైదీలందరినీ మార్పిడి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. యుద్ధాన్ని ఇలా న్యాయబద్ధమైన మార్గంలో ముగిద్దాం'' అని జెలెన్‌స్కీ అన్నారు. తమ దేశానికి నాటో సభ్యత్వం ఇస్తే ఉక్రెయిన్ అధ్యక్ష పదవి నుంచి వెంటనే వైదొలగడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన మరుసటి రోజే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. ఉక్రెయిన్ మూడేళ్ల ప్రతిఘటనను, సైనికుల పోరాటపటిమ, వీరత్వాన్ని జెలెన్‌స్కీ ప్రశంసించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్యవర్తిత్వంలో 2024 అక్టోబర్‌లో రష్యా, ఉక్రెయిన్ చెరో 95 మంది యుద్ధ ఖైదీలను మార్పిడి చేసుకున్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఖైదీల పరస్పర బదిలీ ప్రక్రియ ఇప్పటికి 58సార్లు జరిగింది. గత సెప్టెంబర్‌లో ఇరు దేశాలు 103 మంది ఖైదీలను విడుదల చేశాయి. భద్రతా సాయానికి బదులుగా కీలకమైన సహజ వనరులను సమకూర్చడంపై అమెరికా అధ్యక్షుడితో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

తప్పుడు సమాచారం ఇస్తే వీసాలు రద్దు!

- కెనడా ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో భారీ మార్పులు
- అధికారులకు మరిన్ని అధికారాలు



టోరంటో: ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో కెనడా ప్రభుత్వం భారీ మార్పులు చేసింది. నూతన ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీ ప్రొటెక్షన్ నిబంధనలు ఈ ఏడాది జనవరి 31వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయి. వీటిద్వారా ఇమ్మిగ్రేషన్, బోర్డర్ అథారిటీ అధికారులకు మరిన్ని అధికారాలు లభించాయి. స్టడీ వీసాలు, వర్క్ వీసాలతోపాటు ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్స్(ఈటీఏ), టెంపరరీ రెసిడెంట్ వీసాలు(టీఆర్‌వీ) రద్దుచేసే అధికారం దక్కింది. వర్క్ పర్మిట్లు, స్టడీ పర్మిట్లు సైతం రద్దు చేయొచ్చు. ఈ కొత్త నిబంధనల వల్ల వేలాది మంది విదేశీయులకు నష్టం జరిగే ప్రమాదం కనిపిస్తోంది. ప్రధానంగా కెనడాలో ఉంటున్న భారతీయులపై తీవ్ర ప్రభావం పడనుందని నిపుణులు చెబుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగస్థులు, టెంపరరీ రెసిడెంట్ విజిటర్లకు ఇబ్బందులు ఎదురు కానున్నాయని పేర్కొంటున్నారు. తప్పుడు సమాచారం ఇచ్చినా, నేర చరిత్ర ఉన్నట్లు తేలినా కెనడా అధికారులు వీసాలు రద్దు చేస్తారు. వీసా గడువు ముగిసినా సదరు వీసాదారుడు కెనడా విడిచి వెళ్లే అవకాశం లేదని అధికారులు భావిస్తే వీసా రద్దు కావొచ్చు. వీసా పత్రాలను పోగొట్టుకున్నా, చోరీకి గురైనా, ధ్వంసమైనా, తప్పుడు సమాచారంతో ఆ వీసా మంజూరు చేసినట్లు గుర్తించినా.. రద్దు చేయడానికి ఆస్కారం ఉంటుంది. కొత్త నిబంధనల వల్ల దాదాపు 7,000 వీసాలు రద్దయ్యే ప్రమాదం కనిపిస్తోంది. కొన్ని రెసిడెంట్ వీసాలు, వర్క్ పర్మిట్లు, స్టడీ పర్మిట్లపై వేటు తప్పదని అంటున్నారు. ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థులు కెనడా వైపు అధికంగా మొగ్గు చూపుతుంటారు. ప్రస్తుతం కెనడాలో 4.27 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఉన్నట్లు భారత విదేశాంగ శాఖ వెల్లడించింది.

ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

బీజేపీ దళిత, సిక్కు వ్యతిరేకి అంటూ ఆప్ నిరసన

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా అధికార బీజేపీ శాసనసభ్యుడు విజేందర్ గుప్తా ఎన్నికయ్యారు. కొత్తగా కొలువుదీరిన ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి మొదలయ్యాయి. సెషన్ ప్రారంభానికి ముందు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా బీజేపీ ఎమ్మెల్యే అర్విందర్ సింగ్ లవ్లీతో ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేయించారు. అత్యంత సీనియర్ ఎమ్మెల్యే అయిన లవ్లీ నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలందరితో ప్రమాణం చేయించారు. అనంతరం, మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన గుప్తా పేరును స్పీకర్ పదవికి ప్రతిపాదిస్తూ సీఎం రేఖా గుప్తా, మంత్రి రవీందర్ ఇంద్రజ్ రెండు తీర్మానాలను ప్రవేశపెట్టగా, వీటిని మంత్రులు పర్వేశ్ వర్మ, మంజిందర్ సింగ్ బలపరిచారు. మూజువాణి ఓటుతో తీర్మానాలను సభ ఆమోదించిందని ప్రొటెం స్పీకర్ అర్విందర్ సింగ్ లవ్లీ ప్రకటించారు. దీంతో, సీఎం రేఖా గుప్తా, ప్రతిపక్ష నేత ఆతిశీ వెంట రాగా కొత్త స్పీకర్ కుర్చీలో ఆసీనులయ్యారు. స్పీకర్ విజేందర్ గుప్తాకు సీఎం రేఖా గుప్తా శుభాకాంక్షలు తెలపగా, ఆప్‌కు చెందిన ప్రతిపక్ష నేత ఆతిశీ మాత్రం అసంతృప్తి వ్యక్తం చేశారు. దళిత, సిక్కు వ్యతిరేక పార్టీ ఢిల్లీ అసెంబ్లీకి సారథ్యం వహించడం దురదృష్టకరమంటూ వ్యాఖ్యానించారు. సీఎం కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్, భగత్ సింగ్‌ల ఫొటోలను తీసేయడం చూస్తే బీజేపీ దళిత వ్యతిరేక వైఖరి తేటతెల్లమవుతోందని ఆరోపించారు. దీంతో, సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల పోటాపోటీ నినాదాలతో సభ 15 నిమిషాలపాటు వాయిదా పడింది. ఢిల్లీ సీఎం కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని తొలగించవద్దని అనంతరం ఆప్ చీఫ్ కేజ్రీవాల్ 'ఎక్స్'లో బీజేపీని కోరారు. ప్రధాని మోదీ ఫొటో పెట్టి, అంబేడ్కర్ ఫొటోను తీసేయడం కోట్లాది మంది ఆయన అనుచరుల మనస్సులను గాయపరిచినట్లేనన్నారు.



విజేందర్‌కు స్వీటు తినిపిస్తున్న ఆయన భార్య శోభ

ఆరు భాషల్లో ఎమ్మెల్యేల ప్రమాణం

సెషన్ ప్రారంభానికి ముందు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా బీజేపీ ఎమ్మెల్యే అర్విందర్ సింగ్ లవ్లీతో ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేయించారు. అత్యంత సీనియర్ ఎమ్మెల్యే అయిన లవ్లీ నూతన ఎమ్మెల్యేలందరితో ప్రమాణం చేయించారు. వీరు హిందీ, ఇంగ్లిష్, సంస్కృతం, ఉర్దూ, మైథిలి, పంజాబీ భాషల్లో ప్రమాణం చేయడంతో అసెంబ్లీలో భాషాపరమైన వైవిధ్యం ప్రతిఫలించింది.

జమిలి ఎన్నికలు అప్రజాస్వామికం కాదు

- దేశ సమాఖ్య నిర్మాణానికి విఘాతం కలగదు
- జేపీసీకి తెలియజేసిన కేంద్ర న్యాయ శాఖ

న్యూఢిల్లీ: 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' విధానం అప్రజాస్వామికం కాదని కేంద్ర న్యాయ శాఖ తేల్చిచెప్పింది. జమిలి ఎన్నికలతో దేశ సమాఖ్య నిర్మాణానికి ఎలాంటి విఘాతం కలగదని స్పష్టంచేసింది. ఒకే దేశం.. ఒకే ఎన్నిక బిల్లుపై అధ్యయనం కోసం ఏర్పాటైన పార్లమెంట్ జాయింట్ కమిటీ(జేపీసీ)కి కేంద్ర న్యాయశాఖ తాజాగా వివరణ ఇచ్చింది. తమ అభిప్రాయం తెలియజేసింది. జేపీసీ సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చింది. దేశంలో లోక్‌సభతోపాటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించిన ఉదంతాలు గతంలో ఉన్నాయని గుర్తుచేసింది. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత చాలాఏళ్లపాటు జమిలి ఎన్నికలు కొనసాగాయని పేర్కొంది. కొన్ని రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడంతోపాటు ఇతర కారణాలతో జమిలి ఎన్నికల శృంఖలం విచ్ఛిన్నమైందని వెల్లడించింది. జమిలి ఎన్నికలపై మరింత స్పష్టత కోసం జేపీసీ సభ్యులు కేంద్ర ఎన్నికల సంఘానికి కొన్ని ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. ఒకే దేశం.. ఒకే ఎన్నికపై జేపీసీ తదుపరి సమావేశం మంగళవారం జరుగనుంది.

సీడీయూ, సీఎస్‌యూ కూటమిదే జర్మనీ

వలసలు, ఆర్థికాభివృద్ధిపై దృష్టి పెడతానన్న కాబోయే చాన్స్‌లర్ మెర్జ్

బెర్లిన్: ఒలాఫ్ షోల్జ్ సారథ్యంలోని మైనారిటీ ప్రభుత్వం కూలిపోవడంతో అనివార్యమైన జర్మనీ సార్వత్రిక ఎన్నికల్లో విపక్ష ఫ్రెడరిక్ మెర్జ్ సారథ్యంలోని క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్ (సీడీయూ), మార్కస్ సోడర్ సారథ్యంలోని క్రిస్టియన్ సోషల్ యూనియన్(సీఎస్‌యూ) కూటమి ఘన విజయం సాధించింది. కడపటి వార్తలు అందేసరికి సీడీయూ,సీఎస్‌యూ కూటమికి 28.6 శాతం ఓట్లు పడ్డాయి. దీంతో సీడీయూ పార్టీ చీఫ్ ఫ్రెడరిక్ మెర్జ్ తదుపరి ఛాన్స్‌లర్ కావడం ఖాయమైంది. వలసలను తీవ్రంగా వ్యతిరేకించే అతివాద ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ(ఏఎఫ్‌డీ) పార్టీకి 20.8 శాతం ఓట్లు పడ్డాయి. గత మూడేళ్లుగా అధికారం చలాయించిన ఒలాఫ్ షోల్జ్ సారథ్యంలోని సోషల్ డెమొక్రటిక్ పార్టీ(ఎస్‌డీపీ) ఈసారి మూడోస్థానానికి పరిమితమైంది. ఈ పార్టీకి కేవలం 16.4 శాతం ఓట్లు పడ్డాయి. పర్యావరణ పరిరక్షణ ఉద్యమం నుంచి పురుడుపోసుకుని పార్టీగా అవతరించిన ది గ్రీన్స్ పార్టీకి కేవలం 11.6 శాతం వచ్చాయి. ది సారా వాగెన్‌కనెక్ట్–రీజన్ అండ్ జస్టిస్ పార్టీ (బీఎస్ డబ్ల్యూ) 4.97 శాతం ఓట్లు సాధించింది. 630 సీట్లున్న బండేస్టాగ్(జర్మనీ పార్లమెంట్)లో సీడీయూ, సీఎస్‌యూ కూటమి అత్యధికంగా 208 చోట్ల విజయం సాధించింది. '' అతివాద ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ(ఏఎఫ్‌డీ) పార్టీకి ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బహిరంగంగానే మద్దతు తెలుపుతున్న నేపథ్యంలో అమెరికా, రష్యాల నుంచి ఏవైనా సవాళ్లు ఎదురైతే వాటిని ఎదుర్కొని యూరప్‌ను ఐక్యంగా ఉంచేందుకు పోరాడతా'' అని మెర్జ్ అన్నారు.

సంకీర్ణ ప్రభుత్వం దిశగా..

ఏ కూటమి/పార్టీకి స్పష్టమైన మెజారిటీరాని కారణంగా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకానుంది. అధిక సీట్లు సాధించిన సీడీయూ, సీఎస్‌యూ కూటమి మూడో స్థానంలో వచ్చిన ఎస్‌డీపీ పార్టీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే వీలుంది. రెండోస్థానంలో వచ్చిన ఏఎఫ్‌డీ పార్టీకి సీడీయూ,సీఎస్‌యూ కూటమికి మధ్య బద్ధ శత్రుత్వం ఉంది. ఈ నేపథ్యంలో ఒలాఫ్ షోల్జ్‌కు చెందిన ఎస్‌డీపీ పార్టీ సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించనుందని వార్తలొచ్చాయి. అవసరమైతే నాలుగోస్థానంలో వచ్చిన గ్రీన్స్ పార్టీని ప్రభుత్వంలో కలుపుకోవాలని సీడీయూ, సీఎస్‌యూ కూటమి భావిస్తోంది. పెద్దపెద్ద షరతులు పెట్టకుండా ఎస్‌డీపీ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు కలిస్తే అంతా సవ్యంగా సాగుతుంది. లేదంటే ఏఎఫ్‌డీ పార్టీలోని నేతలకు ఎరవేసి తమ కూటమిలో కలుపుకునే ప్రయత్నాలను సీడీయూ, సీఎస్‌యూ కూటమి ముమ్మరం చేయొచ్చు. గత మూడేళ్లుగా గ్రీన్స్, ఫ్రీ డెమొక్రటిక్ పార్టీతో కలిసి ఎస్‌డీపీ ప్రభుత్వాన్ని షోల్జ్ నడిపించారు.

ప్రధాన పార్టీలు	గెలుపొందిన స్థానాలు
సీడీయూ, సీఎస్‌యూ	208
ఏఎఫ్‌డీ	152
ఎస్‌డీపీ	120
గ్రీన్స్	85
లెఫ్ట్ పార్టీలు	64

బలపడనున్న అమెరికాతో మైత్రి

రష్యా దురాక్రమణను వ్యతిరేకిస్తున్న సీడీయూ కూటమి త్వరలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం ఉక్రెయిన్‌కు ఒక రకంగా సానుకూలమైన వార్త. మెర్జ్ సారథ్యంలోని సర్కార్ ఇకమీదటా ఉక్రెయిన్‌కు తగు రీతిలో ఆయుధ, ఆర్థిక సాయం చేసే వీలుంది. మరోవైపు జర్మనీ, అమెరికా సత్సంబంధాలను మరింత పటిష్టం చేస్తానని మెర్జ్ సోమవారం స్పష్టంచేశారు. '' అమెరికా మాత్రమే ఎదగాలనే 'అమెరికా ఫస్ట్' నినాదం వాస్తవరూపం దాల్చితే అమెరికా ఒంటరి అయిపోతుంది. అలాకాకుండా ఇరుపక్షాలు లాభపడేలా జర్మనీ, అమెరికా బంధాన్ని బలపరుస్తా. అమెరికా సత్సంబంధాలను తెంచుకుంటే యూరప్ దేశాలు మాత్రమే దెబ్బతినవు. దాని విపరిణామాలను అమెరికా కూడా అనుభవించాల్సి ఉంటుంది'' అని ఎన్నికల ముందస్తు ఫలితాలొచ్చాక తొలి మీడియా సమావేశంలో మెర్జ్ వ్యాఖ్యానించారు. యూరప్ దేశాలకంటే దేశ స్వీయ ప్రయోజనాలకే ట్రంప్ పెద్దపీట వేస్తున్న వేళ మెర్జ్ ఈ అంశంపై మాట్లాడటం గమనార్హం.

వైఫల్యం నుంచి చాన్స్‌లర్ దాకా..

అలుపెరుగని పోరాటం చేసిన ఫ్రెడరిక్ మెర్జ్ ● పార్టీ పగ్గాలు చేపట్టిన రెండేళ్లలోనే పార్టీని అధికారంలోకి తెచ్చిన నేత

జర్మనీకి కాబోయే చాన్స్‌లర్ అయిన ఫ్రెడరిక్ మెర్జ్ పేరు జర్మనీ అంతటా మార్మోగిపోతోంది. న్యాయవాదిగా అపార అనుభవం గడించి ఆర్థిక రంగంలో విశేషమైన ప్రతిభ కనబరిచిన మెర్జ్ చివరకు మళ్లీ రాజకీయాల్లో చేరి ఎట్టకేలకు చాన్స్‌లర్ పదవికి తాను సరైన వ్యక్తిని అని నిరూపించుకున్నారు. రాజకీయాల్లో ఆసక్తితో క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్(సీడీయూ) వైపు అడుగులు వేసిన మెర్జ్ తదనంతరకాలంలో పార్లమెంటు సభ్యుడిగా ఎదిగారు. కానీ సిద్ధాంతపరమైన విభేదాలు ఆయనను పార్టీ వీడేలా చేశాయి. ఒక దశాబ్దంపాటు రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉండిపోయారు. తర్వాత మళ్లీ రాజకీయ గాలిసోకి రీ ఎంట్రీ ఇచ్చారు. పార్టీ పగ్గాలు సాధించేందుకు పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేశారు. ఒకానొక సమయంలో విఫల రాజకీయ నాయకుడిగా మీడియా ముద్రవేసింది. అయినాసరే ఏమాత్రం వెనుకడుగు వేయకుండా అలుపెరుగని పోరాటం చేసి ఎట్టకేలకు పార్టీ పగ్గాలను రెండేళ్ల క్రితం సాధించారు. కేవలం ఈ రెండేళ్లలోనే పార్టీని అధికార పీఠం మీద కూర్చోబెట్టి తన రాజకీయ చతురతను చాటారు. అద్భుతమైన వక్తగా పేరు తెచ్చుకున్న మెర్జ్ రాజకీయ ఆటుపోట్ల ప్రయాణాన్నిఓసారి తరచిచూద్దాం.

మిలియనీర్ కార్పొరేట్ లాయర్

బడా వ్యాపార సంస్థల తరఫున కేసులు వాదించే సీనియర్ న్యాయవాదిగా పేరు తెచ్చుకున్న మెర్జ్ ఆకాలంలో కోట్ల రూపాయలు సంపాదించి మిలియనీర్‌గా అవతరించారు. 70వ దశకంలో సైనికుడిగా ఆ తర్వాత చాన్నాళ్లు న్యాయవాదిగా, ఆ తర్వాత రాజకీయాల్లోనూ రాణించి సైనిక, న్యాయ, శాసన వ్యవస్థల్లో అపార అనుభవం గడించారు. మెర్జ్ 1972 నుంచి సీడీయూ పార్టీకి బలమైన మద్దతుదారుగా ఉన్నారు. 1989లో పూర్తిగా రాజకీయాల్లో మునిగిపోయారు. 1994లో హోచ్‌సార్లాండ్ క్రీస్ నియోజకవర్గం నుంచి గెలుపొంది తొలిసారిగా పార్లమెంటులో అడుగు పెట్టారు. సీడీయూలో కీలక పదవులు నిర్వహించిన ఆయన 2000 సంవత్సరంలో పార్టీ పార్లమెంటరీ నేతగా ఎదిగారు. 2005 ఏడాది నుంచి ఆయన రాజకీయ పతనం మొదలైంది. సీడీయూ, సీఎస్‌యూ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు తనకు సరైన పార్టీలో, ప్రభుత్వంలో సరైన ప్రాధాన్యత ఇవ్వట్లేదని గ్రహించారు. పార్టీలో ఆధిపత్యం కోసం ఏంజెలా మెర్కెల్‌తో పోటీపడి అలసిపోయారు. దీంతో చివరకు 2009లో క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నారు.

పునరాగమనం

ఆరున్నర అడుగుల ఎత్తు 69 ఏళ్ల వయస్సున్న మెర్జ్ 2002 ఏడాదిలో ఏంజెలా మెర్కెల్ ప్రభుత్వంలో పనిచేశారు. తర్వాత రాజకీయాలు వదిలేసి పలు పెట్టుబడుల బ్యాంకుల బోర్డుల్లో సేవలందించారు. దాదాపు 10 సంవత్సరాల తర్వాత 2018లో రాజకీయాల్లోకి తిరిగి వచ్చారు. ఆ ఏడాది సీడీయూ నేతగా ఏంజెలా మెర్కెల్ దిగిపోయారు. దీంతో తనకు రాజకీయ అవకాశాలు బలపడతాయని గ్రహించి మెర్జ్ మళ్లీ పార్టీలో చేరారు. పార్టీ చీఫ్ పదవికి పోటీచేసి 2021లో ఆర్మిన్ లాషెట్ చేతిలో ఓటమిని చవిచూశారు. దీంతో మీడియా ఈయనపై విఫలనేత ముద్రవేసింది. 2021లో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసి గెలిచారు. ఆ ఎన్నికల్లో సొంత పార్టీ అధికారాన్ని కైవసం చేసుకోలేకపోయింది. పార్టీలో కీలకనేతగా ఎదిగి చిట్టచివరకు 2022లో పార్టీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ(ఏఎఫ్‌డీ) పార్టీ మూలాలు దెబ్బకొడతానని ప్రతిజ్ఞ చేశారు. రాజకీయ, ఆర్థిక, రక్షణ వ్యవహారాల్లో ఉత్తర అమెరికా దేశాలతో యూరప్ దేశాలు కలిసిమెలసి ఉండాలనే 'అట్లాంటిక్ వాదం'ను మెర్జ్ మొదట్నుంచీ గట్టిగా వినిపించేవారు. ఈ ఒక్క విషయంలో జర్మనీలో ఎక్కువ మంది మెర్జ్‌ను గతంలో బాగా విమర్శించేవారు. అయినాసరే అమెరికా, కెనడా వంటి దేశాలతో జర్మనీ సత్సంబంధాలు దేశ భవిష్యత్తుకు బాటలు వేస్తాయని బలంగా వాదించారు. ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడే వాగ్ధాటి, కార్పొరేట్ లాయర్‌గా దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో కలిసి పనిచేసిన అనుభవం, లాబీయింగ్ నైపుణ్యం, వివిధ పెట్టుబడుల బ్యాంక్ బోర్డుల్లో సాధించిన అనుభవం.. మెర్జ్‌కు రాజకీయాల్లో బాగా అక్కరకొచ్చాయి. ఈ అర్హతలే మెర్జ్‌ను ఛాన్స్‌లర్ పీఠం వైపు నడిపించాయి. 'జర్మనీలో ఉన్నందుకు మరోసారి గర్వపడదాం' వంటి నినాదాలు, 'దేశ సరిహద్దులను పటిష్టంచేస్తా. వలసలను కట్టడిచేసేలా శరణార్థి నిబంధనలను కఠినతరం చేస్తా. పన్నులు తగ్గిస్తా. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టం కోసం, సంక్షేమ పథకాల కోసం 50 బిలియన్ యూరోలను ఖర్చుచేస్తా. రష్యాను ఎదుర్కొనేలా ఉక్రెయిన్‌కు సాయపడతా' వంటి వాగ్దానాలు ఈయనను నయా జర్మనీ నేతగా నిలబెట్టాయి.



రెండు విమానాలకు యజమాని

చాంధసవాదానికి, గ్రామ సమాజాలకు ప్రసిద్ధి చెందిన పశ్చిమ జర్మనీలోని బ్రిలాన్ పట్టణంలో 1955 నవంబర్ 11న మెర్జ్ జన్మించారు. కుటుంబానికి న్యాయవాద వృత్తి నేపథ్యం ఉంది. మెర్జ్ తండ్రి న్యాయమూర్తిగా సేవలందించారు. తర్వాత ఆయన సీడీయూ పార్టీలోనూ కొనసాగారు. మెర్జ్ సైతం న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. అంతకు ముందు 1975లో జర్మన్ సైన్యంలో సైనికుడిగా దేశసేవ చేశారు. 1985లో న్యాయవిద్యను పూర్తి చేసిన తర్వాత న్యాయమూర్తి అయ్యారు. 1986లో జడ్జి పదవికి రాజీనామా చేసి కార్పొరేట్ లాయర్ అవతారం ఎత్తారు. మూడేళ్లపాటు జర్మన్ రసాయనరంగ సంఘానికి ప్రైవేట్ లాయర్‌గా పనిచేశారు. 1981లో తోటి న్యాయవాది, ప్రస్తుతం న్యాయమూర్తిగా ఉన్న షార్లెట్ మెర్జ్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు. మెర్జ్ రాజకీయాల నుంచి విరామం తీసుకున్న దశాబ్దం పాటు అత్యంత విజయవంతమైన కార్పొరేట్ లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు. అట్లాంటిక్ సంబంధాలను సమర్థించే లాబీ అయిన 'అట్లాంటిక్–బీఆర్ 1/4కే'కు సారథ్యం వహించారు. పైలట్ శిక్షణ తీసుకున్నారు. ఈయనకు ప్రైవేట్ పైలట్ లైసెన్స్ కూడా ఉంది. ఈయనకు సొంతంగా రెండు విమానాలు కూడా ఉన్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



హలీం మరింత ప్రియం
రంజాన్ మాసం స్పెషల్ డిష్..హలీం ధరలు ఈ ఏడాది అమాంతం పెరిగిపోయాయి. ప్రస్తుతం మటన్ రేటు పెరగడంతో హలీం తయారీదారులు ధరను పెంచేశారు. -8లో



స్టెప్ టు ఫిట్..
ఫిట్‌నెస్ కోసం ఇప్పుడు వ్యాయామంతోపాటు డ్యాన్స్‌ను కూడా ఎన్నుకుంటున్నారు. ఇంట్లో ఎలా స్టెప్పులు వేసినా అది ఆరోగ్యానికి దారితీస్తుందని అధ్యయనాల్లో వెల్లడైంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.0/20.0
నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 34, కనిష్టంగా 20 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది.

‘సీనియర్లను’ ఇబ్బంది పెట్టొద్దు!



వినతులు ఆలకిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

- వారి గుర్తింపు కార్డుల జారీలో జాప్యం చేయొద్దు
- ‘ప్రజావాణి’లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సాక్షి, సిటీబ్యూరో: తమకు గుర్తింపు కార్డులివ్వడంలో అధికారులు ఆలస్యం చేస్తున్నారని, తద్వారా కొన్ని సదుపాయాలు పొందలేకపోతున్నామని సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కొందరు సీనియర్ సిటిజన్లు కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదు చేశారు. వారి సాదకబాధకాలు విన్న కమిషనర్ సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డులివ్వడంలో జాప్యం చేయొద్దని, వారిని ఇబ్బంది పెట్టొద్దని సంబంధిత అధికారులకు సూచించారు. ఇవి మాత్రమే కాకుండా ప్రజల నుంచి అందే అన్ని ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. వీలైనంత త్వరితంగా పరిష్కరించాలని సూచించారు. ఈ వారం ప్రధాన కార్యాలయానికి మొత్తం 82 విజ్ఞప్తులు రాగా, ఎప్పటిలాగే టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించినవి అత్యధికంగా 46 ఉన్నాయి. మిగతావి ఆస్తిపన్ను, ఆరోగ్యం, ఇంజినీరింగ్ (నిర్వహణ), పరిపాలన, విద్యుత్, భూసేకరణ, యూబీడీ, హౌసింగ్, ఫైనాన్స్ విభాగాలకు సంబంధించినవి ఉన్నాయి. కార్యాలయం దాకా రాలేని ఆరుగురు ఫోన్ ద్వారా తమ తమ సమస్యల గురించి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, యాదగిరి రావు, సీసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జోన్లలో జరిగిన ప్రజావాణి కార్యక్రమాల్లో ఆరు జోన్లలో వెరసి 112 అర్జీలందాయి. వాటిల్లో కూకట్‌పల్లి జోన్‌లో 51, ఎల్‌బీనగర్‌లో 13, శేరిలింగంపల్లిలో 12, సికింద్రాబాద్‌లో 27, చార్మినార్‌లో 8, ఉండగా, ఖైరతాబాద్‌జోన్ కేవలం ఒక్కటి మాత్రమే అందడం విశేషం.

బాధ్యతలు స్వీకరించిన జోయల్ డెవిస్



సాక్షి, సిటీబ్యూరో: నగర ట్రాఫిక్ విభాగం సంయుక్త పోలీసు కమిషనర్ (జేసీపీ) డి.జోయల్ డెవిస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సైబరాబాద్ ట్రాఫిక్ చీఫ్‌గా పని చేసిన ఆయన అక్కడ తన మార్కు చూపించారు. కొన్నేళ్లుగా నగర ట్రాఫిక్‌కు ఐజీ ర్యాంకులో ఉండే అధికారి అదనపు సీపీ హోదాలో నేతృత్వం వహిస్తున్నారు. అయితే జోయల్ ప్రస్తుతం డీఐజీ ర్యాంకులో ఉండటంతో ఆయనను జేసీపీగా నియమించారు. నగరంలో రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతూ, నిర్వహణ క్లిష్టంగా మారుతున్న ఈ తరుణంలో ప్రభుత్వం జోయల్ డెవిస్‌ను ట్రాఫిక్ చీఫ్‌గా నియమించింది.

సమయ పాలన పాటించాలి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ఉద్యోగులు కార్యాలయ విధులకు హాజరుకావాలని, సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.అనంతరం అధికారులతో మాట్లాడుతూ అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి కార్యాలయాలకు చేరుకోవాలని, ఉద్యోగులు సరైన సమయానికి విధులకు అవుతున్నారా లేదా అని పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, కార్యాలయ పని వేళల్లో విధుల్లో లేని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు కదిరవన్ పలని, డాక్టర్ జి ముకుంద రెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల దుకాణంలో అగ్ని ప్రమాదం



కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరధిలోని మైసమ్మగూడలో సోమవారం ఓ ప్లాస్టిక్ వ్యర్థాల దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం..కిరణ్‌అగర్వాల్ అనే వ్యక్తి మైసమ్మగూడలో ప్లాస్టిక్ స్క్రాప్ గోదాము నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం గోదాములో ఒక్కసారిగా మంటలు వ్యాపించి దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతో వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఫైర్ విభాగాన్ని అప్రమత్తం చేశారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది కలిసి సాయంత్రం ఐదున్నర గంటల వరకు మంటలు అదుపు చేశారు. ప్రమాదం సమయంలో గోదాములో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా రూ.30 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని సమాచారం. కాగా గోదాములో ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు వాడే బాయిలర్ సిలిండర్ పేలడం వల్ల లేదా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

కబ్జాలపై గళమెత్తారు!



- ఇందిరా పార్కులోనూ కబ్జాలు
- కోర్టు పరిధిలోని అంశాలను పేర్కొనాలంటున్న హైడ్రా

పార్కులు, ప్రజోపయోగ స్థలాలు కాపాడాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ





ఫిర్యాదులు స్వీకరిస్తున్న హైడ్రా అధికారులు

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్:

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 46 ఫిర్యాదులు అందాయి. వీటిలో అత్యధికం పార్కులు, ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాల కబ్జాలకు సంబంధించినవే ఉన్నాయి. ప్రభుత్వ, ప్రజోపయోగ స్థలాల కబ్జాలపై ఇప్పటి వరకు మౌనంగా ఉన్నవారు కూడా ఇప్పుడు హైడ్రా కార్యాలయం మెట్లెక్కుతున్నారు. కబ్జాలను అరికట్టి న్యాయం చేయాలంటూ విన్నవిస్తున్నారు. ఏకంగా ఫిలింనగర్ కల్చరల్ సెంటర్(ఎఫ్‌ఎన్‌సీసీ) పైనా ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఇక్కడి రాక్ గార్డెన్‌ను ఆక్రమించి ఎఫ్‌ఎన్‌సీసీని నిర్మించారనేది ఆయన ఆరోపణ.

- మరోపక్క కోర్టులో ఉన్న అంశంపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తుంటే ఫిర్యాదుదారులు ఆ అంశాన్ని తమ ఫిర్యాదులో కచ్చితంగా పేర్కొనాలని అధికారులు సూచిస్తున్నారు.
- దాదాపు 76 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఇందిరాపార్కులో పింగళి వెంకట్రామిరెడ్డి విరాళంగా ఇచ్చిన భూమి కొంత ఉందని, విద్యుత్ సబ్‌స్టేషన్, డంపింగ్ యార్డ్, స్నో వరల్డ్‌కు ప్రభుత్వం దీని నుంచి కొంత భూమిని కేటాయించిందనీ మార్నింగ్ వాకర్స్ ప్రతినిధులు హైడ్రాకు తెలిపారు. మిగిలిన భూమిని వ్యాపారులు కబ్జా చేస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే ఎన్టీఆర్ గార్డెన్స్ కూడా నిరుపయోగంగా ఉందని పేర్కొన్నారు.
- కీసర మండలం అహ్మద్‌గూడలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ శ్మశానవాటికలో కొంత భాగంతో పాటు నాలా బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టిందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.
- శామీర్‌పేట మండలం అంతియాపల్లి గ్రామంలో చెట్టుకుంట చెరువును కబ్జా చేస్తున్నారని ఆ చెరువును కాపాడాలని స్థానికులు హైడ్రాను కోరారు.
- దుండిగల్ మున్సిపాలిటీ, బహదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీలో పార్కులు, పాఠశాలలు, కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలాలు ప్లాట్లుగా మారుతున్నాయని అక్కడి నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదులపై హైడ్రా అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.

ఆ వివరాలు దాస్తే చర్యలుంటాయి..

హైడ్రా ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదులు ఇస్తున్న వారు..ఆ సమస్యలకు సంబంధించిన అంశాలు సివిల్, హైకోర్టులో పెండింగ్ ఉంటే ఆ వివరాలను ఫిర్యాదులో తప్పకుండా పేర్కోవాలని హైడ్రా కోరింది. ఈ వివరాలను ఉద్దేశపూర్వకంగా దాచిపెడితే ఫిర్యాదుదారులపై చర్యలు ఉంటాయని హైడ్రా హెచ్చరించింది. వ్యక్తిగత వివాదాలు లేదా ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న సమస్యలను హైడ్రా పరిష్కరించదని స్పష్టం చేసింది. జలవనరులతో పాటు ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జాలకు సంబంధించిన అంశాలనే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని సూచించింది.



ఫిలింనగర్ రోడ్ నెం.1లో ఎఫ్‌ఎన్‌సీసీ కింద మిగులు పార్కు స్థలం

ఎఫ్‌ఎన్‌సీసీది కబ్జా స్థలమే!

చర్యలు తీసుకోవాలని హైడ్రాకు ఫిర్యాదు చేసిన స్థానిక నేత

ఫిలింనగర్ ప్రజల అవసరాలకు ఉద్దేశించిన, జీహెచ్‌ఎంసీలో ఉండాల్సిన పార్క్, రాక్‌గార్డెన్ స్థలాన్ని కబ్జా చేసి ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌ను (ఎఫ్‌ఎన్‌సీసీ) నిర్మించారని, దాన్ని ప్రస్తుతం వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని స్థానిక నేత ఒకరు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా) ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం మిగిలి ఉన్న పార్కు స్థలాన్నైనా పరిరక్షించి, అభివృద్ధి చేయాలని ఈ నెల 17న ఫిర్యాదు చేయగా.. దీనిపై అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. జూబ్లీహిల్స్‌కు చెందిన కాంగ్రెస్ నేత కాటూరి రమేష్ ఇచ్చిన ఫిర్యాదులోని అంశాల ప్రకారం...ఫిలింనగర్ సొసైటీ ఏర్పడినప్పుడు ఆ లేఔట్‌లో దాదాపు రెండున్నర ఎకరాలు స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. జీహెచ్‌ఎంసీ ఆధీనంలో ఉండాల్సిన దీన్ని కొందరు సొసైటీ పెద్దలు ఆక్రమించడంతో పాటు అడ్డదారుల్లో అప్పటి ప్రభుత్వం నుంచి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ఖాతరు చేయకుండా నిర్మాణాలు చేపట్టారు. ఈ స్థలం పూర్తిగా పార్కు కోసం కేటాయించగా...ప్రస్తుతం అందులో జీ ప్లస్ 3 విధానంలో భవనం నిర్మించారు. ఎఫ్‌ఎన్‌సీసీ పేరుతో పిలుస్తున్న దీన్ని పూర్తిగా రాక్ గార్డెన్ స్థలంలో నిర్మించారు. దీనిపై గతంలో ఎన్నోసార్లు పత్రికల్లోనూ కథనాలు వచ్చాయి. అయినప్పటికీ ప్రభుత్వాలు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రమేష్ తన ఫిర్యాదుతో పాటు ఫిలింనగర్ సొసైటీ లేఔట్‌కు సంబంధించిన మ్యాప్‌ను జతపరిచారు. ఇటీవల భారీ వర్షాలకు ఎఫ్‌ఎన్‌సీసీ ముందు భాగం కుప్పకూలింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం వల్లనే ఇది కూలిపోయిందని అప్పట్లోనే దర్యాప్తు సంస్థలు నిగ్గుతేల్చాయని హైడ్రా దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిలింనగర్ రోడ్ నెం.1లోని రాజరాజేశ్వరి గుడి ముందు ఎఫ్‌ఎన్‌సీసీ ఆధీనంలో ప్రస్తుతం 1200 చదరపు గజాల ఖాళీ స్థలం ఉందని, దాన్ని కూడా కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కనీసం దాన్ని అయినా కాపాడి పార్కుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇప్పటికైనా పట్టించుకోకుంటే ఆ స్థలం కూడా కబ్జాకు గురై, అక్రమ నిర్మాణాలకు అడ్డా అవుతుందని స్పష్టం చేశారు. ఎఫ్‌ఎన్‌సీసీకి చెందిన వాళ్లు తమకు పలుకుబడి వినియోగించి దుకాణాలు నిర్మించడంతో పాటు అద్దెకు ఇచ్చుకుంటారని, ఆ దిశలో ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని రమేష్ ఆరోపించారు. అన్యాక్రాంతమైన పార్కు స్థలాలు, చెరువులను కాపాడుతున్న హైడ్రా..ఎఫ్‌ఎన్‌సీసీ పైనా దృష్టి పెట్టాలని కోరారు. ఎఫ్‌ఎన్‌సీసీ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.



ఫిలింనగర్ కల్చరల్ సెంటర్..

ఓఆర్‌ఆర్–వాటర్ ప్రాజెక్టు 3

కొత్త కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు మంచినీటి సరఫరా


ఓఆర్‌ఆర్ పరిధిలో రోజువారిగా నీటి సరఫరా ఇలా (మిలియన్ లీటర్స్ పర్ డే)

సరఫరా సంస్థ	ఎంఎల్‌డీ
జలమండలి	278.49
భగీరథ (ఆర్‌డబ్ల్యూఎస్)	140.93

ఇప్పటి వరకు ఓఆర్‌ఆర్ ఫేజ్-1, ఫేజ్-2 ఇలా..

ప్రాజెక్టు	డొమెస్టిక్ కనెక్షన్లు	ఎంఎస్‌బీ	బల్క్	మొత్తం కనెక్షన్లు	లబ్ధిదారులు
ఓఆర్‌ఆర్ ఫేజ్-1	41,837	1,879	141	43,857	4,253,85
ఓఆర్‌ఆర్ ఫేజ్-2	60,667	2,614	189	63,279	656,185

- సమగ్ర ప్రాజెక్టు నివేదికకు కసరత్తు
- ఇప్పటికే ఓఆర్‌ఆర్ ఫేజ్-1 పూర్తి
- తుది దశలో ఫేజ్-2 పనులు
- ఫేజ్-3 పనులు చేపట్టేందుకు జలమండలి సిద్ధం
- ఇప్పటికే 1.07 లక్షల కుటుంబాలకు తాగునీరు



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్‌రోడ్డు వాటర్ ప్రాజెక్టు ఫేజ్–3కి అడుగులు పడుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వెలుపల, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) లోపల కొత్తగా వెలుస్తున్న ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగు నీరు సరఫరా చేసేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు జలమండలి కసరత్తు చేస్తోంది. మహా నగరం చుట్టూ సుమారు 762 కిలో మీటర్లు విస్తరించి ఉన్న ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీలు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలకు నీటి సరఫరా కోసం మూడేళ్ల క్రితం ఓఆర్‌ఆర్ తాగునీటి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మొదటి దశ పనులు పూర్తి కాగా, రెండో దశ పనులు శరవేగంతో సాగుతున్నాయి. పనులు పూర్తయిన ప్రాంతాల్లో నీటి సరఫరా కూడా చేస్తున్నారు. తాజాగా ఆయా ప్రాంతాల శివార్లలో సైతం కొత్తగా వెలుస్తున్న గృహాలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు కూడా సురక్షిత తాగునీరు అందించేందుకు మూడో దశ పథకానికి సిద్ధమవుతోంది. హైదరాబాద్ నగరానికి మణిహారమైన ఔటర్ రింగ్‌రోడ్డు వరకు జీహెచ్‌ఎంసీని విస్తరించడానికి కసరత్తు నేపథ్యంలో ఆ చుట్టూ ఉన్న ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెంది తాగునీటి డిమాండ్ పెరుగుతోంది.

తాగునీటి ప్రాజెక్టు ఇలా..

ఓఆర్‌ఆర్ ఫేజ్-1: జీహెచ్‌ఎంసీ పరిధిలో అవతల ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, 24 గ్రామ పంచాయితీల పరిధిలోని 190 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు ఓఆర్ఆర్ ఫేజ్–1 చేపట్టారు. సుమారు రూ.124 కోట్ల అంచనా వ్యయంతో 70 మిలియన్ లీటర్ల సామర్థ్యంగల 164 రిజర్వాయర్లు నిర్మించడంతో పాటు దాదాపు రూ.527 కోట్ల వ్యయంతో 1601 కిలో మీటర్ల మేర పైపులైన్ నెట్‌వర్క్ వేశారు.

ఫేజ్-2: ఓఆర్‌ఆర్ ఫేజ్–2 పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు 189 కోట్ల అంచనా వ్యయంతో 140 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో కొత్తగా 71 సర్వీసు రిజర్వాయర్ల నిర్మాణం, సుమారు రూ.778 కోట్ల అంచనా వ్యయంతో 2758 కిలో మీటర్ల మేర కొత్త పైపు లైను నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా రిజర్వాయర్లు, నెట్‌వర్క్ పనులు పూర్తయ్యాయి. వాస్తవంగా ఫేజ్–2ను రెండు ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టారు. ప్యాకేజీ–1 పరిధిలోకి సరూర్ నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్కేసర్, కీసర మండలాల్లో, ప్యాకేజీ–2 పరిధిలోకి రాజేంద్రనగర్, శామీర్‌పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, పటాన్‌చెరు, ఆర్సీపురం బొల్లారం ప్రాంతాల్లో పనులు చేపట్టారు. 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. కాగా ఔటర్ రింగ్ రోడ్ నీటి సరఫరా పథకం ఫేజ్–1,2ల కింద దాదాపు 10 లక్షల 83 వేల 570 మంది లబ్ధి పొందుతున్నారు.

ఓఆర్‌ఆర్ పరిధిలో ఇలా..

కార్పొరేషన్లు: బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్ నగ ర్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, నిజాంపేట్, బండ్లగూడ

మున్సిపాలిటీలు: పోచారం, దమ్మాయిగూడ, నాగారం, తూముకుంట, గుండ్లపోచంపల్లి, జల్‌పల్లి, తుక్కుగూడ, తుర్కయాంజల్, పెద్దఅంబర్‌పేట్, ఆదిబట్ల, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం, దుండిగల్, కొంపల్లి, మణికొండ, నార్సింగ్, శంషాబాద్.

గ్రామపంచాయతీలు: చౌదరిగూడ, కొర్రెముల, వెంకటాపూర్, కాచవాని సింగారం, ప్రతాప సింగారం, గోధుమకుంట, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, చేర్యాల్, కరీంగూడ, జాఫర్‌గూడ, ఆర్‌సీపురం, పటాన్‌చెరు, ఐలాపూర్, ఐలాపుర్ తండా, గండిగూడెం, సుల్తాన్ పూర్, కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడ, శంషాబాద్, బహదుర్‌గూడ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, కుత్బుల్లాపూర్, గౌరెల్లి.

రోడ్డెక్కాల్సిందే!

లక్ష్యానికి దూరంగా గ్రేటర్ ఆర్టీఏ ఆదాయం

2024–25 సంవత్సరానికి గ్రేటర్ ఆర్టీఏ లక్ష్యం:	రూ.4,375 కోట్లు
ఈ ఏడాది జనవరి నాటికి సాధించింది:	రూ.3,648 కోట్లు
ఈ రెండు నెలల్లో సాధించవలసింది:	రూ.727 కోట్లు
ఒక్కో ఎంవీఐ టార్గెట్ నెలకు:	రూ.30 లక్షలు

- టార్గెట్ల కోసం ఎంవీఐల ఛేజింగ్
- ఆర్టీఏ విస్తృత తనిఖీలు
- పన్ను చెల్లించని వాహనాలపై కొరడా

సాక్షి, సిటీబ్యూరో:

‘తెల్లారితే చాలు రోడ్డెక్కాల్సివస్తోంది. ఏడాది పొడవునా చేసిన డ్యూటీ కంటే ఈ రెండు నెలల డ్యూటీలే కీలకంగా మారాయి. సాధారణంగా అయితే ప్రతి నెలా రూ.6 లక్షల చొప్పున టార్గెట్. కానీ ఇప్పుడు దాన్ని ఏకంగా రూ.30 లక్షలకు పెంచారు. ఈ రెండు నెలల్లో ఒక్కో ఎంవీఐ కనీసం రూ.60 లక్షలు సంపాదించాలి. అందుకే రాత్రింబవళ్లు రోడ్డుపైనే మకాం వేసుకొని ఉంటున్నాం.’ ఒక సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఆవేదన ఇది.

...ఆయన ఒక్కరే కాదు...గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో పని చేసే మోటారు వాహన తనిఖీ అధికారులు, సహాయ మోటారు వాహన తనిఖీ సిబ్బంది, కానిస్టేబుళ్లు కొద్ది రోజులుగా టార్గెట్‌ల కోసం వాహనాలను వెంటాడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి తిరిగే వాటిపైన కొరడా ఝుళిపిస్తున్నారు. ప్రైవేట్ బస్సులు, మ్యాక్సీక్యాబ్‌లు, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్లు, తదితర వాహనాలను లక్ష్యంగా చేసుకొని తనిఖీలను విస్తృతం చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ ఏడాది రవాణాశాఖ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోలేదు. దీంతో ఎంవీఐలు, ఏఎంవీఐలు, తదితర అధికారయంత్రాంగం వాహనాల ‘ఛేజింగ్ డ్యూటీ’లో పరుగులు తీస్తున్నారు.

తగ్గుముఖం పట్టిన ఆదాయం

కొత్త వాహనాలపైన వచ్చే జీవితకాలపన్ను, రవాణా వాహనాల నుంచి ప్రతి మూడు నెలలకు ఒక సారి వచ్చే క్వార్టర్లీ ట్యాక్స్, ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణా, పౌరసేవలపై లభించే ఫీజులు, ప్రత్యేక నెంబర్‌లపైన నిర్వహించే ఆన్‌లైన్ బిడ్డింగ్, తదితర రూపాల్లో ఆర్టీఏకు ఆదాయం లభిస్తుంది. గతేడాది లభించిన ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకొని ప్రతి సంవత్సరం రెవిన్యూ టార్గెట్‌లను నిర్ణయిస్తారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు జిల్లాలు..హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలో రూ.4,375 కోట్ల రెవిన్యూ లక్ష్యాన్ని సాధించవలసి ఉండగా, ఈ ఏడాది జనవరి నాటికి రూ.3,648 కోట్లు లభించింది. మరో రూ.727 కోట్ల లక్ష్యాన్ని చేరవలసి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్త వాహనాలపైన వచ్చే జీవితకాల పన్ను తగ్గుముఖం పట్టడం వల్లనే ఆర్టీఏ ఆదాయం తగ్గినట్లు అధికారులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఎలక్ట్రిక్ వాహనాలకు రాయితీనిస్తోంది. జీవితకాల పన్ను నుంచి వాటిని మినహాయించారు. అలాగే రవాణాశాఖకు ఎక్కువ మొత్తంలో జీవితకాల పన్ను లభించే వ్యక్తిగత కార్ల కొనుగోళ్ల సంఖ్య ఈ ఏడాది తగ్గినట్లు అంచనా. ద్విచక్ర వాహనాల అమ్మకాలు బాగానే ఉన్నప్పటికీ కార్ల అమ్మకాలు తగ్గాయి. గతేడాదితో పోల్చుకుంటే సుమారు 30 వేలకు పైగా కార్ల అమ్మకాలు తగ్గినట్లు అంచనా. ఇలా వివిధ రకాలుగా ఆదాయమార్గాలు పడిపోవడంతో ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయినట్లు ఆర్టీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మొత్తంగా ఈ ఏడాది జనవరి నాటికి 83.38 శాతాన్ని మాత్రమే చేరగలిగారు.



లక్ష్యాన్ని భర్తీచేసేందుకు...

గ్రేటర్‌లోని హైదరాబాద్ జిల్లాలో రూ.1,433.30 కోట్ల ఆదాయానికి రూ.1226.64 కోట్లు లభించింది. 69.86 శాతం ఆదాయాన్ని మాత్రమే హైదరాబాద్ ఆర్టీఏ సాధించింది. అలాగే రంగారెడ్డి జిల్లాలో రూ.1,662.87 కోట్లకు ఈ ఏడాది జనవరి నాటికి రూ.1,421.19 కోట్లు వచ్చింది. మేడ్చల్ జిల్లా లక్ష్యం రూ.1,279.53 కోట్లు కాగా, రూ.1,097 కోట్లు లభించింది. ఇలా మూడు జిల్లాల్లోనూ ఆశించిన స్థాయిలో ఆదాయం లభించకపోవడంతో ఎంవీఐలకు మరోసారి టార్గెట్‌లను విధించారు. ప్రతి నెలా రూ.6 లక్షలు ఉన్న సాధారణ టార్గెట్‌ను ఏకంగా రూ.30 లక్షలకు పెంచారు. ఈ మేరకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఒక్కో ఎంవీఐ రూ.60 లక్షలు టార్గెట్ సాధించాల్సి ఉంది. దీంతో నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై జరిమానాలు విధిస్తున్నారు.

బండి అడ్రస్ మారాల్సిందే...

ఇతర రాష్ట్రాల్లో వాహనాలను కొనుగోలు చేసి హైదరాబాద్‌లో నడిపే వాహనదారులు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ అయ్యే వాహనాలు నెల రోజుల్లో హైదరాబాద్‌లో జీవితకాల పన్ను చెల్లించి చిరునామా మార్చుకోవాలి.

లేబర్ అడ్డాల్లో తాగునీటి వసతి కల్పించాలి



మాట్లాడుతున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి,సిటీబ్యూరో: వేసవిని దృష్టిలో ఉంచుకుని లేబర్ అడ్డాలు, పని ప్రదేశాల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేసవి నేపథ్యంలో ఎదురయ్యే సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో అనుకున్న దానికంటే 200 శాతం అధికంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను నిల్వ ఉండేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. వైద్య ఆరోగ్య, ఉపాధి , కార్మిక శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, కేంద్రాలకు వచ్చే వారికి ఓఆర్ఎస్ ద్రావణం పంపిణీ చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ వసతి గృహాలలో ఎండ తీవ్రత పై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు కదిరవన్ పలని, డాక్టర్ జి ముకుంద రెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి, జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటజీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన



హాజరైన వివిధ జిల్లాల డీపీఎంలు, ఏపీఎంలు, వీఓఏలు

బంజారాహిల్స్: మానవ అక్రమ రవాణా నియంత్రణపై రంగారెడ్డి, సంగారెడ్డి, నల్లగొండ, మేడ్చల్–మల్కాజిగిరి, సూర్యాపేట, యాదాద్రి–భువనగిరి జిల్లాలకు చెందిన డీపీఎంలు, ఏపీఎంలు, వీఓఏలకు సోమవారం జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ సరిత మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం జరిగే తీరు, బాధితురాలిపై ప్రభావాలు, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, చట్టాలు, భరోసా, చైల్డ్‌లైన్, పోలీసు టోల్‌ఫ్రీ నెంబర్స్ తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రతినిధి అరుంధతి, ప్రజ్వల సీనియర్ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్, అంబర్ సింగ్, మిథాలిరాజ్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ల తనిఖీ



సాక్షి,సిటీబ్యూరో: వాటర్ ట్యాంకర్ల ఫిల్లింగ్ స్టేషన్లను సోమవారం జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంజారాహిల్స్, ఎర్రగడ్డ ఫిల్లింగ్ స్టేషన్లను ఆయన సందర్శించిన ఆయన ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి?, ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలపై ఆరా తీశారు. ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ ఇన్ చార్జిలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అక్కడ సౌకర్యాల మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. బంజారాహిల్స్ ఫిల్లింగ్ స్టేషన్‌లో 8 ఫిల్లింగ్ పాయింట్స్, 44 ట్యాంకర్లు ఉండగా.. రోజుకి 300 ట్రిప్పులు డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. ఎర్రగడ్డ ఫిల్లింగ్ స్టేషన్ లో 4 ఫిల్లింగ్ పాయింట్స్, 29 ట్యాంకర్లు ఉండగా రోజూ 150 ట్రిప్పులు డెలివరీ చేస్తున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో జీఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశోధనలకు మద్దతు

- పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్
- ఐఐటీహెచ్‌లో ప్రారంభమైన అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్ హబ్
- 28 వరకు కొనసాగనున్న సెమినార్లు



మాట్లాడుతున్న జయేష్‌రంజన్, చిత్రంలో ఇండో- జర్మనీకి చెందిన ప్రొఫెసర్లు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: హైదరాబాద్ హబ్ ఇన్ అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుందని, పరిశ్రమలు, వాణిజ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ అన్నారు. ఐఐటీ హైదరాబాద్‌లో అడ్వాన్స్‌డ్ కెమికల్ ఎడ్యుకేషన్ హబ్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. జర్మనీలోని హీడెల్‌బర్గ్ యూనివర్సిటీ, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, ఐఐటీ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఈనెల 28 వరకు కొనసాగుతుంది. సోమవారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో జయేష్‌రంజన్ మాట్లాడారు. శాస్త్ర, సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో ఇండో–జర్మనీ దీర్ఘకాలిక భాగస్వామ్యానికి అనుగుణంగా ఈ హబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమం రెండు దేశాల్లోని విద్యార్థుల సంయుక్త పరిశోధనకు తోడ్పడుతుందన్నారు. అలాగే ఆధునిక రసాయన శాస్త్రంలో అనుభవాన్ని పెంపొందించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. 17 మంది జర్మనీ విద్యార్థులతో పాటు, ఐఐటీహెచ్, టీఐఎఫ్ఆర్ విద్యార్థులు, ఆయా విద్యా సంస్థల ప్రొఫెసర్లతో కలిసి ఇండో–జర్మన్ స్కూల్ ఆన్ కంప్యూటేషనల్ కెమిస్ట్రీని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ రసాయన రంగంలోని పరిశోధనలు, ఆవిష్కరణలు వ్యవసాయ రంగం ప్రగతిలో కీలకమైనవని పేర్కొన్నారు. ఔషధాలు, ఇంధన వనరులు, మెటీరియల్ రంగాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తాయని చెప్పారు. కంప్యూటేషనల్ కెమిస్ట్రీ ఆధునిక పారిశ్రామిక రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని, వీటిలోని ఆవిష్కరణలు ఆయా రంగాల్లో వ్యయాన్ని తగ్గించి, పర్యావరణంపై ప్రభావాన్ని కూడా తగ్గిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెడెల్‌బర్గ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు కట్సాపట్సేల్‌మేటర్న్, అంద్రియాస్ డ్రాఫ్, సబూర్ భక్ష్, టీఐఎఫ్ఆర్ డైరెక్టర్ ఎం.కృష్ణమూర్తి, ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు బీఎస్.మూర్తి, నరహరిశాస్త్రి, బెర్లిన్‌లోని భారత రాయబారి డాక్టర్ రామానుజ్ బెనర్జీ, జర్మన్ కాన్సులేట్ జనరల్ డాక్టర్ కాథ్రిన్‌మిసెరా–లాంగ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



సాక్షి,సిటీబ్యూరో: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా సాధికారత పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలించిన టీటీడీ ఈఓ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈ నెల 25 నుండి మార్చి 6వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఈవో జె.శ్యామలరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 25వ తేదీ సాయంత్రం అంకురార్పణ, 26న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మార్చి 2న గరుడ వాహన సేవ, మార్చి 5న రథోత్సవం, మార్చి 6న చక్రస్నానం నిర్వహించనున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి అందంగా రంగవల్లులు తీర్చిదిద్దారన్నారు. అంతకు ముందు ఈఓ స్థానిక టీటీడీ అధికారులతో కలిసి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో శ్రీ రమేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

హలీం మరింత ప్రియం

- మటన్ రేటు పెరగడంతో హలీం ధర పెరుగుదల
- రంజాన్ నేపథ్యంలో భారీ డిమాండ్
- నగరంలో ఇప్పటికే విక్రయాలు షురూ..



చార్మినార్: రంజాన్ మాసంలో ప్రత్యేకమైన హలీం ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఈ ఏడాది రంజాన్ ప్రారంభానికి ముందే హలీం విక్రయాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం మటన్ రేట్లు పెరగడంతో హలీం తయారీదారులు హలీం ధర పెంచేశారు. గతేడాది రూ.280లకు ప్లేట్ హలీం లభించగా..ప్రస్తుతం రూ.20 పెరిగి రూ.300 చేరుకుంది. ఇటీవల ముగిసిన నాంపల్లి ఎగ్జిబిషన్‌లో సైతం పిస్తాహౌజ్ ప్లేట్ హలీంను రూ.300 చొప్పున విక్రయించింది. అయితే ఎగ్జిబిషన్ ముగిసినా నగరంలోని పలు హోటళ్ల నిర్వాహకులు రూ.300కు విక్రయిస్తున్నారు. రేటు పెరిగినా హలీం ప్రియులు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. మార్చి 1న ఆకాశంలో నెల వంక కనిపిస్తే..2 నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానున్నట్లు ముస్లిం మత పెద్దలు పేర్కొంటున్నారు. రంజాన్ మాసంలో మాంసాహార వంటకాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఉపవాస దీక్షల అనంతరం నిర్వహించే ఇఫ్తార్ విందులో హలీంను తప్పనిసరిగా వడ్డిస్తారు.

పాతబస్తీ ప్రత్యేకం..

హలీం తయారీ, విక్రయాల్లో పాతబస్తీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. నగరంలోని పలు ప్రాంతాల ప్రజలు రంజాన్ మాసంలో పాతబస్తీకి వచ్చి మరీ హలీం తినడం అలవాటు. దీంతో పాతబస్తీలోని హలీం హోటళ్లు వినియోగదారులతో కిటకిటలాడతాయి. పాతబస్తీలోని పిస్తాహౌజ్, మదీనా సర్కిల్‌లోని షాదాబ్ హోటల్, నయాగ్రా హోటల్, శాలిబండలోని షాగౌస్, బార్కాస్ తదితర హోటళ్లలో ఎన్నో ఏళ్లుగా హలీం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి.

వినూత్న విద్యా కోర్సులతో 'నయంత విశ్వవిద్యాలయం'



సందర్భంగా రాజ్ దుగర్ మాట్లాడుతూ., భరత్ పూరి, నాషాద్ ఫోర్బ్స్, క్రిస్ గోపాలకృష్ణన్, నాదిర్ గోద్రేజ్, మెహర్ పుదుంజీ, డాక్టర్ రెడ్డీస్ సతీష్ రెడ్డి తదితర ప్రముఖ పారిశ్రామిక

సాక్షి, సిటీబ్యూరో: భారత్‌లో ప్రపంచ స్థాయి ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులు అందిస్తున్న విద్యాసంస్థలు ఉన్నప్పటికీ అవి.., ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ తరహాలో సంపూర్ణ సేవలందించే స్థాయిలో లేవని ఎయిట్ రోడ్స్ ఏసియా మాజీ మేనేజింగ్ పార్టనర్ రాజ్ దుగర్ అన్నారు. ఇలాంటి తరుణంలో హైదరాబాద్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాకు చెందిన నైపుణ్యాలున్న విద్యార్థులకు అత్యున్నత విద్యాసంస్థల అవసరముందన్నారు. మహారాష్ట్ర ప్రైవేట్ యూనివర్సిటీ చట్టం కింద నూతనంగా ప్రారంభిస్తున్న 'నయంత విశ్వవిద్యాలయం' ఆవిష్కరణ ప్రచార కార్యక్రమాన్ని సోమవారం నగరంలోని టీ–హబ్ వేదికగా నిర్వహించారు. ఈ వేత్తల మద్దతుతో ఈ విశ్వవిద్యాలయం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పూణె వేదికగా నూతన సెలబస్‌తో పాటు ట్రాన్స్‌ఫర్మేషన్ ఎడ్యుకేషన్ విధానంతో పూర్తి రెసిడెన్షియల్ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రయత్నంలో భాగంగా కార్పొరేట్, ప్రభుత్వ, సామాజిక రంగాల్లో ఇంటర్న్‌షిప్‌లు, మెంటర్‌షిప్‌లతో పాటు ప్లేస్‌మెంట్‌ల కోసం విద్యార్థులకు అసమానమైన అవకాశాలను అందించడం తమ లక్ష్యంగా నయంత ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రొఫెసర్, సీఈఓ డాక్టర్ రంజన్ బెనర్జీ పేర్కొన్నారు. 2025 ఫిబ్రవరిలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, మొదటి బ్యాచ్‌కు ఆగస్టు 2025లో తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రోహింగ్యాల వ్యవస్థీకృత వ్యభిచార దందా

- టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడులు
- 18 మంది అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: మయన్మార్ నుంచి అక్రమంగా నగరానికి వలసవచ్చిన రోహింగ్యాలు వ్యవస్థీకృతంగా వ్యభిచార దందా కొనసాగిస్తున్నారు. తమ జాతీయతను దాచి పెట్టడానికి నకిలీ ఆధార్ కార్డులు తయారు చేసుకున్నారు. వీరి వ్యవహారాలపై సమాచారం అందుకున్న దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాతబస్తీతో పాటు పలు ప్రాంతాల్లో సోమవారం మెరుపు దాడులు చేశారు. 18 మందిని అదుపులోకి తీసుకుని చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. మయన్మార్ నుంచి బంగ్లాదేశ్ మీదుగా అక్రమంగా సరిహద్దులు దాటి వచ్చిన ఈ రోహింగ్యాలు కోల్‌కతాలో నకిలీ ఆధార్ కార్డులు సంపాదించారు. వీటిని తయారు చేసి ఇచ్చిన వ్యక్తులు వారిని వెస్ట్‌బెంగాల్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన వారిగా చూపించారు. ఈ ఆధార్ కార్డుల ఆధారంగా నగరానికి చేరుకున్న వీరు పాతబస్తీ పరిసర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరిలో పురుషులు సెకండ్ హ్యాండ్ బైకులు కొనుగోలు చేసి వాటి ఆధారంగా ట్యాక్సీ డ్రైవర్లుగా పని చేస్తుండగా... మహిళలు, యువతులు వ్యభిచార వృత్తిలో దిగారు. పరిచయస్తులతోనే ఈ దందా చేస్తున్న వారిని సంబంధీకులైన పురుషులే తమ వాహనాలపై తీసుకెళ్లి కస్టమర్ల వద్ద వదిలి వస్తున్నారు. కొన్నాళ్లుగా సాగుతున్న ఈ దందాపై దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందడంతో సోమవారం వివిధ ప్రాంతాల్లో వరుస దాడులు చేసిన ప్రత్యేక బృందాలు మొత్తం 18 మందిని పట్టుకున్నాయి. వారి నుంచి వాహనాలు, నకిలీ గుర్తింపుకార్డులతో పాటు ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రోహింగ్యాల్లో కొందరిని చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

తలసరిలో టాప్

ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా

- నగటున రూ.11.46 లక్షల రాబడి
- దేశంలోనే అత్యధిక వార్షిక ఆదాయం
- ఐటీ, ఫార్మా, రియల్ పెట్టుబడులు
- పుష్కలంగా ఉపాధి అవకాశాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో మన జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. 2023–24లో తలసరి సగటు ఆదాయం రూ.11.46 లక్షలుగా తేలింది. తర్వాతి స్థానాల్లో హర్యానాలోని గుర్గావ్ (రూ. 9.05లక్షలు) ఉండగా, కర్ణాటకలోని బెంగళూరు (రూ.8.93 లక్షలు), యూపీలోని గౌతంబుద్ధనగర్ (రూ.8.48 లక్షలు), హిమాచల్‌ప్రదేశ్‌లోని సోలాన్ (రూ.8.10 లక్షలు), గోవా (రూ.7.64 లక్షలు), సిక్కిం (రూ.7.46 లక్షలు), మహారాష్ట్రలోని ముంబై (రూ.6.57 లక్షలు), గుజరాత్‌లోని అహ్మదాబాద్ (రూ.6.43 లక్షలు), హైదరాబాద్ (రూ.5.39 లక్షలు), తమిళనాడులోని చెన్నై (రూ.5.20 లక్షలు) ఉన్నాయి. దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న మన జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నట్లు వెల్లడైంది.

పెరిగిన ఉపాధి అవకాశాలు

తలసరి వార్షికాదాయంలో తెలంగాణలోనూ జిల్లా టాప్‌లో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, నల్లగొండ జిల్లాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రణాళికాశాఖ జనాభా, విద్య, ఆర్థిక, సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ఇటీవల విడుదల చేసిన అట్లాస్‌లోనూ ఇదే అంశం స్పష్టమైంది. జిల్లాలో అంతర్జాతీయ విమానాశ్రయానికి తోడు ఔటర్ రింగ్‌రోడ్డు ఉండటం కలిసి వచ్చింది. కావాల్సినన్ని భూములు అందుబాటులో ఉండటం.. ఇతర ప్రాంతాలతో పోలిస్తే, కావాల్సినంత మ్యాన్‌పవర్ అందుబాటులో ఉండటం.. ఉద్యోగుల వేతనాలు కూడా చాలా తక్కువగా ఉండటంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఐటీ అనుబంధ సంస్థలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలే కాదు రియల్ ఎస్టేట్ రంగం సైతం ఇక్కడ ఎక్కువగా పెట్టుబడులు పెడుతుండటంతో జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. ఫలితంగా జిల్లావాసుల సగటు వార్షిక ఆదాయం భారీగా పెరిగింది. వస్తు ఎగుమతి, దిగుమతి కూడా జిల్లా నుంచే అత్యధికంగా జరుగుతోంది.

యువతిపై లైంగిక దాడి..

నిందితుడిపై కేసు నమోదు

సనత్‌నగర్: ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన యువతి (19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. కొన్నేళ్ల క్రితం ఆమెకు బేగంపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన ఆర్యతో ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత వారిరువురు తరచూ వ్యక్తిగతంగా కలుసుకుని మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి సదరు యువతిని తన ఇంటికి తీసుకెళ్లిన ఆర్య ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో గర్భం దాల్చిన బాధితురాలు తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయగా ఆమెపై దాడికి పాల్పడ్డాడు. అంతేగాగా ఆమె వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు తీసిన అతను తనను విడిచి పెట్టి వెళ్లాలని, లేని పక్షంలో ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరిస్తున్నాడు. దీంతో బాధితురాలు సోమవారం బేగంపేట పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుల అరెస్టు

ఫిలింనగర్: ఇండియా–పాకిస్థాన్ జట్ల మధ్య ఐసీసీ ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్ జరుగుతుండగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..గోల్కొండ సమీపంలోని సాజిద్‌కాలనీకి చెందిన ఇమ్రాన్‌బేగ్ అనే వ్యక్తి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. బెట్టింగ్ వెబ్‌సైట్‌లో మ్యాచ్‌కు సంబంధించి బెట్టింగ్ నిర్వహిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్‌లో మరొకరు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని దుర్గా బార్‌లో క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన బంజారాహిల్స్ పోలీసులు జవహర్‌కాలనీకి చెందిన రేగిటి కిరణ్‌కుమార్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. అతడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫైర్ ప్లే వెబ్‌సైట్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు. మొబైల్ ఫోన్‌తో పాటు నగదు, ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ సామాగ్రి సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ సిగరెట్లు స్వాధీనం

వ్యాపారిపై కేసు నమోదు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–82లోని ఎఫ్ఎన్‌సీసీ ఎదురుగా ఉన్న బనారసి పాన్ మహల్‌లో విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఫిలింనగర్ పోలీసులు పాన్ షాప్‌పై దాడి చేసి పెద్ద ఎత్తున ఖరీదైన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. బనారసి పాన్ మహల్ యజమాని టకీవుల్లాఖాన్ కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయి. సిగరెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

గచ్చిబౌలి: ఇంటి మరమ్మతు పనులు చేస్తూ ప్రమాదవశాత్తు భవనం 12వ అంతస్తు నుంచి కింద పడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ నగర్‌జిల్లాకు చెందిన లక్ష్మణ్(37) నగరానికి వలస వచ్చి నార్సింగి ప్రాంతంలో నివాసం ఉంటూ కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం అతను గచ్చిబౌలి, బాంబూస్ అపార్ట్‌మెంట్స్‌లోని 12 అంతస్తులో పునర్నిర్మాణ పనుల్లో పాల్గొన్నాడు. గాలి రాకపోవడంతో కిచెన్ విండోకు ఉన్న గ్లాసు డోర్ తెరిచి పనులు చేస్తున్న అతను ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్యూజన్ పబ్‌లో యువతిపై దాడి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఇల్యూజన్ పబ్‌లో శనివారం రాత్రి మద్యం మత్తులో ఓ యువకుడు ఓ యువతిపై దాడి చేసి పొత్తి కడుపులో బూటు కాలితో తన్ని తీవ్రంగా గాయపరిచిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..పాతబస్తీకి చెందిన యువతి తన ముగ్గురు స్నేహితురాళ్లతో కలిసి శనివారం రాత్రి ఇల్యూజన్ పబ్‌కు వచ్చింది. రాత్రి 12.40 గంటల సమయంలో ఆమె మాజీ ప్రియుడు ఓల్డ్ సిటీకే చెందిన ఎండీ ఆసిఫ్‌జానీ మద్యం సేవించి అక్కడికి వచ్చాడు. సదరు యువతి స్నేహితురాళ్లతో బర్త్‌డే వేడుకలు జరుపుకుంటుండగా అక్కడికి వచ్చిన ఆసిఫ్‌జానీ ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దూషిస్తూ దాడి చేశాడు. దీంతో ఆమె స్నేహితురాళ్లతో కలిసి కిందకు పరుగులు తీయగా అక్కడికి కూడా వచ్చిన ఆసిఫ్‌జానీ ఆమె పొత్తి కడుపులో బూటు కాలితో తన్నడమేగాక తీవ్రంగా కొట్టాడు. అడ్డుకునేందుకు యత్నించిన ఆమె స్నేహితురాలిపై కూడా దాడికి పాల్పడ్డాడు.

బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. గతంలో ఆసిఫ్‌జానీ, తాను ప్రేమించుకున్నామని, కొద్ది రోజులు కలిసి తిరిగామని, అయితే అతడి ప్రవర్తన నచ్చకపోవడంతో కొంత కాలంగా దూరంగా ఉంటున్నానని తెలిపింది. అయినా తనను వెంబడిస్తూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. జూబ్లీహిల్స్ పోలీసులు ఆసిఫ్‌జానీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : లక్ష్మీకాంప్లెక్స్ 11 కెవీ ఫీడర్ ఆల్విన్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ సోమవారం తెలిపారు. అదేవిధంగా సీతారామయ్య టవర్స్ 11కెవీ ఫీడర్ జనప్రియ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు బంజారానగర్, ఓల్డ్ అండ్ న్యూశాస్త్రినగర్, పీఆర్‌నగర్, ఓల్డ్ సుల్తాన్ నగర్, ఇండస్ట్రియల్ లైన్ ప్రాంతాల్లో, న్యూశాస్త్రినగర్ 11 కెవీ ఫీడర్ జనప్రియ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు పీఆర్‌నగర్, ఓల్డ్ అండ్ న్యూ శాస్త్రినగర్, అవంతినగర్ ఈస్ట్ ప్రాంతాల్లో, భరత్‌నగర్ 11కెవీ ఫీడర్ జనప్రియ సబ్‌స్టేషన్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెచ్‌పి రోడ్డు, లక్ష్మికళ థియేటర్, శ్రీరాములు థియేటర్ ఏరియాలు, ఆశ్విన్ హెయిర్ ఆయిల్ లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీలో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో రెండోరోజు కూడా ఉత్సవాలు కొనసాగాయి. ఇందులో భాగంగా భక్తులు 24 గంటల పాటు హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన హనుమాన్ చాలీసా మంగళవారం ఉదయం 7 గంటల వరకు కొనసాగుతుందని ఉత్సవాల నిర్వాహకులు తెలియజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



రహమత్‌నగర్: ప్రతి వ్యక్తి సేవాగుణం కలిగి ఉండాలని ఖురైషీ కాన్ఫరెన్స్ హైదరాబాద్ నగర అధ్యక్షుడు రహీం ఖురైషీ పేర్కొన్నారు. రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం శ్రీరాంనగర్‌లో పేద ముస్లింలకు నిత్యావరసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో చేసిన పుణ్యాలు రెట్టింపు ప్రతిఫలం అందజేస్తాయయన్నారు.

మార్చి 4న కనకమ్మ, దువ్వూరి రామిరెడ్డి జయంతి సభ



పంజగుట్ట: కనకమ్మ, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి జయంతి సభ మార్చి 4న అబిడ్స్‌లోని రాజ బహదూర్ వెంకట రామిరెడ్డి భవనంలో నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సెక్రటరీ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, కొండా లక్ష్మీకాంత రెడ్డి, పెల్లేటి సుబ్రమణ్యం రెడ్డి, కొల్లూరి సత్తయ్య, గజ్జల స్వామితో కలిసి ఆవిష్కరించారు.

మద్యం మత్తులో మహిళ వీరంగం


వెంగళరావునగర్ : మద్యం మత్తులో ఓ మహిళ వీరంగం సృష్టించింది. ఈ సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆదివారం రాత్రి మధురానగర్‌లో ఓ మహిళ మద్యం తాగి చరణ్ అనే వ్యక్తిని దుర్భాషలాడుతోంది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి మహిళా పోలీసులతో కలిసి సిబ్బంది వెళ్ళగా వారిని సైతం ఆ మహిళ దూషించి వీరంగం చేసింది. బలవంతంగా ఆమెను పీఎస్‌కు తరలించారు. పోలీసు స్టేషన్‌లో సైతం ఆమె సిబ్బందిని దూషించింది. దాంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య



మనీష్ (ఫైల్)

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ పరిదిలో ఇద్దరు వెర్వేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్‌కు బస్తీకి చెందిన మనీష్(22) డిగ్రీ పూర్తి చేసి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబంలో ఏర్పడ్డ కలహాలతో మనస్తాపానికి గురైన అతను సోమవారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



కంచనకుమారి

◆ టి అంజయ్యనగర్‌కు చెందిన కంచన్ కుమారి (18) హౌజ్ కీపింగ్ చేస్తుండేది. సోమవారం అనుమానాస్పదంగా ఇంట్లో ఉరివేసుకుంది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం

- ముస్తాబవుతున్న ఆలయాలు
- బుధవారం తెల్లవారుజాము నుంచే విశేష పూజలు
- అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయాల నిర్వాహకులు



ముస్తాబవుతున్న శ్రీనగర్‌కాలనీలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం



జూబ్లీహిల్స్ సీతారామ ఆలయం

బంజారాహిల్స్: మహా శివరాత్రి వేడుకలకు శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ఆలయాల్లో భక్తుల కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26న మహా శివరాత్రి ఉత్సవాలను శివాలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో, పూల మాలలతో కనువిందుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

శివరాత్రి సందర్భంగా శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో కొలువుదీరిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఏక రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 7:30 గంటల వరకు ఏక రుద్రాభిషేకాలు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం, రాత్రి 11 నుంచి తెల్లవారుజామున 1:30 గంటల వరకు లింగోద్భవ కాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు.

ఫిలింనగర్ దైవ సన్నిధానంలో..

మహా శివరాత్రి వేడుకలకు హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన సంచలిత ఫిలింనగర్ దైవ సన్నిధానంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం ఈ వేడుకల సందర్భంగా తెల్లవారుజామున 4:30 గంటల నుంచి 6:30 గంటల వరకు లఘు న్యాస పూర్వక ఏక రుద్రాభిషేకాలు, సామూహిక ఏక రుద్రాభిషేకాలు జరుగుతాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వదర్శనం, రాత్రి 8 గంటలకు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి శాంతి కల్యాణం, రాత్రి 10 నుంచి 12:30 గంటల వరకు లింగోద్భవ సమయాన మహాన్యాసపూర్వక ఏకరుద్రాభిషేకాలు జరగనున్నాయి.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.18లోని సీతారామస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేశారు. కల్యాణానికి ముందు శివపార్వతుల ఊరేగింపు ఘట్టం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు రాఘవాచార్యులు నేతృత్వంలో ఈ వేడుక నిర్వహించారు.

సీతారామస్వామి ఆలయంలో..

జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-18లోని సీతారామస్వామి ఆలయ సముదాయంలో శివరాత్రి సందర్భంగా సాయంత్రం 5 గంటల నుంచి పర్వతవర్ధిని అమ్మవారికి సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన, 6గంటల నుంచి రామలింగేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, నవగ్రహ అభిషేకాలు నిర్వహించనున్నారు.

ముస్తాబవుతున్న ఆలయాలు ఇవే..

- ◆ శ్రీనగర్‌కాలనీలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం.
- ◆ ఫిలింనగర్‌లోని ఫిలింనగర్ దైవసన్నిధానంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం.
- ◆ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని శివాలయం.
- ◆ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14 నందినగర్‌లోని హనుమాన్ ఆలయం, నందినగర్ బ్రహ్మకుమారీస్ ప్రాంగణం.
- ◆ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని కమాన్‌లో ఉన్న హనుమాన్ ఆలయం.
- ◆ శ్రీకృష్ణానగర్‌లోని గ్రీన్ బావర్చి హోటల్ సమీపంలోని శివాలయం.
- ◆ జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-18లోని సీతారామ స్వామి ఆలయం.
- ◆ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 ఎన్‌బీటీనగర్ అయ్యప్పస్వామి ఆలయం.
- ◆ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10 బసవతారకం ఆస్పత్రిలో వద్ద ఉన్న విజయగణపతి స్వామి ఆలయం, గౌరీశంకర్‌నగర్ రామాలయం.
- ◆ శాలివాహననగర్‌లోని శ్రీకాశీ విశాలక్ష్మి ఆలయం.
- ◆ ఫిలింనగర్ వినాయకనగర్‌లోని పర్వతాంజనేయస్వామి ఆలయం.
- ◆ ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీ అభయాంజనేయస్వామి ఆలయం.

చెట్లు కొట్టేస్తున్న యూబీడీ సిబ్బందిపై ఫిర్యాదు



దుకాణానికి అడ్డుగా ఉందని కొట్టేసిన చెట్టు

బంజారాహిల్స్: మొక్కలు నాటి చెట్లు పెంచి పచ్చదనాన్ని, పర్యావరణాన్ని కాపాడాల్సిన జీహెచ్ఎంసీ అర్బన్ బయో డైవర్సిటీ (యూబీడీ) సిబ్బంది అనుమతులు లేకుండా అడ్డదారుల్లో యజమానులతో కుమ్మక్కై చెట్లు కొట్టేస్తుండడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని జహీరానగర్ చౌరస్తాలో గోల్కొండ ఎంపోరియం సమీపంలో ఓ ఇంటికి అడ్డుగా ఉన్నాయని మూడు చెట్లను కొట్టేశారు. ఈ వ్యవహారంపై సోమవారం జీహెచ్ఎంసీ యూబీడీ విభాగం అధికారిణి సుభద్రాదేవికి ఫిర్యాదులు అందాయి. జీహెచ్ఎంసీ సర్కిల్-18 యూబీడీ విభాగానికి చెందిన సిబ్బంది ఈ చెట్లను కొట్టేయించారని ఆమెకు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం ఒక చెట్టు కొట్టేయాలంటే అటవీ శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. ఎక్కడైనా చెట్టు కొట్టేస్తుంటే అటవీ శాఖ అధికారులు అక్కడికి వెళ్లి ఆపి వారిపై కేసులు కూడా నమోదు చేయాలి. కానీ జీహెచ్ఎంసీ సర్కిల్-18 పరిధిలో అటవీ శాఖ అధికారులు కూడా యజమానులతో కుమ్మక్కై చెట్లు కొట్టేసినా చర్యలు తీసుకోకుండా జారుకుంటున్నారు. ఇటీవల కాలంలో చాలా చోట్లకు అటవీ శాఖకు చెందిన సిబ్బంది వెళ్లి బేరసారాలు కుదుర్చుకున్న సంఘటనలు కూడా విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు అందాయి. ఒకవైపు యూబీడీ విభాగం నిర్లక్ష్యం, ఇంకోవైపు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నిర్వాకం వల్ల భారీ వృక్షాలు నేలమట్టమవుతున్నాయి. జీహెచ్ఎంసీ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, విజిలెన్స్ విభాగాలు నిఘా పెట్టకపోవడంతో స్థానికంగా మామూళ్లు దండుకుంటూ చెట్లు కొట్టేసేందుకు అడ్డదారుల్లో అనుమతులు ఇస్తున్నట్లుగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న నర్సింగ్ క్లాత్ ఎంపోరియం యాజమాన్యం

బంజారాహిల్స్: హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు చెందిన హరేకృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్టుకు నర్సింగ్ క్లాత్ ఎంపోరియం ప్రైవేట్ లిమిటెడ్ విరాళం అందించింది. ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ సింఘానియా, డైరెక్టర్ రవికాంత్ సింఘానియాలు హరేకృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్ట్ కింద చేపట్టే కార్యక్రమాల నిర్వహణకు గాను రూ.17 లక్షలను విరాళంగా అందించి ఉదారతను చాటుకున్నారు. సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి గాను వారు ఈ విరాళాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీకి అందించారు. తాజా విరాళంతో ఇప్పటివరకు నర్సింగ్ క్లాత్ సంస్థ ఆర్థిక సంవత్సరం 2024-25కి గాను రూ.42 లక్షల విరాళాలను హరేకృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్టుకు అందించినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ సందర్భంగా సత్యగౌర చంద్రదాస ప్రభూజీ మాట్లాడుతూ..నర్సింగ్ క్లాత్ ఎంపోరియం ఉదారతతో విరాళం అందించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి కమిషన్ తరుపున నివేదిక అందజేస్తామని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా విద్యా హక్కు చట్టాన్ని కల్పించకపోతే దళితులు చదువుకు దూరం అయ్యేవారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బహుజనులంతా ఉన్నత విద్యను అభ్యసించి ఆత్మగౌరవాన్ని పెంపొందించాలని తెలిపారు.ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మనువాద భావాజాలం వల్లనే విద్యకు బడ్జెట్ కేటాయించకుండా బలహీనవర్గాలను విద్యకు దూరం చేసేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వేల పాఠశాలలను మూసివేతకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు.

15శాతం ఇస్తామని 7శాతం నిధులు కేటాయించడమేంటి?

ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 15శాతం బడ్జెట్ విద్యకు కేటాయించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో విద్యకు 7శాతం నిధులు కేటాయించి తాము ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందన్నారు. రానున్న బడ్జెట్‌లోనైనా విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు నాగరాజు, అనిల్, హరీష్, హైకోర్టు న్యాయవాది సాదిక్, దివాకర్, మెట్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 2న ఎల్లో రిబ్బన్ రన్



రన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: ఎండోమెట్రియోసిస్ (గర్భాశయం వెలుపల పొరగా ఏర్పడడం) సమస్య ప్రస్తుతం మహిళల్లో విపరీతంగా పెరుగుతుందని దీనిపై అవగాహన ఎంతో అవసరమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్, ఐఏఎస్ అధికారి ఆర్.వి. కర్ణన్ అన్నారు. ఎండోమెట్రియోసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 2న నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో 10కె, 5కె, 3కె ఎల్లో రిబ్బన్ రన్‌లు నిర్వహిస్తున్న నేపథ్యంలో రన్ పోస్టర్, టీషర్ట్‌ను సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ విమీ బింద్రా, సినీనటి డాక్టర్ సాయి కామాక్షి, వివేక్ గోయల్, డాక్టర్ అర్చనా రెడ్డి, డాక్టర్ శ్వేతా రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ వ్యాధితో ప్రస్తుతం సగటునా 10 మంది మహిళల్లో నలుగురు బాధపడుతున్నారని, ఈ వ్యాధి వస్తే గర్భం కూడా ఎంతో కష్టంగా మారుతుందన్నారు. గత సంవత్సరం కూడా రన్ నిర్వహించామని, ఇది రెండవ ఎడిషన్ రన్ అన్నారు. రన్‌లో సుమారు 1500 మంది పాల్గొంటారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారుల ఫొటోలు యాప్‌లో నమోదు



చిన్నారి ఫొటోను యాప్‌లో నమోదు చేస్తున్న టీచర్

బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఫొటోలను పోషణ్ అభియాన్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి చిన్నారి వివరాలను ప్రత్యేకంగా కేటాయించిన యాప్‌లో నమోదు చేస్తూ పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధిలోని 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఫొటోలను క్యాప్చర్ చేస్తూ ఈ యాప్‌లో అనుసంధానం చేస్తున్నారు. దీని ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంతమంది పిల్లలు వస్తున్నారు, రోజూ హాజరవుతున్నారా? లేదా, వారికి పోషకాహారం అందిస్తున్నారా లేదా తదితర వివరాలన్నీ ప్రభుత్వానికి తెలిసేవిధంగా ఈ నమోదు కార్యక్రమం జరుగుతుంది.

పరీక్ష ఫీజులు తగ్గించాలంటూ ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ, పీజీ కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. సోమవారం చలో ఉస్మానియా యూనివర్సిటీ పిలుపులో భాగంగా ఆర్ట్స్ కాలేజీ నుంచి ఓయూ పాలనా భవనం వరకు పెంచిన పరీక్షల ఫీజులను తగ్గించాలని నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఏబీవీపీ నాయకులు రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డికి ఫీజులు తగ్గించాలని వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పృథ్వితేజ, జాన్సీ, అలివేలి రాజు పాల్గొన్నారు.

బస్ చార్జీల పెంపు రద్దు చేయాలి

కాచిగూడ: హిందూ పండుగల సందర్భంగా బస్ చార్జీల పెంపు రద్దు చేయాలని హిందూ జన జాగృతి సమితి ఆధ్వర్యంలో ప్రతినిధులు రఘువీర్‌సింగ్ ఠాకూర్, నవీన్‌కుమార్, సుధాకర్ సోమవారం ఆర్టీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ (ఆపరేషన్స్)ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిసంవత్సరం మహా శివరాత్రి పండుగ సందర్భంగా వివిధ శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల నుంచి ఆర్టీసీ బస్ చార్జీలను 50శాతం పెంచడం సరికాదన్నారు. ఇతర మతాలకు సంబంధించిన యాత్రికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తున్నాయని అన్నారు. హజ్ యాత్రకు అలాగే జేరుసలేం యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించడం తెలిసిందే. అదే విధంగా హిందూ భక్తులకు కూడా ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

విద్యార్థులకు చేతి రాత ప్రాముఖ్యతను తెలియజేయాలి

గన్‌ఫౌండ్రీ: అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చేతి రాత పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ వికాస పరిషత్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ బీవీపీ సంస్కార్ మాట్లాడుతూ..విద్యార్థులకు చేతి రాత ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో చేతిరాతను పెంపొందించడంతో పాటు చేతిరాతపై ఆసక్తిని పెంచేందుకు దోహదపడుతాయన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వికాస పరిషత్ సలహాదారులు సాధనాచారి, అకాడమీ నిర్వాహకులు అహ్మద్, బి.సుదర్శన్, చొక్కాపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కుల అందజేస్తున్న ఆర్డీఓ,ఎఆర్ఓ, సీఎన్ రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు

రహమత్‌నగర్: రహమత్‌నగర్, బోరబండ డివిజన్లకు లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం ఖైరతాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో అందజేశారు. సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్, తహసీల్దార్ నయామొద్దిన్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ సతీమణి హబీబా సుల్తానా 204 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

వెంగళరావునగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలో 38 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను కార్పొరేటర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మేనిఫెస్టో ఆవిష్కరణ



మేనిఫెస్టో ఆవిష్కరిస్తున్న పురుషోత్తంరెడ్డి

పంజగుట్ట: పట్టభద్రుల ఎన్నికల్లో గెలవగానే పాత పెన్షన్ పథకం పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి తలకోల పురుషోత్తం రెడ్డి అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టీచర్స్ 2030 మేనిఫెస్టోను వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ మాజీ కార్యదర్శి డాక్టర్ బి.వి జయ్‌కుమార్, విద్యావేత్త డాక్టర్ ఈ.రాజిరెడ్డి, ప్రొఫెసర్ రేఖారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో మొదటిసారి ఒక స్వతంత్ర అభ్యర్థి విస్తృతమైన విద్యా పరిపాలనా ప్రణాళిక రూపొందించబడిందని తెలిపారు. కొత్త పెన్షన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయించి పాత పెన్షన్ విధానం అమలు చేసేలా కృషి చేస్తానని, పీఆర్సీ ప్రకారం 53 శాతం ఫిట్‌మెంట్, డీఏ చెల్లింపు, విద్యాలయాల్లో మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, స్మార్ట్ ల్యాబ్‌లు, లైబ్రరీలు ఏర్పాటు చేస్తానన్నారు.

బల్దియా కార్మికులను పర్మనెంట్ చేయాలి

గోల్కొండ: బల్దియాలోని వివిధ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ నాయకులు సి.మల్లేష్, విఠల్ డిమాండ్ చేశారు. సోమవారం నగర సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్‌తో కూడిన పత్రాన్ని వారు బల్దియా జోనల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బల్దియా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేటగిరీలను అనుసరించి వారికి వివిధ విభాగాల్లో జీతాలు చెల్లించాలన్నారు. కార్మికుల హాజరుపట్టిలో జరుగుతున్న అవకతవకులను నివారించి అధికారుల వేధింపులను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, యాదమ్మ, లక్ష్మి తదితరులున్నారు.

'సౌకర్యాలుంటేనే చదువుపై శ్రద్ధ చూపిస్తారు'

సనత్‌నగర్: పాఠశాలలో సరైన సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపిస్తారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం సనత్‌నగర్‌లోని నెహ్రూ పార్కు సమీపంలో గల రౌండ్‌టేబుల్ స్కూల్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఈ స్కూల్‌లో సుమారు 600 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, విద్యార్థుల సంఖ్యకు తగినట్లు తరగతి గదులు లేవని ఎమ్మెల్యేకు స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు వివరించారు. సరిపడా తరగతి గదులు లేని కారణంగా చెట్ల కింద, షెడ్ల కింద విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మేడ్చెల్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. రూ.40 లక్షల రూపాయలతో ప్రైమరీ స్కూల్ భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చెల్ కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

బెదిరించి నగలు, నగదు దోపిడీ

వెంగళరావునగర్: ఎన్‌జీఓ నిర్వహిస్తున్న వ్యక్తిని బెదిరించి నగలు, నగదు దోచుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గాజులరామారం ప్రాంతానికి చెందిన ఎస్.రాజశ్రీకర్‌రెడ్డి తనకు చెందిన ఇంటిని రూ.39 లక్షలకు విక్రయించాడు. విషయం తెలుసుకున్న మణికుమార్, త్యాగరాజు, అగస్టీన్, కిరణ్‌కుమార్, సందీప్, రాజేంద్ర మరో ఇద్దరు మహిళలు గత ఏడాది రహమత్‌నగర్‌లోని వారి ఇంటికి పిలిచారు. తెలిసిన వ్యక్తులు అయినందున ఇంటికి వెళ్ళగా తమకు నగలు, నగదు కావాలని అడిగారు. ఒప్పుకోకపోవడంతో కట్టేసి కొట్టి ఫ్యాన్‌కు ఉరేసి చంపడానికి ప్రయత్నించారు. ఒక మహిళ తనను శారీరకంగా కలవాలని ఒత్తిడి తెచ్చింది. రాజశేఖర్ ఒప్పుకోకపోవడంతో లైంగిక దాడికేసు పెడతానని బెదిరించింది. అనేకమార్లు బెదిరింపులకు గురిచేసి రూ.12 లక్షల నగదు, 33 తులాల బంగారాన్ని తీసుకున్నారు. వాటిని తిరిగి ఇవ్వకపోగా తనపై తప్పుడు కేసు పెడతానని బెదిరిస్తున్నారు. బాధితుడు తనకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుడిమల్కాపూర్‌లో సంగీత, నృత్య కళాశాల పరీక్షా కేంద్రం

నాంపల్లి: గుడిమల్కాపూర్‌లోని శ్రీఅన్నమాచార్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల వార్షిక పరీక్షల నిర్వహణకు కొత్తగా పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25వ విద్యా సంవత్సరానికి జూన్ నెలలో ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలకు వార్షిక పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అలాగే పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పొడగించినట్లు వివరించారు. వార్షిక పరీక్ష రాసే విద్యార్థులు వచ్చేనెల 3వ తేదీలోగా వార్షిక పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాల కోసం హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లోని అన్నమాచార్య ప్రభుత్వ, సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

జర్నలిస్టుల సమస్యలు పట్టవా..?

సమాచార భవన్ ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ నిరసన

సాక్షి, సిటీబ్యూరో: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మాసబ్‌ట్యాంక్‌లో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ హరీష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మామిడి సోమయ్య, బి.బసవ పున్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని, హెల్త్ కార్డులు లేక, వైద్య సేవలు అందక రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది జర్నలిస్టులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సమస్యలను పరిష్కరించకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్, గుడిగ రఘు, కార్యదర్శులు ఎస్‌కే సలీమా, కార్యవర్గ సభ్యులు కె.పాండురంగారావు, పి.నాగవాణి, మణిమాల, నాయకులు యర్రమిల్లి రామారావు, శ్రీనివాస్ గౌడ్, రవికుమార్, సీహెచ్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఆరోగ్యానికి దోహదం




మహిళా పెన్షనర్స్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగ విరమణ తర్వాత ఆనందం కోసమే కాకుండా ఆరోగ్యం కోసం కూడా క్రీడలు ఎంతో అవసరమని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్బీస్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వ మహిళా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయస్సుతో నిమిత్తం లేకుండా క్రీడల్లో పాల్గొనడం ఆరోగ్యానికి దోహద పడుతుందని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ క్రీడల్లో క్రియాశీలకంగా పాల్గొనడం ఎంతో అవసరమని సూచించారు. మ్యూజికల్ చైర్, స్పీడ్ రన్నింగ్, ఫాస్ట్‌వాక్ వంటి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కో ఆపరేటివ్ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బి.శోభారాణి, అసోసియేషన్ చైర్మన్ ఆర్.ఉమాదేవి, కో చైర్మన్ కె.ధనలక్ష్మి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు సుధాకర్, పెన్షనర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

26న కొలకలూరి పురస్కారాలు

సాక్షి, సిటీబ్యూరో: జ్యోతి గంధమాల ఆధ్వర్యంలో ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో కొలకలూరి పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షతన జరిగే సాహిత్య పురస్కార ప్రదానం, సన్మాన కార్యక్రమానికి మాజీ మంత్రి మాణిక్య వరప్రసాద్, ఆచార్య కొలకలూరి సుమకిరణ్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా కొలకలూరి భాగీరధి కవితా పురస్కారం, కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం, కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం అందజేస్తామన్నారు.

ఫార్మా ఇండస్ట్రీస్‌కు పూర్తి సహకారం



మిల్టేని బయోటెక్ సెల్ అండ్ జీన్ థెరపీ ప్రారంభంలో జయేష్ రంజన్

శామీర్‌పేట్: ఫార్మా కంపెనీలు స్థాపించేవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. హైదరాబాద్ జినోమ్ వ్యాలీ ఫేస్‌– 1లో మిల్టేని బయోటెక్ ఫార్మా సంస్థ ఆధ్వర్యంలో సెల్ అండ్ జీన్ థెరపీ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సైన్స్ పరిశోధన, ఆవిష్కరణల హబ్‌గా మరింత ముందుకు తీసుకెళ్లడంలో సెల్ అండ్ జీన్ థెరపీ కేంద్రం ఏర్పాటుతో మరో అడుగు ముందుకు వేశామన్నారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సెల్, జీన్ థెరపీ రంగంలో మరింత అభివృద్ధికి మార్గం సులభతరం చేస్తుందన్నారు. కొత్త ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన వివరించారు.

పండుటాకులను పట్టించుకోరా..?

గాంధీలో అందుబాటులోకి రాని వయోవృద్ధుల విభాగం

- 10 నెలల క్రితం ఆధునిక హంగులతో జెరియాట్రిక్ వార్డు
- వైద్యులు, సిబ్బంది కొరతతో ప్రారంభానికి నోచుకోని వైనం
- రూ.లక్షలు వృథా.. వైద్యశాఖ మంత్రి స్పందించాలని డిమాండ్





గాంధీలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ వార్డు

గాంధీఆస్పత్రి: చిన్ననాటి తీపి గుర్తులకు వారే సాక్షులు.. అలనాటి సంగతులను నేటి తరానికి అందించే వారధులు.. వయసు రీత్యా వచ్చే శారీరక, మానసిక రుగ్మతలతో బాధపడుతూ ముదిమి వయసులో శరీర సత్తువ కోల్పోయి.. తనకు తాను దూరమై, కుటుంబ సభ్యులకు భారమై మెరుగైన వైద్య సేవల కోసం అల్లాడుతూ రోజులు వెల్లదీస్తున్న వయోవృద్ధులు ఎందరో.. అటువంటి పండుటాకులను అక్కున చేర్చుకుని మెరుగైన వైద్య సేవలు అందించి, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి, వారిలో మానసిక, శారీరక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపేందుకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో 10నెలల క్రితం ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ వార్డు(వయోవృద్ధుల విభాగం) నేటికీ అందుబాటులోకి రాకపోవడం దురదృష్టకరం. వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, అవగాహనలేమి వయోవృద్ధుల పాలిట శాపంగా మారింది.

శారీరక, మానసిక తత్వాలు భిన్నం..

60 ఏళ్లు నిండిన వారిలో మానసిక, శారీరక తత్వాలు భిన్నంగా ఉంటాయి. మానసిక అనుబంధాల కోసం వెంపర్లాడుతుంటారు. ఇమ్యూనిటీ, రోగ నిరోధకశక్తి తగ్గి, ప్రధాన అవయవాలు సరిగా పనిచేయకుండా నీరసించిపోతాయి. ఇన్ఫెక్షన్ల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. జెరియాట్రిక్ వార్డులో చేరిన వృద్ధుల ఎమోషనల్ డిస్ట్రబెన్స్, శరీర తత్వాన్ని గుర్తించి అందుకు తగ్గ వైద్యసేవలతో పాటు ఆప్యాయత, ప్రేమతో మానసిక చికిత్సలు అందించి నూతనోత్సాహం కల్పించేలా కార్యాచరణ రూపొందించారు.

పది నెలల క్రితం ఏర్పాటు

గాంధీ ఆస్పత్రి ఇన్‌పేషెంట్ విభాగంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా 20 చొప్పున మొత్తం 40 పడకలతో జెరియాట్రిక్ విభాగాన్ని అప్పటి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు నేతృత్వంలో పది నెలల క్రితం ఏర్పాటు చేశారు. బ్యాలెన్స్ కోల్పోకుండా నడిచేందుకు రెయిలింగ్, కాలు జారకుండా యాంటి స్కిట్ టైల్స్, వాష్‌రూంలో కూర్చుని లేచేందుకు హ్యాండిల్స్, ఎడ్జస్టబుల్ మంచాలు, బెడ్‌సోర్స్ రాకుండా ప్రత్యేక పరుపులు, మానసిక, శారీరక వ్యాయామంలో మెళకువలు నేర్పించేందుకు ఫిజియోథెరపీ వార్డు ఏర్పాటు చేశారు. సానుకూల దృక్పథం, మానసిక ఉల్లాసం కలిగించేందుకు వార్డులోని గోడలకు ప్రత్యేక పెయింటింగ్స్ వేయించి ఆహ్లాదరకమైన వాతావరణాన్ని సృష్టించారు.



గాంధీలో అందుబాటులోకి రాని వయోవృద్ధుల విభాగం(వృత్తంలో వార్డుకు తాళం)

నాలుగు పీజీ సీట్లు కేటాయింపు..

గాంధీ జెరియాట్రిక్ విభాగానికి నేషనల్ మెడికల్ కౌన్సిల్ నాలుగు పీజీ సీట్లు కేటాయించింది. జెరియాట్రిక్ విభాగం జనరల్ మెడిసిన్ విభాగానికి అనుసంధానంగా ఉంటుంది. ఈ విభాగంలో విధులు నిర్వర్తించేందుకు ప్రొఫెసర్, అసోషియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇద్దరు సీనియర్ రెసిడెంట్లు, జూనియర్ డాక్టర్లు, 30 మంది నర్సింగ్ సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు అవసరం. ఇటీవల జరిగిన బదిలీల్లో గాంధీ నుంచి వైద్యులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో ఇతర ఆస్పత్రులకు బదిలీ కావడంతో జెరియాట్రిక్ వార్డు ప్రారంభంలో తీవ్ర జాప్యం నెలకొంది.

> **ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..**
>
> సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో వయోవృద్ధుల విభాగాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. వైద్యులు, సిబ్బందిని నియమించేలా కార్యాచరణ రూపొందించి ప్రభుత్వంతో పాటు వైద్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో వృద్ధులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.
>
> – ప్రొఫెసర్ రాజకుమారి, గాంధీ సూపరింటెండెంట్
>
> **పూర్తిస్థాయిలో విస్తరిస్తాం..**
>
> జెరియాట్రిక్ విభాగానికి నాలుగు పీజీ సీట్లు కేటాయించగా, సంబంధిత పీజీలు జాయిన్ అయ్యారు. త్వరలోనే ఈ విభాగాన్ని పూర్తిస్థాయిలో విస్తరిస్తాం. ప్రభుత్వంతో పాటు వైద్యశాఖ మంత్రి, ఉన్నతాధికారులు స్పందించి జెరియాట్రిక్ విభాగాన్ని అందుబాటులోకి తేవాలి.
>
> – ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, గాంధీ మెడికల్ కాలేజీ

నాలుగేళ్ల క్రితం పడిన బీజం..

గాంధీ ఆస్పత్రిలో జెరియాట్రిక్ వార్డు ఏర్పాటు చేసేందుకు నాలుగేళ్ల క్రితమే బీజం పడింది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ కేర్ ఫర్ ఓల్డర్ పీపుల్(ఐసీఓపీఈ) ప్రాజెక్టులో భాగంగా గాంధీలో వయోవృద్ధుల వార్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కోవిడ్ పాండమిక్‌తో తీవ్ర జాప్యం జరిగింది. జెరియాట్రిక్ మెడిసన్, మెడికల్ జెరంటాలజీ విభాగంలో విధులు నిర్వర్తించే వైద్యులను జెరియాట్రిషియన్, జెరియాట్రిక్ ఫిజిషియన్ అంటారు. గ్రీకు భాషలో జెరెన్ అంటే వృద్ధుడు అని అర్థం.

అక్షయ విద్యా ఫౌండేషన్ కృషి ఎనలేనిది



అక్షయ విద్య ఫౌండేషన్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

– గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఆల్విన్‌కాలనీ: పేద విద్యార్థుల జీవితాల్లో కాంతిరేఖ అక్షయ విద్యా ఫౌండేషన్ వెలుగులు నింపుతోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్‌లో అక్షయ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, జీహెచ్ఎంసీ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అక్షయ విద్యా కమ్యూనిటీ లెర్నింగ్ అండ్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుకు దూరంగా ఉండి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే పేద, మధ్య తరగతి విద్యార్థులకు అక్షయ విద్యా ఫౌండేషన్ చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ అక్షయ విద్యా ఫౌండేషన్‌ను ఎల్లమ్మబండ ప్రాంతంలో ప్రారంభించడం సంతోషకరం అన్నారు. ఇందులో శిక్షణ పొందిన 500 మంది విద్యార్థులు గురుకులాల్లో సీట్లు సాధించారని తెలిపారు. అదేవిధంగా విప్రో, గూగుల్, ప్రభుత్వ రంగ సంస్థలైన పలు డిపార్టుమెంట్‌లలో ఉద్యోగాలు సాధించారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్, యుసిడి అడిషనల్ కమీషనర్ చంద్రకాంత్ రెడ్డి, డీసీ గంగాధర్, బాలానగర్ డిసిపి సురేష్‌కుమార్, బాలానగర్ ఏసిపి హన్మంతరావు, సిఐ నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు చర్చలు జరపాలి



– ప్రొఫెసర్ హరగోపాల్

కాచిగూడ: ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు చర్చలు జరపాలని పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక 30వ వార్షికోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభల వాల్ పోస్టర్‌ను పలువురు ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే ఈ మహాసభలకు 23 రాష్ట్రాల నుంచి మేధావులు, ప్రముఖ జాతీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. సహజ వనరులు, ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు కాపాడటమే ధ్యేయంగా ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక పోరాడుతుందన్నారు. హైదరాబాద్ వేదికగా జరిగే ఈ జాతీయ సమావేశంలో 30 ఏళ్ల పోరాటాలు, ఉద్యమ విజయాలను ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికలను ఈ జాతీయ సభలో చర్చిస్తామని తెలిపారు. చేనేత వారసత్వం పేరిట హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించడాన్ని పీవోడబ్ల్యూ సంధ్య తప్పుబట్టింది. చేనేత వస్త్రాలను ప్రోత్సహిస్తున్నామని చెబుతూ, తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే కుట్ర జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఈ పోటీల నిర్వహణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక నాయకులు విస్సా కిరణ్ కుమార్, కన్నెగంటి రవి, కిరణ్, మీరా సంఘమిత్ర పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ ఎటువైపు..?

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపా.. బీజేపీ వైపా..?
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి

కాచిగూడ: రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో వర్గీకరణ చేసిన కాంగ్రెస్ పార్టీకి మద్దతా? లేక ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా మాదిగలకు వెన్నుపోటు పొడిచిన బీజేపీ వైపా? అని మంద కృష్ణమాదిగ వెల్లడించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాదిగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి చరమగీతం పాడుతూ రాష్ట్రంలో మాదిగలకు 9.75 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏకసభ్య కమిషన్ రిపోర్టు ఆమోదం తెలియజేస్తూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి మంద కృష్ణమాదిగ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ప్రకటించాలన్నారు. మంద కృష్ణమాదిగ లక్ష డప్పులు.. వేల గొంతులు కార్యక్రమం చేపడితే, మేము అదే రోజు సూటు బూటు కార్యక్రమం చేపట్టి ప్రతిఒక్కరూ భారత రాజ్యాంగం చేతిలో పట్టుకుని రావాలని పిలుపునిస్తామన్నారు. రాపోలు రాములు, బచ్చలకూర బాలరాజు, బుదాల బాబురావు, డాక్టర్ మీసాల మల్లేశం, నండ్రు నరసింహ, కనకం వంశీ, బోరెల్లి సురేష్, తిమ్మల నవీన్ రాజు, ఎర్రమళ్ల మొగులయ్య, జెర్రిపోతుల సాయన్న, దేవరకొండ నరేష్, జోగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిడమర్తి రవి



నగరంలో నేడు

- సారంగీ మ్యూజిక్ అకాడమీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయ గానసభలో సాయంత్రం 5.30గంటలకు సుమధుర సుస్వరాల రాగమంజరి కార్యక్రమం జరుగుతుంది.
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, తెలంగాణ లైఫ్ సైన్స్ ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు బయో ఏషియా 2025 కార్యక్రమం జరుగుతుంది.
- గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం అందుబాటులో ఉంటుంది. ప్రదర్శనలో 16 అడుగుల రుద్రా శివలింగం దర్శనం ప్రత్యేక ఆకర్షణ.
- కాశీపట్నం ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శివరాత్రిని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చిత్రలేఖనం పోటీలు జరుగుతాయి.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: వాగ్దేవి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో 178వ త్యాగరాజ ఆరాధనోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ మినీ శిల్పారామంలో జరిగిన సంగీతోత్సవంలో జంటనగరాలకు చెందిన సంగీత అధ్యాపకులు, విద్యార్థులు, త్యాగరాజ విరచిత పంచరత్న కీర్తనలను గానం చేసి అలరించారు. విద్యాలయ ప్రిన్సిపల్ తాడేపల్లి సుబ్బలక్ష్మి, డైరెక్టర్ తాడేపల్లి ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన బిల్ కలెక్టర్

మైలార్‌దేవ్‌పల్లి: అవినీతికి పాల్పడుతున్న బిల్ కలెక్టర్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల ప్రకారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వార్డు కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సి.మధు ఓ పరిశ్రమకు ట్యాక్స్ వసూలు చేసేందుకు కొన్ని రోజులుగా డబ్బులు ఆర్జిస్తున్నారు. పరిశ్రమకు ట్యాక్స్ మినహాయింపుపై రూ.లక్ష లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సోమవారం బిల్ కలెక్టర్ సి.మధుతో పాటు వి.రమేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.45 వేల లంచం బిల్‌కలెక్టర్‌కు అందిస్తున్నప్పుడు అధికారులు పట్టుకున్నారు. చేతి వేళ్లను రసాయన పరీక్షలో పాజిటివ్‌గా రావడంతో స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే ఏసీబీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1064లో సమాచారం ఇవ్వాలన్నారు. వాట్సాప్ ద్వారా 94404 46106, ఫేస్‌బుక్‌లో తెలంగాణ ఏసీబీ, ఎక్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ప్రయత్నంతోనే ఎంతటి విజయమైనా సాధ్యం

- విద్యార్థులు స్థితప్రజ్ఞత అలవర్చుకోవాలి
- సంగీత దర్శకుడు మణిశర్మ



విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని అందజేస్తున్న సంగీత దర్శకుడు మణిశర్మ

ఫిలింనగర్: కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోవడం, సంతోషంగా ఉన్నప్పుడు పొంగిపోవడం చేయకూడదని ప్రతి ఒక్కరూ స్థితప్రజ్ఞత అలవర్చుకోవాలని ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఫైవ్ ఫింగర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే స్టేషనరీ వస్తువులను సోమవారం ఉచితంగా అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంగీత దర్శకుడు మణిశర్మ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవడంతోపాటు లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని, ఆ ప్రయాణంలో ఒక్కోసారి ఓటమి ఎదురైనా నిరుత్సాహ పడకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నించి విజయాన్ని సాధించాలని అన్నారు. బాగా చదువుకొని మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులతోపాటు గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థుల కోసం ఫైవ్ ఫింగర్స్ సంస్థ చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణుకళ్యాణ్ పరీక్ష సందర్భంగా విద్యార్థులు భయపడవద్దని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఫిలింనగర్‌లోని వివిధ పాఠశాలలు చెందిన 600 మంది పిల్లలకు పరీక్ష స్టేషనరీ వస్తువులు ఉచితంగా అందజేశారు.

కార్మికుల కోసం పోరాటం చేసేవారిని గెలిపించండి



జలమండలి కార్మిక సంఘం నేత రాజిరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఎన్నికల్లో కార్మికుల కోసం పాటుపడే వారికి గెలిపించాలని వాటర్ వర్క్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజిరెడ్డి పిలుపునిచ్చారు. బంజారాహిల్స్ సబ్ డివిజన ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. గతంలో కార్మికుల పక్షాన పోరాటం చేస్తాడని రాంబాబు యాదవ్‌ను కార్మికులకు పరిచయం చేస్తే స్వార్థ ప్రయోజనాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. అతని అవినీతి వ్యవహారం నచ్చక యూనియన్ నుంచి బహిష్కరించడం జరిగిందన్నారు. అతనికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈసారి జలమండలి యూనియన్ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కార్మిక నేత సతీష్ కుమార్ మాట్లాడుతూ రాంబాబును రాబోయే ఎన్నికలలో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. జహంగీర్, శేఖర్, రాఘవేంద్ర రాజు, శ్రవణ్, నర్సింహారెడ్డి, అజయ్, గౌస్‌పాషా, రాజా, మొగులయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, రాజు, హాషం, అశోక్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ ప్రైవేటీకరణ వద్దు



సుల్తాన్‌బజార్: తపాలా శాఖను ప్రైవేటీకరించాలన్న యోచనను వెంటనే వెనక్కి తీసుకోవాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం ఏఐపీఈయూ నేత ఆర్‌పి.సారంగ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో సోమవారం నిర్వహించిన మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పోస్టల్ బిల్లులు, ఎన్‌పీఎస్, యూపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకౌంట్ల పేరుతో, టార్గెట్ల పేరుతో పోస్టుమెన్ సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయడాన్ని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం వ్యతిరేకిస్తోందన్నారు. ఆచరణకు సాధ్యం కాని స్కీమ్‌లను ప్రవేశపెట్టి తపాలా సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చేనెల 3వ తేదీన చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రిసెప్షన్ కమిటీ చైర్మన్ ఎం.నాగేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఎం.మధుసూదన్‌రావు, కోశాధికారి ఎ.రమేష్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్ట్‌మెన్, ఎంటీఎస్‌ల నేతలు పాల్గొన్నారు.



దళిత ఫైర్ బ్రాండ్ ఈశ్వరీబాయి

గన్‌ఫౌండ్రీ: సామాన్య కుటుంబంలో పుట్టిన వీరనారి ఈశ్వరీబాయి అని పలువురు వక్తలు కొనియాడారు. రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివంగత ఈశ్వరీబాయి 34వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక శాఖ సారథి వెన్నెల గద్దర్, సంగీత నాటక అకాడమి చైర్మన్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆ రోజుల్లోనే ఈశ్వరీబాయి రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని గుర్తు చేశారు. దళితుల అభ్యున్నతి, మహిళా సంక్షేమం, రాష్ట్ర సాధన కోసం అనేక ఉద్యమాలు చేసిందని కొనియాడారు. సీఎస్‌టీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ లారెన్స్ సైమన్‌కు ఈశ్వరీబాయి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గీతారెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి, దళితసేనా జాతీయ అధ్యక్షుడు జేబీ.రాజు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మనలో చాలా మంది ఫిట్‌గా ఉండాలంటే కిలోమీటర్ల కొద్దీ జాగింగ్ చేయడం, గంటల తరబడి జిమ్‌కి వెళ్లడం.. కసరత్తులు చేయడం, బరువులు ఎత్తడం లేదా ఈత కొట్టడం వంటివి అవసరమని నమ్ముతారు. అయితే ఫిట్‌గా ఉండటానికి కేవలం వ్యాయామాలు మాత్రమే కాదు.. ఫిట్‌నెస్ ఎక్సర్‌సైజులతో పాటు డ్యాన్స్ కూడా అదే స్థాయిలో సహాయపడుతుంది. అయితే డ్యాన్స్‌లలో చాలా రకాలు ఉన్నాయి.. ఏది మంచిది అనుకోకండి.. ఏ డ్యాన్స్ చేసినా ఒక్కటే.. మరైతే ఏదైనా డ్యాన్స్ క్లాసెస్‌లో చేరాలా? అనే సందేహం రావచ్చు.. అబ్బే అదేం అవసరంలేదు.. ఏ డ్యాన్స్ క్లాస్‌లోనూ చేరకుండానే కేవలం ఇంట్లో చేసే నృత్యం ద్వారా కూడా తగినంత ఫిట్‌నెస్ సాధించవచ్చని తాజా అధ్యయనం స్పష్టం చేస్తోంది. - సాక్షి, సిటీబ్యూరో



స్టెప్ టు ఫిట్..


నట్టింట నృత్యం.. ఆరోగ్య భాగ్యం..

రోజంతా అలసిపోయేలా పని చేసిన తర్వాత, షూస్, ట్రాక్స్ వగైరాలు ధరించి జిమ్‌కి వెళ్లడం చాలా మందికి కష్టం అనిపిస్తుంది. దీంతో గత కొంత కాలంగా నగరవాసుల్లో కూడా ఇంట్లోనే డ్యాన్స్ చేసే అలవాటు క్రమంగా పెరుగుతోందని ప్రముఖ డ్యాన్స్, ఎరోబిక్స్ శిక్షకులు బాబీ చెప్పారు. రోజువారీ ఫిట్‌నెస్ లక్ష్యాలను సాధించడానికి చాలామంది సులభమైన ఎంపికగా నడక లేదా జాగింగ్‌కి బదులు.. హోమ్ డ్యాన్స్ ఎంచుకుంటున్నారు. ఇది సరైనదేనని, వంటచేసేటప్పుడు రోజుకు కేవలం 20 నిమిషాల పాటు వంటగదిలో డ్యాన్స్ చేసినా అది ఫిట్‌గా ఉండేందుకు సరిపోతుందని తాజా అధ్యయనం తేల్చింది.

స్టడీ ఏం చెబుతోంది..

బోస్టన్‌లోని నార్త్ ఈస్టర్న్ విశ్వవిద్యాలయంలోని పరిశోధకులు 18 నుంచి 83 సంవత్సరాల మధ్య వయసు గల వారిని ఎంచుకుని పరీక్షించారు. పరిశోధకులు వారు ఎంత ఆక్సిజన్ ఉపయోగిస్తున్నారు? వారి గుండెలు ఎంత వేగంగా కొట్టుకుంటున్నాయి? అనే రీతిలో పలురకాల టెస్టులు నిర్వహించారు. అనంతరం వ్యాయామ తీవ్రతను కూడా పరీక్షించారు. పాల్గొనే వారందరూ సహేతుకమైన ఆరోగ్యలాభాలు అందించే శారీరక శ్రమ స్థాయికి చేరుకున్నారని ఫలితాలు చూపించాయి. ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన డాక్టర్ ఆస్టన్ మెక్‌కల్లొగ్ మాట్లాడుతూ 'తమంత తాము స్వేచ్ఛగా నృత్యం చేయడం ఆరోగ్యాన్ని మెరుగుపరిచే శారీరక శ్రమకు సరిపోతుందా అని పరీక్షిస్తే.. దీనికి అధ్యయనంలో 'అవును' అని సమాధానం వచ్చింది. ఏ తీవ్రతతో నృత్యం చేయాలో చెప్పకుండానే ఆరోగ్యాన్ని మెరుగుపరిచే స్థాయికి అందరూ చేయగలిగారు. వారు తమ సొంత సంగీతాన్ని ఆస్వాదించారు' అని చెప్పారు.





- కిచెన్‌లో డ్యాన్స్ చేస్తూ ఫిట్‌గా ఉండొచ్చు
- జాగింగ్, నడకతో సమానమైన వ్యాయామం
- రోజుకు 20 నుంచి 30 నిమిషాల నృత్యం చాలు
- నార్త్ ఈస్టర్న్ వర్సిటీ తాజా అధ్యయనంలో వెల్లడి
- గత కొంతకాలంగా హోమ్ డ్యాన్స్‌పై సిటిజనుల ఆసక్తి

ఫిట్‌నెస్ రొటీన్‌లో భాగంగా..

నేషనల్ హెల్త్ సర్వీస్ ప్రకారం, ఎక్కువసేపు కూర్చోవడం లేదా పడుకోవడం నివారించాలి. ప్రతి వారం 150 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. దీనిని రోజువారీగా విభజించి ప్రతిరోజూ ఏదో ఒక కార్యాచరణ చేయాలి.. దానిలో హోమ్ డ్యాన్స్‌ను కూడా చేర్చుకోవచ్చు. ఇష్టమైన ట్యూన్‌లను ఎంచుకుని చేసే హోమ్ డ్యాన్స్ ఆహ్లాదకరమైన ప్రభావవంతమైన వ్యాయామం ఇది. ఫిట్‌నెస్ రొటీన్‌లో సరదా వ్యాయామాన్ని చేర్చే అద్భుతమైన మార్గం. అన్ని వయసుల, ఫిట్‌నెస్ స్థాయిల వారికి అందుబాటులో ఉంటుంది. గణనీయమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది అంటున్నారు నిపుణులు.

ఇంటి పనులతో సైతం..

'బాత్‌రూమ్‌ను ఎవరు శుభ్రం చేయాలి? వంటపని ఎవరు చేయాలి? వంటి విషయాలపై తర్జనభర్జనలు పడుతున్న జంటలకు పరిష్కారాలను చూపించే మార్గం అంటున్న ప్రముఖ సల్సా టీచర్ డానియెల్లా గోమ్స్ మాట్లాడుతూ.. 'నృత్యాలతో పాటు ఇంటి పనులను చేయడం కూడా ఆహ్లాదకరమైన, ఆనందకరమైన మంచి అనుభవం' అని చెబుతున్నారు. ఇంట్లో రిలాక్స్‌డ్‌గా కూర్చున్న సమయంతో మొదలుపెట్టి షవర్ బాత్ చేసే సమయం వరకూ.. నచ్చినట్టుగా రిథమిక్‌గా కాళ్లూ, చేతులూ కదుపుతూ ఇంటి నృత్యాన్ని అలవాటుగా మార్చుకోవచ్చని సూచిస్తున్నారు.

ఒత్తిడికి సరైన పరిష్కారం..



"కేవలం ప్రొఫెషన్‌గా తీసుకునేవారికే అనుకోవడం సరైంది కాదు. ఆరోగ్యం, మానసికోల్లాసం కోరుకునే ప్రతి ఒక్కరికీ నృత్యం మంచి ఎంపిక. క్లాసెస్‌కు అటెండ్ అవ్వలేని సందర్భంలో మా విద్యార్థులకు ఇంట్లో కాసేపు నృత్యం చేయమని చెబుతాం. హోమ్ డ్యాన్స్ చేసేటప్పుడు సోఫాలు, టీపాయ్.. వంటివి అడ్డుగా లేకుండా చూసుకోవాలి. డ్యాన్స్ చేయడానికి కనీసం 5/5 అడుగుల స్థలం ఉండేలా చూసుకోవాలి. అలాగే 20 నిమిషాల నృత్యం చేయాలనుకుంటే కనీసం 2 నుంచి 3 నిమిషాల పాటు మెడ, భుజాలు, నడుము.. ప్రాంతాలపై ఒత్తిడి కలిగిస్తూ చేసే తేలికపాటి వార్మప్ వ్యాయామాలు చేయాలి. మ్యూజిక్ బీట్స్‌లో తీవ్రమైన మార్పు చేర్పులు ఉండే పాటలకన్నా ఒక రిథమిక్‌గా సాగే ట్యూన్స్ ఎంచుకోవడం మంచిది. నృత్యం పూర్తయిన తర్వాత 2 నిమిషాల పాటు కూల్ డవున్ స్ట్రెచ్ వ్యాయామాలు చేయగలిగితే బెటర్."

- పృథ్వీ రామస్వామి, ఆర్టిస్టిక్ డైరెక్టర్, స్టెప్స్ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్

ఇదిగో ఇలా..

- బాలీవుడ్, జుంబా లేదా ఫ్రీస్టైల్ కదలికలు అయినా, హార్ట్ బీట్ రేటును పెంచి కేలరీలను బర్న్ చేస్తాయి. ఇవి కార్డియో వ్యాయామానికి సమానం.
- డ్యాన్స్‌లోని విభిన్న కదలికలు కాళ్లు, కోర్, చేతులు.. వీపుతో సహా బహుళ కండరాల సమూహాలను చైతన్యవంతం చేస్తాయి. మజిల్స్ బలోపేతం, టోనింగ్‌కి ఉపకరిస్తుంది. విభిన్న అవయవాల మధ్య సమన్వయం, చురుకుదనాన్ని మెరుగుపరుస్తుంది.
- శారీరక ప్రయోజనాలకు మించి డ్యాన్స్ ఒత్తిడిని తగ్గించి మానసిక స్థితిని గణనీయంగా మెరుగుపరుస్తుంది.
- నచ్చిన పాటలకు మొదలుకుని, జుంబా, హిప్‌హాప్, సల్సా, బ్యాలె వరకూ విభిన్న నృత్య రీతులను ఎంచుకోవచ్చు.
- కదలికలను గైడ్ చేయడానికి ఆన్‌లైన్ డ్యాన్స్ తరగతులు లేదా వీడియో ట్యుటోరియల్స్ వినియోగించవచ్చు.
- ఇష్టమైన సంగీతాన్ని ప్లే చేస్తూ.. జతగా స్నేహితులను లేదా కుటుంబ సభ్యులను కలుపుకోవచ్చు. సాధారణ దశలతో ప్రారంభించి నైపుణ్యంతో పాటు తీవ్రత పెంచాలి.
- నట్టింటి నృత్యం ఎన్నో రకాల ఉత్ప్రేరకంగా ఉంటుంది, ఎందుకంటే ఇందులో నియమాలు ఉండవు. కేవలం కదలికలు తప్ప ఇది భావోద్వేగాలను వ్యక్తపరచడంలో సహాయపడుతుంది. ఫుట్ ఫ్లెక్స్, పాయింట్, పాస్, రోండ్‌డిజాంబే (కాలు చుట్టూ) చైన్స్ (మలుపులు) వంటి కొన్ని సమకాలీన ప్రాథమిక అంశాలతో దీనిని స్టార్ట్ చేయవచ్చు.



దేశంలోని టాప్10 పర్యాటక ప్రదేశాలు

2023-2024 వృద్ధి రేటు



సందర్శకులు (లక్షల్లో)	2022-23	2023-24
తాజ్‌మహల్ (ఆగ్రా)	50.53	60.99
సన్ టెంపుల్ (కోణార్క్)	24.05	31.97
కుతుబ్‌మినార్ (ఢిల్లీ)	17.64	31.24
ఎర్రకోట (ఢిల్లీ)	22.15	27.94
ఎల్లోరా గుహలు (ఔరంగాబాద్)	14.38	17.41
గోల్కొండ ఫోర్ట్ (హైదరాబాద్)	15.27	16.08
ఆగ్రా ఫోర్ట్ (ఆగ్రా)	17.22	16.08
బీబీకా మక్బర్ (ఔరంగాబాద్)	11.83	12.95
చార్మినార్ (హైదరాబాద్)	9.29	12.90
షానివార్ వాడా (పూణే)	10.8	12.61
ఇతరులు	285.81	530.90

షంషేర్.. చార్మినార్..

- పర్యాటకుల సంఖ్య పెరుగుదలలో దేశంలో నెంబర్ వన్
- ఏఎస్ఐ టాప్ 10 జాబితాలో గోల్కొండకూ చోటు

ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) స్మారక చిహ్నాల జాబితా టాప్ 10లో నగరంలోని ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం చార్మినార్ చోటు దక్కించుకుంది. అంతేకాదు అత్యధిక సంఖ్యలో భారతీయ సందర్శకులను ఆకట్టుకుని వార్షిక పెరుగుదలలో దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచింది.

–సాక్షి, సిటీబ్యూరో

అన్నింటికన్నా మిన్నగా..

గత 2023–24 ఆర్థిక సంవత్సరంలో భారత పర్యాటక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన జాబితాలో చార్మినార్ 9వ స్థానంలో నిలిచింది. దేశీయ పర్యాటకుల సంఖ్య 2022–23లో 9.29లక్షలు కాగా, గత ఏడాది 2023–24 కల్లా 12.9లక్షలకు పెరిగింది. సందర్శకుల సంఖ్యలో పెరుగుదల 38 శాతానికి పైగా ఉండడంతో అన్ని ఏఎస్ఐ స్మారక చిహ్నాల్లో కలిపి 10.8 శాతంగా ఉన్న మొత్తం కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది. గత 2022–23 ఆర్థిక సంవత్సరంలో అన్ని ఏఎస్ఐ స్మారక చిహ్నాల్లో మొత్తం దేశీయ పర్యాటకుల సంఖ్య 479.01 లక్షలు కాగా ఇది 2023–24లో 530.9 లక్షలకు పెరిగింది.

గోల్కొండ కోటకూ..

చార్మినార్‌తో పాటు, నగరంలోని గోల్కొండ కోట కూడా అత్యధిక భారతీయ సందర్శకులను సాధించిన స్మారక చిహ్నాల జాబితాలో చోటు సంపాదించింది. ఈ చారిత్రక స్మారక చిహ్నాన్ని 2022–23లో 15.27 లక్షల మంది సందర్శించగా, 2023–24లో 5 శాతానికి పైగా పెరిగి 16.08 లక్షల మంది సందర్శించారు. ఇక అత్యధిక భారతీయ సందర్శకులను ఆకట్టుకున్న టాప్ 10 స్మారక చిహ్నాల జాబితాలో తాజ్ మహల్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ ఏడాది 20 శాతానికి పైగా సందర్శకుల సంఖ్యను పెంచుకుంది. అయితే ఇది చార్మినార్ పెరుగుదలతో పోలిస్తే తక్కువ కావడం గమనార్హం.

విద్యార్థులకు హ్యుందాయ్ స్కాలర్‌షిప్స్

సాక్షి, సిటీబ్యూరో: హ్యుందాయ్ మోటార్ ఇండియా ఫౌండేషన్, హ్యుందాయ్ హోప్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ కింద రూ.3.38 కోట్ల విలువైన స్కాలర్‌షిప్స్ పంపిణీ చేసింది. ఈ విషయాన్ని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. గత ఆగస్టులో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా నగరంతో పాటు దేశవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను సమీక్షించి వెనుకబడిన సామాజిక–ఆర్థిక నేపథ్యాలకు చెందిన ప్రతిభావంతులైన 783 మంది విద్యార్థులను ఎంపిక చేసి స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామని వెల్లడించింది. వీరిలో సివిల్ సర్వీసెస్ పరీక్షలు, కామన్ లా అడ్మిషన్ టెస్టుల కోసం సిద్ధమవుతున్న 440 మంది అభ్యర్థులతో పాటు 343 మంది వివిధ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌లకు చెందిన విద్యార్థులు ఉన్నారని వివరించింది.

గ్లోబల్ జెమ్స్ అండ్ జ్యువెలరీ స్నాతకోత్సవం





జెమాలజీ ప్రోగ్రామ్, జ్యువెలరీ డిజైన్ టెక్నాలజీలో గ్రాడ్యుయేట్లకు సర్టిఫికెట్ల ప్రదానం

సాక్షి, సిటీ బ్యూరో : నగర వేదికగా వజ్రాలు–ఆభరణాలు (జెమ్స్ అండ్ జ్యువెలరీ) ప్రోగ్రామ్, జెమాలజీ ప్రోగ్రామ్, జ్యువెలరీ డిజైన్ టెక్నాలజీలో గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌తో వినూత్న కోర్సులను అందిస్తున్న గ్లోబల్ జెమ్స్ అండ్ జ్యువెలరీ అకాడమీ ఆధ్వర్యంలో మొదటి వార్షిక స్నాతకోత్సవ వేడుక ఘనంగా జరిగింది. బంజారాహిల్స్ లోని జీజీజేఏ క్యాంపస్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వజ్రాలు–ఆభరణాల ప్రోగ్రామ్, జెమాలజీ ప్రోగ్రామ్, జ్యువెలరీ డిజైన్ టెక్నాలజీలో గ్రాడ్యుయేట్లు సర్టిఫికెట్లను అందుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రైసన్ జ్యువెల్స్ అండ్ క్రిష్ డైమండ్స్ సీఈఓ అనూప్ అగర్వాల్, డైరెక్టర్ జవిన్ కుమార్ అగర్వాల్ హాజరై గ్రాడ్యుయేట్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జీజీజేఏ సీఈఓ, డైరెక్టర్ సోనాల్ అగర్వాల్ మాట్లాడుతూ.. వజ్రాభరణాల డిజైనింగ్ రంగంలో అత్యుత్తమ అంకితభావం, శ్రేష్ఠతను ప్రదర్శించిన తమ విద్యార్థుల గురించి గర్విస్తున్నామని అన్నారు. ఈ కాన్వొకేషన్ ద్వారా విజయాలను, వజ్రాభరణాల పరిశ్రమకు విశేషమైన కృషిని కొనసాగిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

సాలిటైర్ గ్లోబల్ మీట్..

స్కూల్ పూర్వ విద్యార్థుల సమావేశంలో విద్యార్థుల సందడి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అత్తాపూర్ సాలిటైర్ గ్లోబల్ స్కూల్ వేదికగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశం – 2025లో పూర్వవిద్యార్థులు ఓపెన్ మైక్, డ్యాన్స్ బీట్స్ తదితర కార్యక్రమాలతో సందడి చేశారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. 100 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఆఫ్ బీట్ గేమ్స్, డ్యాన్స్, మ్యూజిక్ ఈవెంట్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, ఇతర తోటి విద్యార్థులతో.. వివిధ పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో, భవిష్యత్తు ప్రణాళికలు వంటి అంశాలపై తమ అనుభవాలను పంచుకున్నారు.







మాటతో మాయచేసి..

గత కొంత కాలంగా చిన్నారుల్లో ఫోన్ వాడే అలవాటు విపరీతంగా పెరిగిపోతోంది. ఆ అలవాటును మాన్పించేందుకు తనదైన శైలిలో ప్రయత్నాలు చేపట్టాడు నగరానికి చెందిన ప్రముఖ వెంట్రిలాక్విజం కళాకారుడు సంతోష్ కుమార్. వివిధ రకాల జంతువుల బొమ్మలతో పప్పెట్ షోలు నిర్వహిస్తూ చిన్నారుల్లోని ఫోన్, టీవీ చూసే అలవాటును మాన్పిస్తున్నారు. అలాంటి అలవాట్లతో వచ్చే అనర్థాలను తెలియజేస్తూ వారిని ఎడ్యుకేట్ చేస్తున్నారు. దీంతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపైనా అవగాహన కల్పిస్తున్నాడు. - సుల్తాన్‌బజార్

- పప్పెట్ షోలతో ఫోను అలవాటు మాన్పించేందుకు కృషి
- వెంట్రిలాక్విజంతో చిన్నారులను ఆకట్టుకుంటున్న సంతోష్‌కుమార్
- తరగతులను చేపడుతున్న పలు కార్పొరేట్ పాఠశాలలు

చిన్నారుల్లోని మానసిక స్థితిని మార్చేందుకు తన వంతు కృషి చేస్తున్నాడు వెంట్రిలాక్విజం కళాకారుడు సంతోష్ కుమార్. తద్వారా నగరంలోని ఎందరో తల్లిదండ్రుల మన్ననలను పొందుతున్నాడు. నగరంలోని పేరొందిన కార్పొరేట్ పాఠశాలలతో పాటు అమెరికా, జర్మనీ, జపాన్, లండన్, శ్రీలంక లాంటి దేశాల్లో తనదైన శైలీలో ప్రదర్శనలు ఇస్తూ జాతీయస్థాయిలో అవార్డులను అందుకుంటున్నారు.

చిన్నారుల్లో మార్పుకు దోహదం..

కార్టూన్ షోలకు ఎడిక్ట్ అయిన చిన్నారులను వాటి ద్వారా రుగ్మతలను దూరం చేసేందుకు తనదైన శైలిలో కృషి చేస్తున్నాడు. పిల్లల భవిష్యత్తు కోసం లక్షల రూపాయలు వెచ్చిస్తున్న తల్లిదండ్రులు టీవీ, మొబైల్ ఎడిక్షన్ నుంచి వారిని మాన్పించే విషయంలో విఫలమవుతున్నారు. ఈ క్రమంలో తన వెంట్రిలాక్విజం కళతో పలు పాఠశాలల ఆహ్వానం మేరకు 30 నిమిషాల పప్పెట్ షో నిర్వహిస్తున్నాడు. తద్వారా వివిధ జంతువులు, తోలు బొమ్మల ద్వారా వెంట్రిలాక్విజం చేస్తూ చిన్నారుల్లోని అలవాట్లను దూరం చేసే ప్రయత్నం చేస్తున్నాడు. విద్యాబోధన ద్వారానే కాకుండా ఇలాంటి షోల ద్వారా చిన్నారుల్లో ఎంతో మార్పు వస్తుందని పలు పాఠశాలల యాజమాన్యాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.



జాతీయస్థాయి అవార్డు..

దేశ విదేశాల్లో వెయ్యికి పైగా షోల ద్వారా చిన్నారుల మానసిక పరివర్తనలో మార్పుతెచ్చేందుకు కృషిచేసిన సంతోష్‌కు ఎర్లీ చైల్డ్‌హుడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అనే సంస్థ ఈ నెల 15న ముంబయిలో జాతీయ అవార్డును ప్రదానం చేసింది. ఇదే ప్రోత్సాహంతో చిన్నారుల మానసిక స్థితిని మార్చేందుకు ప్రభుత్వ పాఠశాలల్లోనూ పప్పెట్ షోలు నిర్వహిస్తానని, అయితే దానికి ప్రభుత్వ సహకారం కావాలని సంతోష్ కోరుతున్నాడు.

క్లుప్తంగా...

మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి

- మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా



సాక్షి, హైదరాబాద్: చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును వెంటనే అమలు చేయాలని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఈ విషయంలో చిత్తశుద్ధి లేదని, మహిళల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం గాంధీభవన్‌లో జరిగిన 'నారీ న్యాయ్ సమ్మేళన్'కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె అంతకుముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. ఇందుకు తగినట్టుగా దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మహిళల కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. మహిళల కోసం త్వరలోనే మరో పథకాన్ని కూడా తీసుకురాబోతున్నామని వెల్లడించారు. ఇటు పార్టీలో, అటు ప్రభుత్వంలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఉండేలా సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌లతో మాట్లాడతానని ఆమె చెప్పారు. కాగా, నారీ న్యాయ్ సమ్మేళన్‌లో ఆమె మాట్లాడుతూ, మహిళా కాంగ్రెస్ సభ్యత్వాలు దేశంలోనే తెలంగాణలో అత్యధికంగా నమోదయ్యాయని ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఐదులక్షల సభ్యత్వాలు నమోదైతే, ఒక్క తెలంగాణలోనే లక్షకుపైగా సభ్యత్వాలు నమోదయ్యాయని, ఇందుకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, ఇతర నాయకులకు అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. సభ్యత్వంలో చురుగ్గా పాలుపంచుకున్న నేతలను సన్మానించారు.

ఇల్లు కడతా.. నువ్వు చస్తే నీకు గోరి కడతా

- ఎంపీ నగేశ్‌పై మాజీ ఎంపీ సోయం తీవ్ర వ్యాఖ్యలు



తలమడుగు: 'సొంత ఇల్లు లేనప్పుడు కట్టు కోవడం తప్పుకాదు. బరాబర్ ఇల్లు కట్టుకుంటా.. నువ్వు చస్తే నీకు కూడా గోరి కట్టిస్తా' అంటూ ఎంపీ నగేశ్‌పై మాజీ ఎంపీ సోయం బాపూ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సాయిలింగి, కుచులాపూర్ గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోయం మాట్లాడారు. కేంద్రంలో పదేళ్లుగా బీజేపీ, రాష్ట్రంలో పదేళ్లుగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఎంపీ నగేశ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తాను ఎంపీ నిధులతో ఇల్లు కట్టానని ఆరోపించడం సరికాదని, ప్రభుత్వ నిధులకు రికార్డులుంటాయని ఆయనకు తెలియదా? అని ప్రశ్నించారు.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రత్యేక నిధులు ఇవ్వండి

- 'బడ్జెట్'పై డిప్యూటీ సీఎంతో కోదండరెడ్డి భేటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కూరగాయలు, పండ్లు, పూలతోటల సాగు కు తగిన ప్రాధాన్యం ఇచ్చి, ప్రత్యేక నిధులు కేటాయించాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి రాబోయే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చే విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి భట్టికి ఓ లేఖ అందజేశారు. రాష్ట్రంలో రైతు కమిషన్ క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులు, కౌలు రైతులను కలిసి అభిప్రాయాలు సేకరించిందని, ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగాలన్నా, దిగుబడి రావాలన్నా రైతులకు సబ్సిడీ పథకాలు అవసరమని గుర్తించిందని లేఖలో పేర్కొన్నారు. ఇందుకోసం భూగర్భ జలాలపై ఆధారపడిన రైతులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం రైతులు ప్రకృతి వ్యవసాయంవైపు మొగ్గు చూపుతున్నారని, ఈ దిశగా ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కోదండరెడ్డి కోరారు. రాష్ట్రంలో చిన్న కమతాలు ఎక్కువగా ఉండడం వల్ల వారికీ మరింత మేలు జరుగుతుందన్నారు. రైతు కమిషన్ లేఖపై భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్లు రైతు కమిషన్ తెలిపింది.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మా మద్దతు'

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగుల సంఘం తరపున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు స్థితప్రజ్ఞ, కల్వల శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి మద్దతు పత్రాన్ని అందించారు. ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎస్ ఉద్యోగులంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో సీపీఎస్ ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ మంత్రికి వినతిపత్రాన్ని అందించారు.

మార్కెట్లకు పోటెత్తిన మిర్చి

ఖమ్మం మార్కెట్‌కు 1.20 లక్షల బస్తాలు

వ్యవసాయ మార్కెట్లకు మిర్చి పోటెత్తుతోంది. రెండు రోజుల సెలవు అనంతరం సోమవారం ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాలతో పాటు మహబూబాబాద్, ఏపీలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలే కాక మహబూబ్‌నగర్, కరీంనగర్ తదితర జిల్లాల నుంచి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు మిర్చి తీసుకొచ్చారు. 1.20 లక్షల బస్తాల మేర మిర్చి రావడంతో మార్కెట్‌లోని యార్డులు, షెడ్లన్నీ బస్తాలతో నిండిపోయాయి. ఆదివారం రాత్రి నుంచే వాహనాల్లో రైతులు మిర్చి బస్తాలు తీసుకొస్తుండగా మిర్చి యార్డు నిండిపోవడంతో పత్తి యార్డును కూడా మిర్చి క్రయవిక్రయాలకు కేటాయించారు. కాగా, సోమవారం ఖమ్మం మార్కెట్‌లో మిర్చి క్వింటాకు జెండాపాట ధర రూ.14,125 పలకగా, మోడల్ ధర రూ.13,600గా, కనిష్ట ధర రూ.6వేలుగా నమోదైంది. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు కూడా సోమవారం సుమారు 90 వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయి.

-ఖమ్మం వ్యవసాయం/వరంగల్



మిర్చి బస్తాలతో నిండిపోయిన ఖమ్మం మార్కెట్‌లోని యార్డులు, షెడ్లు

ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం

పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశంలో వైఎస్ జగన్ పునరుద్ఘాటన

"శాసన సభలో ఉన్న ఏకైక ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్‌సీపీనే. మరో విపక్ష పార్టీ అంటూ లేదు. మిగతావన్నీ అధికారంలో కొనసాగుతున్న పార్టీలే. మరి ప్రతిపక్ష హోదా ఎవరికి ఇస్తారు? సహజంగానే వైఎస్సార్‌సీపీకే ఇవ్వాలి కదా! హోదా ఇవ్వకపోతే ఎందుకు నడుపుతున్నారు? అవతలి వారు చెప్పేది మనం వినకూడదనుకుంటే ఇక అసెంబ్లీ ఎందుకు? ప్రతిపక్షం చెప్పేది ఆలకించాలి. తద్వారా లోపాలను సరిదిద్ది ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. ఎంతసేపూ పరనింద.. ఆత్మస్తుతేనా? అలాంటప్పుడు ఇక ప్రజాస్వామ్యానికి అర్థం లేదు.."

\- వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటాన్ని కొనసాగిస్తామని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. కూటమి ప్రభుత్వంపై క్షేత్ర స్థాయిలో తీవ్ర వ్యతిరేకత నెలకొందని... టీడీపీ ఇస్తామన్న పథకాలన్నీ మోసాలుగా మిగిలిపోయాయని ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. 'మనం యుద్ధరంగంలో ఉన్నాం.. విజయం దిశగా అడుగులు వేయాలి.. ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం చేయాలి.. నిజాయితీగా, చిత్తశుద్ధితో ప్రజల తరపున పోరాటం చేయాలి.. ప్రజలకు తోడుగా ఉంటూ వారితో మమేకమైతే గెలుపు సాధించినట్లే. ప్రజా సమస్యలపై పోరాటంలో వెనుకడుగు వేయవద్దు. మనం వేసే ప్రతి అడుగూ పార్టీ ప్రతిష్టను పెంచేదిలా ఉండాలి. ఎక్కడా రాజీ పడకూడదు' అని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

అందుకే ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదు..

అసెంబ్లీలో మనం మినహా వేరే ప్రతిపక్షం లేదు. ప్రతిపక్ష హోదా ఇస్తే.. హక్కుగా మనకు సమయం ఇవ్వాల్సి వస్తుంది. సభా నాయకుడితో దాదాపు సమానస్థాయిలో సమయం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ భయంతోనే ప్రతిపక్ష హోదాను ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఆ విధంగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. ప్రతిపక్ష హోదా విషయంలో అధికార పార్టీ వైఖరిని ప్రజలకు తేటతెల్లం చేసేందుకే ఇవాళ అసెంబ్లీకి వెళ్లాం. శాసన సభలో మనం ఒక్కరమే ప్రతిపక్షం. అందుకే విపక్ష హోదా అడుగుతున్నాం. సభలో ప్రతిపక్షం స్వరాన్ని వినాలి. తప్పులుంటే సరిదిద్దుకోవాలి. నేను ఏ అంశంపై మాట్లాడినా నిందలకు, దూషణలకు దూరం. ప్రతి అంశాన్నీ ఆధారాలు, రుజువులతో మాట్లాడతా. నా ప్రసంగాల్లో కూడా చాలా సార్లు సభలో చంద్రబాబునాయుడు ఉంటే బాగుండేదని చెప్పా. అయితే ప్రభుత్వ స్వరం మినహా వేరే స్వరం వినపడకూడదన్నట్లు అసెంబ్లీని తయారు చేశారు.

ప్రజలకు అన్నీ తెలుసు..

పేదల ఇళ్ల కాలనీల పేర్లుకూడా మారుస్తున్నారని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశంలో ప్రస్తావించగా.. ''ఎవరు ఇళ్ల స్థలాలిచ్చారో, ఎవరు కాలనీలు ఏర్పాటు చేశారో ప్రజలకు తెలుసు. విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనాన్ని మనమే నిర్మించాం. కానీ పేరు తీసేయాలన్న దురుద్దేశంతో ఏకంగా అంబేడ్కర్ విగ్రహం మీదే దాడికి దిగారు. ఈ ప్రభుత్వం ఆదేశాలతోనే అదంతా జరిగింది. అధికారులే స్వయంగా దీనికి ఒడిగట్టారు. మరి స్మృతివనం ఎవరు కట్టారో ప్రజలకు తెలియదా? ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా ప్రజలకు నేరుగా రూ.2.73 లక్షల కోట్లు అందించి మనం మంచి చేశాం. ఇవాళ మనమిచ్చిన పథకాలన్నీ రద్దు చేశారు. నోటి దాకా వచ్చిన కూడును తీసేశారు. టీడీపీ వాళ్లు ఇస్తామన్న పథకాలన్నీ మోసాలుగా మిగిలాయి'' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

మరిన్ని వివరాలు, వార్తలకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి

▶ మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారని, తాము ఎక్కడ కుమ్మక్కు అయ్యామో నిరూపించాలన్నారు. ఈ కేసును రేవంత్ వదిలిపెట్టినా.. బీజేపీ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. సోమవారం రాత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని బీజేపీగా హైకోర్టులో కేసు వేయడమే కాకుండా, ఈ కేసును సీబీఐకు అప్పగించాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశామన్నారు. అయితే బీఆర్ఎస్‌తో రేవంత్ కుమ్మక్కై ఈ కేసును నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

రేవంత్ మాటల్లో ఓటమి భయం కనిపిస్తోంది

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మూడుచోట్లా గెలిచే అవకాశాలుండగా, కాంగ్రెస్ పార్టీ పోటీచేసిన ఆ ఒక్కసీటులోనూ ఓటమి భయంతో ఒత్తిడికి గురై సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి వచ్చారన్నారు. 'రేవంత్ ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టు మాట్లాడుతున్నారు. ఆయన మాట ల్లో ఓటమి భయం కనిపిస్తోంది.పోలింగ్‌కు ముందే సీఎం ఓటమిని ఒప్పుకున్నారు. రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల, నిరుద్యోగులకు ఏం చేశారో రేవంత్‌రెడ్డి చెప్పాలి'అని నిలదీశారు.

బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అనుకూలమే

బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అనుకూలమని, ఎక్కడా తాము ఈ రిజర్వేషన్లను వ్యతిరేకించలేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ముస్లింలను బీసీల్లో చేర్చడం బరాబర్ తప్పే. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీ కోటాలో అధికమంది కార్పొరేటర్లుగా ముస్లింలు వచ్చే అవకాశం ఉంది. దీంతో బీసీలకు అన్యాయం జరుగుతుంది. నాకు నైతిక విలువలున్నాయి. రేవంత్ మాదిరిగా పార్టీలు మారలేదు. గంటకో మాట మాట్లాడలేదు. దయ్యం అని పిలిచిన సోనియాను దేవత అని పొగడలేదు'అని ఓ ప్రశ్నకు కిషన్‌రెడ్డి సమాధానమిచ్చారు.

కాంగ్రెస్ మూల్యం చెల్లించక తప్పదు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి హెచ్చరించారు. డీఏలు, జీపీఎఫ్, పెండింగ్ బకాయిలు చెల్లించకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను రోడ్డున పడేస్తారా అని నిలదీశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం కిషన్‌రెడ్డి బహిరంగలేఖ రాశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టెక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులను మళ్లీ మోసగించేందుకు సిద్ధమవ్వడం సిగ్గుచేటని కిషన్‌రెడ్డి విమర్శించారు.

నాకు కేంద్ర మంత్రి పదవి రాకుండా చేశారు

- కాంగ్రెస్‌లోని రెడ్డివర్గం నేతలపై అంజన్‌కుమార్ యాదవ్ ధ్వజం
- వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి లాలూ ప్రసాద్ యాదవ్ ఇప్పించారని వెల్లడి
- తెలంగాణను అడ్డుకున్నారని ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: 'పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పిండు.. అందుకే రాష్ట్రంలో కులగణన జరిగింది. లేకుంటే ఎప్పుడు కానిచ్చేవాళ్లు'అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్.. కాంగ్రెస్ పార్టీలోని రెడ్డి సామాజికవర్గం నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అప్పట్లో తెలంగాణను కూడా అడ్డుకున్నారని ఆరోపిస్తూ, తనకు కేంద్ర మంత్రి పదవి రాకుండా చేశారని, వీళ్ల వల్లనే తన రాజకీయ భవిష్యత్తుకు నష్టం జరిగిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆదర్శనగర్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన యాదవ సామాజికవర్గ నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కులగణన చేపట్టి బీసీ కులాల లెక్కలు తేల్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో తనకు ఎదురైన కొన్ని సందర్భాలను ప్రస్తావిస్తూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పుడు నిర్ణయం తీసుకుందని, నిజానికి ఈ సీటును యాదవులకు కేటాయిస్తే తప్పకుండా గెలిచేదని అన్నారు. కాగా, తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని ఈ భజనగాళ్లు ఇవ్వలేదని.. సోనియా గాంధీతో మాట్లాడి లాలూ ప్రసాద్ యాదవ్ తనను వర్కింగ్ ప్రెసిడెంట్‌ను చేశారని అంజన్‌కుమార్ వెల్లడించారు. అప్పుడు కూడా తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వకూడదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జగ్గారెడ్డి అడ్డు పడ్డారని ఆరోపించారు.

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు.. బీజేపీని బొంద పెట్టాలి





కరీంనగర్ సభలో వేదికపై సీఎం రేవంత్, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, సభకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు

▶ మొదటి పేజీ తరువాయి

నిధులు వస్తాయి. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదు. కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించడంటున్న పట్టభద్రులైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత తాము ఎవరికి ఓటేస్తారో పట్టభద్రులకు సమాధానం చెప్పాలి..' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. సోమవారం నిజామాబాద్, కరీంనగర్, మంచిర్యాల నస్పూర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం, సంకల్ప సభల్లో ఆయన మాట్లాడారు.

కేటీఆర్ బీజేపీ నేతల కాళ్లు పట్టుకుంటున్నారు..

'బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో నిధుల కోసం ఢిల్లీ వెళ్లకుండా.. కేటీఆర్ ఇప్పుడు ఢిల్లీ వెళ్లి చీకట్లో బీజేపీ నేతల కాళ్లు పట్టుకుంటున్నారు. నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లాలంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న మాతో కలిసి రావాలి. కానీ చీకటి బేరాలు కుదుర్చుకునేందుకు ఢిల్లీ వెళుతున్నారు. బీఆర్ఎస్ బీజేపీలు చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాయి. అందుకే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని పెట్టలేదు. బండి సంజయ్ ద్వారా బేరాలు కుదుర్చుకున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్‌కు అభ్యర్థి లేకున్నా ఓడించాలంటున్నారంటే, దాని వెనుక మతలబు ఏంటో చెప్పాలి. బీజేపీతో చీకటి ఒప్పందంలో భాగంగా.. అరెస్టుల నుంచి తప్పించుకోవడానికే బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుందని ప్రజలు గమనించాలి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులను అమెరికాలో దాచిపెట్టారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ వారిని ఎప్పుడు అరెస్టు చేస్తారో చెప్పాలి. ఫార్ములా ఈ- రేస్, గొర్రెల స్కామ్ కాగితాలను ఈడీ పట్టుకుపోయింది. కేటీఆర్, హరీశ్‌రావు ఢిల్లీ వెళ్లి కాళ్లు పట్టుకోగానే బండి సంజయ్ కేసులు నీరు గారుస్తున్నారు..' అని సీఎం మండిపడ్డారు.

కులగణన సర్వే మోదీ ఎందుకు చేయలేదు?

'కులగణనపై బీజేపీ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ భావోద్వేగాలు రెచ్చగొట్టేలా వీధినాటకాలు ఆడుతున్నారు. అజ్ఞానంతో మాట్లాడుతున్నాడు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిం ఉపకులాలకు రిజర్వేషన్లు అమలవుతున్న మాట వాస్తవం కాదా? బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వడం ఇష్టం లేని బీజేపీవి చావు తెలివితేటలు. మతం పేరుతో ప్రతిసారీ విద్వేషాలు రెచ్చగొడితే ఎవరూ నమ్మరు. కులగణన సర్వేను మోదీ ప్రభుత్వం ఎందుకు చేయలేదు? చేయకపోగా ఇప్పుడు వండిన అన్నంలో ఉప్పు వేసేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోంది. బలహీనవర్గాలకు అన్యాయం చేయాలని చూస్తోంది. మేము వందేళ్ల సమస్యను పరిష్కరించాం. మంద కృష్ణ మాదిగను కౌగిలించుకున్న మోదీ సమస్య పరిష్కరించలేదు. మా ప్రభుత్వమే ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేసింది. 100 ఏళ్ల కింద తెల్లోళ్లు చేసిన తరువాత నేను కులగణన చేసి లెక్క తేల్చిన ఘనత నాది. నా లెక్కలు తప్పయితే మేమంతా ముక్కు భూమికి రాస్తాం. బీజేపీకి దమ్ముంటే..జనగణనలో కులగణనలో చేయాలి..' అని రేవంత్ సవాల్ విసిరారు.

తెలంగాణకు శకునిలా కిషన్‌రెడ్డి

'కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు శకునిలా మారాడు. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు ఇతర ప్రాజెక్టులకు నిధులు రాకుండా అడ్డుకుంటున్నాడు. కాశీలో గంగ, ఢిల్లీలో యమున, గుజరాత్‌లో సబర్మతి నదులను ప్రక్షాళన చేస్తున్న బీజేపీ హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు మాత్రం అడ్డుపడుతోంది..' అని సీఎం విమర్శించారు.

మేము చేసిన మంచిని చూసి ఓటేయండి

'పదేళ్ల కేసీఆర్, 12 ఏళ్ల మోదీ చేయలేని పనిని మేం చేశాం. ఏడాదిలో 56 వేల కొలువులు ఇచ్చాం. రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. టీచర్లకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాం. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలతో బాధలు దూరం చేశాం. యువతలో నైపుణ్యం పెంచాలన్న సంకల్పంతో ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసి వేలాది మందికి శిక్షణ ఇస్తున్నాం. స్కిల్స్ వర్సిటీ ప్రారంభించాం. వరికి రూ.500 బోనస్, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఉచిత సిలిండర్ ఇస్తున్నాం. మేము చెప్పేవి అబద్ధాలైతే మాకు ఓటేయొద్దు. భావోద్వేగాలకు, అబద్ధాలకు ఆవేశపడి నిర్ణయం తీసుకోవద్దు. మేము చేసిన మంచిని చూసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మా అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించండి..' అని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాల్లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, గడ్డం వివేక్, వెడ్మ బొజ్జు, శ్రీగణేశ్, గండ్ర సత్యనారాయణరావు, అభ్యర్థి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందే

- ఏపీ అసెంబ్లీ బయట మీడియాతో వైఎస్సార్‌సీపీ నేతలు బొత్స, పెద్దిరెడ్డి
- ప్రభుత్వ వైఖరికి నిరసనగా గవర్నర్ ప్రసంగిస్తుండగా సభ నుంచి వాకౌట్



సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా.. చట్టసభలో ప్రజల గళాన్ని వినిపించనివ్వకుండా చేయాలనే కుట్రతో కూటమి సర్కారు వ్యవహరిస్తోందని విపక్ష పార్టీ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించి సభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు బొత్స, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే టి.చంద్రశేఖర్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి బయట మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష హోదా ఇస్తే తమ పాలనా వైఫల్యాలను చట్టసభ సాక్షిగా నిలదీస్తారనే భయంతోనే కూటమి సర్కారు ఇలాంటి దుర్మార్గ పోకడలను అనుసరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రజా గొంతుక వినిపించడానికి వీల్లేకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని అంతకుముందు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు శాసనసభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో ఉన్న ఏకైక విపక్షం వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా కల్పించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి పాతరేసిన చంద్రబాబు ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం కొనసాగుతున్న సమయంలో సభ నుంచి వైఎస్సార్‌సీపీ వాకౌట్ చేసింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉభయ సభల సంయుక్త సమావేశానికి హాజరయ్యారు. ఆయన వెంట శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఉన్నారు.

'కన్జర్వేషన్ రిజర్వ్'కు ఎస్‌బీడబ్ల్యూఎల్ ఓకే

సాక్షి, హైదరాబాద్: కవ్వాల్ టైగర్ రిజర్వ్, మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వ్‌లను కలిపే టైగర్ కారిడార్‌ను 'కన్జర్వేషన్ రిజర్వ్'గా ప్రకటించాలని రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు (ఎస్‌బీడబ్ల్యూఎల్) నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి ఆమోదం పొందాలని తీర్మానించింది. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అటవీ డివిజన్ల పరిధిలోని 9 అటవీ రేంజ్‌లలోని 1,400 కిలోమీటర్ల పరిధిలో దీనిని ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం. ఈ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటిస్తే.. రక్షిత అటవీప్రాంతంగా గుర్తింపుతోపాటు కేంద్ర నిధులను కూడా ఉపయోగించుకునే అవకాశముంటుంది.

ములుగులో 11 కేవీ, సాగర్‌లో పెద్దగట్టు ఎత్తిపోతలకు అనుమతి

ములుగులో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, నాగార్జునసాగర్ డివిజన్‌లో పెద్దగట్టు ఎత్తిపోతల పథకానికి అనుమతి, పోచారం వన్యప్రాణుల అభయారణ్యం మీదుగా వెళ్లే మెదక్-ఎల్లారెడ్డి రహదారి విస్తరణకు ఎస్‌బీడబ్ల్యూఎల్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సోమవారం సచివాలయంలో అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ విషయంలో ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల్లో యానిమల్ పాసేజ్‌ల మార్పుల కోసం 18 ప్రతిపాదనలు, మొబైల్ టవర్ల ఏర్పాటుకు 13 ప్రతిపాదనలపై సమీక్ష సందర్భంగా జాతీయ వన్యప్రాణుల సంరక్షణ మండలి (ఎన్‌బీడబ్ల్యూఎల్)కి పంపే ముందు అవసరమైన సవరణలపై చర్చించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, రాందాస్‌నాయక్, అటవీశాఖ ముఖ్యకార్యదర్శి నదీమ్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్, వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ ఏలూసింగ్ మేరు ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్థాయికి విస్తరించేలా వీహెచ్‌పీ ప్రణాళిక

- ముగిసిన విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: ధర్మరక్షణకు విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ)ను గ్రామస్థాయికి విస్తరింపజేయాలని ఆ సంస్థ పెద్దలు నిర్ణయించారు. అన్నోజిగూడలోని రాష్ట్రీయ విద్యాకేంద్రంలో మూడురోజులుగా జరుగుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు సోమవారంతో ముగిశాయి. వీహెచ్‌పీ అఖిల భారత సంఘటన సహ కార్యదర్శి వినాయకరావు దేశ్‌పాండే, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, దక్షిణ భారత సంఘటన కార్యదర్శి స్థాను మలయన్, భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మళ్ల సత్యం, భాగ్యనగర్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవి కుమార్ మార్గదర్శనం చేశారు. వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి అధ్యక్షతన కొనసాగిన సమావేశాలను రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ నిర్వహించారు. గ్రామస్థాయిలో విశ్వహిందూ పరిషత్ బలం పెరిగితే మతమార్పిడి ఆగిపోతుందని చెప్పారు. హిందూ సమాజాన్ని జాగృతం చేసి, కుటుంబ విలువలను పరిరక్షించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి హిందూ కుటుంబంలో జనాభా పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జనాభా తగ్గితే ఎదురయ్యే సమస్యలు, ప్రమాదాలను వివరించారు. ప్రతివ్యక్తి తనలో భారతీయత, స్వదేశీ భావజాలం కలిగి ఉండాలన్నారు. సంస్థాగతమైన వ్యవహారాలపై చర్చించారు. సమావేశంలో వీహెచ్‌పీ నాయకులు బండారి రమేష్, పండరీనాథ్, సునీతరెడ్డి, రామ్‌సింగ్, భాస్కర్‌రావు, సహకార్యదర్శి తోట భానుప్రసాద్, వెంకటేశ్వరరాజు, రమేష్, పగుడాకుల బాలస్వామి పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు పునరావృతం: మాజీమంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: యూరియా కోసం రైతులు మండుటెండల్లో తంటాలు పడుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్రలో ఉండటం దుర్మార్గమని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఇటీవల మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీకి పోలీసులు టోకెన్లు జారీ చేయగా, తాజాగా సోమవారం జగిత్యాలలో రైతులు పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు పెట్టి వరుసలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులు ఎదుర్కొన్న కన్నీళ్లు, కడగండ్లను రాష్ట్ర ప్రభుత్వం పునరావృతం చేస్తోందని 'ఎక్స్'లో మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో రైతే రాజుగా మారాడని, కానీ ప్రస్తుతం వారిని నట్టేట ముంచి నడిరోడ్డు మీదకు తెచ్చిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతు డిక్లరేషన్, రుణమాఫీ, రైతుభరోసా, పంటల బోనస్ పేరుతో రేవంత్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతాంగానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

యూరియా కోసం..



కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లో వరుసగా పెట్టిన చెప్పులు

జగిత్యాల అగ్రికల్చర్/తిమ్మాపూర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యూరియా కొరత రోజురోజుకూ తీవ్రమవుతోంది. జగిత్యాల జిల్లాకేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయానికి యూరియా బస్తాలు రాగా.. కార్యాలయం ఎదుట ఉదయం నుంచే రైతులు క్యూ కట్టారు. క్యూలైన్లలో నిలబడలేక ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్స్‌లు పెట్టారు. ఈ-పాస్ యంత్రంలో గుర్తింపు కోసం వేలిముద్ర పెట్టాల్సి ఉండటంతో గంటల కొద్దీ జాప్యం జరుగుతోందని రైతులు పేర్కొంటున్నారు. రెండ్రోజులుగా యూరియా కోసం తిరుగుతుంటే.. రాత్రి యూరియా వచ్చిందని తెలుసుకుని రాగా.. గంటల తరబడి క్యూలైన్లలో నిలబెట్టి రైతుకు ఒకటి, రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారని వాపోతున్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ ప్రాథమిక వ్యవసాయ సంఘానికి ఉదయమే వచ్చిన రైతులు వరుసలో నిలబడలేక చెప్పులను క్యూలో పెట్టారు. కొందరు యూరియా అందక నిరాశతో వెనుతిరిగారు.



స్త్రీశక్తి... ఇంధనమై

'పెట్రోల్ బంక్‌లో మహిళలు ఉద్యోగం చేయగలరా!' అనే పురుషాధిపత్య అనుమానాన్ని పటాపంచలు చేస్తూ... 'బ్రహ్మాండంగా చేయగలరు' అని నిరూపించారు మహిళలు.
ఇప్పుడు ఆ దారిలో మరో ముందడుగు... తొలి మహిళా పెట్రోల్ బంక్. ఇద్దరు కలెక్టర్‌ల చొరవ, కృషితో తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం చౌరస్తాలో తొలిసారిగా జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు అయింది...

నారాయణపేట జిల్లాలో మహిళాసమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంకును ఏర్పాటు చేయించాలనే ఆలోచన గత కలెక్టర్ కోయ శ్రీహర్షకు వచ్చింది. 'మీరు ముందుకు వస్తే పెట్రోల్ బంకును ఏర్పాటు చేయిస్తాను' అని హామీ ఇచ్చారాయన. దీంతో మహిళా సమాఖ్య సభ్యులు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. డీఆర్‌డీఏ కార్యాలయానికి అనుకొని ఉన్న ఆరు గుంటల ప్రభుత్వ భూమిని డీఆర్‌డీఏ, జడ్‌ఎంఎస్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి బీపీసీఎల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కలెక్టర్ బదిలీపై వెళ్లడంతో 'అయ్యో!' అనుకున్నారు.

మరింత మందికి ఉపాధి



నారాయణపేట జడ్‌ఎంఎస్ అధ్యక్షురాలిగా మూడేళ్ల నుంచి పనిచేస్తున్నా. జడ్‌ఎంఎస్‌కు వరి కొనుగోలు కేంద్రాల ద్వారా, స్త్రీనిధి కింద వచ్చే ఆదాయంతో నెట్టుకొచ్చేవాళ్లం. పెట్రోల్ బంక్ రూపంలో అదనపు ఆదాయం రావడంతో మరింత మంది ఉపాధి అవకాశాలకు వీలైంది.

– చంద్రకళ, పెట్రోల్ బంకు మేనేజర్

కలలో కూడా ఊహించలేదు



నారాయణపేటలో మహిళ సంఘం ద్వారా పెట్రోల్ బంకును ఏర్పాటు చేసుకుంటామని కలలో కూడా ఊహించలేదు. ఇది అయ్యే పని కాదనుకున్నాం. ప్రభుత్వ ప్రోత్సాహంతో బంకు ఏర్పాటు కావడం, అందులో సేల్స్ ఎగ్జిక్యూటిగా ఉద్యోగంలో చేరడం సంతోషంగా ఉంది. నెలకు రూ.11 వేల జీతం వస్తుంది. కుటుంబానికి ఎంతో అండగా ఉండేందుకు తోడ్పడుతుంది.

– జగదీశ్వరి, సెల్స్ ఉమన్, జడ్.ఎం.ఎస్. పెట్రోల్ బంకు

పెట్రోల్ బంక్ కల సాధ్యం కాదు అనుకున్నారు.

అయితే ప్రస్తుత కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఫైల్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లారు. రాష్ట్రంలోనే తొలి మహిళ పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు. 35 వేల లీటర్ల (పెట్రోల్, డిజిల్) నిల్వ సామర్థ్యం ఉండే ఈ బంకు 24 గంటలు పనిచేస్తుంది. బంకు నిర్వహణ ద్వారా వచ్చే కమిషన్ జిల్లా సమాఖ్యకు చేరుతుంది. దీనికి అదనంగా ప్రతి నెలా రూ.10 వేలు బీపీసీఎల్ మహిళా సమాఖ్యకు అందిస్తుంది. బంకు నిర్వహణ ద్వారా 10 మంది మహిళా సభ్యులకు ఉపాధి లభించనుంది.

ఈ పెట్రోల్ బంక్ దగ్గరికి వచ్చిన ఒకాయన ఇలా అన్నాడు....

'ఎంతైనా ఆడవాళ్ల ఓపికే వేరు'

పెట్రోల్ బంక్‌ను విజయపథంలో నడిపించడంలో ఆ ఓపిక, ఉత్సాహం, శక్తిసామర్థ్యాలు వారికి ఇంధనంగా మారాయి.

– కలాల్ ఆనంద్ కుమార్ గౌడ్, సాక్షి, నారాయణపేట

ఫస్ట్ టైమ్

చరిత్ర సృష్టించిన చిత్రం

శుచి తలాటీ రచించి, దర్శకత్వం వహించిన 'గర్ల్స్ విల్ బి గర్ల్స్' 40వ ఇండిపెండెంట్ స్పిరిట్ అవార్డ్స్‌లో జాన్ కాసావెట్ అవార్డును గెలుచుకుంది. హిమాలయన్ బోర్డింగ్ స్కూల్లో చదివే మీరా అనే టీనేజర్ ఆలోచనలు, వ్యక్తిత్వాన్ని పరిచయం చేసే చిత్రం ఇది.

'నా దృష్టిలో ఇది తల్లీకూతుళ్ల ప్రేమ కథ. అయితే సంక్లిష్టమైన ప్రేమ కథ. ఈ సినిమా ద్వారా రెండు తరాలకు చెందిన మహిళల స్వేచ్ఛ, స్వతంత్ర ఆలోచనలను చెప్పే ప్రయత్నం చేశాం' అని తన చిత్రం గురించి చెప్పింది శుచి తలాటీ.

జాన్ కాసావెట్ అవార్డ్ గెలుచుకున్న తొలి భారతీయ చిత్రంగా 'గర్ల్స్ విల్ బి గర్ల్స్' చరిత్ర సృష్టించింది. మిలియన్ డాలర్‌ల కంటే తక్కువ బడ్జెట్‌తో నిర్మించిన చిత్రానికి ఈ అవార్డ్ ఇస్తారు.

ప్రముఖ నటులు రిచా చద్దా, అలీ ఫజల్ 'గర్ల్స్ విల్ బి గర్ల్స్'ను నిర్మించారు.

'ఈ విజయం ఒక కలలా అనిపిస్తోంది. ఎప్పుడో కన్నకల సాకారం అయినట్లుగా అనిపిస్తోంది. ఇది ఒకరి వ్యక్తిగత విజయం కాదు. సమష్టి కృషికి దక్కిన విజయం. ఇండిపెండెంట్ స్పిరిట్ అవార్డ్ గెలుచుకున్న తొలి భారతీయ నటిగా, నిర్మాతగా ఇది నా విజయం మాత్రమే కాదు వైవిధ్యమైన కథలను రూపొందించడానికి కృషి చేస్తున్న అందరి విజయం' అంటుంది రిచా చద్దా.

'నా దృష్టిలో ఇది కేవలం అవార్డు కాదు. కథలోని బలానికి దక్కిన గౌరవం' అంటుంది శుచి తలాటి.



బ్యూటిప్స్

ఆముదంతో చర్మం, జుట్టు సమస్యలకు చెక్ పెట్టొచ్చిలా!



- టేబుల్ స్పూను ఆముదం, టేబుల్ స్పూను కొబ్బరి నూనెలను కలిపి వేడి చేసి గోరువెచ్చగా అయిన తరవాత మాడుకు పట్టించి పదినిమిషాల పాటు మర్దన చేయాలి. ఇలా వారానికి మూడుసార్లు చేస్తే.. చుండ్రు తగ్గడంతోపాటు, జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.
- పొడిబారిన చర్మానికి సైతం ఆముదం మంచి మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. బాడీ లోషన్స్‌కు బదులు ఆముదాన్ని రాసుకుంటే మరింత మంచిది.
- గోరువెచ్చని ఆముదాన్ని పలుచగా ఉన్న కనుబొమ్మలకు రాసి రెండు నిమిషాలు మర్దన చేసి ఉదయం కడిగేయాలి. ఇలా కొన్నిరోజులపాటు క్రమం తప్పకుండా చేస్తే కనుబొమ్మలు ఒత్తుగా కనిపిస్తాయి.
- రాత్రి పడుకునే ముందు ఆముదాన్ని పెదవులకు రాసి మూడు నిమిషాలపాటు మర్దన చేయాలి. చిన్న బాక్స్‌లో ఆముదాన్ని పోసుకుని రోజులో అప్పుడప్పుడు లిప్ బామ్‌లా రాసుకుంటూ ఉంటే పెదవులు మృదువుగా, పింక్ కలర్‌లోకి మారతాయి.

ఏఐ వంటకాలు!

సమ్‌థింగ్ స్పెషల్

కొండంత దేవుడికి కొండంత పత్రి సమర్పించడం సాధ్యం కాదు కదా! అని అంటారు గానీ ఇప్పుడు సాధ్యమే!

కొండంత లడ్డు తయారు చేస్తే ఎలా ఉంటుంది?

ఆకాశమంత అప్పడాన్ని ఆవురావురుమని ఆరగించేలా తయారు చేస్తే ఎలా ఉంటుంది?

ఓడ లాంటి భారీ సమోసాను తయారు చేస్తే ఎలా ఉంటుంది?

... బానే ఉంటుందిగానీ అదెట్లా సాధ్యం అంటాం ఎవరైనా. కాని ఏఐ పుణ్యమా అని ఏదైనా సాధ్యమే. ఏఐ టెక్నాలజీ వల్ల క్రియేటివ్ ఫుడ్ వీడియోలు వెల్లువెత్తుతున్నాయి. జె.పి. కరణ్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో వైరల్ అయింది. ఈ వీడియోలో రకరకాల వంటకాల విశ్వరూపం కనిపిస్తుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే మరో ప్రపంచంలోకి వెళ్లినట్లుగా ఉంటుంది.



సాగుబడి
శతభిష కార్తె: మార్చి 4 వరకు

పత్తి మానుకొని.. సిరిధాన్యాల సాగు!

- పత్తి సాగుకు స్వస్తి చెప్పి ఆరేళ్ల క్రితం నుంచి సిరిధాన్యాలు సాగు చేస్తున్న కౌలు రైతు
- 32 ఎకరాల్లో 5 రకాల సిరిధాన్యాలతో పాటు అంతర పంటగా కంది సాగు
- సొంతంగానే ప్రాసెసింగ్.. ప్రజలకు నేరుగా సిరిధాన్యాల బియ్యం అమ్మకం..
- కలెక్టరేట్‌లో సిరిధాన్యాల ఫుడ్ కోర్ట్ నిర్వహణ
- క్వింటా సిరిధాన్యాల ధర రూ.4 వేలకు తగ్గితే రైతుకు గిట్టుబాటు కాదంటున్న అభ్యుదయ రైతు వేణుబాబు



ఊద పంట



కొర్ర + కంది పంటలు

ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తి సాగులో, అందునా విత్తనోత్పత్తిలో నైపుణ్యం సాధించిన సీనియర్ రైతు కందిమళ్ల వేణుబాబు(52) ఆరేళ్ల క్రితం తన దృష్టిని సిరిధాన్యాల వైపు మళ్లించారు. ప్రకాశం జిల్లాకు చెందిన వేణుబాబు మూడు దశాబ్దాల క్రితం కర్నూలు జిల్లాకు వలస వచ్చి స్థానికంగా దేవాలయ భూములను కౌలుకు తీసుకొని విత్తనోత్పత్తి లక్ష్యంగా పత్తి సాగు చేస్తుండేవారు. మరో 8 మంది రైతులతో కలసి ఆంధ్రప్రదేశ్ విత్తన రైతు సేవా సంఘాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తన తల్లికి కేన్సర్ వ్యాధి సోకటంతో ఆరోగ్యదాయకమైన సిరిధాన్యాల గురించి ఆలోచించారు. కర్నూలులో డాక్టర్ ఖాదర్‌వలి సభకు హాజరై సిరిధాన్యాల ఆహారంలో ఔషధ గుణాల గురించి తెలుసుకున్నారు. అప్పటికే పత్తి విత్తన రంగంలో ఎదురవుతున్న సవాళ్ల దృష్ట్యా పత్తి సాగుకు స్వస్తి చెప్పి సిరిధాన్యాల సాగు వైపు పూర్తిగా దృష్టి మళ్లించారు.

క్వింటా రూ.4 వేలకు ప్రభుత్వం కొనాలి

సిరిధాన్యాలకు గత ఏడాది మంచి ధర రావటంతో సాగు ఈ ఏడాది 50% పెరిగింది. గత సంవత్సరం కొర్ర ధాన్యం క్వింటా రూ. 5-6 వేలు పలికితే, ఈ ఏడాది 2,500కి పడిపోయింది. అండుకొర్రలు గత ఏడాది క్వింటా రూ. 8 వేలు పలికితే ఈ ఏడాది రూ.3,500కి పడిపోయింది. ఏ రకం సిరిధాన్యమైనా క్వింటా రూ. 4 వేలైతేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. సిరిధాన్యాల సాగు విస్తీర్ణం స్థిరంగా పెరగాలంటే ప్రభుత్వం రూ. 4 వేల చొప్పున కొనాలి లేదా మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. దీంతో పాటు.. మినీ హార్వెస్టర్లను రైతులకు సబ్సిడీపై అందించాలి. వీటితో రైతులే స్వయంగా పంట కోసుకోవచ్చు. మహిళలు కూడా వీటిని ఉపయోగించగలుగుతారు. సిరిధాన్యాల వినియోగం కూడా క్రమంగా పెరుగుతోంది. మా దగ్గర ఇద్దరు ఆయుర్వేద వైద్యులు రోగులకు విధిగా సిరిధాన్యాల ఆహారాన్నే సూచిస్తున్నారు. వారి కోసం అర కేజీ ప్యాకెట్ల కిట్లను అందిస్తున్నాం. సిరిధాన్యాల సాగుకు పెట్టుబడి తక్కువ.. నికరాదాయం ఎక్కువ. పూర్తి సంతృప్తి ఉంది. మా ఇంట్లోనూ సిరిధాన్యాలనే తింటూ ఆరోగ్యంగా ఉన్నాం.

– కందిమళ్ల వేణుబాబు (94408 61443), చిరుధాన్యాల రైతు, కర్నూలు



32 ఎకరాల్లో సిరిధాన్యాల సాగు

2019లో తొలిసారి ఏడు ఎకరాల్లో కొర్రలు, అండుకొర్రల సాగుకు శ్రీకారం చుట్టారు. క్రమంగా సాగు విస్తీర్ణాన్ని పెంచారు. కల్లూరు మండలం పందిపాడు గ్రామంలో ఒకే చోట 25 ఎకరాల దేవాలయ భూములను కౌలుకు తీసుకొని వర్షాధారంగా ఖరీఫ్‌లో సిరిధాన్యాలతో పాటు అంతర పంటగా కంది సాగు చేస్తున్నారు. నీటి సదుపాయం గల మరో 7 ఎకరాల్లో ఖరీఫ్‌లో అండుకొర్ర పండిస్తున్నారు. రెండో పంటగా కంది, దోస సాగు చేస్తున్నారు.

నల్లరేగడి నేలలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు వేస్తారు. వేస్ట్ డీ కంపోజర్‌ను 4 సార్లు, పుల్ల మజ్జిగను రెండు సార్లు ట్రాక్టర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయిస్తారు. 8 క్వింటాళ్ల కొర్రలతో పాటు ఎకరానికి 5 క్వింటాళ్ల కంది దిగుబడి పొందుతున్నారు. కందులతో పాటు ఎకరానికి అరికలైతే 7 క్వింటాళ్లు, సామలు 3 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తోందని వేణుబాబు తెలిపారు. మిషన్‌తో పంట కోయిస్తే ఎకరానికి రూ. 10 వేలు, కూలీలతో కోయిస్తే రూ. 15 వేల వరకు సాగు ఖర్చవుతుందని ఆయన తెలిపారు.

సొంత ప్రాసెసింగ్ యూనిట్

సిరిధాన్యాలను పండించి టోకుగా అమ్మటం కన్నా బియ్యంగా మార్చి రిటైల్‌గా అమ్మటం ద్వారా అధికాదాయం వస్తుందని తొలిదశలోనే గుర్తించిన వేణుబాబు రూ. 15 లక్షలతో సొంత ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. తాను పండించిన సిరిధాన్యాలతో పాటు ఇతర రైతులు పండించినవి కూడా కొని, మరపట్టించి నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. పురుగుల బెడద లేకుండా వ్యాక్యూమ్ ప్యాకింగ్ చేసి ఆంధ్రప్రదేశ్ విత్తన రైతు సేవా సంఘం బ్రాండ్ పేరుతో మార్కెటింగ్ చేస్తున్నారు. సుమారు 3 వేల మందికి నేరుగా సిరిధాన్యాల బియ్యం, రవ్వను అమ్ముతున్నారు. సాగు చేసి అమ్మటమే కాదు కుటుంబ సభ్యులంతా చిరుధాన్యాల ఆహారమే తీసుకుంటుండటం విశేషం. ఈ ఆహారంతో తాను బరువు తగ్గి చాలా ఆరోగ్యంగా ఉన్నానని వేణుబాబు సంతోషిస్తున్నారు. వినియోగదారుల ఆదరాభిమానాలు పొందాలంటే రాళ్లు, ఇసుక రాకుండా సిరిధాన్యాల బియ్యం, రవ్వను అందించటం చాలా ముఖ్యమన్నారు.

కలెక్టరేట్‌లో మిల్లెట్ కేఫ్

చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో రెండేళ్ల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ సృజన కలెక్టరేట్ ఆవరణలో మిల్లెట్ కేఫ్ ప్రారంభానికి వేణుబాబుకు అవకాశం ఇచ్చారు. సిరిధాన్యాల భోజనంతో పాటు జావ, లడ్డూలు, మురుకులు, బ్రెడ్ తదితర ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. తమ వద్ద రోజువారీగా సిరిధాన్యాల ఆహారం తినే వారిలో 60% మంది యువతేనని ఆయన చెబుతున్నారు.

– గవిని శ్రీనివాసులు, సాక్షి, కర్నూలు

3,4 తేదీల్లో మిల్లెట్ కిసాన్ మేళా

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) మార్చి 3, 4 తేదీల్లో షెడ్యూల్డ్ కులాలు, తెగల రైతుల ప్రయోజనం కోసం జాతీయ స్థాయి కిసాన్ మేళా నిర్వహిస్తోంది. చిరుధాన్యాలు సాగు చేసే ఎస్సీ ఎస్టీ రైతులతో శాస్త్రవేత్తలు, అధికారులు, యంత్రాల ఉత్పత్తిదారులు, వ్యాపారుల ముఖాముఖి సమావేశాలు నిర్వహించటం ఇదే ప్రథమమని ఐఐఎంఆర్ డైరెక్టర్ డా. సి. తారసత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు.. 040-24599382.

డ్రాగన్‌కు ఎండ దెబ్బ..?





- పగటి ఉష్ణోగ్రత 38 డిగ్రీల సెల్షియస్ దాటితే డ్రాగన్‌కు ఇబ్బందే
- కోలినైట్, నీమ్ సోప్, సీవీడ్ ఎక్స్‌ట్రాక్ట్, హ్యూమిక్ యాసిడ్ కలిపి పిచికారీ చేయాలంటున్న ఐఐహెచ్‌ఆర్ శాస్త్రవేత్తలు

డ్రాగన్ ఫ్రూట్ తోటలను ఎండ దెబ్బ(సన్ బర్న్) నుంచి కాపాడుకోవటం రైతులకు ఒక సవాలు వంటిదే. పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు దాటితే డ్రాగన్ ఫ్రూట్ చెట్లకు సన్ బర్న్ ముప్పు పొంచి ఉంటుంది. సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ సమస్య వస్తుంది. అయితే, ఈ ఏడాది ఫిబ్రవరిలోనే అనేక దక్షిణాది రాష్ట్రాల్లో అక్కడక్కడా 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో బెంగళూరులోని భారతీయ ఉద్యాన పంటల పరిశోధనా సంస్థ (ఐఐహెచ్‌ఆర్) సన్‌బర్న్ దెబ్బ నుంచి డ్రాగన్ పంటను కాపాడుకోవటానికి చేసిన సూచనలను తెలుసుకుందాం..

పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్షియస్ దాటితే రాత్రి-పగటి ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం కూడా పెరుగుతుంది. ఇది కూడా చెట్టును బలహీనపరుస్తుంది. ఆకు పచ్చగా నిగనిగలాడుతూ ఉండే డ్రాగన్ మొక్కల కాండాలు అధిక రేడియేషన్ వల్ల పత్రహరితాన్ని కోల్పోయి (బ్లీచ్‌డ్ అప్పియరెన్స్) తెల్లబోయి కాంతి హీనంగా కనిపిస్తాయి. అటువంటప్పుడు మొక్క పెరుగుదల మందగిస్తుంది. ఆ దశలో గనక రక్షక చర్యలు తీసుకోకపోతే డ్రాగన్ మొక్కలు చనిపోయే అవకాశం ఉంది. మొక్క పశ్చిమ భాగంలోని డ్రాగన్ కాండాలకు సన్ బర్న్ నష్ట తీవ్రత 10% నుంచి 50% వరకు ఉంటుంది. కాండం కుళ్లి సోకుతుంది. ఇది విజృంభిస్తే ఏకంగా తోటలో మొక్కల న్నీటినీ రైతు నష్టపోవాల్సి వస్తుంది. కాబట్టి, సన్‌బర్న్ సమస్యను రైతులు సకాలంలో గుర్తించి, తగిన జాగ్రత్తలు పాటిస్తే డ్రాగన్ ఫ్రూట్ తోటలను ఎండల తీవ్రత నుంచి రక్షించుకోవచ్చు.

ఎలుకలు కొరికేస్తున్నాయ్!

డ్రాగన్ ఫ్రూట్.. ఖరీదైనది, పోషకాలతో కూడినదే కాకుండా, దీన్ని సేంద్రియంగా సాగు చేయటం కూడా సులభం. గ్రామీణ ప్రాంతాలతో పాటు నగరాల పరిసర ప్రాంతాల్లోనూ డ్రాగన్ ఫ్రూట్ తోటలు విస్తరిస్తున్నాయి. ఇంటిపంటలు, మిద్దె తోటల్లోనూ డ్రాగన్ సాగు చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో డ్రాగన్ పంటకు ఎలుకల బెడద ఎదురవుతోందని కొల్లం (కేరళ) కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గుర్తించారు. కొల్లం జిల్లాలోని అనేక ప్రాంతాల్లో డ్రాగన్‌కు ఎలుకల బెడద ఎదురవుతున్నట్లు సమాచారం రావటంతో కేవీకే భవనంపైనే ప్రయోగాత్మకంగా ఫైబర్ డ్రమ్ముల్లో డ్రాగన్ మొక్కల్ని పెంచారు. తెల్లవారుజామున 4-5 గంటల మధ్య ఎలుకలు డ్రాగన్ మొక్కల కాండం లోపలి గుజ్జును కొరికి తింటున్నట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. శరీరం కన్నా తోక ఎక్కువ పొడవున్న రకానికి చెందిన ఎలుకలు ఈ పని చేస్తున్నాయని గుర్తించారు. ఎలుకలు కొరికిన కాండం ద్వారా నీరు, పోషకాల సరఫరా తగ్గిపోతుంది. దీంతో, పూత రాకపోవచ్చు. పూత వచ్చిన తర్వాత ఎలుకలు కొరికితే.. పూత, పిందెలు రాలిపోవచ్చు. అంతిమంగా, దిగుబడి తగ్గిపోతుంది.



పిచికారీ

ఎండ తీవ్రత వల్ల పత్ర రంధ్రాల్లో నుంచి నీటి తేమ ఎక్కువగా వాతావరణంలోకి విడుదలవుతుంటుంది. అటువంటప్పుడు మొక్కలో నీటి శాతం తగ్గిపోతుంది. ఈ ప్రక్రియను తగ్గించగలిగే యాంటీ-ట్రాన్స్‌పైరెంట్స్‌ను పిచికారీ చేస్తే ఉపయోగం ఉంటుంది. డ్రాగన్ తోటను సన్ బర్న్ నుంచి రక్షించుకోవటానికి కోలినైట్ (లీటరు నీటికి 50 గ్రాములు) + నీమ్ సోప్ (లీటరు నీటికి 4 గ్రాములు) తో పాటు సీవీడ్ ఎక్స్‌ట్రాక్ట్‌ను, హ్యూమిక్ యాసిడ్ (లీటరు నీటికి 4 ఎం.ఎల్.) కలిపి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో పిచికారీ చేయాలని ఐఐహెచ్‌ఆర్ నిపుణులు రైతులకు సూచిస్తున్నారు. సన్ బర్న్ నష్ట తీవ్రతతో పాటు శిలీంధ్ర, బాక్టీరియా తెగుళ్ల బెడదను కూడా తగ్గిస్తుందని తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్ తోటలో పోల్‌కి 8-10 లీటర్ల నీటిని డ్రిప్ ద్వారా ఇస్తే ఎండ తీవ్రతను తట్టుకోవటానికి అవకాశం కలుగుతుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



భారత హాకీ జట్లకు నిరాశ

అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో సోమవారం భారత మహిళల, పురుషుల హాకీ జట్లకు నిరాశ ఎదురైంది. భువనేశ్వర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం జరిగిన మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు 2–4 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ జట్టు చేతిలో... భారత పురుషుల జట్టు 2–3 గోల్స్ తేడాతో ఇంగ్లండ్ జట్టు చేతిలో ఓడిపోయాయి. నెదర్లాండ్స్‌తో జరిగిన పోరు ద్వారా భారత జట్టు గోల్‌కీపర్ సవితా పూనియా తన కెరీర్‌లో 300 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. వందన కటారియా తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయ ప్లేయర్‌గా సవిత గుర్తింపు పొందింది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో భారత్ తరఫున ఉదిత (18వ, 42వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేసింది. నెదర్లాండ్స్ తరఫున ఎమ్మా రెజ్నెన్ (7వ నిమిషంలో), ఫే వాన్‌డెర్ (40వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించగా... ఫెలిస్ అల్బెర్స్ (34వ, 47వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేసింది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల జట్టుకు అభిషేక్ (18వ నిమిషంలో), సుఖ్‌జీత్ సింగ్ (39వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. ఇంగ్లండ్ తరఫున జేకబ్ పేటన్ (15వ నిమిషంలో) ఒక గోల్ చేయగా... సామ్ వార్డ్ (19వ, 29వ నిమిషంలో) రెండు గోల్స్ సాధించాడు.

కివీస్‌తో కలిసి సెమీస్‌కు భారత్

బంగ్లాదేశ్ స్పిన్నర్ రిషాద్ ఓవర్లో కవర్స్ దిశగా ఫోర్ కొట్టిన కివీస్ బ్యాటర్ బ్రేస్‌వెల్... ఈ షాట్‌తో చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ ‘ఎ’లో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సమీకరణం తేలిపోయింది. ఈ బౌండరీతో న్యూజిలాండ్, భారత్ అధికారికంగా సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య జట్టయిన పాకిస్తాన్‌తో పాటు బంగ్లాదేశ్ కథ కూడా లీగ్ దశలోనే ముగిసింది. నిష్క్రమించిన రెండు జట్లు ప్రాధాన్యత లేని పోరులో గురువారం తలపడనుండగా... సెమీస్‌కు ముందు సన్నాహకంగా ఆదివారం కివీస్‌ను భారత్ ఎదుర్కోనుంది. కివీస్ కట్టుదిట్టమైన బౌలింగ్‌ను ఎదుర్కొనడంలో విఫలమైన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్ తరహాలోనే పేలవ బ్యాటింగ్‌తో దాదాపు అదే స్కోరు సాధించగా... మరో 23 బంతులు మిగిలి ఉండగానే న్యూజిలాండ్ ఛేదనను అలవోకగా పూర్తి చేసింది. విరామం లేకుండా వరుసగా 10 ఓవర్లు వేసిన ఆఫ్‌స్పిన్నర్ బ్రేస్‌వెల్ నాలుగు కీలక వికెట్లతో ప్రత్యర్థి పని పట్టగా... బ్యాటింగ్‌లో రచిన్ రవీంద్ర సెంచరీ హైలైట్‌గా నిలిచాయి. గత చాంపియన్స్ ట్రోఫీలో తమను ఓడించి సెమీఫైనల్ చేరిన బంగ్లాదేశ్‌ను ఇప్పుడు కివీస్ అదే తరహాలో 5 వికెట్లతో ఓడించి సెమీస్ చేరడం విశేషం.

న్యూజిలాండ్‌కు వరుసగా రెండో విజయం

- 5 వికెట్లతో బంగ్లాదేశ్ ఓటమి
- బ్రేస్‌వెల్‌కు 4 వికెట్లు, రచిన్ సెంచరీ
- చాంపియన్స్ ట్రోఫీ నుంచి బంగ్లాదేశ్, పాకిస్తాన్ అవుట్


రచిన్

రావల్పిండి: చాంపియన్స్ ట్రోఫీలో వరుసగా రెండో విజయంతో మాజీ విజేత న్యూజిలాండ్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. ఇదే గ్రూప్‌లో రెండు విజయాలు సాధించిన భారత్ కూడా కివీస్‌తో పాటు సెమీస్ చేరింది. సోమవారం జరిగిన గ్రూప్ ‘ఎ’ లీగ్ మ్యాచ్‌లో కివీస్ 5 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. కెప్టెన్ నజ్ముల్ హసెన్ (110 బంతుల్లో 77; 9 ఫోర్లు), జాకీర్ అలీ (55 బంతుల్లో 45; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా... ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ బ్రేస్‌వెల్ (4/26) నాలుగు వికెట్లతో బంగ్లాదేశ్‌ను దెబ్బ తీశాడు. అనంతరం న్యూజిలాండ్ 46.1 ఓవర్లలో 5 వికెట్లకు 240 పరుగులు సాధించి గెలిచింది. రచిన్ రవీంద్ర (105 బంతుల్లో 112; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో సత్తా చాటగా... లాథమ్ (76 బంతుల్లో 55; 3 ఫోర్లు) రాణించాడు.

నజ్ముల్ అర్ధసెంచరీ...

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు తన్‌జీద్ (24; 1 ఫోర్, 2 సిక్స్‌లు), నజ్ముల్ ధాటిగా మొదలు పెట్టారు. తన్‌జీద్ రెండు సిక్స్‌లు బాదగా, జేమీసన్ ఓవర్లో నజ్ముల్ 3 ఫోర్లు కొట్టాడు. అయితే 9వ ఓవర్లోనే స్పిన్ బౌలింగ్‌ను మొదలు పెట్టిన కివీస్ ఫలితం సాధించింది. బ్రేస్‌వెల్ తొలి ఓవర్లోనే తన్‌జీద్ వికెట్ తీసి పతనానికి శ్రీకారం చుట్టగా... మిరాజ్ (13) మరోసారి విఫలమయ్యాడు. అయితే ఆ తర్వాత బ్రేస్‌వెల్ మళ్లీ బంగ్లాను దెబ్బ కొట్టాడు. 21 పరుగుల వ్యవధిలో బంగ్లా తౌహీద్ (7), ముష్ఫికర్ (2), మహ్మదుల్లా (4) వికెట్లు కోల్పోయింది. ఈ మూడు వికెట్లూ బ్రేస్‌వెల్ ఖాతాలోకే చేరాయి. ఈ దశలో నజ్ముల్, జాకీర్ కొద్దిసేపు వికెట్ల పతనాన్ని నిలువరించారు. 71 బంతుల్లో నజ్ముల్ అర్ధ సెంచరీ పూర్తయింది. నజ్ముల్‌ను అవుట్ చేసి రూర్కే ఈ జోడీని విడదీయగా... బంగ్లా మిగిలిన వికెట్లు కోల్పోయేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. బంగ్లా ఇన్నింగ్స్‌లో డాట్ బాల్స్ ఏకంగా 178 ఉన్నాయి.


బ్రేస్‌వెల్

శతక భాగస్వామ్యం...

లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తొలి ఓవర్లోనే యంగ్ (0) అవుట్ కాగా, కొద్ది సేపటికే కేన్ విలియమ్సన్ (5) కూడా వెనుదిరిగాడు. కాన్వే, రచిన్ కలిసి మూడో వికెట్‌కు 57 పరుగులు జోడించిన తర్వాత కాన్వే పెవిలియన్ చేరాడు. అయితే రచిన్, లాథమ్‌ల భారీ భాగస్వామ్యం జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లింది. ఈ ద్వయాన్ని విడదీసేందుకు బంగ్లా బౌలర్లు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో 95 బంతుల్లోనే రచిన్ కెరీర్‌లో నాలుగో సెంచరీని అందుకున్నాడు. లాథమ్ కూడా 71 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఎట్టకేలకు విజయానికి 36 పరుగుల దూరంలో రచిన్‌ను బంగ్లా అవుట్ చేయగా, కొద్ది సేపటికే లాథమ్ కూడా నిష్క్రమించాడు. అయితే ఫిలిప్స్ (21 నాటౌట్), బ్రేస్‌వెల్ (11 నాటౌట్) కలిసి మిగతా పనిని పూర్తి చేశారు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జీద్ (సి) విలియమ్సన్ (బి) బ్రేస్‌వెల్ 24; నజ్ముల్ (సి) బ్రేస్‌వెల్ (బి) రూర్కే 77; మిరాజ్ (సి) సాంట్నర్ (బి) రూర్కే 13; తౌహీద్ (సి) విలియమ్సన్ (బి) బ్రేస్‌వెల్ 7; ముష్ఫికర్ (సి) రచిన్ (బి) బ్రేస్‌వెల్ 2; మహ్మదుల్లా (సి) రూర్కే (బి) బ్రేస్‌వెల్ 4; జాకీర్ (రనౌట్) 45; రిషాద్ (సి) సాంట్నర్ (బి) హెన్రీ 26; తస్కీన్ (సి) కాన్వే (బి) జేమీసన్ 10; ముస్తఫిజుర్ (నాటౌట్) 3; నాహిద్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 236. వికెట్ల పతనం:** 1–45, 2–64, 3–97, 4–106, 5–118, 6–163, 7–196, 8–231, 9–236. **బౌలింగ్:** హెన్రీ 9–0–57–1, జేమీసన్ 9–1–48–1, బ్రేస్‌వెల్ 10–0–26–4, రూర్కే 10–1–48–2, సాంట్నర్ 10–1–44–0, ఫిలిప్స్ 2–0–10–0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: యంగ్ (బి) తస్కీన్ 0; కాన్వే (బి) ముస్తఫిజుర్ 30; విలియమ్సన్ (సి) ముష్ఫికర్ (బి) నాహిద్ 5; రచిన్ (సి) (సబ్) పర్వేజ్ (బి) రిషాద్ 112; లాథమ్ (రనౌట్) 55; ఫిలిప్స్ (నాటౌట్) 21; బ్రేస్‌వెల్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (46.1 ఓవర్లలో 5 వికెట్లకు) 240. వికెట్ల పతనం:** 1–0, 2–15, 3–72, 4–201, 5–214. **బౌలింగ్:** తస్కీన్ 7–2–28–1, నాహిద్ 9–0–43–1, మిరాజ్ 10–0–53–0, ముస్తఫిజుర్ 10–0–42–1, రిషాద్ 9.1–0–58–1, నజ్ముల్ 1–0–12–0.

చాంపియన్స్ ట్రోఫీలో నేడు
ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా
మధ్యాహ్నం గం. 2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

‘సూపర్’ సోఫీ...

- ఆఖరి ఓవర్లో మెరిపించి, సూపర్ ఓవర్లో గెలిపించిన ఎకిల్‌స్టోన్
- బెంగళూరుపై యూపీ వారియర్స్ అద్భుత విజయం



బెంగళూరు: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజయానికి ఓవర్ దూరంలో ఉంది. 6 బంతుల్లో 18 పరుగులు యూపీ వారియర్స్‌కు క్లిష్టమైన సమీకరణం. కానీ సోఫీ ఎకిల్‌స్టోన్... ఓటమి అంచున ఉన్న యూపీ వారియర్స్‌కు ఊపిరి పోసింది. 0, 6, 6, 4, 1లతో 17 పరుగులు బాదింది. ఆఖరి బంతి క్రాంతి గౌడ్ ఆడగా... సోఫీ రనౌటైంది. అయితే 17 పరుగుల రాకతో స్కోరు సమమైంది. దీంతో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) చరిత్రలో తొలి సూపర్ ఓవర్‌కు పిచ్ సిద్ధమైంది. ముందుగా ఆర్‌సీబీ బౌలర్ కిమ్ గార్త్ వేసిన సూపర్ ఓవర్లో యూపీ 8 పరుగులు చేసింది. 6 బంతుల్లో 9 పరుగులు ఆర్‌సీబీ హిట్టర్లు రిచా ఘోష్, స్మృతి మంధానలకు సులువు! కానీ సోఫీ స్పిన్ ఉచ్చుతో ఆర్‌సీబీ బ్యాటర్లను అనూహ్యంగా కట్టడి చేసింది. బౌండరీ కాదు కదా... కనీసం ఒక బంతికి రెండు పరుగులైనా ఇవ్వకుండా 0, 1, 0, 1, 1, 1లతో 4 పరుగులే ఇచ్చింది. అంతే సోఫీ ‘సూపర్’ స్టార్ అయ్యింది. యూపీ విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. ఎలీస్ పెరీ (56 బంతుల్లో 90 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగింది. డానీ వ్యాట్ హాగ్ (41 బంతుల్లో 57; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించింది. హెన్రీ, దీప్తి శర్మ, తాలియా తలా ఓ వికెట్ తీశారు. అనంతరం యూపీ వారియర్స్ సరిగ్గా 20 ఓవర్లలో 180 పరుగులు చేసి ఆలౌటైంది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సోఫీ ఎకిల్‌స్టోన్ (19 బంతుల్లో 33; 1 ఫోర్, 4 సిక్స్‌లు), దీప్తి శర్మ (13 బంతుల్లో 25; 4 ఫోర్లు, 1 సిక్స్), శ్వేత (25 బంతుల్లో 31; 4 ఫోర్లు) దంచేశారు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి (బి) దీప్తిశర్మ 6; డానీ వ్యాట్ (సి) శ్వేత (బి) తాలియా 57; పెరీ (నాటౌట్) 90; రిచా (సి అండ్ బి) హెన్రీ 8; కనిక (రనౌట్) 5; వేర్‌హమ్ (రనౌట్) 7; కిమ్ గార్త్ (రనౌట్) 2; రాఘ్వీ బిస్త్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లలో) 180. వికెట్ల పతనం:** 1–23, 2–117, 3–126, 4–136, 5–158, 6–180. **వికెట్ల పతనం:** 1–23, 2–117, 3–126, 4–136, 5–158, 6–180. **బౌలింగ్:** హెన్రీ 4–0–34–1, గ్రేస్ హారిస్ 1–0–11–0, దీప్తి శర్మ 4–0–42–1, సోఫీ 4–0–29–0, సైమా 1–0–8–0, క్రాంతి 3–0–26–0, తాలియా 3–0–30–1.

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: నవ్‌గిరే (బి) రేణుక 24; వృందా (సి) స్మృతి (బి) రేణుక 14; దీప్తి (సి) రిచా (బి) స్నేహ్ రాణా 25; తాలియా (స్టంప్) రిచా (బి) స్నేహ్ రాణా 0; శ్వేత (సి) రిచా (బి) పెరీ 31; గ్రేస్ (సి) స్నేహ్ రాణా (బి) కిమ్ 8; ఉమా (సి) వేర్‌హమ్ (బి) స్నేహ్ రాణా 14; హెన్రీ (బి) కిమ్ 8; సోఫీ (రనౌట్) 33; సైమా (రనౌట్) 14; క్రాంతి (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 180. వికెట్ల పతనం:** 1–30, 2–48, 3–50, 4–72, 5–93, 6–123, 7–123, 8–134, 9–161, 10–180. **బౌలింగ్:** రేణుక 4–0–36–2, కిమ్ గార్త్ 4–0–40–2, స్నేహ్ రాణా 3–0–27–3, ఎక్తాబిస్త్ 3–0–26–0, పెరీ 2–0–10–1, వేర్‌హమ్ 4–0–40–0.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ క్యాపిటల్స్ X గుజరాత్ జెయింట్స్
రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో...

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఒక పేరు చెప్తా..


నాని


‘‘సార్ మీకు ప్రాబ్లమ్ లేదంటే.. ఒక పేరు చెప్తా.. అర్జున్ సర్కార్’, ‘ఈ కేసు వాడికి ఇవ్వడంలో ప్రాబ్లమ్ ఏం లేదు కానీ... వీడి లాఠీకి దొరికినవాడి పరిస్థితి ఆలోచిస్తేనే భయం వేస్తుంది’ అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది ‘హిట్: ది థర్డ్ కేస్’ టీజర్. నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘హిట్: ది థర్డ్ కేస్’. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధీ శెట్టి హీరోయిన్. వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్ పాత్రలో నటిస్తున్నారు నాని. కాగా సోమవారం (ఫిబ్రవరి 24) ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ‘‘అందరూ ఒకే మెథడ్‌లో మర్డర్స్ చేస్తున్నారంటే.. ఏదో మోటివ్ ఉంది’, ‘ఫస్ట్ టైమ్ నిన్ను చూసినప్పుడే డౌటొచ్చింది నాకు... ఒక పోలీస్ ఆఫీసర్‌వేనా నువ్వు..’ వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. మే 1న రిలీజ్ కానున్న ఈ సినిమాకు మిక్కీ జె. మేయర్ స్వరకర్త. అలాగే నాని హీరోగా నటిస్తున్న మరో సినిమా ‘ప్యార డైజ్’. శ్రీకాంత్ ఓదెల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ అప్‌డేట్‌ను మార్చి 3న వెల్లడించనున్నట్లు నాని ‘ఎక్స్’లో పేర్కొన్నారు.

ఇంగ్లిష్‌లో టాక్సిక్


యశ్

‘కేజీఎఫ్: చాప్టర్ 1, కేజీఎఫ్: చాప్టర్ 2’ వంటి బ్లాక్ బస్టర్ మూవీస్‌తో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు హీరో యశ్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం ‘టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్’. గీతూ మోహన్ దాస్ దర్శకుడు. కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌పై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాని కన్నడతో పాటు గ్లోబల్ ఆడియన్స్ కోసం ఇంగ్లిష్‌లోనూ చిత్రీకరిస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. గీతూ మోహన్‌దాస్ మాట్లాడుతూ– ‘‘విభిన్న భాషా, సాంస్కృతిక నేపథ్యంలో రాబోతున్న ‘టాక్సిక్’ మూవీని అన్ని భాషల, ప్రాంతాల ప్రేక్షకులు ఆస్వాదించేలా రూపొందిస్తున్నాం’’ అన్నారు. ‘‘ఇంగ్లిష్‌లో చిత్రీకరిస్తున్న మొదటి భారతీయ చిత్రంగా ‘టాక్సిక్’ రికార్డుల్లోకి ఎక్కింది. మా సినిమా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లోకి డబ్ అవుతుంది’’ అని వెంకట్ కె.నారాయణ తెలిపారు.

కోర మీసాలతో...


నిధీ అగర్వాల్, పవన్ కల్యాణ్

‘‘కోర కోర మీసాలతో.. కొదమ కొదమ అడుగులతో.. కొంటె కొంటె చెనుకులతో..’ అంటూ మొదలవుతుంది ‘కొల్లగొట్టినాదిరో..’ పాట లిరికల్ వీడియో. పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ‘హరిహర వీరమల్లు: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్’ సినిమాలోనిది ఈ పాట. క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఏఎమ్ రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్న చిత్రం ‘హరిహర వీరమల్లు’. నిధీ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో బాబీ డియోల్, నాజర్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి పార్టు ‘హరిహర వీరమల్లు: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్’ మార్చి 28న రిలీజ్ కానుంది. కీరవాణి సంగీతం అందించిన ఈ సినిమాలోని ‘కొల్లగొట్టినాదిరో..’ పాట లిరికల్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటని మంగ్లీ, రాహుల్ సిప్లిగంజ్, రమ్య బెహ్రా, యామిని ఘంటసాల, ఐరా ఉడిపి, మోహన భోగరాజు, వైష్ణవీ కన్నన్, సుదీప్ కుమార్, అరుణ మేరీ పాడారు. ఈ సాంగ్‌కి బృందా, గణేష్ మాస్టర్స్ కొరియోగ్రఫీ చేశారు.

డబుల్ మజాకా ఉంటుంది


- రాజేష్ దండా


‘‘ధమాకా’ వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత త్రినాథరావుగారి దర్శకత్వంలో వస్తున్న చిత్రం ‘మజాకా’. ఈ సినిమాని ఆయన బాగా తీశారు. ఆయనతో మరో సినిమా చేయాలని ఉంది. ‘మజాకా’ కి సీక్వెల్ చేయాలనే ఆలోచనతో ఈ మూవీ చివరలో ‘డబుల్ మజాకా’ అనే టైటిల్ కూడా వేస్తున్నాం’’ అని నిర్మాత రాజేష్ దండా తెలిపారు. సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్న చిత్రం ‘మజాకా’. త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించిన ఈ మూవీలో అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషించారు. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా నిర్మించారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం రేపు(బుధవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా రాజేష్ దండా విలేకరులతో మాట్లాడుతూ– ‘‘త్రినాథరావు, రైటర్ ప్రసన్నగారి శైలిలో ఉండే మాస్ ఎంటర్‌టైనర్ ‘మజాకా’. భావోద్వేగాలతో పాటు చక్కని సందేశం కూడా ఉంటుంది. మా మూవీ రిలీజ్ డేట్‌కి తక్కువ సమయం ఉండటంతో ప్రమోషన్స్ కొత్తగా ప్లాన్ చేయాలనుకున్నప్పుడు అనిల్ సుంకరగారు లైవ్ షూటింగ్ ఐడియా చెప్పారు. ఆయనతో నా భాగస్వామ్యం కొనసాగుతుంది. వచ్చే ఏడాది మా కాంబినేషన్‌లో ఓ స్టార్ హీరోతో బిగ్ మూవీ చేయబోతున్నాం. ‘అల్లరి’ నరేశ్, సందీప్ కిషన్‌లతో నా అనుబంధం ప్రత్యేకమైనది.. వారితో మళ్లీ సినిమాలు చేస్తాను. ఇకపై వినోదాత్మక సినిమాలే చేస్తాను. ‘సామజవరగమన’ సినిమాకి సీక్వెల్ ఉంటుంది. ప్రస్తుతం కిరణ్ అబ్బవరంతో ఓ సినిమా, హీరోయిన్ సంయుక్తతో ఓ చిత్రం చేస్తున్నాను’’ అని చెప్పారు.

మనసుని హత్తుకునే ప్రేమకథ


‘23’ సినిమా పోస్టర్‌ని విడుదల చేస్తున్న భట్టి విక్రమార్క

తేజ, తన్మయి ప్రధాన పాత్రల్లో ‘మల్లేశం’ ఫేమ్ రాజ్. ఆర్ దర్శకత్వం వహించిన చిత్రం ‘23’. స్టూడియో 99 నిర్మించిన ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కానుంది. నటుడు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ సినిమాని డిస్ట్రిబ్యూట్ చేయనుంది. కాగా ఈ మూవీ స్పెషల్ స్క్రీనింగ్‌కి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. అనంతరం ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను ఆయన రిలీజ్ చేశారు. ‘‘వాస్తవ ఘటనల స్ఫూర్తితో ‘23’ తీశాం. పశ్చాత్తాపం, విముక్తి వంటి అంశాలను లోతుగా అన్వేషించే మనసుని హత్తుకునే ప్రేమకథ ఇది. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం’’ అని యూనిట్ పేర్కొంది. ఝాన్సీ, పావోస్ రమేష్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు మార్క్ కె. రాబిన్ సంగీతం అందించారు.

నవ్వుల ప్రసాద్


సప్తగిరి

సప్తగిరి హీరోగా అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో రూపొందిన సినిమాకు ‘పెళ్లి కాని ప్రసాద్’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. చాగంటి సినిమా టిక్ వరల్డ్ సమర్పణలో థామ మీడియా ఎంటర్‌టైన్మెంట్స్‌పై కె.వై. బాబు (విజన్ గ్రూప్), భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల నిర్మించిన ఈ చిత్రం మార్చి 21న రిలీజ్ కానుంది. నిర్మాత ‘దిల్’ రాజు బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ సినిమాను రిలీజ్ చేస్తోంది. ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి, మూవీని మార్చి 21న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఆడియన్స్‌ను అలరించనుందని మేకర్స్ తెలిపారు. ప్రియాంకా శర్మ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, అన్నపూర్ణమ్మ, ప్రమోదిని ఇతర పాత్రలు పోషించారు. ఈ మూవీకి శేఖర్ చంద్ర సంగీతం అందించారు.

భలే చాన్స్?


ఊర్వశీ రౌతేలా

‘వేర్ ఈజ్ ద పార్టీ.. బాసూ వేర్ ఈజ్ ద పార్టీ..’ అంటూ తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు ఊర్వశీ రౌతేలా. చిరంజీవి హీరోగా నటించిన ‘వాల్తేరు వీరయ్య’ చిత్రంలోని ‘వేర్ ఈజ్ ద పార్టీ..’ అంటూ సాగే ప్రత్యేక పాటలో ఆడిపాడారామె. ఆ తర్వాత ‘ఏజెంట్, బ్రో, స్కంద’ వంటి సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌తో అలరించారు. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన బాలకృష్ణ ‘డాకు మహారాజ్’ చిత్రంలో ఊర్వశి ఓ కీలక పాత్ర చేయడంతో పాటు ‘దబిడి దిబిడి’ పాటలో తనదైన డ్యాన్సులతో ఆకట్టుకున్నారు. ఇదిలా ఉంటే.. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న ‘ఎన్టీఆర్ నీల్’(వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటించే భలే చాన్స్‌ని ఊర్వశీ రౌతేలా అందుకున్నారనే వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఊర్వశీ రౌతేలా ఓ కీలక పాత్ర పోషించనున్నారట. ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది. తర్వాతి షెడ్యూల్‌లో ఆమె పాల్గొంటారని టాక్.

గ్రామీణ నేపథ్యంలో...


అనిల్, జ్వలిత

అనిల్ బురగాని, ఆర్.జ్వలిత జంటగా నటించిన చిత్రం ‘ప్రేమకు జై’. మల్లం శ్రీనివాస్ దర్శకత్వంలో అనసూర్య నిర్మించిన ఈ చిత్రం మార్చిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు దర్శక–నిర్మాత సాయి వెంకట్ అతిథిగా హాజరై, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. మల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ– ‘‘గ్రామీణ నేపథ్యంలో ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశాం’’ అన్నారు. ‘‘మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి’’ అని అనిల్, జ్వలిత, సహ నిర్మాత మైలారం రాజు కోరారు. ఈ కార్యక్రమంలో నటుడు అదిరే అభి, నిర్మాతలు ఏమ్ఆర్ చౌదరి వడ్లపట్ల, చందర్ గౌడ్, దర్శకుడు లారెన్స్ పాల్గొన్నారు. దుబ్బాక భాస్కర్ విలన్‌గా నటించిన ఈ సినిమాకు చైతు స్వరకర్త.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▼	నిఫ్టీ ▼
857	243
74,454	22,553

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	19,494	▼	30
డోజోన్స్	43,651	▲	223
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,659	▼	1
డాక్స్	22,426	▲	138
షాంఘై	3,373	▼	6
నికాయ్ (అక్టోబర్ ముగింపు)	38,777	▼	99

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	86,400
బంగారం (99.5 స్వచ్ఛత)	86,054
వెండి (కిలో)	96,115

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.20	87.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.50	111.39
€	యూరో	ఎస్‌బీఐ	89.90	92.53
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.41	58.87
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.23	56.47
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.50	67.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.22	23.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.71	24.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.09	12.91

బిజినెస్ మెసేజ్.. టెల్కోలకు భలే ఛాన్స్!

మీకు అతి తక్కువ వడ్డీ రేటుకే ప్రీ-అప్రూవ్డ్ పర్సనల్ లోన్ ఆఫర్. ఇప్పుడే దరఖాస్తు చేయండి..

మా ప్రొడక్టులపై 80 శాతం వరకు భారీ డిస్కౌంట్ ఆఫర్ నడుస్తోంది. వెంటనే షాపింగ్ చేసి, పండుగ చేస్కోండి..

గేమ్ స్టార్ట్ చేసేందుకు రూ. 3,000 స్పెషల్ క్యాష్‌బ్యాక్ కూపన్ రెడీగా ఉంది. యాప్ డౌన్‌లోడ్ చేసి, ఆటాడుకోండి..

ఫోన్‌లో.. వాట్సాప్‌లో ఈ మధ్య పోలోమంటూ వస్తున్న ఇలాంటి మెసేజ్‌లను గమనిస్తున్నారా? కంపెనీలు తమ ప్రొడక్టులు, సర్వీసులను నేరుగా కస్టమర్ల చెంతకు తీసుకెళ్లేందుకు ఈ కొత్త మార్కెటింగ్ రూట్‌ను ఎంచుకుంటున్నాయి. మనక్కూడా వీటి వల్ల కొన్నిసార్లు ఉపయోగం ఉన్నప్పటికీ.. పదేపదే వచ్చే ఇలాంటి అనవసర మెసేజ్‌లతో ఒక్కోసారి విసుక్కోవడం కూడా కామన్‌గా మారింది. అయితే, టెలికం కంపెనీలకు మాత్రం ఇవి కాసులు కురిపిస్తున్నాయి. దీంతో ఎంటర్‌ప్రైజ్ లేదా బిజినెస్ మెసేజింగ్.. టెల్కోలకు సరికొత్త ఆదాయ వనరుగా నిలుస్తోంది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

మార్కెటింగ్ కోసం కంపెనీల కొత్త రూట్

- కస్టమర్లకు ఆఫర్లు, సేవలతో పాటు బ్రాండింగ్
- టెలికం సంస్థలకు అదనపు ఆదాయం
- వీఐ, జియో హవా.. త్వరలో బరిలోకి ఎయిర్‌టెల్
- హీటెక్కనున్న టారిఫ్ వార్...

వినియోగదారులతో మరింత బాగా మమేకం అయ్యేందుకు కంపెనీలు ఇప్పుడు సంప్రదాయ టెక్ట్స్ మెసేజీల స్థానంలో రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్ (ఆర్‌సీఎస్) బాట పట్టాయి. దేశంలో స్మార్ట్ ఫోన్ల వినియోగం దూసుకెళ్తుండటం.. వాట్సాప్ వాడుతున్న వారు కోట్లలో ఉండడంతో బిజినెస్ మెసేజింగ్ టెల్కోలను ఊరిస్తోంది. ప్రస్తుతం ఈ మార్కెట్లో వొడాఫోన్ ఐడియా (వీఐ), రిలయన్స్ జియో హవా నడుస్తోంది. త్వరలోనే భారతీ ఎయిర్‌టెల్ కూడా బరిలోకి దూకే సన్నాహాల్లో ఉంది. దీంతో మార్కెట్ వాటాను కొల్లగొట్టేందుకు టెలికం ఆపరేటర్ల మధ్య పోటీ పెరిగి, టారిఫ్ వార్‌కు తెరతీయనుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

గూగుల్, వాట్సాప్ ద్వారా...

ఆర్‌సీఎస్ బిజినెస్ మెసేజింగ్ (ఆర్‌బీఎం) ద్వారా తమ బ్రాండింగ్, మార్కెటింగ్ మెసేజీలను పేంపేందుకు, అలాగే చాట్‌బాట్ తరహాలో కస్టమర్లతో ఇంటరాక్ట్ అయ్యేందుకు టెల్కోల విస్తృత నెట్‌వర్క్ వీలు కల్పిస్తోంది. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్లలో సాధారణ ఎస్ఎంఎస్ చాట్ స్థానంలో గూగుల్ ఈ ఆర్‌సీఎస్‌ను ప్రమోట్ చేస్తోంది. ఇక వాట్సాప్ బిజినెస్ మెసేజింగ్ సర్వీస్ దీనికి తీవ్ర పోటీ ఇస్తోంది. ఆర్‌సీఎస్ మార్కెటింగ్ మెసేజీలను పంపడం ద్వారా కస్టమర్లకు చేరువ కావాలనుకునే కంపెనీలకు అగ్రిగేటర్లు దన్నుగా నిలుస్తున్నారు. డాట్‌గో, రూట్ మొబైల్, సించ్, ఇన్ఫోబిప్ వంటి కమ్యూనికేషన్స్ ప్లాట్‌ఫామ్ యాజ్ ఎ సర్వీస్ (సీపాస్) ప్రొవైడర్లు ఆర్‌సీఎస్‌కు కావలసిన సాంకేతిక సహకారం, సేవలు అందిస్తున్నాయి. అంటే జియో, వీఐ నెట్‌వర్క్ ద్వారా కస్టమర్లకు వివిధ కంపెనీల బ్రాండ్, మార్కెటింగ్ మెసేజీలను చేరవేస్తున్నాయి. బేసిక్ టెక్ట్స్ ఆర్‌సీఎస్ మెసేజీలకు కంపెనీల నుంచి టెల్కోలు 15 పైసలు చొప్పున వసూలు చేస్తుండగా.. షాపింగ్, యాప్ డౌన్‌లోడ్స్, లోన్ దరఖాస్తులకు వీలు కల్పించే ఇంటరాక్టివ్ మెసేజీలకు 35 పైసల దాకా చార్జీ విధిస్తున్నాయి.

వీటి ప్రత్యేకతేంటి?

సాధారణ టెక్ట్స్ మెసేజీలతో పోలిస్తే, ఆర్‌సీఎస్‌లు చాలా భిన్నం. కస్టమర్లు తమ మెసేజీలను తెరిచారా లేదా.. తెరిచిన తర్వాత ఎలా స్పందించారు వంటివన్నీ బ్రాండ్ తెలుసుకునేందుకు ఆర్‌సీఎస్‌లు వీలు కల్పిస్తాయి. ఆర్‌సీఎస్‌ల డెలివరీ రేట్ మన దేశంలో 98% ఉందని, చదివే శాతం 40% కాగా, రెస్పాన్స్ రేట్ 6% ఉన్నట్లు అంచనా. వీటిపై వెచ్చించే వ్యయంతో పోలిస్తే ఫలితాలు మెరుగ్గా ఉండటంతో కంపెనీలు ఆర్‌సీఎస్ పట్ల ఎక్కువగా మొగ్గు చూపుతున్నాయి. ఆర్‌బీఎం సర్వీస్‌లో వీఐ ముందంజలో ఉంది. పరిశ్రమ వర్గాల సమాచారం మేరకు నెలకు 100 కోట్ల ఆర్‌సీఎస్ మెసేజీలను వీఐ ఆపరేట్ చేస్తోంది. ఆర్నెల్ల క్రితం ఈ సర్వీసులను ప్రారంభించిన జియో కూడా జోరు పెంచింది. ఎయిర్‌టెల్ రంగంలోకి దూకితే పోటీ పెరిగి చార్జీలు తగ్గే అవకాశం ఉందని డాట్‌గో సీఈఓ ఇందర్‌పాల్ మమిక్ పేర్కొన్నారు.



ఊరిస్తున్న మార్కెట్...

దేశంలో మారుమూల పల్లెల్లో కూడా స్మార్ట్ ఫోన్ వాడకం శరవేగంగా దూసుకెళ్తోంది. ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) తాజా గణాంకాల ప్రకారం భారత్‌లో 66 కోట్ల మందికి పైగా స్మార్ట్ ఫోన్ యూజర్లున్నారు. ఇందులో అత్యధికంగా ఆండ్రాయిడ్ ఫోన్లే. కాగా, స్మార్ట్ ఫోన్ల జోరుతో గత రెండేళ్లుగా ఆర్‌సీఎస్ మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందిందని రూట్ మొబైల్ వైస్ ప్రెసిడెంట్ తుషార్ అగ్నిహోత్రి చెప్పారు. 2023లో 1.3 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత బిజినెస్ మెసేజింగ్ మార్కెట్ 2028 నాటికి 3.2 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని కన్సల్టెన్సీ సంస్థ గార్ట్‌నర్ లెక్కగట్టింది. ప్రస్తుతం యాపిల్ ఐఓఎస్‌లో ఆర్‌సీఎస్ మెసేజ్‌లకు సపోర్ట్ లేదని, అదికూడా అందుబాటులోకి వస్తే కంపెనీల మార్కెటింగ్ ఇంకా విస్తృతం అవుతుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

3.2 బిలియన్ డాలర్లు
2028 నాటికి భారత్‌లో బిజినెస్ మెసేజింగ్ మార్కెట్ అంచనా. 2023లో ఇది 1.3 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

100 కోట్లు ప్రస్తుతం వొడాఫోన్ ఐడియా నెలకు ఆపరేట్ చేస్తున్న ఆర్‌సీఎస్ ఎస్ఎంఎస్‌ల సంఖ్య

15 పైసలు బేసిక్ టెక్ట్స్ ఆర్‌సీఎస్‌లకు కంపెనీల నుంచి టెల్కోలు వసూలు చేస్తున్న టారిఫ్. ఇంటరాక్టివ్ ఆర్‌సీఎస్ ఎస్ఎంఎస్‌లకు 35 పైసలు వరకు చార్జీ విధిస్తున్నారు.

భీమా జ్యువెల్స్ 'అద్భుతమైన ఫిబ్రవరి' ఆఫర్

హైదరాబాద్: ప్రముఖ గోల్డ్ అండ్ డైమండ్ జ్యువెల్లరీ సంస్థ భీమా జ్యువెల్స్ 'అద్భుతమైన ఫిబ్రవరి' ఆఫర్ ప్రకటించింది. బంగారు, వెండి ఆభరణాల తయారీ చార్జీలపై 70% డిస్కౌంట్ అందిస్తుంది. వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.7,000 తగ్గింపుతో పాటు ప్రతి క్యారెట్‌తో ఒక గ్రాము బంగారు నాణెం ఉచితంగా పొందవచ్చు. ప్రతి వారం నిర్వహించే 'గ్రాండ్ వీక్లీ లక్కీ డ్రా' ద్వారా 20 మంది కస్టమర్లు అప్రిలియా స్కూటర్ గెలుచుకోవచ్చు. స్క్రాచ్ అండ్ విన్ క్యాష్ ఆఫర్‌లో భాగంగా ప్రతి గ్రాముకు రూ.150 వరకు క్యాష్ బ్యాక్ గెలుచుకోవచ్చు. ఇప్పటికే మొదలైన 'అద్భుతమైన ఆఫర్' ఫిబ్రవరి 28 వరకు అందుబాటులో ఉంటుందని, కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ తెలిపింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

టెక్ @ 300 బిలియన్ డాలర్లు	యూజ్డ్ కారు.. యమా జోరు..

75000 కిందికి సెన్సెక్స్

- 22,600 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- అయిదో రోజూ ఆగని అమ్మకాలు
- ఇన్వెస్టర్లకు రూ.4.22 లక్షల కోట్ల నష్టం

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో అయిదో రోజూ అమ్మకాల పరంపర కొనసాగింది. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ 857 పాయింట్లు క్షీణించి 75వేల స్థాయి దిగువన 74,454 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 243 పాయింట్లు కోల్పోయి 22,553 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే నష్టాలతో మొదలయ్యాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఒక దశలో సెన్సెక్స్ 924 పాయింట్లు క్షీణించి 74,387 వద్ద, నిఫ్టీ 278 పాయింట్లు పతనమై 22,518 వద్ద కనిష్టాలు తాకాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 4 పైసలు బలహీనపడి 86.72 స్థాయి స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

→ చిన్న, మధ్య తరహా షేర్లలోనూ అమ్మకాలు కొనసాగాయి. బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 1.3%, మిడ్ క్యాప్ 1% పడ్డాయి.

→ స్టాక్ మార్కెట్ భారీ పతనంతో రూ.4.22 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.397.97 లక్షల కోట్లకు దిగివచ్చింది.

→ క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్స్ షేరు లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.425)తో పోలిస్తే 1.50% స్వల్ప ప్రీమియంతో రూ.432 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 10% క్షీణించి రూ.382 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 9% నష్టంతో రూ.387 వద్ద స్థిరపడింది.



నష్టాలకు నాలుగు కారణాలు..

→ వ్యయ ఒత్తిళ్లు, వాణిజ్య సుంకాల ఆందోళనలతో అమెరికా ఫిబ్రవరి సర్వీసెస్ యాక్టివిటీ 15 నెలల కనిష్టానికి చేరుకుంది.

→ భారత్ ఐటీ రంగానికి అతిపెద్ద మార్కెట్ అమెరికాలో వృద్ధి మందగమనం, ద్రవ్యోల్బణ పెరుగుదల ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో దేశీయ ఐటీ షేర్లు డీలాపడ్డాయి. ఎల్‌టీటీఎస్, ఎల్‌టీఐఎం 5% క్షీణించాయి. విప్రో 4%, హెచ్‌సీఎల్ టెక్ 3.50%, ఎంఫసిస్, ఇన్ఫోసిస్, టీసీఎస్ 3% పతనమయ్యాయి.

→ అమెరికా ద్రవ్యోల్బణం, భారత క్యూ3 జీడీపీ వృద్ధి గణాంకాల వెల్లడి ముందు ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తూ అప్రమత్తత వహించారు. ట్రంప్ అధిక టారిఫ్‌ల అమలుతో ద్రవ్యోల్బణం ఎక్కువ కావచ్చనే ఆందోళనలు నెలకొన్నాయి.

→ విదేశీ పెట్టుబడులు తరలిపోతుండడం దలాల్ స్ట్రీట్ పతనానికి ప్రధాన కారణం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.1.01 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 80 బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని బ్యాంక్ ఆఫ్ బరోడా.. క్యాపిటల్ మార్కెట్ లిమిటెడ్ విభాగంలో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 80.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఫైనాన్షియల్ సర్వీస్, సేల్స్ ప్రొడక్ట్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఈమెయిల్: careers@bobcaps.in
» దరఖాస్తులకు చివరితేది: 28.02.2025.
» వెబ్‌సైట్: https://www.bobcaps.in

బీహెచ్ఈఎల్, బెంగళూరులో 20 మేనేజర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బీహెచ్ఈఎల్).. మేనేజర్, ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 20.
» పోస్టుల వివరాలు: సీనియర్ ఇంజనీర్(ఈ-2)-13, డిప్యూటీ మేనేజర్(ఈ3)-03, మేనేజర్(ఈ4), సీనియర్ మేనేజర్(ఈ-5)-04.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బీఎస్సీ (ఎలక్ట్రికల్, మెకానికల్), ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.02.2025 నాటికి సీనియర్ మేనేజర్‌కు 42 ఏళ్లు, మేనేజర్‌కు 39 ఏళ్లు, మిగతా పోస్టులకు 32 ఏళ్లు నిండి ఉండాలి.
» వేతనం: నెలకు సీనియర్ ఇంజనీర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000, మేనేజర్‌కు రూ.90,000 నుంచి రూ.2,40,000, సీనియర్ మేనేజర్‌కు రూ.1,00,000 నుంచి రూ.2,60,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:04.03.2025
» వెబ్‌సైట్: https://careers.bhel.in

గెయిల్ న్యూఢిల్లీలో 73 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్).. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న గెయిల్ వర్క్ సెంటర్లు/యూనిట్లలో వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 73.
» పోస్టుల వివరాలు: ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(కెమికల్)-21, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (ఇన్‌స్ట్రుమెంటేషన్)-17, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(ఎలక్ట్రికల్)-14, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(మెకానికల్)-08, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(బీఐఎస్)-13.
» అర్హత: 65 శాతం మార్కులతో కెమికల్, పెట్రో కెమికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ తదితర విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్-2025 స్కోరు తప్పనిసరిగా ఉండాలి.
» గరిష్ట వయో పరిమితి: 18.03.2025 నాటికి 26 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» పే స్కేల్: నెలకు రూ.60,000 నుంచి రూ.1,80,000.
» ఎంపిక విధానం: గేట్-2025 స్కోర్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 18.04.2025.
» వెబ్‌సైట్: https://gailonline.com

ఇంటర్‌లో బెస్ట్ స్కోర్‌కు మార్గం!

ఇంటర్మీడియెట్.. భవిష్యత్ గమనాన్ని నిర్ణయించే దశ. ఇంటర్‌లో సాధించిన మార్కులు ఉన్నత విద్య కోర్సుల్లో చేరేందుకు, ఆ తర్వాత కొలువుల సాధనలో కీలకంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు బోర్డు పరీక్షల్లో బెస్ట్ స్కోర్ సాధించేందుకు ఎంతో కష్టపడి చదువుతుంటారు. మరి కొద్ది రోజుల్లోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు పరీక్షల్లో రాణించేందుకు సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్ ప్లాన్..

» మరికొద్ది రోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం
» ఉన్నత విద్య, ఉద్యోగాలకు కీలకంగా మార్కులు
» రివిజన్, ప్రాక్టీస్‌తో పరీక్షల్లో విజయం ఖాయం

2025 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 1 నుంచి, తెలంగాణలో మార్చి 5 నుంచి మొదలు కానున్నాయి. దీంతో.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయం విద్యార్థులకు ఎంతో విలువైనది. ఇంతకాలం చదివిన అంశాలను ప్రస్తుత సమయంలో పరీక్షలకు ముందు రివిజన్, ప్రాక్టీస్ చేయడం ద్వారా ఉత్తమ స్కోర్ సాధించే అవకాశం ఉంది.

మ్యాథమెటిక్స్

ప్రస్తుత సమయంలో ఎంపీసీ విద్యార్థులు మ్యాథమెటిక్స్‌కు సంబంధించి షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్‌పై బాగా దృష్టి పెట్టాలి. కొశ్చన్ అండ్ ఆన్సర్ల మాదిరిగా కాకుండా డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో అవగాహన చేసుకుంటూ ప్రాక్టీస్ చేయాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడే జేఈఈ, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకోవాలి. ఇప్పుడు పూర్తిగా ఇంటర్మీడియెట్ ప్రిపరేషన్‌కే సమయం కేటాయించాలి. తెలుగు అకాడమీ పుస్తకాల్లోని అన్ని ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేయాలి. దీంతోపాటు వీక్లీ టెస్టులు రాయడం మేలు చేస్తుంది. అదే విధంగా కనీసం రెండు ప్రీ-ఫైనల్ ఎగ్జామ్స్‌కు హాజరవ్వాలి. ద్వితీయ సంవత్సరం మ్యాథమెటిక్స్‌కు సంబంధించి ద్విపద సిద్ధాంతం, ప్రస్తారాలు-సంయోగాలు, సంభావ్యత, వృత్తాలు, సమాకలనులు, నిశ్చిత సమాకలనులు, అవకలన సమీకరణాలు, డిమూవర్స్ సిద్ధాంతం, వర్గ సమీకరణాలు, పరావలయం వంటి అంశాలను పునశ్చరణ చేయాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు వెక్టార్ ఆల్జీబ్రా, మాత్రికలు, సరళరేఖలు, సరళరేఖ యుగ్మాలు, అవకలనాలు, అప్లికేషన్స్ అండ్ డెరివేషన్స్‌పై ఎక్కువ సమయం కేటాయించాలి.

ఫిజిక్స్

ఫిజిక్స్ సబ్జెక్ట్‌కు సంబంధించి విద్యార్థులు పూర్తి సమయాన్ని రివిజన్‌కు కేటాయించాలి. ఫిజిక్స్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మూవింగ్ ఛార్జెస్ అండ్ మ్యాగ్నటిజం, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, పరమాణువు, వేవ్స్, సెమీ కండక్టర్ ఎలిమెంట్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. రొటేటరీ మోషన్, యూనివర్సల్ గ్రావిటేషన్ లా, ఎస్కేప్ వెలాసిటీ, సింపుల్ హార్మోనిక్ మోషన్, సర్ఫేస్ టెన్షన్, థర్మో డైనమిక్స్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి. ఫిజిక్స్‌లో లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్‌ను సాధన చేసేటప్పుడు అంచెలవారీ పరిష్కార విధానాన్ని అనుసరించాలి. ఫలితంగా సదరు సమస్యకు సంబంధించి ప్రాథమిక భావనలపైనా పట్టు సాధించేందుకు ఆస్కారం లభిస్తుంది.

కెమిస్ట్రీ

కెమిస్ట్రీలో ముఖ్యాంశాలను నోట్ చేసుకుంటూ చదవాలి. ప్రస్తుత సమయంలో దీర్ఘ సమాధాన ప్రశ్నలు, నాలుగు మార్కుల ప్రశ్నలపై ఎక్కువగా ఫోకస్ చేయాలి. వీటికి సంబంధించి గతంలో అడిగిన ప్రశ్నల సాధనతోపాటు మోడల్ టెస్టులకు హాజరవడం ఉపయుక్తంగా ఉంటుంది. ద్వితీయ సంవత్సరంలో విద్యుత్ రసాయన శాస్త్రం, పి-బ్లాక్ మూలకాలు, డి.ఎఫ్-బ్లాక్ మూలకాలు, లోహ శాస్త్రం, సాలిడ్ స్టేట్ వంటి అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీలోని అన్ని ముఖ్యాంశాలతో నోట్స్ రాసుకోవడం మేలు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. కర్బన రసాయన శాస్త్రం, ఆవర్తన పట్టిక, పరమాణు నిర్మాణం, రసాయన బంధం అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

బైపీసీలో ఇలా

బోటనీ

బైపీసీ విద్యార్థులు బోటనీ సబ్జెక్ట్‌కు సంబంధించి అనలిటికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. అనువర్తిత అంశాలను నిజ జీవితంలోని పరిస్థితులతో బేరీజు వేస్తూ సాగాలి. ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్స్ వేయడం ప్రాక్టీస్ చేయాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు.. మొక్కల నిర్మాణాత్మక సంవిధానం-స్వరూప శాస్త్రం; జీవ ప్రపంచంలో వైవిధ్యం; కణ నిర్మాణం-విధులు; మొక్కల అంతర్ నిర్మాణ సంవిధానం, మొక్కల్లో ప్రత్యుత్పత్తి యూనిట్లపై ఎక్కువ దృష్టి పెట్టాలి. దీనికి సంబంధించి డయాగ్రమ్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి. డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్(మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రోబయాలజీ(బ్యాక్టీరియా, వైరస్), జెనెటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయోటెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ టాపిక్స్ పైనా అవగాహన పెంచుకునేలా ప్రిపరేషన్ సాగించాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొక్కల శరీర ధర్మశాస్త్రం, బయో టెక్నాలజీ, మైక్రోబ్స్, అణు జీవశాస్త్రం యూనిట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి.


ఇంటర్ స్పెషల్

జువాలజీ

ఈ సబ్జెక్ట్‌లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు..మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, ప్రత్యుత్పత్తి సంబంధిత ఆరోగ్యం, అంతఃస్రావక వ్యవస్థ, నాడీ నియంత్రణ -సమన్వయం; శరీర ద్రవాలు, ప్రసరణ, విసర్జక పదార్థాలు; జన్యు శాస్త్రాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. జంతుదేహ నిర్మాణం; గమనం, ప్రత్యుత్పత్తి, జీవావరణం, పర్యావరణం, బొద్దింక జీవ వ్యవస్థ వంటి అంశాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ఈ సబ్జెక్ట్‌లో కూడా గ్రాఫికల్ ప్రజంటేషన్ మార్కుల సాధనలో కీలకంగా ఉంటుంది. కాబట్టి డయాగ్రమ్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి. ఈ సబ్జెక్ట్‌లో రెండు సంవత్సరాలకు సంబంధించి డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ, లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటొజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనెటా అమెరికానా, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనెటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీలపై ప్రత్యేక దృష్టితో చదవాలి.

ఫిజిక్స్

బైపీసీ-ఫిజిక్స్‌లో.. ప్రథమ సంవత్సరం విద్యార్థులు లిక్విడ్, గ్యాస్, కైనటిక్ గ్యాస్ థియరీ, రొటేటరీ మోషన్, యాంగులర్ మూమెంట్, యూనివర్సల్ గ్రావిటేషన్ లా, ఆర్బిటాల్ వెలాసిటీ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వేవ్ మోషన్, సెమీ కండక్టర్ ఎలిమెంట్స్, మూవింగ్ ఛార్జెస్ -మ్యాగ్నటిజం, విద్యుదయస్కాంత ప్రేరణ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి.

కెమిస్ట్రీ

ఈ సబ్జెక్ట్ విషయంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఆవర్తన పట్టిక, కర్బన రసాయన శాస్త్రం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వీటిలోని సమస్యలను సాధన చేయాలి. సినాప్సిస్ రూపొందించుకుంటే.. రివిజన్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. ద్వితీయ సంవత్సరంలో పి-బ్లాక్ ఎలిమెంట్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, విద్యుత్ రసాయన శాస్త్రం, కెమికల్ కైనటిక్స్‌లోని దీర్ఘ సమాధాన ప్రశ్నలు, నాలుగు మార్కుల ప్రశ్నల ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

రెడీ రెకనర్స్

అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌ల ప్రిపరేషన్‌కు రెడీ రెకనర్స్‌ను రూపొందించుకోవాలి. అంటే.. సంబంధిత సబ్జెక్ట్‌లో ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లతో కూడిన సంక్షిప్త సమాచారాన్ని ఒక నోట్స్‌గా రూపొందించుకోవాలి. ఫలితంగా రివిజన్ వేగంగా పూర్తి చేయడానికి, పరీక్ష ముందు రోజు క్విక్ రివిజన్‌కు ఆస్కారం లభిస్తుంది.

పరీక్ష హాల్లో ఇలా

పరీక్ష హాల్లో విద్యార్థులు ముందుగా ప్రశ్న పత్రం పూర్తిగా చదవాలి. ఆ తర్వాత తమకు సులభంగా భావించే ప్రశ్నలకు తొలుత సమాధానం ఇవ్వాలి. అనంతరం ఓ మోస్తరు క్లిష్టమైన ప్రశ్నలకు, చివరగా బాగా క్లిష్టంగా భావించే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్‌కు సమాధానం ఇచ్చేటప్పుడు పరీక్ష సమయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. కేవలం ఒక ప్రశ్నకే సమాధానం రాస్తూ కూర్చుంటే మిగతా ప్రశ్నల విషయంలో సమయాభావం సమస్య ఎదురవుతుంది.

ఇంటర్మీడియెట్ ఎగ్జామ్స్.. జనరల్ టిప్స్

- మార్చి 1 నుంచి ఏపీలో, మార్చి 5 నుంచి తెలంగాణలో ఇంటర్మీడియెట్ పరీక్షలు.
- ఇప్పటి నుంచి పూర్తిగా రివిజన్‌కే సమయం కేటాయించాలి.
- షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ అన్నింటికీ సమాధానం ఇచ్చేలా సంసిద్ధత పొందాలి.
- లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేస్తున్నప్పుడే.. వాటి నుంచి అడిగే అవకాశం ఉన్న షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్‌కు సంబంధించిన అంశాలు నోట్స్‌లో రాసుకోవాలి.
- విద్యార్థులు క్లాస్‌రూం లెక్చర్‌కు అదనంగా ప్రతి రోజు కనీసం ఆరు నుంచి ఏడు గంటల స్వీయ ప్రిపరేషన్‌కు కేటాయించాలి.
- మెమొరీ టిప్స్(విజువల్ ఇమాజినేషన్; షార్ట్ నోట్స్)ను పాటించడం మేలు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- మెంటల్ ఎబిలిటీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్



కొత్తగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన, పూర్తి చేసుకోబోతున్న వారికి శుభవార్త. కొంతకాలం నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గాయని, కొత్తగా ఇంజనీరింగ్, ఇతర డిగ్రీలు పూర్తిచేసిన వారికి ఉద్యోగాలు దొరకడం కష్టమనే అభిప్రాయాన్ని పటాపంచలు చేస్తూ... ఫ్రెషర్లకు ఉద్యోగ అవకాశాలు పెరగనున్నట్టు టీమ్‌లీజ్ నివేదికలో వెల్లడైంది. దేశంలోని నాలుగింట మూడొంతుల కంపెనీలు ఫ్రెషర్లను రిక్రూట్ చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు తేలింది. దేశవ్యాప్తంగా 649 సంస్థలు, కంపెనీల యాజమాన్యాలపై చేపట్టిన సర్వే ఆధారంగా 'టీమ్‌లీజ్ ఎడ్‌టెక్స్ కెరీర్ ఔట్‌లుక్ హెచ్1-2025' నివేదిక పేర్కొంది. ఎంట్రీ లెవల్ స్థాయిలో సుమారు లక్షన్నర మందికి అవకాశం లభించవచ్చని తెలిపింది.

\- సాక్షి, హైదరాబాద్

ఫ్రెషర్స్‌కు జాబుల జాతరే..!

2024 జూలై–డిసెంబర్ మధ్య నాటితో పోల్చితే 2025 జూన్ నాటికి ఫ్రెష్ గ్రాడ్యుయేట్లకు మరింత మెరుగైన అవకాశాలు లభిస్తాయని నివేదిక పేర్కొంది. ఐటీతోపాటు ఇతర

ప్రధాన రంగాల్లో అవకాశాలు..

టెక్నాలజీ కంపెనీలు, సంస్థలు తమ ప్రాజెక్టు డిమాండ్లకు అనుగుణంగా ఫ్రెషర్లను నియామకానికి మొగ్గుచూపుతున్నట్టు తెలిపింది. ఐటీతోపాటు హెల్త్‌కేర్ అండ్ ఫార్మా, మార్కెటింగ్, అడ్వర్టయిజింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో అవకాశాలు పెరుగుతాయని వెల్లడించింది. ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ టెక్నాలజీస్ వంటి వాటిలో 30–35 శాతం అవకాశాలు పెరుగుతాయని తెలిపింది. ఈ–కామర్స్, టెక్నాలజీ స్టార్టప్‌ల రిజిస్ట్రేషన్ కూడా పెరిగిందని.. డీప్–టెక్‌తో ముడిపడిన ఉద్యోగాలకు ప్రాధాన్యత పెరుగుతోందని స్పష్టం చేసింది. క్లినికల్ బయో ఇన్ఫర్మేటిక్స్ అసోసియేట్, రోబోటిక్ సిస్టమ్ ఇంజనీర్, సస్టెయినబుల్ అనలిస్ట్, ప్రాంప్ట్ ఇంజనీర్, ఏఐ అండ్ మెషీన్ లెర్నింగ్ ఇంజనీర్, క్లౌడ్ ఇంజనీర్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్ వంటి ఉద్యోగాలకు డిమాండ్ ఉందని నివేదిక పేర్కొంది.

2025 జూన్ నాటికి 'ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్' రిక్రూట్‌మెంట్‌కు మూడో వంతు దేశీయ కంపెనీల సంసిద్ధత

- ఎంట్రీ లెవల్‌లో లక్షన్నర మంది ఫ్రెషర్స్‌కు చాన్స్ రావచ్చనే అంచనాలు
- 'టీమ్‌లీజ్ ఎడ్‌టెక్స్ కెరీర్ ఔట్‌లుక్ హెచ్1–2025'నివేదికలో వెల్లడి
- ఐటీ, హెల్త్‌కేర్ అండ్ ఫార్మా, మార్కెటింగ్, అడ్వర్టయిజింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో పెరగనున్న అవకాశాలు
- ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ టెక్నాలజీస్‌లలో 30–35 శాతం పెరుగుదల..

డేటా సైన్స్ వంటి నైపుణ్యాలను పెంచుకోవాలి..



ఇంజనీరింగ్ లేదా ఏదైనా డిగ్రీ చదివేటప్పుడు కీలక బోధనాంశాలు ఉన్నవారికి, ఆయా రంగాల్లో ప్రత్యేక శిక్షణ పొందినవారికి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్ అందరికీ ఒక్కసారిగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని భావించలేం. డేటా సైన్స్ వంటి నైపుణ్యాలను పెంచుకోవాలి. నాన్–టెక్, నాన్–ఐటీ ఉద్యోగులు, గ్రాడ్యుయేట్స్ వంటివారు ఇంటెలిజెంట్, డెసిషన్ మేకింగ్ టాస్క్‌లు, కాంప్లెక్స్ ప్రాసీజర్స్ ఉండే వాటిలోకి వెళ్లగలిగితే మంచి అవకాశాలు పొందొచ్చు. రాబోయే రోజుల్లో డేటాసైన్స్, ఏఐ, మెషీన్ లెర్నింగ్ వంటివి ప్రతి పరిశ్రమకు అవసరం. ప్రస్తుతం ఫ్రెషర్ల నియామకాలు రెండు స్థాయిల్లో జరుగుతున్నాయి. అడ్వాన్స్ స్కిల్స్ ఉన్న వారికి ప్యాకేజీలు రూ.6 –15 లక్షల మధ్య ఉంటున్నాయి, లేనివారికి రూ.6 లక్షలలోపే వార్షిక ప్యాకేజీలు ఉంటున్నాయి. అందువల్ల అడ్వాన్స్ స్కిల్స్ నేర్చుకోవడం కచ్చితంగా మంచి ఉద్యోగాన్ని సాధించేందుకు ఉపకరిస్తుంది. హెల్త్‌కేర్ రంగంలో హెల్త్‌కేర్ టెక్, మేనేజ్‌మెంట్ వంటి వాటిపై పట్టుసాధించాలి. సంప్రదాయ డిగ్రీ కోర్సులు చేసినా, అంతగా నైపుణ్యాలు లేకున్నా ఉద్యోగం వచ్చేస్తుందని ఆశిస్తే ఇబ్బందే.

\- రమణ భూపతి, క్వాలిటీ థాట్ గ్రూప్ చైర్మన్, ఎడ్‌టెక్ కంపెనీ

ఫ్రెషర్స్‌ను ఎక్కువగా తీసుకునే రంగాలివే..

ఈ-కామర్స్ అండ్ టెక్నాలజీ స్టార్టప్‌లలో..	ఉత్పత్తి రంగంలో..	ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో
70 శాతం	66 శాతం	62 శాతం

ఉద్యోగాల సాధన కోసం డిమాండ్ ఉన్న కోర్సులివీ..

సర్టిఫికేషన్ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్	సస్టెయినబుల్ మేనేజ్‌మెంట్	జనరేటివ్ ఏఐ అండ్ మెషీన్ లెర్నింగ్
	రోబోటిక్స్ ఇంజనీరింగ్	



రాత్రి వేళ మెరుస్తున్న స్వర్ణ విమాన గోపురం

మార్చి 1 నుంచి యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు

7న ఎదుర్కోలు, 8న తిరు కల్యాణోత్సవం, 9న రథోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 11 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1వ తేదీన స్వస్తీవాచనం, 2న ధ్వజారోహణం, దేవతాహ్వానం, 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు వేద పారాయణాలు, హోమాలు, అలంకార సేవలు, ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయి. 7వ తేదీన శ్రీస్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం, 8న తిరు కల్యాణోత్సవం, 9న దివ్య విమాన రథోత్సవం, 10వ తేదీన పూర్ణాహుతి, చక్రతీర్థం, దోపు ఉత్సవం, 11వ తేదీన శతఘటాభిషేకం, డోలోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు ఆలయంలో నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చన వంటి పూజలను ఆలయాధికారులు రద్దుచేశారు. మార్చి 7వ తేదీ నుంచి 9 వరకు భక్తులు జరిపించుకునే రాత్రి అర్చనలు, భోగములు ఉండవని అధికారులు వెల్లడించారు. అలాగే 10, 11వ తేదీల్లో ఉదయం అభిషేక, అర్చనలను కూడా రద్దుచేశారు.

స్వర్ణ విమానం గోపురం ధగధగలు..

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య విమాన స్వర్ణ గోపురం భక్తులకు కనువిందు చేస్తోంది. వానమామలై రామానుజ జీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి స్వర్ణ విమాన గోపురానికి మహా కుంభాభిషేక సంప్రోక్షణ చేసి, శ్రీస్వామికి అంకితం ఇచ్చిన విషయం విదితమే. దివ్య స్వర్ణ విమానం గోపురం రాత్రి వేళ విద్యుత్ దీపాల కాంతుల్లో ధగధగా మెరిసిపోతోంది.

200 స్టాళ్లు.. 20,000 మంది విద్యార్థులు

నేషనల్ సైన్స్ డేకు విస్తృతంగా ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 28న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ సైన్స్ డే వేడుకలకు డీఆర్‌డీఓ, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. వేడుకల్లో భాగంగా రక్షణరంగ సంస్థలకు చెందిన పలు ఉత్పత్తుల ప్రదర్శన కోసం 200 ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 20 వేల మంది వరకు విద్యార్థులు ఈ సైన్స్ డే వేడుకల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వేడుకలను రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభిస్తారని వెల్లడించారు. రక్షణరంగ తయారీ సంస్థలతోపాటు పలు సాంకేతికతల అభివృద్ధి సంస్థలైన డీఆర్‌డీఎల్, సీసీఎంబీ, ఐఐసీటీ, మిధానీ, బీడీఎల్, బీఈఎల్, హెచ్ఏఎల్, ఈసీఐఎల్‌తోపాటు ఐఐటీ హైదరాబాద్, ఐఐఐటీ హైదరాబాద్, తదితర సంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు వారు వెల్లడించారు. భవిష్యత్ ఆవిష్కరణలకు విద్యార్థుల్లో ప్రేరణ కల్గించేలా ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, రోబోటిక్స్, నెక్స్ట్ జెనరేషన్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ తదితర రంగాలపై భవిష్యత్తులో దృష్టి పెట్టేలా ఎగ్జిబిషన్‌లో చర్చలు జరగనున్నాయి.

ప్రభుత్వాన్ని ఏం చేద్దామనుకుంటున్నారు?

- ఉన్నతాధికారులపై ఇటీవలి సమీక్షలో మంత్రుల ఆగ్రహం!
- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై మండిపాటు
- ఇన్ని శాఖలు ఉండి సమన్వయం లేకపోతే ఎలా అని నిలదీత

సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐఏఎస్ అధికారులను బుజ్జగిస్తూ వస్తున్న రాష్ట్ర మంత్రులు ఇటీవల జరిగిన ఓ సమావేశంలో మాత్రం ఒక్కసారిగా వారిపై విరుచుకుపడ్డట్టు తెలుస్తోంది. ఈ విషయం అటు ప్రభుత్వ వర్గాల్లోనూ, ఇటు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు నాలుగైదు శాఖల కీలక అధికారులు పాల్గొన్న సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) పురోగతిపై చర్చిస్తున్న సందర్భంగా ఇద్దరు అమాత్యులు సీనియర్ ఐఏఎస్ అధికారులను తమ వ్యాఖ్యలు, ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసినట్లు సమాచారం. ప్రభుత్వాన్ని ఏం చేయదల్చుకున్నారని, ఏం కంకణం కట్టుకున్నారో చెప్పాలని కూడా ఒక దశలో వారు నిలదీసినట్లు తెలిసింది. మున్సిపల్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, హౌసింగ్ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించడం ద్వారా తాము ప్రజలకిచ్చిన హామీ అయిన ఎల్ఆర్ఎస్‌ను ముందుకు తీసుకెళ్లాల్సి ఉండగా... సమన్వయం లేకుండా పనిచేయడం ఏమిటని మంత్రులు నిలదీసినట్లు తెలియవచ్చింది. ఈ సందర్భంలోనే ఒక అధికారి మాట్లాడుతూ తన శాఖకు, ఎల్ఆర్ఎస్‌కు సంబంధం లేని వ్యాఖ్యానించగా ఇద్దరు మంత్రులు ఆ అధికారితోపాటు ఇతర అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. 'మీకు సంబంధం లేదని ఎలా అంటారు? సీనియర్ అధికారులు అయ్యుండి సలహాలు ఇవ్వాలి కదా? ఎవరికి వారే సంబంధం లేదనుకుంటారా? మీ ఇష్టం వచ్చినట్లు మీరు చేస్తే మాకు చేతనైంది మేం చేస్తాం. మేం చేసే దానికి కూడా రెడీ అయి ఉండండి' అని మంత్రులు ఘాటుగా హెచ్చరించినట్లు తెలిసింది. ఎల్ఆర్ఎస్ అమలు ఎలా చేయాలో అందరూ కలిసి కూర్చొని కాగితంపై రాసుకొని తమ వద్దకు తీసుకురావాలని కూడా సీనియర్ అధికారులను ఆ ఇద్దరు మంత్రులు ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దల హెచ్చరికల నేపథ్యంలో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ ఐఏఎస్ అధికారుల్లో నెలకొంది.

నేటి నుంచి ఎల్ఆర్ఎస్ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

సర్వర్‌ను అనుసంధానిస్తున్నారు. దీంతో ఎల్ఆర్ఎస్‌కు ఆమోదం పొందిన ప్లాట్ల వివరాలు సబ్ రిజిస్ట్రార్ల వద్ద కనిపిస్తాయి. ఎల్ఆర్ఎస్ పోర్టల్‌లో క్రమబద్ధీకరించాల్సిన ప్లాట్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే దరఖాస్తుదారుడే నేరుగా ఇంటి నుంచే ఆన్‌లైన్, యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు ఫీజు చెల్లించేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నారు. అనుసంధాన ప్రక్రియ సోమవారం రాత్రి కల్లా పూర్తి చేసి, మంగళవారం నుంచి ఫీజులు చెల్లించేలా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్‌లు కృషి చేస్తున్నాయి.

ఇప్పటికే రూ.107.01 కోట్ల చెల్లింపులు

2020 ఆగస్టు 26కు ముందు ఎల్ఆర్ఎస్ కోసం చేసుకున్న 25.67 లక్షల దరఖాస్తుల్లో 9.21 లక్షల దరఖాస్తుల పరిశీలన ఇప్పటికే పూర్తయింది. వీటిలో ఎలాంటి అభ్యంతరాలు లేని 1.74 లక్షల దరఖాస్తుదారులకు ఫీజుల చెల్లింపు కోసం పురపాలక శాఖ గతంలోనే సమాచారం ఇచ్చింది. వీరిలో 13,844 దరఖాస్తులకు సంబంధించి రూ.107.01 కోట్ల చెల్లింపులు కూడా గతంలో జరిగాయి. తాజాగా మార్చి 31వ తేదీలోపు ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించి అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించుకుంటే, ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది.



4 లక్షల దరఖాస్తులకు 'నీటి వనరుల' లింక్

ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులకు 200 మీటర్ల పరిధిలోపు ఉన్న వెంచర్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కుదరదని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. నీటి వనరులను ఆనుకుని ఏర్పాటు చేసిన లేఅవుట్లు, వ్యక్తిగత ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని ఇప్పటికే ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్‌లకు సమాచారం ఇచ్చిన నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను కూడా తిరస్కరించనున్నారు. వచ్చిన 25 లక్షల దరఖాస్తుల్లో ఇలాంటివి 4 లక్షల వరకు ఉండొచ్చని అంచనా. ఇక ఒక వెంచర్‌లో 100 ప్లాట్లు ఉంటే అందులో 10 ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు చేసుకుని ఉంటే, మిగతా 90 ప్లాట్లకు దరఖాస్తు చేసుకోకపోయినా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నారు. ఈ మేరకు విధి విధానాలను ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది.

14% ఓపెన్ స్పేస్ చార్జీలు

- → మొత్తం స్థలం విలువలో 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీల కింద చెల్లించాల్సి ఉంటుంది.
- → వెంచర్‌తో సంబంధం లేని వ్యక్తిగత ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు దరఖాస్తులు అవసరం లేదు. వాటిలో భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నప్పుడే ఎల్ఆర్ఎస్ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది.
- → వారసత్వ ఆస్తిని పిల్లలకు పంచినప్పుడు భాగస్వామ్య ఒప్పంద పత్రాలను రిజిస్ట్రేషన్ చేయిస్తే, ఎల్ఆర్ఎస్‌తో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్‌తో పాటు ఎల్ఆర్ఎస్ ఫీజు కడితే, భవన నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ లభిస్తుంది.
- → ఫాం లాండ్స్ పేరుతో ఎకరాల కొద్దీ భూమిని 150, 200 గజాలుగా విభజించి ప్లాట్లుగా విక్రయించారు. నాలా కన్వర్షన్ లేకుండా ఇందులో రోడ్లు వంటివి వేసినప్పటికీ, ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేయనప్పుడు..క్రమబద్ధీకరణ ప్రక్రియ వర్తించదు. 2020 ఆగస్టుకు ముందు లేఅవుట్ వేసి, 10 శాతం ప్లాట్లను విక్రయిస్తేనే క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంది.

అగ్రిగోల్డ్ బాధితులకు భారీ ఊరట

రూ.3,339 కోట్ల విలువైన జప్తు ఆస్తులు తిరిగి చెల్లించేందుకు కోర్టు అనుమతి

పీఎంఎల్ఏ సెక్షన్ 8(8) కింద పునరుద్ధరణకు దరఖాస్తు చేసిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: అగ్రిగోల్డ్ గ్రూప్ కంపెనీల చేతిలో మోసపోయిన బాధితులకు భారీ ఊరట లభించనుంది. కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఏపీ పోలీసులు జప్తు చేసిన రూ.3,339 కోట్ల విలువైన ఆస్తులను (అటాచ్‌మెంట్ సమయంలో ఆస్తుల విలువ) తిరిగి చెల్లించేందుకు పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు అనుమతించింది. ఈ ఆస్తుల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.6,000 కోట్ల కంటే ఎక్కువగానే ఉంటుందని అంచనా. జప్తు చేసిన ఆస్తులను బాధితులకు తిరిగి చెల్లించే ప్రక్రియలో భాగంగా ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయ అధికారులు 2024 డిసెంబర్‌లో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) 2002లోని సెక్షన్ 8(8) కింద పునరుద్ధరణ దరఖాస్తును పీఎంఎల్ఏ స్పెషల్ కోర్టులో దాఖలు చేశారు. దీనికి స్పందించిన కోర్టు జప్తు చేసిన ఆస్తులను బాధితులకు తిరిగి చెల్లించే ప్రక్రియ ప్రారంభించొచ్చని ఈనెల 21న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఈడీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని, అధిక రాబడి లేదంటే నివాస స్థలాలు తీసుకోవచ్చన్న హామీలతో అగ్రిగోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల యాజమాన్యం వేలాది మంది కమీషన్ ఏజెంట్ల ద్వారా 32 లక్షలకు పైగా పెట్టుబడిదారుల నుంచి దాదాపు రూ.6,380 కోట్లు వసూలు చేసింది. ఈ మోసాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, అండమాన్, నికోబార్‌లలో నమోదైన అనేక ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఏపీ సీఐడీతోపాటు 2018లో అగ్రిగోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీలపై ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు ఈడీ, ఏపీ సీఐడీ అధికారులు ఆస్తులు జప్తు చేశారు. జప్తు చేసిన ఆస్తుల్లో 2,300 కంటే ఎక్కువ వ్యవసాయ భూమి, నివాస, వాణిజ్య ప్లాట్లు, అపార్ట్‌మెంట్‌లు ఏపీలోని గుంటూరు జిల్లా, చిన్నకాకాని వద్ద 'హైలాండ్' పేరుతో ఉన్న వినోద ఉద్యానవనం ఉంది. ఈ జప్తు ఆస్తులను తిరిగి ఖాతాదారులకు ఇప్పించే ప్రక్రియకు కోర్టు అనుమతితో మార్గం సుగమమైనట్టు ఈడీ అధికారులు తెలిపారు.

కనీస అభ్యసన సామర్థ్యాల సాధనకు 'ఏఐ'

- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని స్లో లెర్నర్స్ కోసమే...
- 6 జిల్లాల్లోని ఆరు పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం

పాపన్నపేట(మెదక్): సర్కార్ బడుల్లోని ప్రాథమిక విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని జోడించింది. మెదక్ డీఈఓ రాధాకిషన్ సోమవారం బూర్గుపల్లి, మాసాయిపేట, తూప్రాన్, కాళ్లకల్, నర్సాపూర్, నిజాంపేట ప్రాథమిక పాఠశాలల్లో ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. మెదక్‌తోపాటు మరో ఐదు జిల్లాలోని 30 పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.

ఎఫ్ఎల్ఎన్‌కు ఇది మరింత మెరుగు

విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో సామర్థ్యాలను పెంపొందించేందుకు 2022లో ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. 2027 వరకు విద్యార్థికి రాయడం, చదవడం, సంఖ్యా భావనతోపాటు చతుర్విధ ప్రక్రియలు రావాలి. కానీ ప్రోగ్రాం ప్రారంభించి రెండేళ్లు దాటినా అనుకున్న లక్ష్యాలు సాధించలేకపోతున్నారు. దీంతో స్లో లెర్నర్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఏఐ జోడించే దిశగా కొత్త ప్రణాళికకు శ్రీకారం చుట్టారు.



మాసాయిపేటలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న మెదక్ డీఈఓ రాధాకిషన్

- ఒక్కో ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతి చదువుతున్న 10 మంది స్లో లెర్నర్స్‌ను ఎంపిక చేశారు. కంప్యూటర్, ఇయర్ హెడ్స్, స్పీకర్‌తోపాటు కంప్యూటర్ లాగిన్ ఐడీ నంబర్ ఇచ్చారు. ఎక్స్‌స్టెప్‌లో ఫౌండేషన్ ఏఐ లెర్నింగ్ టూల్స్, అసిస్టెడ్ లాంగ్వేజ్ లెర్నింగ్ (ఏఎల్ఎల్), అసిస్టెడ్ మ్యాథమెటిక్ లెర్నింగ్ (ఏఎంఎల్) ఇన్‌స్టాల్ చేశారు. ఎఫ్ఎల్ఎన్ ద్వారా నేర్చుకున్న అంశాలను కంప్యూటర్ ముందు చదివితే, తప్పుల కనుగుణంగా లోపాలను గుర్తిస్తుంది. 40 రోజులపాటు ఈ ప్రోగ్రామ్ కొనసాగనుంది.

అంతర్జాతీయ మహిళా సదస్సుకు నగరం ఆతిథ్యం

కోవె జాతీయ అధ్యక్షురాలు లలిత వెల్లడి



సనత్‌నగర్: అంతర్జాతీయ మహిళా సదస్సుకు నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (కోవె) ఆధ్వర్యంలో ఈనెల 28, మార్చి 1వ తేదీల్లో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో ఉమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, బీ2బీ ఎక్స్‌పో–2025ను నిర్వహించనున్నారు. ఈ సదస్సు సన్నాహక కార్యక్రమం సోమవారం బేగంపేట టూరిజం ప్లాజాలో జరిగింది. దీనికి హాజరైన కోవె జాతీయ అధ్యక్షు రాలు లలితా ఆలూరి మాట్లాడుతూ పలు రంగాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం, స్థిరమైన వ్యాపార వృద్ధికి దోహదపడటం లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ ప్రారంభిస్తారన్నారు. 'ఇన్నోవేషన్–సస్టెయినబిలిటీ–క్రాస్ బోర్డర్ కొలాబరేషన్' అనే థీమ్‌తో దీన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సమావేశంలో మాజీ జాతీయ అధ్యక్షురాలు మధు త్యాగి, జాతీయ కార్యదర్శులు నీరజారెడ్డి కోవె తెలంగాణ చాప్టర్ అధ్యక్షురాలు కల్పనారావు తదితరులు పాల్గొన్నారు.

బీరు బాటిల్‌లో మందుపాతర

నిర్వీర్యం చేసిన బీడీఎస్ టీం



చర్ల: కూంబింగ్‌కు వచ్చే పోలీసు బలగాలను మట్టుబెట్టాలనే ఉద్దేశంతో మావోయిస్టులు బీరు బాటిల్‌లో ఏర్పాటు చేసిన శక్తివంతమైన మందుపాతరను పోలీసులు నిర్వీర్యం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధి పిడియాలో ఇటీవల సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఏర్పాటు చేసి, సమీప అటవీ ప్రాంతంలో కొంతకాలంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే పిడియా నుంచి ముద్వెండి మార్గంలో సీఆర్‌పీఎఫ్ 85, కోబ్రా 199 బెటాలియన్ల బలగాలు రోడ్డుకిరువైపులా తనిఖీలు చేపడుతున్నాయి. పిడియా నుంచి రెండు కిలోమీటర్ల వద్ద రోడ్డుకు సుమారు 100 మీటర్ల దూరంలో చెట్ల మధ్య వారికి ఓ బీరు బాటిల్ కనిపించింది. దీన్ని పరిశీలించగా అందులో శక్తివంతమైన మందుపాతర ఉండటంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి బీడీఎస్ టీంను రప్పించారు. ఈ బృందం సీసాలోని మందుపాతరను నిర్వీర్యం చేయడంతో బలగాలకు ప్రమాదం తప్పినట్లయింది.

కృష్ణా జలాలపై రాజీ మార్గం!

తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అంగీకారం

- రెండు రాష్ట్రాల సీఈలతో కమిటీ ఏర్పాటు
- సాగర్ కుడి, ఎడమ కాల్వల నీటి అవసరాలపై నివేదిక ఇవ్వనున్న కమిటీ
- కృష్ణా బోర్డు అత్యవసర సమావేశంలో నిర్ణయాలు
- 27న కృష్ణా బోర్డు తదుపరి సమావేశంలో కేటాయింపులపై ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో మిగిలి ఉన్న కొద్దిపాటి నిల్వలను తాగు, సాగునీటి అవసరాలకు వాడుకునే విషయంలో పరస్పర అంగీకారంతో రాజీమార్గంలో నడుచుకోవాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు నిర్ణయం తీసుకున్నాయి. వచ్చే జూలై వరకు తాగు, సాగునీటి అవసరాలకోసం కృష్ణా జలాల వినియోగంపై చర్చించడానికి సోమవారం జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అత్యవసర సమావేశంలో ఈ మేరకు రెండు రాష్ట్రాలు ఓ అవగాహనకు వచ్చాయి. బోర్డు చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) జీ.అనిల్‌కుమార్, ఈఎన్సీ (ఓఅండ్ఎం) విజయభాస్కర్, డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్, ఏపీ తరఫున ఈఎన్సీ వెంకటేశ్వరరావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇప్పటికే ఏపీ తమ వాటాకి మించి కృష్ణా జలాలను వాడుకున్నందున ఇకపై ఆ రాష్ట్రం శ్రీశైలం, సాగర్ నుంచి నీళ్లు తీసుకోకుండా నిలువరించాలని తెలంగాణ అధికారులు వాదించారు. వచ్చే మేలో సాగర్ ఎడమ కాల్వ, ఏఎమ్మార్పీ, కల్వకుర్తి ప్రాజెక్టుల అవసరాలకు 90 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు మరో 17 టీఎంసీలు కలిపి మొత్తం 107 టీఎంసీలను తమ రాష్ట్రానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత జూన్ 1 నుంచి జూలై 31వ తేదీ వరకు తాగునీటి అవసరాలకోసం మరో 9 టీఎంసీలను కేటాయించాలని కోరారు. రబీలో సాగర్ ఎడమ కాల్వ కింద 6.38 లక్షల ఎకరాలు, కల్వకుర్తి లిఫ్టు కింద 2.8 లక్షల ఎకరాలు, ఏఎమ్మార్పీ ఎస్ఎల్‌బీసీ కింద 2.39 లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయని, ఏపీని నిలువరించకపోతే ఈ పంటలను కాపాడుకోవడం కష్టంగా మారుతుందని తెలంగాణ అధికారులు బోర్డుకు వివరించారు. కాగా, ఏపీలో సైతం సాగునీటి అవసరాలున్నాయని ఆ రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్సీ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల వాదనలు విన్న కృష్ణా బోర్డు.. మధ్యేమార్గంగా సాగర్ జలాలపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి రెండు రాష్ట్రాలకు చెందిన చీఫ్ ఇంజనీర్లతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సాగర్ కుడి కాల్వ (ఏపీ) సీఈ, నల్లగొండ (తెలంగాణ) సీఈ ఈ కమిటీలో ఉంటారు. ఈ కమిటీ మంగళవారం నల్లగొండలో సమావేశమై చర్చించనుంది. కుడి, ఎడమ కాల్వలకు ఎంత నీరు అవసరం? ఎంత నీళ్లు విడుదల చేయాలి? అనే అంశంపై వీరు నిర్ణయం తీసుకుని కృష్ణా బోర్డుకు నివేదిక సమర్పిస్తారు. కాగా, ఈ నెల 27న కృష్ణా బోర్డు మళ్లీ సమావేశమై ఈ ప్రతిపాదనల ఆధారంగా నీటి కేటాయింపులు, వాటర్ రిలీజ్ ఆర్డర్ల జారీపై నిర్ణయం తీసుకోనుంది.



సమావేశానికి హాజరైన రాహుల్ బొజ్జా

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం । 25-2-2025

ప్రకృతి పరవశం.. పక్షుల ప్రతిబింబం

చెరువు గట్టుపై వరుసగా నిల్చొని సేదతీరుతున్న పక్షులు.. నీటిలో కనిపించే వాటి ప్రతిబింబం.. ఆహార వేటలో అలసిపోయి అమాయకంగా కనిపించాయి. మనుషుల చప్పుడు కాగానే తుర్రుమంటూ ఎగిరిపోయాయి. ఈక్రమంలోనూ చూపరులకు ఆహ్లాదం పంచాయి. బుడుబుంగల సందడి.. కొంగలు, ఇతర పక్షుల పరవశం.. ప్రకృతి ప్రేమికులను కట్టిపడేశాయి. పెద్దపల్లి పట్టణ శివారులోని చెరువులో సోమవారం కనిపించిన అందమైన దృశ్యాలివీ..


– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి






ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో తగ్గిన యూరియా ఉత్పత్తి

వార్షిక ఉత్పత్తి లక్ష్యం 12.7 లక్షల మెట్రిక్ టన్నులు	ప్లాంట్‌లో సాంకేతిక సమస్యతో ఉత్పత్తికి అంతరాయం	రూ.150 కోట్లతో సల్ఫర్ కోటెడ్ యూరియా ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం



పది నెలల్లో వివిధ రాష్ట్రాలకు సరఫరా చేసిన యూరియా (మెట్రిక్ టన్నుల్లో)

రాష్ట్రం	సరఫరా
తెలంగాణ	3,60,882.13
ఆంధ్రప్రదేశ్	1,18,333.21
కర్ణాటక	1,66,276.89
మధ్యప్రదేశ్	1,05,722.64
తమిళనాడు	93,282.21
మహారాష్ట్ర	75,094.83
ఛత్తీస్‌గఢ్	19,555.92

ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం

ఫెర్టిలైజర్ సిటీ (రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) కర్మాగారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేయాలని లక్ష్యాన్ని విధించింది. ప్లాంట్ సామర్థ్యం రోజూ 3,850 మెట్రిక్ టన్నుల యూరియా, 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తోంది. ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు 9,74,691.54 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసింది. అయితే సాంకేతిక సమస్యలతో ఉత్పత్తి భారీగా తగ్గింది. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటి నుంచి మార్చి 31వ తేదీ వరకు 2,95,308.46 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేయాల్సి ఉంది. దీంతో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంపై ప్రత్యేక దృష్టి సారించింది.

సల్ఫర్ కోటెడ్ యూరియా కోసం రూ.150 కోట్లు

ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో రూ.150 కోట్ల వ్యయంతో సల్ఫర్ కోటెడ్ యూరియా ఉత్పత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఇక్కడ నీమ్ కోటెడ్ యూరియా తయారు చేస్తున్నారు. దేశీయంగా వంట నూనెలకు డిమాండ్ అధికంగా ఉండటంతో వాటికి కొరత లేకుండా కేంద్ర ప్రభుత్వం తెలంగాణతోపాటు అన్ని రాష్ట్రా ల్లో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు శ్రీకారం చుట్టింది. రామగుండం ఎరువుల కర్మాగారంలో సల్ఫర్ కోటెడ్ యూరియా ఉత్పత్తితో ఆయిల్ పామ్ సాగుకు ఉపయోగకరంగా ఉంటుంది.

పొరుగు రాష్ట్రాలకూ సరఫరా

తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాలకూ ఆర్‌ఎఫ్‌సీఎల్ యూరియా సరఫరా చేయడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. అయితే, కర్మాగారంలో సాంకేతిక సమస్యలతో ప్లాంట్ షట్‌డౌన్ అయింది. దీంతో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యం చేరుకోలేకపోతోంది.

25 రోజుల పాటు ప్లాంట్ షట్‌డౌన్

2024, సెప్టెంబర్ 6న అమ్మోనియా పైప్‌లైన్ లీక్ కావడంతో ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. అక్టోబర్ 9, 2024, సంస్థ సీఎండీ శరవణన్ ప్లాంట్‌లో సాంకేతిక సమస్యలపై అధికారులతో చర్చించారు. ఆర్థిక సంవత్సరంలో సుమారు 25 రోజులపాటు ప్లాంట్ షట్‌డౌన్ ఉండటంతో యూరియా ఉత్పత్తిపై ప్రభావం చూపిందని అధికారులు తెలిపారు.



14 నెలలుగా అసెంబ్లీకి రాకుండా కేసీఆర్ రికార్డు

14 వేల పరుగులు సాధించి కోహ్లి రికార్డు: మంత్రి సురేఖ



సాక్షి, హైదరాబాద్: వన్డేల్లో 14 వేల పరుగులు సాధించి విరాట్ కోహ్లి రికార్డు సృష్టిస్తే, 14 నెలలుగా అసెంబ్లీకి రాకుండా మాజీ సీఎం కేసీఆర్ కూడా రికార్డు సృష్టించారని దేవాదాయ, అటవీ శాఖమంత్రి కొండా సురేఖ ఎద్దేవా చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'దుబాయ్ వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించడం హర్షణీయం. ఈ విజయాన్ని అందరం టీవీల్లో చూసి సంబురపడ్డాం. క్రికెట్‌లో అది విరాట్ కోహ్లి పర్వం అయితే, ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ప్రజలకు అందుబాటులో లేకుండా పోవడం దేశ రాజకీయ చరిత్రలో పెద్ద రికార్డే కదా? ఇది కేసీఆర్ విరాట పర్వం' అని ఆ ప్రకటనలో సురేఖ వెల్లడించారు.

బీఆర్‌ఎస్ నేత జీవన్‌రెడ్డి కేసుపై వివరణ ఇవ్వండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లిలో భూ వివాదంపై చేవెళ్ల పీఎస్‌లో దాఖలైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణేంటో చెప్పాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేసేందుకు వారం సమయం ఇస్తూ.. తదుపరి విచారణను మార్చి 3కు వాయిదా వేసింది. జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు తన భూమిని కబ్జా చేశారని దామోదర్‌రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో 2024, మేలో కేసు నమోదైంది. తన భూమి కబ్జా గురించి ప్రశ్నిస్తే మారణాయుధాలు చూపించి బెదిరింపులకు పాల్పడ్డారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తొలుత ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ జీవన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే విచారణ ఎదుర్కోవాల్సిందేనని చెబుతూ హైకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ముందస్తు బెయిల్ కోరుతూ జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని ఏపీపీ డాక్టర్ ఎస్.ప్రశాంత్ విజ్ఞప్తి చేయడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను వాయిదా వేశారు.

మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలి

రూ. 25 వేల గిట్టుబాటు ధర కల్పించాలి: జూలకంటి

సాక్షి, హైదరాబాద్: మిర్చి పంటను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే క్వింటాలుకు రూ. 25 వేల చొప్పున కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ గ్రీన్‌మార్కెట్‌ను సందర్శించి మిర్చి పంట ధరలను పరిశీలించిన ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, తదితర జిల్లాల్లో గత సంవత్సరం 3.58 లక్షల ఎకరాలలో 70 లక్షల క్వింటాళ్ల మిర్చి దిగుబడి రాగా, క్వింటాల్‌కు రూ. 20–25 వేల గిట్టుబాటు ధర లభించిందని తెలిపారు. ఈ సంవత్సరం 2.30 లక్షల ఎకరాలలో మిర్చిని పండిస్తే 50 లక్షల క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని తెలిపారు. గత సంవత్సరం కన్నా విస్తీర్ణం, దిగుబడి తగ్గినా, ధర సగానికి పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు మాసాల నుండి మిర్చికి గిట్టుబాటు ధర లేక, పెట్టిన పెట్టుబడి కూడా రావటం లేదని రైతులు ఆవేదనతో చెప్పారన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా క్వింటాల్ మిర్చికి 25 వేల రూపాయలు గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేసేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

సామాజిక అవసరాలు గుర్తించడం అభినందనీయం

సీఆర్‌పీలకు మంత్రి సీతక్క ప్రశంసలు



సాక్షి, హైదరాబాద్: మహిళల ఆర్థికమైన అవసరాలే కాకుండా సామాజిక అవసరాలను కూడా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీ) గుర్తించడం అభినందనీయమని పీఆర్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలు ఒకరికొకరు అండగా ఉండే విధంగా ప్రభుత్వపరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వారు తెలియజేయాలని సూచించారు. సోమవారం రాత్రి మంచిర్యాల నుంచి ఆమె వర్చువల్‌గా సీఆర్‌పీలతో మాట్లాడారు. రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీ సమావేశ మందిరంలో వీరి సమావేశానికి సీతక్క హాజరుకావాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో ఆలస్యమైంది. దీంతో టీజీఐఆర్డీలోనే తన కోసం వేచిచూస్తున్న సీఆర్‌పీల సమావేశంలో సీతక్క వర్చువల్‌గా పాల్గొన్నారు. గ్రామ సమాఖ్యల అనుభవాలు తెలుసుకోవడంతోపాటు వారి పనితీరును మెరుగుపరిచేందుకు గత 15 రోజులపాటు సీఆర్‌పీలు గ్రామాల్లో శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా... ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లో గ్రామ సమాఖ్యలతో సీఆర్పీ లు సమావేశం కాగా, దీనికి సంబంధించి గ్రామీణ దారిద్ర్య నిర్మూలనా సంస్థ (సెర్ప్) సీఈవో దివ్య దేవరాజన్, ఇతర అధికారులు ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు.

ఆధార్ లేకుంటే వైద్యానికి నిరాకరిస్తున్నారా?

వివరాలు చెప్పాలని స్పెషల్ జీపీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ఆధార్ లేకుంటే వైద్యానికి నిరాకరిస్తున్నారా? అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. వివరాలు తెలుసుకొని చెప్పాలని స్పెషల్ జీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఓయూలో ఆధార్ లేకుంటే వైద్యం చేయట్లేదంటూ న్యాయవాది బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుకయారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ వాదిస్తూ ప్రభుత్వాస్పత్రిలో వైద్యానికి ఆధార్ తప్పనిసరి అనడం చట్టవిరుద్ధమన్నారు. ఆధార్ అడగకుండా వైద్యం అందించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాగా, ఆధార్ లేకున్నా వైద్యం అందిస్తున్నామని స్పెషల్ జీపీ రాహుల్ పేర్కొన్నారు.

సినీ నిర్మాత దిల్ రాజుకు ఊరట

- మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమా కేసులో ట్రయల్ కోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే
- రెండు వారాల పాటు విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమా కాపీరైట్ వివాదానికి సంబంధించి దిల్ రాజుపై చర్యలు తీసుకోవాలంటూ సిటీ సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు రెండు వారాల పాటు స్టే విధించింది. అంతేకాక తదుపరి విచారణ వరకు దిల్ రాజుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. 'నా మనసు నిన్ను కోరే నవల'ఆధారంగా 'మిస్టర్ పర్‌ఫెక్ట్'అనే సినిమా తీశారంటూ రచయిత్రి ముమ్ముడి శ్యామలాదేవి 2017లో దిల్ రాజుపై కేసు పెట్టారు. దీంతో మాదాపూర్ పోలీసులు నిర్మాత దిల్ రాజుపై కాపీ రైట్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసు విచారణ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో జరిగింది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్న సిటీ సివిల్ కోర్టు.. సాక్ష్యాలను పరిశీలించి 2019లో దిల్ రాజుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అయితే ఈ ఉత్తర్వులను కొట్టివేయాలంటూ దిల్ రాజు సుప్రీం కోర్టును ఆశ్రయించగా జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను రెండు వారాలపాటు వాయిదా వేసింది. అప్పటి వరకు సిటీ సివిల్ కోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది.

రంజాన్ ప్రారంభమవుతున్నా సమీక్ష ఎక్కడ?

ప్రశ్నించిన బీఆర్‌ఎస్ మైనారిటీ నేతలు



సాక్షి, హైదరాబాద్: త్వరలో రంజాన్ మాసం ప్రారంభం కాబోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం సమీక్ష నిర్వహించలేదని, రంజాన్‌కు నిధులు కేటాయించలేదని బీఆర్‌ఎస్ మైనారిటీ నేతలు సయ్యద్ అక్బర్ హుస్సేన్, వహీద్ అహ్మద్ విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. 14 నెలల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. మైనారిటీలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తున్న హామీలు ఆచరణ కావడంలేదన్నారు. మైనారిటీ డిక్లరేషన్ అని ఎన్నో హామీలిచ్చినా ఒక్కటి కూడా అమలు కాలేదని, మైనారిటీ కమిషన్ వేయలేదని, బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, ఈ ప్రభుత్వంలో మైనారిటీకి మంత్రిలేదని విమర్శించారు. బీజేపీతో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని, బీజేపీని గెలిపించేందుకు సీఎం శాయశక్తులా ప్రయత్ని స్తున్నారని ఆరోపించారు. మైనారిటీలకు ఇచ్చిన హామీలపై సీఎం స్పందించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నాడు కళకళ... నేడు వెల వెల

జీవనదిగా పేరుగాంచిన జంపన్నవాగు వెలవెలబోయి కనిపిస్తోంది. ములుగు జిల్లా ఏటూరునాగారం పరిధిలోని ఈ వాగు వర్షాకాలంలో భారీవరదలతో జలకళతో ఊగిసలాడింది. అదే జంపన్నవాగు (దయ్యాలవాగు) నేడు వెలవెలబోయి కనిపిస్తోంది. ఇసుక తిన్నెలు కనిపిస్తున్నాయి. తాగు, సాగు నీరు అందించడానికి చెక్ డ్యామ్‌లు కడితే ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, పాలకులు, అధికారులు దృష్టి పెట్టకపోవడంతో వందలాది క్యూసెక్కుల నీరు వృథాగా గోదావరిలో కలిసి పోతోందని స్థానికులు చెబుతున్నారు.

– ఏటూరునాగారం



ఏటూరునాగారంలో జులైలో ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు



వెలవెలబోయి కనిపిస్తున్న జంపన్నవాగు



సప్తవర్ణశోభితం

చీకట్లను చీల్చుతూ.. వెలుగులు విరజిమ్ముతూ పైకి వస్తున్న ఉదయభానుని కిరణాలకు ప్రకృతి పరవశిస్తోంది. కొండమాటునుంచి నిశ్చల సరోవరంలో జలాలను తాకిన లేలేత కిరణాలు దశదిశలా సప్తవర్ణాలను వెదజల్లుతున్నాయి. ఈ మనోహర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



జగజ్జనని కల్యాణం..

ఆదిదేవుడు శివుడు.. జగజ్జనని పార్వతీదేవి కల్యాణ ఘట్టాన్ని కూచిపూడి కళాకారులు కళ్లముందు ఆవిష్కరింపజేశారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో కూచిపూడి కళాకారులు ప్రదర్శించిన ఈ నృత్యరూపకం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



దేదీప్యమానం

మహాశివరాత్రికి రాష్ట్రవ్యాప్తంగా శివాలయాలు ముస్తాబవుతున్నాయి. విజయవాడ సమీపంలోని యనమలకుదురు గ్రామంలో శివాలయం ఇలా విద్యుత్‌ దీప కాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా...

మార్చి 3 నుంచి 'పది' విద్యార్థులకు గ్రాండ్‌ టెస్ట్‌



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్‌ టెస్ట్‌ నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌ విడుదల చేసింది. మార్చి 3 నుంచి 13వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్య డైరెక్టర్‌ విజయ్‌ రామరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 3న తెలుగు, ఫస్ట్‌ లాంగ్వేజ్‌ పేపర్‌–1 (కాంపోజిట్‌ కోర్సు), 4న హిందీ, 5న ఇంగ్లిష్, 6న ఫస్ట్‌ లాంగ్వేజ్‌ పేపర్‌–2 (కాంపోజిట్‌ కోర్సు), ఓఎస్‌ఎస్‌సీ మెయిన్‌ లాంగ్వేజ్‌ పేపర్‌–1, 7న మ్యాథమెటిక్స్, 10న ఫిజికల్‌ సైన్స్, 11న బయలాజికల్‌ సైన్స్, 12న ఓఎస్‌ఎస్‌సీ మెయిన్‌ లాంగ్వేజ్‌ పేపర్‌–2, 13న సోషల్‌ స్టడీస్‌ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల డీఈవోలను ఆదేశించారు.

376 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం

సాక్షి, అమరావతి: ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం చర్యలు చేపట్టింది. ఒక్కో పాఠశాలకు రూ.13.05 లక్షల చొప్పున మొత్తం 376 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి రూ.49.07 కోట్లు కేటాయించింది. మొదటి విడతగా పాఠశాలకు రూ.5.22 లక్షల చొప్పున రూ.19.63 కోట్లను (40 శాతం) విడుదల చేస్తూ సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వారీగా విడుదలైన నిధుల జాబితాను డీఈవోలకు పంపించడంతో పాటు గదులు నిర్మించాల్సిన పాఠశాలల జాబితాను కూడా ప్రకటించారు. ప్రస్తుతం విడుదలైన నిధులను మార్చి 2025 లోగా ఖర్చు చేసి, గదుల నిర్మాణ పనులు ఈ ఏడాది మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఎస్పీడీ ఆదేశించారు.

'నర్సింగ్‌ విద్యాసంస్థల్లో అవకతవకలు లేవు'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రైవేట్‌ నర్సింగ్‌ విద్యాసంస్థల నిర్వహణలో అవకతవకలు లేవని ఆంధ్రప్రదేశ్‌ నర్సింగ్‌ ఇనిస్టిట్యూషన్స్‌ మేనేజ్‌మెంట్‌ అసోసియేషన్‌ స్పష్టం చేసింది. దినపత్రికల్లో (సాక్షి కాదు) వచ్చిన వార్తలను ఖండిస్తూ అసోసియేషన్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.చెన్నారెడ్డి, ఈ.ప్రభుదాస్‌ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 3 నుంచి 19వ తేదీ వరకు డైరెక్టర్‌ ఆఫ్‌ మెడికల్‌ ఎడ్యుకేషన్‌ ఆదేశాలతో అన్ని విద్యాసంస్థల అనుమతులను పరిశీలించారని, ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా విద్యాసంస్థలను నిర్వహించడంలేదని తేలిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 307 ప్రైవేట్‌ నర్సింగ్‌ స్కూల్స్, 242 నర్సింగ్‌ కళాశాలలు ప్రైవేట్‌ యాజమాన్యాల ఆధ్వర్యంలో నడుస్తున్నాయని తెలిపారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ప్రైవేట్‌ నర్సింగ్‌ విద్యాసంస్థలకు ఫీజు బకాయిలు చెల్లించి ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రూ.30 క్వింటాళ్ల మిర్చి దగ్ధం



పెద్దదోర్నాల: కళ్లాల్లో ఆరబెట్టిన 30 క్వింటాళ్ల మిర్చి అగ్నికి ఆహుతైన సంఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని గంటవానిపల్లెలోని సోమవారం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి అందిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పాత్లావత్‌ చిన్న నాగే నాయక్‌ తన 2 ఎకరాల వ్యవసాయ భూమిలో మిర్చి పంట సాగు చేశాడు. తొలి కాపులో 15 క్వింటాళ్లు దిగుబడి రాగా, రెండో కాపులో 30 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. దీంతో సమీపంలోని వ్యవసాయ భూమిలో మిర్చిని ఆరబెట్టారు. ఈ క్రమంలో కళ్లంలో ఆరబెట్టిన మిర్చి పంటలో హఠాత్తుగా పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న పాత్లావత్‌ చిన్న నాగేనాయక్‌ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఇతర కళ్లాలకు వ్యాపించకుండా నిరోధించారు. ఈ ఘటనపై రైతు నాగేనాయక్‌ అనుమానాలు వ్యక్తం చేశాడు.

క్యాష్‌ కొట్టు.. ఎంపానెల్‌మెంట్‌ పట్టు!



ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌ ఆసుపత్రుల ఎంపిక ప్రక్రియలో నిబంధనలకు తూట్లు

- ఫస్ట్‌ ఇన్‌ ఫస్ట్‌ ఔట్‌ విధానానికి పాతర
- మంత్రుల సిఫార్సుతో ట్రస్టులో తిష్ట వేసిన అధికారుల నిర్వాకం

సాక్షి, అమరావతి: బీమా విధానం ప్రవేశపెట్టడం కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని గాలికి వదిలేసిన టీడీపీ కూటమి ప్రభుత్వం పథకం అమలు, ట్రస్ట్‌ నిర్వహణను తొమ్మిది నెలల్లో అస్తవ్యస్తంగా మార్చేసింది. ఇదే అదునుగా మంత్రుల సిఫార్సులతో ట్రస్ట్‌లో మకాం వేసిన కొందరు అధికారులు అడ్డగోలు దోపిడీకి తెర తీశారు. ఎంపానెల్‌మెంట్‌ ప్రక్రియను అవినీతిమయంగా మార్చేశారని ఆస్పత్రుల నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఫస్ట్‌ ఇన్‌ ఫస్ట్‌ ఔట్‌ (ఫీఫో) విధానంలో ఎంపానెల్‌మెంట్‌ దరఖాస్తులను పరిశీలించి ఆమోదించగా ట్రస్ట్‌లో ముఠాగా ఏర్పడిన కొందరు అధికారులు దీనికి తూట్లు పొడిచినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం బీమా విధానాన్ని ప్రవేశపెట్టే యోచనలో ఉన్న నేపథ్యంలో ఎంపానెల్‌మెంట్‌ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపేయాలని ట్రస్ట్‌ సీఈవోను వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గతేడాది ఆదేశించారు. అయితే సీఈవోలు మారిపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వసూళ్ల దందాకు తెర తీశారు. ఫీఫో విధానాన్ని పక్కన పెట్టి 15 – 20 ఆస్పత్రుల నుంచి డబ్బులు వసూళ్లు చేసి అనుమతులు జారీ చేశారు.

కొత్త దరఖాస్తులు..

ఎన్నికల కోడ్‌ కారణంగా గతేడాది మార్చి నుంచే కొత్త ఎంపానెల్‌మెంట్‌ దరఖాస్తులను తీసుకోవడం నిలిపివేశారు. అయితే ట్రస్ట్‌లో పాగా వేసిన ముఠా ఆన్‌లైన్‌లో ఎంపానెల్‌మెంట్‌ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించి కొన్ని ఆస్పత్రుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు వెల్లడైంది. సీఈవో ఆమోదం అనంతరం ఎంపానెల్‌మెంట్‌ ప్రక్రియ పూర్తయినట్టు ఆస్పత్రులకు నేరుగా మెయిల్‌ వెళ్లే విధానాన్ని నిలిపివేసి లాగిన్‌లు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులున్నాయి. రెవెన్యూ మంత్రి సిఫార్సుతో డిప్యుటేషన్‌పై ట్రస్ట్‌కు వచ్చిన ఓ అధికారికి కీలకమైన ఎంపానెల్‌మెంట్‌ ఇన్‌చార్జ్‌ బాధ్యతలను కట్టబెట్టారు. ఎంపానెల్‌మెంట్‌ దరఖాస్తుల ఆధారంగా ఆస్పత్రుల్లో తనిఖీలకు ప్రత్యేక బృందాలను నియమించి ఆ నివేదిక ఆధారంగా అన్ని అర్హతలున్న దరఖాస్తులనే ఆమోదిస్తారు. ఈ ప్రక్రియలో పారదర్శకతకు పాతరేసి ఎంపానెల్‌మెంట్‌ విభాగాధిపతిగా ఉన్న సదరు అధికారి ఆస్పత్రుల్లో ఇన్‌స్పెక్షన్‌లు నిర్వహించి, తానే నివేదిక రూపొందించి, ఆమోదించే వరకూ అన్ని పనులను చక్కబెట్టినట్లు తెలుస్తోంది. వైద్య శాఖ మంత్రి సిఫార్సుతో ట్రస్ట్‌లో మరో అధికారి డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆయన పరిపాలన బాధ్యతలను పర్యవేక్షించాల్సి ఉండగా తనిఖీల పేరిట ఆస్పత్రుల్లో హడావుడి చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. వైద్యులు అందుబాటులో లేకపోవడం, సేవల్లో నిర్లక్ష్యం, ఇలా ఆస్పత్రులపై ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో ట్రస్ట్‌లో పనిచేసే వైద్యులను తనిఖీలకు పంపుతుంటారు. ఇందుకు విరుద్ధంగా నాన్‌–డాక్టర్‌ అయిన సదరు అధికారి తనిఖీలకు వెళ్లడం ఇదే తొలిసారని వైద్య శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇష్టారాజ్యంగా సస్పెన్షన్ల ఎత్తివేత

ఆస్పత్రులపై విధించిన సస్పెన్షన్‌ ఎత్తివేతలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. అక్రమాలకు పాల్పడటం, వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి సంబంధించి సుమారు 10 ఆస్పత్రులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతో పాటు పెనాల్టీని తొలగించారు. గుంటూరులో బ్రెయిన్‌ హెమరేజ్‌ చికిత్సల పేరిట దోపిడీకి పాల్పడిన ఓ ఆస్పత్రిపై గత ఏడాది సస్పెన్షన్‌ వేటు వేసి రూ.కోటి పెనాల్టీ విధించారు. ఈ ఆస్పత్రి యాజమాన్యంతో డీల్‌ కుదుర్చుకుని సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతో పాటు పెనాల్టీ భారీగా తగ్గించారు. కర్నూలు జిల్లా ఆదోనిలో వైద్యులు అందుబాటులో లేని ఓ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ సిఫార్సు చేస్తే రెండు వారాలు తిరగకుండానే దాన్ని ఎత్తివేశారు.

విద్యార్థులు కట్టిన ఫీజుతో ఉద్యోగి జంప్‌

హాల్‌ టికెట్లు ఇవ్వని యాజమాన్యం

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం ఇంటర్‌ విద్యార్థులకు చుక్కలు చూపిస్తోంది. కొంగారెడ్డిపల్లెలోని సీఎంటీ రోడ్డులో ఉన్న ప్రైవేటు కళాశాలలో విద్యార్థుల నుంచి ఫీజులు కట్టించుకునే ఉద్యోగి గత పది రోజులుగా కళాశాలకు రాలేదు. ఏమైందని యాజమాన్యం ఆరా తీస్తే, ఆమె ఉద్యోగం మానేసినట్లు సమాచారం అందింది. అయితే వచ్చేవారం నుంచి ఇంటర్‌ పరీక్షలు ప్రారంభం కానుండటంతో విద్యార్థులు హాల్‌ టికెట్లు తీసుకోవడానికి కళాశాల ఉద్యోగులను అడిగితే డబ్బులు కట్టాలని చెబుతున్నారు. తాము మొత్తం ఫీజు చెల్లించేశామని పిల్లలు చెబుతున్నా, యాజమాన్యం పట్టించుకోవడలేదు. డబ్బులు కట్టించుకున్న ఉద్యోగి ఎక్కడికో వెళ్లిపోయిందని.. తమకు కట్టాల్సిన మొత్తం పిల్లలు చెల్లించాల్సిందేనంటూ యాజమాన్యం భీష్మించుకుని కూర్చుంది. ఏడాదంతా కష్టపడి చదివి, పరీక్షలకు సన్నద్ధమవుతున్న వేళలో హాల్‌ టికెట్లు ఇవ్వమని కళాశాల నిర్వాహకులు విద్యార్థుల కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారు. సోమవారం పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాల వద్దకు వచ్చి హాల్‌టికెట్లు అడిగినా ఇవ్వలేదు. ఉద్యోగి డబ్బులు వాడేసుకుని ఉంటే, పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన నిర్వాహకులు.. పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారు. దీనిపై ఇంటర్‌ బోర్డు అధికారులు స్పందించి విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇప్పించాలని.. కళాశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

'దూర'మవుతున్న విద్య

పదేపదే పరీక్షలు వాయిదా

- ఎస్వీ వర్సిటీ దూరవిద్య పరీక్షలపై గందరగోళం
- గడిచిన రెండు నెలల్లో మూడుసార్లు షెడ్యూల్‌ విడుదల
- ఏదో ఒక సాకుతో వాయిదా... తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికలు అడ్డు
- అధికారుల నిర్లక్ష్యం... విద్యార్థుల పాలిట శాపం

వివిధ కారణాలతో చదువుకోలేకపోయిన వారికి దూరవిద్య ఓ మంచి అవకాశంగా మారింది. తమకు నచ్చిన కోర్సుల్లో డిగ్రీ చేసి, వివిధ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండటంతో చాలామంది ఈ బాట పడుతున్నారు. కానీ.. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో దూరవిద్యలో చేరిన అభ్యర్థులకు మాత్రం విద్య 'దూర'మయ్యే పరిస్థితి ఏర్పడింది. సమయానికి పరీక్షలు నిర్వహించకపోవడంతో డిగ్రీలు ఎప్పటికి చేతికొస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

– సాక్షి, అమరావతి



తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ దూరవిద్య పరీక్షల్లో గందరగోళం నెలకొంది. గడిచిన విద్యా సంవత్సరానికి సంబంధించి పరీక్షల షెడ్యూల్‌ ఆలస్యంగా ఇచ్చారు. అంతేకాకుండా పదేపదే మార్పులు చేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరిలో పరీక్షల తేదీలను మూడుసార్లు ప్రకటించి.. వివిధ కారణాలతో వాయిదా వేయడం వర్సిటీ అధికారుల నిర్లక్ష్య వైఖరిని స్పష్టం చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వర్సిటీల పాలన దిగజారింది. అప్పటి వరకు ఉన్న వీసీలతో బలవంతంగా రాజీనామా చేయించడం, అనంతరం వీసీల నియామకంలో ఆలస్యం జరిగింది. ఇప్పటికీ వైస్‌చాన్సలర్‌లను నియమించడంలో ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది.

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు

ఎస్వీ వర్సిటీ దూర విద్య ద్వారా అందించే యూజీ, పీజీ, ఎంబీఏ వంటి కోర్సుల్లో రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల అభ్యర్థులూ ప్రవేశాలు పొందారు. అలా 2023–24 విద్యా సంవత్సరానికి సుమారు 32 వేలమందికి పైగా అభ్యర్థులు వివిధ దశల్లో పరీక్షలు రాయాల్సి ఉంది. గతేడాది ఎన్నికల కారణంగా పరీక్షల షెడ్యూల్‌నే ప్రకటించలేదు. ఈ కారణంగా సెప్టెంబర్‌లో దూరవిద్య పరీక్షలు జరగాల్సి ఉండగా కూటమి ప్రభుత్వ కనుసన్నల్లో నడిచిన వర్సిటీ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. అభ్యర్థుల నుంచి ఒత్తిడి పెరగడంతో జనవరిలో పరీక్షలంటూ డిసెంబర్‌ చివరిలో షెడ్యూల్‌ విడుదల చేసింది. అయితే యూజీసీ కమిటీ పర్యటన కారణంగా పరీక్షలను సంక్రాంతి తర్వాత అంటూ వాయిదా వేసింది. అనంతరం ఫిబ్రవరి మొదటివారం మరో షెడ్యూల్‌ ఇచ్చింది. దాన్ని కూడా వాయిదా వేసింది. తాజాగా ఫిబ్రవరి 24 నుంచి పరీక్షలంటూ షెడ్యుల్‌ ఇచ్చింది. అభ్యర్థులు హాల్‌ టికెట్స్‌ డౌన్‌లోడ్‌ చేసుకున్నారు. పరీక్ష పత్రాలు ఎగ్జామ్‌ సెంటర్‌కు కూడా చేరిపోగా... ఒక్కరోజు ముందు ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా వాయిదా వేస్తున్నామంటూ వర్సిటీ ప్రకటించింది.

పరీక్షలు నిర్వహించే ఉద్దేశమే లేదు

ఎస్వీ వర్సిటీ అధికారులకు దూరవిద్య పరీక్షలను నిర్వహించే ఉద్దేశమే లేదని అభ్యర్థులు మండిపడుతున్నారు. పదేపదే పరీక్షల షెడ్యూల్‌ వాయిదా వేయడంతో ఇబ్బందులు గురవుతున్నామని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టభద్రులై బయటకు వస్తే ఉద్యోగాలు వచ్చేంత వరకు వారందరినీ నిరుద్యోగులుగా గుర్తించాలని... దీంతో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుందనే దురుద్దేశంతో కూటమి ప్రభుత్వం పరీక్షలను అడ్డుకుంటోందని మండిపడుతున్నారు. వ్యయప్రయాసల కోర్చి, ఫీజులు చెల్లించి... సకాలంలో డిగ్రీ పూర్తి చేయాల్సిన తాము.. ఎనిమిదినెలలకు పైగా ఆలస్యంగా పరీక్షలు రాసి... డిగ్రీలు పొంది ప్రయోజనమేంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షల కోసం ఆత్మహత్యాయత్నం

వైఎస్సార్‌ కడప జిల్లాకు చెందిన ఓ ఏఎన్‌ఎం ఎస్వీ వర్సిటీ దూరవిద్యలో చేరారు. ఈనెల 24 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని వైద్యాధికారిని సెలవులు అడిగారు. కానీ సెలవు మంజూరు చేయకపోవడంతో తాను పరీక్షలు రాయలేనన్న బాధతో ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించారు.

దూరవిద్యలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్థులు

వాస్తవానికి దూర విద్య కోర్సులను అభ్యసించే వారిలో సాధారణ విద్యార్థులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్‌ రంగాల్లో వివిధ స్థాయిల్లో ఉద్యోగాలు చేసుకుంటూ చదువుకునే వాళ్లు అధికంగా ఉంటారు. వీరిలో ఇతర రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులూ ఉన్నారు. వర్సిటీ దూరవిద్య పరీక్షల షెడ్యూల్‌ ఫిబ్రవరి 24న ప్రకటించడంతో చాలామంది ఉద్యోగులు సెలవులు పెట్టుకుని మరీ పరీక్షలకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. తీరా పరీక్షలు వాయిదా పడటంతో గందరగోళానికి గురయ్యారు.

అయోమయంలో ఒడిశా అభ్యర్థులు

మరోవైపు ఒడిశా రాష్ట్రానికి చెందిన దాదాపు 30మంది అభ్యర్థులు రెండేళ్ల క్రితం ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్యలో పీజీ కోర్సుల్లో చేరారు. వారంతా ఈనెల 24నుంచి పరీక్షలుండటంతో చిత్తూరు చేరుకున్నారు. తీరా 22న పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు వర్సిటీ ప్రకటించింది. ఎప్పుడు నిర్వహించేది చెప్పలేదు. దీంతో వారంతా ఏపీలో ఉండాలో... ఒడిశా వెళ్లాలో తెలియని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 78,892 మంది స్వామివారిని దర్శించుకోగా 25,930 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు సమర్పించారు. టైంస్లాట్‌ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సూర్య, చంద్ర ప్రభలపై సర్వాంతర్యామి



చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో జరుగుతున్న వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం శ్రీమన్నారాయణుడి అలంకరణలో స్వామి వారు సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ కనువిందు చేశారు. రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. ఆలయ స్పెషల్‌ గ్రేడ్‌ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్‌ పాల్గొన్నారు. వెంకన్న బ్రహ్మోత్సవాల్లో 8వ రోజైన అయిన మంగళవారం ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనాలపై స్వామివారు విహరించనున్నారు.

గజవాహనంపై కపిలేశ్వరుడి అభయం



తిరుపతి కల్చరల్‌: తిరుపతిలోని శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు సోమవారం రాత్రి శ్రీకపిలేశ్వరస్వామి గజవాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి గజవాహన సేవ వేడుకగా సాగింది. గజరాజులు ముందు కదులుతుండగా, కళాబృందాల కోలాటాలు, భజనల నడుమ స్వామి వారి గజవాహన సేవ కోలాహలంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు స్వామి, అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు వ్యాఘ్రవాహనంపై కొలువై శ్రీకామాక్షి అమ్మవారి సమేతంగా పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం కల్పవృక్షవాహనం, అశ్వవాహనంపై విహరించనున్నారు.



విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం

తిరుపతి సిటీ: నూతన ఆవిష్కరణలు సాధించేలా విద్యార్థినులను ప్రోత్సహించడమే సాంకేతిక ఉత్సవ్‌ లక్ష్యమని మహిళా వర్సిటీ ఇంజినీరింగ్‌ కళాశాల డైరెక్టర్‌ మల్లికార్జున, ప్రొఫెసర్‌ కేఎల్‌ నారాయణ తెలిపారు. వర్సిటీలోని మెకానికల్‌ ఇంజినీరింగ్‌ ఆధ్వర్యంలో సోమవారం మెకారేనా-2025 సాంకేతిక ఉత్సవ్‌ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థినుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం పలు సాంకేతిక ఈవెంట్లు నిర్వహించారు.

ప్రాచీన విద్యపై శిక్షణ




తిరుపతి సిటీ: ఎస్వీయూలోని మాలవ్య మిషన్‌ టీచర్‌ ట్రైనింగ్‌ సెంటర్‌లో యూజీసీ సహకారంతో వారం రోజుల పాటు జరిగే భారతీయ వేదిక జ్ఞాన విద్యావిధానం సముపార్జన అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఎస్వీ వేదిక్‌ వర్సిటీ రాణి సదాశివమూర్తి, ఎస్వీయూ వీసీ అప్పారావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రాచీన విద్యను ఆధునిక విద్యకు అనుసంధానం చేయడమే ప్రధాన లక్ష్యం యూజీసీ శిక్షణ ఇస్తుండడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి ఆచార్య దేవప్రసాద్‌ రాజు, ఆచార్య రుద్రమదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

హై-బీపీ కారణంగా పక్షవాతం, గుండెపోటు, మూత్రపిండాలు దెబ్బతినడం, కంటి చూపు కోల్పోవడం లాంటి అనర్థాలతోనూ, అలాగే కిడ్నీల వంటి ఎండ్ ఆర్గాన్స్ వైఫల్యంతో ఏటా ఎంతో మంది మరణిస్తున్నారు. ఇది ఉన్న విషయమే బయటకు తెలియకపోవడం, అది దెబ్బతీసే అవయవాలైన కిడ్నీ వంటివి పూర్తిగా చెడిపోయేవరకు వాటి లక్షణాలేమీ బయటకు కనిపించకపోవడంతో ఇది నిశ్శబ్దంగా అనర్థాలను తెచ్చిపెట్టి, కొన్నిసార్లు మరణాలకు కారణమవుతుంటుంది. అందుకే దీన్ని సైలెంట్ కిల్లర్ అని కూడా అంటారు. హైబీపీ తెచ్చిపెట్టే సమస్యలేమిటి, ఎలా ఉంటాయి, వాటిని అధిగమించడం ఎలా వంటి అనేక విషయాలను తెలుసుకుందాం.

ఇంగ్లిష్‌లో బీపీ అని సంక్షిప్తంగా చెప్పే ఓ ఆరోగ్య సమస్య అసలు రూపం బ్లడ్ ప్రెషర్. కానీ నిజానికి దీన్ని హైబీపీగా చెప్పాలి. అంటే ఉండాల్సిన దానికంటే ఎక్కువ ఒత్తిడితో రక్తం ప్రవహించడమని అర్థం. తెలుగులో దీన్నే రక్తపోటు అంటారు. దీని నార్మల్ విలువ 140/90. ఉండాల్సిన విలువకంటే ఎక్కువ ఒత్తిడితో రక్తం ప్రవహిస్తే అది ఎన్నో ఆరోగ్య సమస్యలకు తావిస్తుంది. ఒకప్పుడు కాస్త పెద్ద వయసు వచ్చాకే బీపీ, డయాబెటిస్ కనిపించేవి. కానీ ఇప్పుడు మన దేశంలో అప్పుడే తమ కౌమార దశ దాటి అప్పుడప్పుడే యువకులు/యువతులుగా మారుతున్న వారిలోనూ హైబీపీ కనిపిస్తోంది. ఎన్నో అనర్థాలకు కారణమయ్యే ఈ హైబీపీ సమస్య గురించి విపులంగా తెలుసుకోవడం కోసమే ఈ కథనం.

బీపీకి మందు... బీహ్యాపీ




డాక్టర్ కె. శివరాజు
సీనియర్ ఫిజీషియన్

హై-బీపీ అంటే ఏమిటి?

కొంతమంది తాము అతిగా ఉద్రేకపడ్డా లేదా బాగా కోపం ఫీలయినప్పుడు తమకు బీపీ పెరిగిందంటుంటారు. అలాగే మరికొందరు తమకు బాగా తలనొప్పిగా ఉండటం, చెమటలు పడుతుండటం, నర్వస్‌గా ఉండటం, నిద్రపట్టకపోవడం, బాగా ఉద్వేగంగా/ఉద్రిక్తంగా ఫీలయినప్పుడు ఆ టైమ్‌లో బీపీ పెరిగిందని చెబుతుంటారు. అయితే అలా జరిగినప్పుడు బీపీ పెరిగి ఉండవచ్చు. కానీ కొందరిలో బీపీ పెరిగాక అది అలాగే కంటిన్యూవస్‌గా ఉండటాన్నే హైబీపీగా చెప్పవచ్చు.

ఇక కొంతమందిలో తాము హాస్పిటల్‌కు వెళ్లగానే, అక్కడి డాక్టర్లను చూడగానే బీపీ పెరుగుతుంది. ఇంటిదగ్గర రీడింగ్ తీసినప్పుడు నార్మల్‌గా ఉంటుంది. ఇలా తెల్లకోట్లలో ఉండే డాక్టర్లను చూసినప్పుడు రక్తపోటు పెరగడాన్ని 'వైట్ కోట్ సిండ్రోమ్' అంటారు. ఇలాంటి సందర్భాల్లో బీపీ పెరగడం, అలాగే తమలో భావోద్వేగాలు చెలరేగినప్పుడు రక్తపోటు కొంతమేరకు పెరగడం జరగవచ్చు. అయితే ఇలాంటి సందర్భాల్లో బీపీ పెరిగినప్పటికీ దాన్ని హైబీపీగా పరిగణించడం జరగదు. అయితే ఓ వ్యక్తిలో అనేక పర్యాయాలు రీడింగ్ తీశాక కూడా... రక్తపోటు (సిస్టోల్ / డయాస్టోల్) విలువలు 140/90 అనే కొలతకు మించి ఉంటే అప్పుడు మాత్రమే హైబీపీగా పరిగణిస్తారు.

రక్తపోటు ఉన్న బాగా చిన్నవయసు వారూ బీపీ ట్యాబ్లెట్స్ తీసుకోవాల్సిందేనా?

రక్తపోటు ఉందని తేలాక... వాళ్లు ఎంత చిన్న వయసు వాళ్లైనప్పటికీ బీపీని అదుపులో ఉంచే మందులు తప్పనిసరిగా వాడాల్సిందే. లేకపోతే దీర్ఘకాలంలో కీలకమైన అవయవాలు దెబ్బతిని ప్రాణాపాయం కలిగించే అవకాశాలు ఎక్కువ.

తల్లిదండ్రులకు ఉంటే పిల్లలకూ హైబీపీ వస్తుందా?

తల్లిదండ్రులకు హైబీపీ ఉంటే... పిల్లలకు అది తప్పనిసరిగా వచ్చేలాంటి జన్యుపరమైన సమస్య కాదు గానీ... తల్లిదండ్రులకూ, రక్తసంబంధీకులకూ, దగ్గరి బంధువులకు అధిక రక్తపోటు ఉన్నప్పుడు... వారి వారసులకు కూడా వచ్చే అవకాశాలు కాస్త ఎక్కువే.

వయసు పెరుగుతున్న కొద్దీ... బీపీ విలువ నార్మల్ కంటే ఎక్కువగానే ఉంటుంది కదా!

ఈ అపోహ చాలామందిలో ఉంది. ఇది చాలాకాలం పాటు రాజ్యమేలింది కూడా. వయసు పెరుగుతున్న కొద్దీ బీపీ కొద్దిగా ఎక్కువే ఉండవచ్చని తొలుత అనుకున్నారు. (వయసు + 100) అంటూ ఓ సూత్రం కూడా ఏర్పాటు చేసుకున్నారు. అంటే ఉదాహరణకు ఓ వ్యక్తి వయసు 60 ఏళ్లు అయితే అతడి పై కొలత 160 వరకు ఉన్నా పర్లేదని అనుకున్నారు. కానీ తాజాగా ఇప్పటి లెక్కలు వేరు. ఇప్పుడు తాజాగా... పద్దెనిమిది దాటిన ఏ వయసువారికైనా బీపీ 140/90 కి పైన ఉంటే అది హైబీపీ కిందే లెక్క.

హైబీపీ ఎన్ని రకాలు...

హైబీపీని రెండు రకాలుగా చెప్పవచ్చు. మొదటిది ఎసెన్షియల్ హైపర్‌టెన్షన్. అంటే ఇది మామూలుగా వచ్చే బీపీ అనుకోవచ్చు. ఇతరత్రా ఎలాంటి కారణం లేకుండా వచ్చే బీపీ ఇది. ఇది చాలా సాధారణంగా కనిపించే హైపర్‌టెన్షన్. ఇక రెండోదాన్ని సెకండరీ హైపర్‌టెన్షన్‌గా చెప్పవచ్చు. ఇది శరీరంలో ఏదో ఇతరత్రా కారణాల వల్ల వస్తుంది. అంటే బాధితులకు ఒంట్లో థైరాయిడ్ సమస్య ఉండటం వల్లనో, లేదా మూత్రపిండాల వ్యాధి వంటి ఇతర సమస్యల కారణంగా రక్తపోటు పెరిగిపోవడం జరుగుతుంది. అందుకే ఒంట్లో బీపీ ఎక్కువగా కనిపిస్తున్నప్పుడు థైరాయిడ్, కిడ్నీ వంటి ఇతరత్రా సమస్యలేమైనా ఉన్నాయా అంటూ చెక్ చేయించుకుని, వాటికి మందులు వాడాలి. ఈ సెకండరీ కారణాలు చక్కబడితే అప్పుడు బీపీ తగ్గుతుంది. కానీ మొదటిదైన ఎసెన్షియల్ హైపర్‌టెన్షన్ అలా కాదు. ఆ సమస్యకు డాక్టర్ల సూచన మేరకు బీపీని నియంత్రణలో ఉంచే మాత్రలు వాడటం అవసరం.

మందులు వాడుతున్నా... బీపీ నియంత్రణలోకి రాలేదంటే... ఆ పేషెంట్ మందులకు రెసిస్టెన్స్ పెంచుకోవడం వల్లనేనా?

కొంతమంది బీపీ నిర్ధారణ సమయంలో ... మొదటిసారి మాత్రమే డాక్టర్‌ను కలుస్తారు. అప్పుడు డాక్టర్ రాసిన మందులనే ఏళ్ల తరబడి వాడుతుంటారు. కానీ వాటితో బీపీ నిజంగానే అదుపులోకి వచ్చిందా... లేక ఆ డోస్ సరిపోతోందా, లేదా... ఇలాంటి విషయాలేమీ పట్టించుకోరు. మరికొందరు తొలిసారి మందులు వాడకం మొదలుపెట్టాక... రెండో వారంలోనో లేదా పది రోజుల తర్వాతనో మరోసారి బీపీ చూసుకుని, అది తగ్గడం లేదంటూ ఫిర్యాదు చేస్తారు. ఇవన్నీ సరికాదు. అలాగే మందుల ప్రభావం తగ్గిపోయిందనే అపోహ కూడా సరికాదు. ఒకసారి బీపీ మందులు మొదలుపెట్టాక అవి పనిచేయడం ప్రారంభించి హై-బీపీ అదుపులోకి రావడానికి కనీసం 3 - 4 వారాల సమయం పట్టవచ్చు. ఇవేవీ చూడకుండానే కొందరు తాము అనుకున్నదే వాస్తవం, అదే నిజమనే అభిప్రాయానికి వచ్చేస్తారు. ఇది కూడా సరికాదు. అందుకే బీపీ మందులు వాడుతున్న వారు డాక్టర్ నిర్దేశించిన ప్రకారం... ఆయా సమయాలకు ఫాలో అప్‌కు వెళ్తుండాలి. తరచూ పరీక్ష చేయిస్తూ తమలో రక్తపోటు అదుపులో ఉందా లేదా అన్నది తెలుసుకుంటూ, ఒకవేళ బీపీ ఇంకా పెరిగితే దాన్ని బట్టి మందులు మార్చడం లేదా మోతాదు మార్చడం జరుగుతుంది.



బీపీ అకస్మాత్తుగా పెరిగిపోతే...

బీపీ అకస్మాత్తుగా పెరగడం చాలా ప్రమాదమని గుర్తించాలి.

చిన్నపిల్లల్లోనూ హైబీపీ ఉండవచ్చా?

చిన్నపిల్లల్లో లేదా అప్పుడప్పుడే యుక్తవయసుకు వస్తున్న యువకుల్లో హైబీపీ ఉండకపోవచ్చని చాలామంది అనుకుంటుంటారు. కానీ వాళ్లలోనూ కొందరికి హైబీపీ (హైపర్‌టెన్షన్) ఉండే అవకాశం ఉంది. ఇటీవల చాలా చిన్నపిల్లలు.. అంటే 3 నుంచి 12 ఏళ్ల మధ్య వయసు వాళ్లలోనూ, కౌమారం (టీనేజ్)లో ఉన్న పిల్లలు... అంటే 13 నుంచి 19 ఏళ్ల మధ్యవారిలోనూ హైబీపీ కనిపిస్తోంది. అయితే చిన్నపిల్లల్లో హైబీపీ నిర్ధారణకు దాన్ని చాలా జాగ్రత్త (మెటిక్యులస్)గా కొలవాలి. పిల్లల్లో బీపీని తెలిపే చార్ట్‌ను 'సెంటైల్ చార్ట్' అంటారు. పిల్లల తాలూకు నార్మల్ విలువలు... వాళ్ల వయసునూ, జెండర్‌నూ, వాళ్ల ఎత్తును బట్టి మారుతుంటాయి. పెద్దవాళ్లలో నార్మల్స్ వాళ్లలో నార్మల్ విలువకు సమానం కాదు. ఉదాహరణకు వారిలో డయాస్టోల్ బీపీ కొలత 90 ఉంటే అది బీపీ ఉన్నట్లు కాదు. కొలత విలువ 95 పర్సంటైల్ లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే అది పిల్లల్లో హైబీపీ ఉన్నదనడానికి సూచన. ఆ రీడింగ్ 95-99 ఉంటే హైపర్‌టెన్షన్ స్టేజ్-1 అని చెప్పవచ్చు. 99 పర్సంటైల్ కంటే ఎక్కువ ఉంటే దాన్ని స్టేజ్-2గా భావించాలి. ఈ దశలూ, తీవ్రతలను బట్టి ఆయా పిల్లలకు ఎలాంటి చికిత్స ఇవ్వాలన్నది డాక్టర్లు నిర్ణయిస్తారు.



కొన్నాళ్ల తర్వాత బీపీ అదుపులోకి వచ్చాక మందులు మానేయవచ్చా?

ఒకసారి హైబీపీ నిర్ధారణ జరిగి... మందులు మొదలుపెట్టాక వాటి ప్రభావంతో రక్తపోటు అదుపులోకి వస్తుంది. దాంతో బీపీ అదుపులోనే ఉంది కదా అని చాలామంది మందులు మానేస్తుంటారు. మళ్లీ బీపీ చెక్ చేయించుకోరు. దీని లక్షణాలు బయటకు కనిపించవు కాబట్టి అది పెరిగిన విషయం తెలియనే తెలియదు. అందుకే ఒకవేళ హై-బీపీ నియంత్రణలోకి వచ్చిందని మందులు ఆపేసినా... మళ్లీ తరచూ బీపీ చెక్ చేయించుకుంటూ ఉండాలి. బీపీ పెరిగినట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా తక్షణం డాక్టర్‌ను సంప్రదించి, ఉన్న హై-బీపీ విలువకు తగినట్లుగా తగిన మోతాదు నిర్ణయించుకుని, మందులు మొదలుపెట్టాలి. అంతేకాదు... మందులు వాడుతున్నప్పటికీ తరచూ బీపీ చెక్ చేయించుకుంటూనే ఉండాలి. ఒకవేళ ఆ మోతాదు సరిపోక బీపీ పెరిగితే... డాక్టర్లు మందులు మార్చడమో లేదా సరైన మోతాదు కోసం మరో మాత్ర లేదా రెండు మాత్రలు పెంచడమో చేస్తారు. అందుకే బీపీ మందులు వాడుతున్నప్పుడు వాటిని మానేయకపోవడం మంచిది. అలాగే తరచూ బీపీ చెక్ చేయించుకుంటూ ఉండటం కూడా తప్పనిసరి.

హై-బీపీ ఉన్నవారు ఉప్పు పూర్తిగా మానేయాలా?

హై-బీపీ ఉన్నవాళ్లలో ఉప్పు వల్ల రక్తపోటు మరింత పెరుగుతుందనేది అందరికీ తెలిసిన విషయమే. అందుకే ముందుజాగ్రత్తగా ఉప్పు మానేసేవాళ్లు చాలామంది ఉంటారు. అయితే మానవ దేహంలోని కీలకమైన జీవక్రియలకు ఉప్పు / లవణాలు అవసరం. ఉదాహరణకు మెదడు నుంచి నాడుల (నర్వ్స్) ద్వారా కండరాలకు వచ్చే ఆదేశాలన్నీ ఉప్పు/ఇతర లవణాలలోని అయాన్ల ద్వారానే జరుగుతుంటాయి. ఉప్పు పూర్తిగా మానేస్తే హైపోనేట్రీమియా అనే కండిషన్ వచ్చి, ఒక్కోసారి అది ప్రాణాలకే ముప్పుగా మారవచ్చు. అందుకే ఉప్పును పూర్తిగా మానేయడం సరికాదు. దానికి బదులుగా ఇంతకుముందు వాడుతున్న మోతాదులో సగం లేదా సగానికంటే తక్కువగా వాడటం మంచిదని గుర్తుంచుకోవాలి.

మనం వాడే రోజువారీ ఆహారాల్లో మనకు తెలియకుండానే ఉప్పు ఉంటుంది. మనం తీసుకునే చిప్స్ వంటివీ లేదా బేకరీ పదార్థాల్లో, ప్యాకేజ్‌డ్ ఫుడ్స్‌లో ఉప్పు చాలా ఎక్కువ మోతాదులో ఉంటుంది. ఉప్పుకూ బీపీ పెరుగుదలకు నేరుగా సంబంధముంటుంది. అంతేకాదు... ఆకుకూరల్లోనూ లవణాల రూపంలో ఉప్పు ఉంటుంది. ఉప్పును చాలాపరిమితంగా తీసుకోవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే హైబీపీ ఉన్న వాళ్లలో ఒక వ్యక్తికి కేవలం రోజుకు రెండు గ్రాముల ఉప్పు అనే మోతాదు సరిపోతుంది.

లక్షణాలేమీ లేకపోతే హైబీపీ లేనట్లేనా?

లక్షణాలేమీ బయటకు కనిపించకపోయినప్పటికీ చాలామందికి హైబీపీ ఉండే అవకాశముంది. నిజానికి చాలామందిలోనూ తమకు హైబీపీ ఉన్న విషయమే తెలియకుండా చాలాకాలంగా వాళ్లలో హైబీపీ ఉండే అవకాశం ఉంది. ఇలా చాలాకాలంగా హైబీపీ ఉండటం వల్ల మానవ దేహంలో ఎండ్ ఆర్గాన్స్‌గా పిలిచే మెదడు, ఊపిరితిత్తులు, మూత్రపిండాల వంటి కీలక అవయవాలు దెబ్బతింటాయి. అవి పూర్తిగా పాడైపోయాకగానీ ఆ అవయవాలు దెబ్బతిన్నప్పుడు కనిపించే లక్షణాలు బయటపడవు. ఈలోపు జరగాల్సిన నష్టం పూర్తిగా జరిగిపోవచ్చు. అందుకే దీన్ని 'సైలెంట్ కిల్లర్' అంటారు. కేవలం లక్షణాలు కనిపించనంత మాత్రాన హై-బీపీ లేదని అనుకోవడం సరికాదు. ఒకసారి డాక్టర్‌ను కలిసి, చెకప్ చేయించుకుని హైబీపీ లేదన్న నిర్ధారణ జరిగాకే నిశ్చింతగా ఉండాలి.

బీపీ పెరుగుతూ, తగ్గుతూ ఉండటం తరచూ జరగవచ్చంటారు కదా... కాబట్టి హైబీపీ లేకపోయినా, ఉన్నట్టుగా డాక్టర్లు పొరబడవచ్చు కదా?

హైబీపీ వల్ల కొందరిలో తలనొప్పి, తలతిరగడం వంటివి కనిపించవచ్చు. కానీ ప్రతి తలనొప్పీ అధిక రక్తపోటు వల్లనే కాకపోవచ్చు. హై-బీపీ తాలూకు లక్షణాలు అని పేర్కొనే కండిషన్లు కనిపించినప్పుడు అసలు బీపీని కొలవకుండానే కేవలం లక్షణాలను బట్టి బీపీ ఉందని అనుకోవడం సరికాదు. డాక్టర్లు అలా పొరబడే అవకాశమే ఉండదు. ఎందుకంటే... రక్తపోటు పెరగడం వల్ల మెదడులోని రక్తనాళాల చివరల్లో రక్తం ఒత్తిడి పెరగడం వల్ల తలనొప్పి రావచ్చు. అలాగే కొందరిలో వారి బాడీ పోష్చర్ అకస్మాత్తుగా మారడం వల్ల రక్తపోటు తగ్గనూవచ్చు. దీన్ని 'ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్' అంటారు. అప్పుడు తల తిరగడం గానీ లేదా కొందరిలో ముందుకు తూలిపడిపోతామనే భావన కలగవచ్చు. బీపీ తగ్గిన ఇలాంటి సందర్భాల్లోనూ బీపీ పెరిగినప్పుడు కనిపించే గిడ్డీనెస్ వంటి లక్షణాలే కనిపిస్తాయి. అందువల్ల డాక్టర్లు కేవలం లక్షణాల ఆధారంగా కాకుండా... అనేక సందర్భాల్లో అనేక మార్లు అలాగే రకరకాల వేళల్లో కొలిచి చూశాకే... హైబీపీని నిర్ధారణ చేస్తారు. ఒక్కోసారి ఐదు రోజుల పాటు రోజుకు మూడు సార్ల చొప్పున కొలతలు తీశాకే నిర్ధారణ చేస్తారు. కేవలం ఒకటి లేదా రెండు కొలతలతో హైబీపీ నిర్ధారణ చేయరు కాబట్టి డాక్టర్లు పొరబడే అవకాశమే ఉండదు.

హైబీపీ మందులు చాలాకాలంపాటు వాడుతుంటే, వాటికే అలవాటు పడి... ఇక మున్ముందు బీపీ తగ్గదేమో?

ఒకసారి హై-బీపీ నిర్ధారణ అయ్యాక... దాన్ని అదుపులో ఉంచేందుకు డాక్టర్లు కొన్ని మందులను సూచిస్తుంటారు. వారిలోని బీపీ తీవ్రతను బట్టి కొందరికి రెండు, మరికొంతమందికి మూడు, ఇంకొందరిలో నాలుగు... ఇలా మందులను వాడాలంటూ డాక్టర్లు సూచిస్తారు. బీపీ కొలతలను తరచూ చూస్తూ... మందుల మోతాదును అడ్జెస్ట్ చేస్తుంటారు. జీవనశైలి మార్పులతో బీపీని అదుపులో పెడితే కేవలం రెండులోపు మాత్రలతోనే చాలాకాలం కొనసాగవచ్చు. కానీ బీపీ అదుపులో లేకపోతే మందుల సంఖ్యా, మోతాదులు పెరుగుతాయి. హైబీపీ మందులైనా, డయాబెటిస్ మందులైనా సుదీర్ఘకాలం వాడాల్సిందే. అది బాధితుల బీపీ కొలతలను బట్టి ఉంటాయి తప్ప... మందులకు అలవాటు పడి... బీపీ తగ్గినప్పటికీ వాటికే అలవాటు పడటం, మానకుండా ఉండలేకపోవడం అనే అంశాలకు ఆస్కారం లేదు.

హైబీపీకి బార్డర్‌లైన్‌లో ఉన్నవారికి మందులు అవసరం లేదు కదా?

హైబీపీ వస్తున్న సూచనలు కనిపిస్తున్నవారు... అంటే హైబీపీ విలువలు మరీ ఎక్కువగా కాకుండా బార్డర్‌లైన్‌లో ఉన్నవాళ్లు మందులు వాడనక్కర్లేదనీ, వాళ్లు మంచి జీవనశైలి నియమాలు పాటిస్తూ ఉంటే చాలని చెబుతుంటారు. అంటే... క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, ఆరోగ్యకరమైన అలవాట్లతో బీపీని అదుపులో ఉంచుకోవాలంటూ డాక్టర్లు చెబుతారన్నది కొందరి వాదన. ఇక చాలామంది తాము మందులు వాడబోమనీ, మంచి క్రమశిక్షణతో వ్యాయామం, ఆహారనియమాలు పాటించడం వంటి జీవనశైలిని అనుసరిస్తూ, హైబీపీని అదుపు చేయగలమని మొదట్లో ప్రతిఒక్కరూ అనుకుంటుంటారు. అయితే ఒకటి రెండు రోజులు పాటించినప్పటికీ... చాలామంది ఈ జీవనశైలి నియమాలను సరిగా పాటించ(లే)రు.

ఇలాంటి వాళ్లలో తమ కీలకమైన అవయవాలపైన హై-బీపీ తన దుష్ప్రభావం చూపినప్పుడు జరిగే నష్టం... అప్పుడు అవసరమైన వైద్యపరీక్షలకూ, చికిత్సకూ అవసరమైన ఆర్థికభారం, ఏదైనా ఎండ్ ఆర్గాన్ శాశ్వతంగా దెబ్బతింటే కలిగే నష్టం లాంటివి డిసీజ్ బర్డెన్‌ను విపరీతంగా పెంచుతాయి. అంతేకాదు... కుటుంబ సభ్యులపైనా ఆర్థిక, భావోద్వేగపరమైన ఒత్తిడీ చాలా ఎక్కువగా పడుతుంది.

ఆ భారంతో పోలిస్తే... అసలు మనపై ఎలాంటి బరువూ పడకుండా చాలా చవగ్గా దొరికే మందుల్ని రోజూ ఒకపూట లేదా రెండు పూటలు తీసుకోవడం వల్ల చాలాకాలం పాటు కీలకమైన అవయవాలను సంరక్షించుకుంటూ హాయిగా జీవించవచ్చు. గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ ఫెయిల్యూర్ లాంటి ఎన్నో వేదనాభరితమైన జబ్బులను తప్పించుకోవచ్చు.

పై అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు హైబీపీని ఎల్లప్పుడూ నియంత్రణలో ఉంచుకోవడం చాలా అవసరం.



బిజినెస్ రీల్

మరోసారి రూ.89,000పైకి బంగారం

- 10 గ్రాములకు రూ.350 ర్యాలీ
- రూ.లక్ష వద్ద వెండి ధర



న్యూఢిల్లీ: బంగారం మరోసారి రూ.89,000 మార్క్‌పైకి చేరింది. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.350 లాభపడి రూ.89,100కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.350 పెరిగి రూ.88,700కు చేరుకుంది. భౌగోళిక రాజకీయ, వాణిజ్యపరమైన ఉద్రిక్తతల మధ్య హెడ్జింగ్‌కు సురక్షిత సాధనంగా పరిగణించే బంగారం మరోసారి లాభపడినట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. యూఎస్ డాలర్ బంగారం ధరలకు మద్దతుగా నిలిచినట్టు చెప్పారు. డాలర్ ఇండెక్స్ వరుసగా మూడో వారంలో పడిపోవడాన్ని ప్రస్తావించారు. వెండి ధర రూ.లక్ష వద్ద ఫ్లాట్‌గా ఉంది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఏప్రిల్ డెలివరీ 10 గ్రాముల కాంట్రాక్ట్ ధర రూ.118 ర్యాలీ చేసి రూ.86,128కి చేరుకుంది. కామెక్స్ మార్కెట్లో ఔన్స్ బంగారం 2,925 డాలర్లకు పైనే ఉండడంతో బంగారం స్వల్పంగా లాభపడినట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది తెలిపారు. కామెక్స్ ఏప్రిల్ నెల డెలివరీ కాంట్రాక్ట్ 2,955 డాలర్లకు చేరుకోగా.. స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు 5.5 డాలర్లు పెరిగి 2,942 డాలర్లను సమీపించింది.

2024లో రూ. 58,104 కోట్లు

అదానీ గ్రూప్ పన్ను చెల్లింపులు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ గ్రూప్ గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో మొత్తం రూ. 58,104 కోట్ల పన్నులు చెల్లించింది. అంతక్రితం ఏడాది(2023-24) చెల్లించిన రూ. 46,610 కోట్లతో పోలిస్తే ఇది అధికం. వీటిలో అదానీ పోర్ట్‌ఫోలియో కంపెనీలు చెల్లించిన గ్లోబల్ ట్యాక్సులు, డ్యూటీలు, ఇతర చార్జీలు కలసి ఉన్నాయి. ఇతర వాటాదారుల తరఫున చెల్లించిన పరోక్ష పన్నులు, డ్యూటీలు మొదలైనవి వీటిలో ఉన్నట్లు అదానీ గ్రూప్ పేర్కొంది. అదానీ గ్రూప్ విడుదల చేసిన 2023-24 పన్నుల సంబంధిత పారదర్శక నివేదికలో ఈ అంశాలను పేర్కొంది. పన్ను చెల్లింపుల వివరాలను విడిగా గ్రూప్ కంపెనీల స్వతంత్ర నివేదికల్లో పేర్కొన్నట్లు తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-2-2025	
విశాఖ	470-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470-00
విజయవాడ	480-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,710.50	1.54
DRREDDY	1,164.90	1.14
EICHERMOT	5,016.65	1.09
HEROMOTOCO	3,884.00	0.82
NESTLEIND	2,225.00	0.45

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	295	-3.7
HCLTECH	1,642.75	-3.41
TCS	3,671.00	-3.04
INFY	1,763.00	-2.87
BHARTIARTL	1,600.00	-2.39

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,530
ఎన్ఎస్ఈ	71,947
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,73,265
ఎఫ్ఐఐ	- 6,287
డీఐఐ	+ 5,186

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.80 (రాత్రి 11.30కు)	$ 70.04
బ్రెంట్	74.39 (రాత్రి 11.30కు)	$ 74.05

టెక్ @ 300 బిలియన్ డాలర్లు

2025-26లో టెక్నాలజీ రంగంపై నాస్కామ్ అంచనా

- ఈసారి 5.1 శాతం వృద్ధితో 283 బిలియన్ డాలర్లకు చేరిక
- ఆశావహంగా నియామకాలు



ముంబై: దేశీ టెక్నాలజీ రంగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5.1 శాతం వృద్ధితో సుమారు 283 బిలియన్ డాలర్లకు చేరనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఇది 300 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు నెలకొన్నాయి. దేశీయ ఐటీ సేవలు, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ కంపెనీలు మొదలైన సంస్థల సమాఖ్య నాస్కామ్ ఈ విషయాలు వెల్లడించింది. ఆదాయ వృద్ధి సరైన దిశలోనే ఉందని నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ తెలిపారు. పరిశ్రమ 2023-24లో 4 శాతంగా, 2024-25లో 5.1 శాతంగా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.1 శాతంగాను వృద్ధి చెందగలదని చెప్పారు. చుట్టూరా భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా టారిఫ్‌ల వడ్డన వంటి ఆందోళనకర పరిస్థితులు నెలకొన్న తరుణంలోనూ పరిశ్రమ మెరుగ్గా రాణిస్తోందని వివరించారు. 2025 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1.26 లక్షల ఉద్యోగాల కల్పనతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 58 లక్షలకు చేరిందని, తదుపరి ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయిలో నియామకాలు ఉండవచ్చని అంచనా వేస్తున్నామని నంబియార్ వివరించారు.

ఐటీ ఆదాయం 4.3 శాతం అప్..


2025 ఆర్థిక సంవత్సరంలో ఆదాయాలను విభాగాలవారీగా చూస్తే ఐటీ సేవల కంపెనీల ఆదాయాలు 4.3 శాతం వృద్ధితో 137.1 బిలియన్ డాలర్లకు, బీపీఎం పరిశ్రమ 4.7 శాతం వృద్ధితో 55.6 బిలియన్ డాలర్లకు చేరొచ్చనే అంచనాలు ఉన్నాయి. ఇక ఇంజినీరింగ్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ రంగం అత్యంత వేగంగా 7 శాతం స్థాయిలో పెరిగి 55.6 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

అనూహ్యంగా అమెరికా..

దేశీ ఐటీ రంగానికి అమెరికాలో పరిస్థితులు అనూహ్యంగా ఉండొచ్చని నంబియార్ చెప్పారు. భారత ఐటీ పరిశ్రమ ఆదాయాల్లో అమెరికా వాటా 60-62 శాతం ఉంటుంది కాబట్టి, టారిఫ్‌ల బెదిరింపులనేవి పరిశ్రమకు అతి పెద్ద ముప్పని ఆయన పేర్కొన్నారు. నాస్కామ్ వార్షిక ఎన్‌టీఎల్‌ఎఫ్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా నంబియార్ ఈ విషయాలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల గురించి భారతీయ ఐటీ రంగం ఆందోళన చెందనక్కర్లేదని ఇన్ఫోసిస్ సీఈవో సలిల్ పరేఖ్ చెప్పారు. ఒకవేళ ట్రంప్ ప్రభుత్వం తీసుకునే చర్యలతో అమెరికన్ కంపెనీలు లాభపడితే, క్లయింట్లు బలోపేతం కావడం వల్ల భారతీయ ఐటీ కంపెనీలకు కూడా లబ్ధి చేకూరుతుందని వివరించారు. అమెరికాలోని సిబ్బంది సంఖ్యలో స్థానిక ఉద్యోగుల సంఖ్యను 60 శాతానికి పెంచుకోవడంలాంటి చర్యలతో గత కొన్నాళ్లుగా అమెరికాలో వ్యాపారాన్ని బలోపేతం చేసుకున్న నేపథ్యంలో హెచ్-1బీ వీసాలపై ఆధారపడే పరిస్థితి తగ్గిందని పరేఖ్ తెలిపారు.

డీబీఎస్‌లో 10% ఉద్యోగాలు కట్

- ఏఐ అమలుతో 4,000 మందికి ఉద్వాసన
- సంస్థ సీఈవో పీయూష్ గుప్తా



ముంబై: అంతర్జాతీయ బ్యాంకింగ్ సంస్థ డీబీఎస్ గ్రూప్ కృత్రిమ మేధ (ఏఐ) అమలుతో వచ్చే మూడేళ్లలో 10 శాతం మేర సిబ్బందిని తగ్గించుకోనున్నట్టు ప్రకటించింది. తమ కార్యకలాపాల్లో ఏఐని మరింత పెద్ద ఎత్తున వినియోగించనున్నట్టు సంస్థ సీఈవో పీయూష్ గుప్తా తెలిపారు. డీబీఎస్ గ్రూప్‌లో 15 ఏళ్ల తన పదవీ కాలంలో మొదటిసారి ఉద్యోగాల సృష్టి పరంగా ఇబ్బందిని ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఏఐ అన్నది భిన్నమైనదని, గతంలో వచ్చిన మరే ఇతర సాంకేతిక పరిజ్ఞానం మాదిరి కాదన్నారు. వచ్చే మూడేళ్లలో 4,000 మంది (10 శాతం) సిబ్బంది తగ్గిపోనున్నట్టు తన ప్రస్తుత అంచనాగా చెప్పారు. నాస్కామ్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మాట్లాడారు. ''ఏఐ ఎంతో శక్తిమంతమైనది. తనను తాను సొంతంగా ఆవిష్కరించుకోగలదు. మరొకరిని అనుసరించగలదు. ఇది ఎంతో భిన్నమైనది. గత పదేళ్లలో గ్రూప్‌లో ఉద్యోగాల కోత అన్నదే లేదు''అని గుప్తా ఏఐ రాకతో గ్రూప్ స్థాయిలో చోటుచేసుకోనున్న మార్పులను వివరించారు. డీబీఎస్ గ్రూప్ రెండేళ్ల క్రితమే జెనరేటివ్ ఏఐ సొల్యూషన్లను అమలు చేయడం ప్రారంభించిందని, ఇందుకు సంబంధించి పూర్తి ప్రయోజనాలను ఇంకా చవిచూడాల్సి ఉందన్నారు. కస్టమర్లను చేరుకోవడం, క్రెడిట్ అండర్‌రైటింగ్ (రుణ వితరణ), నియామకాల్లో ఏఐని డీబీఎస్ గ్రూపు అమలు చేస్తోంది.

కాంట్రాక్టు సిబ్బందే..

వచ్చే మూడేళ్లలో 4,000 మందితగ్గింపు అన్నది ప్రధానంగా కాంట్రాక్టు, తాత్కాలిక సిబ్బంది రూపంలోనే ఉంటుందని డీబీఎస్ గ్రూప్ వివరణ ఇచ్చింది. సహజంగా కంపెనీ నుంచి వెళ్లిపోయే ఉద్యోగుల రూపంలోనూ సిబ్బంది తగ్గనున్నట్టు తెలిపింది.

ఆసియాపసిఫిక్ దేశాలకు టారిఫ్ ముప్పు

- జాబితాలో భారత్, దక్షిణ కొరియా, థాయ్‌ల్యాండ్
- ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ నివేదిక



న్యూఢిల్లీ: ట్రంప్ హయాంలో పలు ఆసియా పసిఫిక్ దేశాలకు అధిక టారిఫ్‌ల రిస్కులు నెలకొన్నాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ వెల్లడించింది. భారత్, దక్షిణ కొరియా, థాయ్‌ల్యాండ్ తదితర దేశాలకు ముప్పు ఉందని ఒక నివేదికలో పేర్కొంది. మిగతా దేశాలతో పోలిస్తే తైవాన్, వియత్నాం, థాయ్‌ల్యాండ్, దక్షిణ కొరియాలాంటివి అమెరికాపై ఎక్కువగా ఆధారపడినందువల్ల టారిఫ్‌లు విధిస్తే ఆర్థికంగా వాటిపై ప్రభావం పడుతుందని వివరించింది. భారత్, జపాన్‌లో దేశీ మార్కెట్ కాస్త భారీగా ఉండటం వల్ల టారిఫ్‌ల ప్రభావం నుంచి కొంత ఉపశమనం ఉండొచ్చని వివరించింది. భారత్ సహా వాణిజ్య భాగస్వాములపై ప్రతీకార టారిఫ్‌లు విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేసిన నేపథ్యంలో నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఆసియా పసిఫిక్‌లోని కొన్ని దేశాలు తమ ఎగుమతులపై అమెరికా విధించే సుంకాలకన్నా అత్యధికంగా అమెరికన్ ఉత్పత్తుల దిగుమతులపై విధిస్తున్నాయని నివేదిక వివరించింది. ప్రతీకార టారిఫ్ చర్యల కోసం సదరు దేశాలను పరిశీలించే అవకాశం ఉందని పేర్కొంది.

యూజ్డ్ కారు..యమా జోరు



- హైదరాబాద్‌లో హోమ్ డెలివరీలు 35 శాతం అప్
- లగ్జరీ కార్లకు డిమాండ్
- 17 శాతానికి పెరిగిన మహిళల వాటా

సాక్షి, బిజినెస్ డెస్క్: ఆన్‌లైన్ కొనుగోళ్లపై నమ్మకం పెరుగుతుండటం, వినియోగదారుల అభిరుచులు మారుతుండటం తదితర పరిణామాలతో పాత కార్ల వైపు మొగ్గు చూపే వారి సంఖ్య పెరుగుతోంది. కొత్త వాటితో పోలిస్తే పాత కార్లు చాలా తక్కువ ధరకే లభిస్తుండటం కూడా ఇందుకు కారణం. తెలంగాణలో ఇటీవలి కాలంలో ఇలా యూజ్డ్ కార్ల వైపు మళ్ళే ధోరణి గణనీయంగా కనిపిస్తోందని యూజ్డ్ కార్ల ప్లాట్‌ఫాం స్పిన్నీ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దీని ప్రకారం, వాళ్ల ప్లాట్‌ఫాంకి సంబంధించి హైదరాబాద్ మార్కెట్ వార్షికంగా 30 శాతం వృద్ధి చెందింది. కొనుగోలుదారుల్లో మహిళలు వాటా 2022లో కేవలం 9 శాతంగా ఉండగా గతేడాది 17 శాతానికి పెరిగింది. ఇందులో 20 శాతం కొనుగోళ్లు హైదరాబాద్‌కి దూరంగా అంటే దాదాపు 300 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాల నుంచి కూడా ఉంటున్నాయి. గతంలో ఫేవరెట్లుగా ఉన్న ఎలీట్ ఐ20 లాంటి కార్ల స్థానంలో ఈసారి కొత్తవి వచ్చి చేరాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా కార్లకు ఆదరణ ఉన్నప్పటికీ క్విడ్‌లాంటి కొత్త మోడల్స్‌ను కూడా ఎంచుకుంటున్నారు.

ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌కి ఓటు..

ఇక సౌకర్యవంతమైన డ్రైవింగ్ విధానాన్ని ఇష్టపడుతుండటంతో ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ కార్లకు డిమాండ్ 19 శాతం (2022) నుంచి గతేడాది 25 శాతానికి పెరిగింది. 2023లో కాస్త తగ్గిన హోమ్ డెలివరీలు 2024లో 35 శాతం పెరిగాయి. అంతే కాదు.. 2022-23లో అంతగా లేని విలాసవంతమైన కార్ల సెగ్మెంట్ కూడా ఊపందుకుంటోంది. లగ్జరీని కోరుకునే ధోరణులు పెరుగుతుండటాన్ని సూచిస్తూ కంపాస్, జీఎల్ఏ, ఎక్స్1 వంటి మోడల్స్‌కి డిమాండ్ ఏర్పడింది. హైదరాబాద్ యూజ్డ్ కార్ల మార్కెట్‌కు విజయవాడ, వరంగల్ వంటి నగరాలకు వాహనాలను సరఫరా చేసే ఫీడర్ సిటీలుగా ఉంటున్నాయి.

పాపులర్ కార్లు ఇవీ..

- మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా
- క్విడ్ లాంటి కొత్త మోడల్స్‌కి ఆదరణ
- లగ్జరీ సెగ్మెంట్లో కంపాస్, జీఎల్ఏకి డిమాండ్

పీఎస్‌యూ బ్యాంకుల్లో వాటా విక్రయంపై దృష్టి

మర్చంట్ బ్యాంకర్లకు దీపమ్ ఆహ్వానం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు, లిస్టెడ్ ఫైనాన్షియల్ సంస్థలలో వాటా విక్రయంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకు అనుగుణంగా పెట్టుబడులు, పబ్లిక్ ఆస్తుల నిర్వహణ సంస్థ(దీపమ్) మర్చంట్ బ్యాంకర్లు, న్యాయసలహా సంస్థలకు ఆహ్వానం పలికింది. రెండు రకాల ప్రతిపాదనల(రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్-ఆర్ఎఫ్‌పీ)కు తెరతీసింది. దీనిలో భాగంగా మర్చంట్ బ్యాంకర్లు, న్యాయసలహా సంస్థలను మూడేళ్ల కాలానికి దీపమ్ ఎంపిక చేయనుంది. గడువును మరో ఏడాది పొడిగించేందుకు వీలుంటుంది. ఎంపికైన సంస్థలు వాటాల విక్రయం విషయంలో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందించవలసి ఉంటుంది. ఎంపిక చేసిన బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలలో వాటాల విక్రయంలో ప్రభుత్వానికి తగిన విధంగా సహకారం అందించవలసి ఉంటుంది. ఇందుకుగాను మర్చంట్ బ్యాంకర్లు బిడ్స్ దాఖలు చేసేందుకు మార్చి 27వరకూ దీపమ్ గడువు ప్రకటించింది. అయితే రెండు కేటగిరీలలో మర్చంట్ బ్యాంకర్లు దరఖాస్తు చేయవలసి ఉంటుంది. ఏప్లస్ విభాగం కింద రూ. 2,500 కోట్లు లేదా అంతకుమించిన పరిమాణంగల లావాదేవీల నిర్వహణ ఉంటుంది. ఏ కేటగిరీలో రూ. 2,500 కోట్ల విలువలోపు వాటాల విక్రయంలో ప్రభుత్వానికి మద్దతివ్వవలసి ఉంటుందని దీపమ్ తెలియజేసింది. ఆర్థిక శాఖ నిర్వహణలోని దీపమ్ ప్రభుత్వ రంగ సంస్థలలో వాటా విక్రయ వ్యవహారాలను పర్యవేక్షించే సంగతి తెలిసిందే. ప్రస్తుతం పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా నిబంధనను పలు ప్రభుత్వ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అమలు చేయవలసి ఉంది. ఇందుకు ప్రభుత్వం 2026 ఆగస్ట్ 1వరకూ గడువునిచ్చింది. తద్వారా ప్రభుత్వ వాటాను తగ్గించడంతోపాటు.. పబ్లిక్ వాటా పెంచవలసి ఉంది.

ఐదు బ్యాంకులు


ప్రధానంగా ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకులు పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటాను అమలు చేయవలసి ఉంది. ప్రస్తుతం పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా 98.3 శాతంకాగా.. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో 96.4 శాతం, యుకో బ్యాంక్‌లో 95.4 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 93.1 శాతం, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 86.5 శాతం చొప్పున వాటా కలిగి ఉంది. ఇదే విధంగా ఐఆర్ఎఫ్‌సీలో 86.36 శాతం, న్యూ ఇండియా ఎస్యూరెన్స్‌లో 85.44 శాతం, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో 82.4 శాతం చొప్పున ప్రభుత్వానికి వాటా ఉంది. వెరసి ఈ సంస్థలలో పబ్లిక్‌కు కనీస వాటా నిబంధనను అమలు చేయవలసి ఉంది. ప్రస్తుతం ఐడీబీఐ బ్యాంక్ ప్రయివేటైజేషన్ ప్రక్రియ కొనసాగుతున్న విషయం విదితమే.

క్యూ4లో 7-8% వృద్ధి

దేశీ కార్పొరేట్ల ఆదాయంపై ఇక్రా అంచనాలు

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) చివరి త్రైమాసికంలో దేశీ కంపెనీల ఆదాయంలో 7-8 శాతం వృద్ధి నమోదుకాగలదని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తాజాగా అంచనా వేసింది. ప్రధానంగా జనవరి-మార్చి(క్యూ4)లో గ్రామీణ డిమాండ్ పుంజుకోవడం, ప్రభుత్వ వ్యయాలు పెరగడం సహకరించనున్నట్లు అభిప్రాయపడింది. ప్రయివేట్ రంగ పెట్టుబడి వ్యయాల సైకిల్ పరిమితస్థాయిలో నమోదుకావచ్చని పేర్కొంది. ఇందుకు భౌగోళిక అనిశ్చితులు, మందగించిన భారత్ ఎగుమతుల ఔట్‌లుక్ ప్రభావం చూపనున్నట్లు తెలియజేసింది. అయితే ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్‌తోపాటు ఆటోమోటివ్ విభాగంలోని ఎలక్ట్రిక్ వాహనాలు తదితర ప్రత్యేక రంగాలలో పెట్టుబడులు జోరందుకోనున్నట్లు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలకు అనుగుణంగా పెట్టుబడులు పుంజుకోనున్నట్లు వివరించింది.

నిర్వహణ మార్జిన్లు ప్లస్: గత త్రైమాసికంలో మెరుగుపడిన నిర్వహణ లాభ మార్జిన్లు(ఓపీఎం) కొనసాగనున్నట్లు ఇక్రా తాజా నివేదికలో పేర్కొంది. డిమాండ్ బలపడటం, కన్జూమర్ సెంటిమెంటు మెరుగుపడటం వంటి అంశాల నేపథ్యంలో 18.2-18.4 శాతం మార్జిన్లు కొనసాగవచ్చని అంచనా వేసింది. ఈ కేలండర్ ఏడాది(2025) తొలి అర్ధభాగంలో గ్రామీణ డిమాండ్ బలపడనున్నట్లు తెలియజేసింది. అత్యధిక శాతం ఖరీఫ్ పంటల నుంచి ఉత్పత్తి మెరుగుపడటంసహా.. రబీ సీజన్‌కు సంబంధించి సానుకూల పరిస్థితులు ఇందుకు సహకరించనున్నట్లు వివరించింది. అంతేకాకుండా 2025లో సాధారణ రుతుపవనాలు కీలకంగా నిలవనున్నట్లు ఇక్రా కార్పొరేట్ రేటింగ్స్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ కింజల్ షా పేర్కొన్నారు. వీటి కారణంగా విస్తారిత వర్షపాతం వ్యవసాయ రంగానికి మద్దతివ్వనున్నట్లు అభిప్రాయపడ్డారు.



ఐటీలో మోస్తరు వేతన పెంపులే!

- 4-8.5 శాతం మధ్య ఉండొచ్చు
- అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితుల వల్లే
- ఏఐ, కీలక నైపుణ్యాలున్న వారికి అధిక పెంపు
- పరిశ్రమకు చెందిన నిపుణుల అభిప్రాయాలు



న్యూఢిల్లీ: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) సేవల రంగంలో ఈ ఏడాది (2024-25) వేతన పెంపులు మోస్తరుగానే ఉండొచ్చని పరిశ్రమకు చెందిన నిపుణులు అంచనా వేస్తున్నారు. సగటున 4-8.5 శాతం మధ్య పెంపు ఉండొచ్చని భావిస్తున్నారు. అంతకుముందు సంవత్సరాలతో పోల్చితే ఇది తక్కువ కావడం గమనార్హం. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితుల నేపథ్యం, కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరుగుతుండడం, నైపుణ్యాలకు డిమాండ్ తదితర పరిస్థితులను ఇందుకు నిదర్శంగా ప్రస్తావిస్తున్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ ఇంజనీరింగ్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్, బ్లాక్ చైన్ డెవలప్‌మెంట్ తదితర కీలక నైపుణ్యాలున్న వారికి మరింత అధికంగా వేతన పెంపులు లభించొచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. వేతన పెంపు విషయంలో ఐటీ కంపెనీలు అప్రమత్త ధోరణి అనుసరించొచ్చని టీమ్‌లీజ్ డిజిటల్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణవిజ్ అభిప్రాయపడ్డారు. ''పెంపు 4-8.5 శాతం మధ్య ఉండొచ్చు. క్రితం సంవత్సరాల కంటే తక్కువ. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక సవాళ్లు, విచక్షణారహిత వ్యయాల తగ్గింపు, వ్యాపార ప్రాధాన్యతల్లో మార్పుతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఏప్రిల్-జూన్ మధ్య సాధారణంగా చేపట్టే వేతన పెంపును మరింత జాప్యం చేయొచ్చు'' అని వివరించారు. సంస్థలు వేతన పెంపునకు బదులు రిటెన్షన్ బోనస్ (కంపెనీతోనే కొనసాగితే), ఇ-సాప్‌లు, ప్రాజెక్ట్ ఆధారిత ఇన్సెంటివ్‌లు ఇవ్వొచ్చన్నారు.

5-8.5 శాతం..

ఈ ఏడాది ఐటీలో వేతనాల పెంపు 5-8.5 శాతం మధ్య ఉండొచ్చని రీడ్ అండ్ విల్లో సీఈవో జానూ మోతియాని అంచనా వేశారు. ''రెండంకెల వేతన పెంపులు ఇప్పటికైతే గతమే. పరిశ్రమ వ్యాప్తంగా అప్రమత్త ధోరణి నెలకొంది. టీసీఎస్ 4-8 శాతం మధ్య వేతన పెంపును (ఏప్రిల్ నుంచి) ప్రకటించడం ద్వారా మిగిలిన పరిశ్రమ వ్యాప్తంగా ఇదే తరహా పెంపునకు బాటలు వేసింది''అని వివరించారు. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టెక్ మహీంద్రా ఇంకా తుది ప్రకటనలు చేయలేదని, అవి రక్షణాత్మక ధోరణితో అడుగులు వేస్తున్నట్టుందన్నారు. ఏఐ ఆధారిత సామర్థ్యాలకు డిమాండ్ పెరుగుతుండడం, క్లయింట్ డిమాండ్లలో మార్పులు ఐటీ కంపెనీల వేతన బడ్జెట్ కేటాయింపులను ప్రభావితం చేస్తున్నట్టు చెప్పారు.

వలసలూ తగ్గాయ్..

ఐటీ రంగంలో వలసల రేటు (ఉద్యోగులు కంపెనీలను వీడడం) 2023లో 18.3 శాతం ఉంటే, 2024 చివరికి 17.7 శాతానికి తగ్గడం గమనించొచ్చు. వలసల రేటు నిదానించడంతో వారిని కాపాడుకునేందుకు రిటెన్షన్ బోనస్, దూకుడుగా పారితోషికాలు ఇవ్వాల్సిన అత్యవసర పరిస్థితి లేకపోవడాన్ని మోతియాని ప్రస్తావించారు. సగటు వేతన పెంపులు 6-10 శాతం మధ్య ఉండొచ్చని, ఏఐ తదితర డిమాండ్ నైపుణ్యాలు కలిగిన మధ్య స్థాయి నుంచి సీనియర్ ఉద్యోగులకు అధిక వేతన పెంపు లభించొచ్చని అడెకో ఇండియా అంచనా వేసింది. ''ఫ్రెషర్లకు వేతన పెంపులు 2-4 శాతం మధ్య ఉండొచ్చు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర ప్రత్యేక నైపుణ్యాలున్న వారికి 10-12 శాతం వరకు కూడా వేతనాలు పెరగొచ్చు. సీనియర్ లెవల్ నిపుణులు, ముఖ్యంగా కీలకమైన టెక్నికల్ విధులు, నాయకత్వ బాధ్యతల్లో ఉన్న వారికి 12-15 శాతం మధ్య వేతన పెంపు ఉండొచ్చు'' అని అడెకో ఇండియా కంట్రీ మేనేజర్ సునీల్ చెమ్మన్‌కోటిల్ తెలిపారు. ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ (ఐబీఈఎఫ్) ప్రకారం దేశ జీడీపీలో ఐటీ రంగం వాటా 7 శాతంగా ఉంది.

భారత్‌లో ఎల్‌జీ చైర్మన్ పర్యటన



న్యూఢిల్లీ: భారత్‌లో లిస్టింగ్‌పై ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా కసరత్తు చేస్తున్న నేపథ్యంలో కంపెనీ మాతృ సంస్థ ఎల్‌జీ కార్పొరేషన్ చైర్మన్ 'క్వాంగ్ మో కూ' భారత పర్యటనకు వచ్చినట్లు సమాచారం. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఎండీతో పాటు పలు సీనియర్ అధికారులతో ఆయన భేటీ అవుతారని, ఐపీవో సన్నాహాల గురించి తెలుసుకుంటారని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అలాగే పెట్టుబడుల ప్రణాళికలను చర్చించవచ్చని వివరించాయి. గ్రేటర్ నోయిడాలోని కంపెనీ ప్లాంటును ఆయన సందర్శించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వ వర్గాలతో కూడా భేటీ అవుతారా లేదా అనే అంశంపై స్పష్టత రాలేదు. ఐపీవో ద్వారా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ 1.5 బిలియన్ డాలర్ల వరకు సమీకరించనున్న సంగతి తెలిసిందే. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఉంటుంది. ఈ పబ్లిక్ ఇష్యూకి సంబంధించి కంపెనీ రోడ్‌షోలు కూడా నిర్వహిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఆదాయం రూ. 64,088 కోట్లుగా నమోదైంది.

‘లెక్కలు వేసుకుంటూ ఉన్నాను’

కోహ్లి సెంచరీపై అక్షర్ పటేల్ వ్యాఖ్య



దుబాయ్: పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో విరాట్ కోహ్లి సెంచరీతో సత్తా చాటి భారత్‌ను గెలిపించాడు. అయితే అతను శతకాన్ని అందుకునే క్రమంలో కొంత ఉత్కంఠ నెలకొంది. మైదానంలోనూ, టీవీల ముందు అభిమానులు కూడా కోహ్లి సెంచరీ చేస్తాడా లేదా అనేదాని గురించే ఆసక్తిగా ఎదురు చూశారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే క్రీజ్‌లో మరోవైపు ఉన్న అక్షర్ పటేల్ పరిస్థితి ఎలా ఉంది! భారత్ విజయానికి 19 పరుగులు, కోహ్లి సెంచరీకి 14 పరుగులు కావాల్సిన స్థితిలో అక్షర్ బ్యాటింగ్‌కు వచ్చాడు. అతను ఒక్క పెద్ద షాట్ ఆడి బౌండరీ సాధించినా లెక్క మారిపోయేది. అందుకే అతను పరుగులు తీయరాదనే అందరూ కోరుకున్నారు. తాను కూడా ఇలాగే భావించినట్లు, కోహ్లి సెంచరీ కోసం లెక్కలు వేసుకున్నట్లు అక్షర్ వెల్లడించాడు. ‘మ్యాచ్ చివరికి వచ్చేసరికి నేను కూడా లెక్కలు వేయడం మొదలు పెట్టాను. బంతి నా బ్యాట్ ఎడ్జ్ తీసుకొని కూడా వెళ్లరాదని కోరుకున్నాను. ఆ సమయంలో అంతా సరదాగా అనిపించింది. ఇంత తీవ్ర ఒత్తిడి ఉండే మ్యాచ్‌లో విరాట్ సెంచరీని డ్రెస్సింగ్ రూమ్ నుంచి నేను చూడటం ఇదే మొదటిసారి. ఈ ఇన్నింగ్స్‌ను చాలా ఆస్వాదించాను. 50 ఓవర్ల పాటు ఫీల్డింగ్ చేసిన తర్వాత వికెట్ల మధ్య అతను పరుగెత్తిన తీరు విరాట్ ఫిట్‌నెస్‌కు తార్కాణం’ అని అక్షర్ వ్యాఖ్యానించాడు.

కోహ్లి మరో 10–15 సెంచరీలు చేస్తాడు!

పాక్‌తో మ్యాచ్‌లో కోహ్లి ప్రదర్శనపై **అన్ని** వైపులనుంచి ప్రశంసలు వస్తున్నాయి. **అతని** ఆటను చూస్తే కనీసం మరో 2–3 **ఏళ్లు ఆడి** మరిన్ని శతకాలు సాధించే అవకాశం ఉ**ందని మాజీ** క్రికెటర్ నవ్‌జోత్ సింగ్ సిద్ధూ అభిప్రాయ **పడ్డాడు.** ‘కోహ్లిలాంటి ఆటగాడు తరానికొక్కడు **మాత్రమే** ఉంటాడు. అతని పట్టుదల, పోరాట**తత్వం ఈ** మ్యాచ్‌లో కనిపించింది. ప్రతికూల **పరిస్థితుల్లో** బాగా ఆడినప్పుడు ఒకరి సత్తా ఏమిటో తెలుస్తుంది. కోహ్లి కనీసం మరో 2–3 ఏళ్లు ఆడటం మాత్రమే కాదు, మరో 10–15 సెంచరీలు సాధిస్తాడని బల్లగుద్ది చెప్పగలను. గత ఆరు నెలల్లో అతనిపై విమర్శలు వచ్చాయి. కానీ పాకిస్తాన్‌పై పరుగులు సాధించడం మరో పదేళ్ల పాటు దీనిని ఎవరూ మరచిపోలేరు’ అని సిద్ధూ వ్యాఖ్యానించాడు. కుర్రాళ్లు కోహ్లి లాంటి ఆటగాళ్ల నుంచే స్ఫూర్తి పొందుతారని, వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళతారని సిద్ధూ అభిప్రాయ పడ్డాడు. ‘కోహ్లి సామర్థ్యం ఏమిటో ఈ మ్యాచ్‌లో కనిపించింది. ఇన్నింగ్స్ ఆరంభంలో అతని ట్రేడ్‌మార్క్ కవర్ డ్రైవ్‌లు చూస్తే పాత విరాట్ గుర్తుకొచ్చాడు. ఇన్నింగ్స్ సాగిన కొద్దీ అతనిలోని పోరాట తత్వాన్నే నేను చూశాను. ఒక ఆట ఎదగాలంటే ఇలాంటివారే స్ఫూర్తిగా నిలుస్తారు. అతను కోహినూర్‌లాంటివాడు. ఛేదనలో కోహ్లి రికార్డు చూస్తే ఒత్తిడిని ఏమాత్రం దరిచేరనీయకుండా ఆడతాడని అర్థమవుతుంది. కోహ్లి సెంచరీ చేసినప్పుడు రోహిత్ శర్మ కూడా ఎంతో ఆనందంగా కనిపించాడు. సహచరుడి పట్ల గర్వంగా ఉండటం టీమ్ గేమ్‌లో ఉండే గొప్పతనం ఏమిటో చూపించింది’ అని సిద్ధూ వివరించాడు. మరోవైపు బీసీసీఐ మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ కూడా కోహ్లి ఆటపై పొగడ్తలు కురిపించారు.

చెన్నై సూపర్ కింగ్స్ అసిస్టెంట్ బౌలింగ్ కోచ్‌గా శ్రీరామ్



చెన్నై: వచ్చే నెలలో మొదలయ్యే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో పాల్గొనే చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు భారత మాజీ ఆల్ రౌండర్ శ్రీధరన్ శ్రీరామ్ అసిస్టెంట్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఈ మేరకు శ్రీరామ్ నియామకం గురించి సీఎస్‌కే సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడుకు చెందిన 49 ఏళ్ల శ్రీరామ్ భారత్ తరఫున 8 వన్డేలు ఆడి 81 పరుగులు చేసి, 9 వికెట్లు పడగొట్టాడు. 2016 నుంచి 2022 వరకు ఆ్రస్టేలియా జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా ఉన్న శ్రీరామ్... ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ (ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్), లక్నో సూపర్ జెయింట్స్‌కు జట్టుతో కలిసి పని చేశాడు. ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచిన సీఎస్‌కే జట్టుకు స్టీఫెన్ ఫ్లెమింగ్ హెడ్ కోచ్‌గా, మైక్ హస్సీ బ్యాటింగ్ కోచ్‌గా, ఎరిక్ సిమన్స్ బౌలింగ్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సీజన్‌లో సీఎస్‌కే జట్టులో రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, శ్రేయస్ గోపాల్, నూర్ అహ్మద్, దీపక్ హుడా, రచిన్ రవీంద్ర రూపంలో స్పిన్నర్లు ఉన్నారు. గత సీజన్ వరకు వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో సీఎస్‌కే జట్టుకు బౌలింగ్ కోచ్‌గా ఉన్నాడు. ఈ సీజన్‌లో అతను డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు మెంటార్‌గా వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. గత సీజన్‌లో సీఎస్‌కే ఐదో స్థానంలో నిలిచి ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించడంలో విఫలమైంది.

వరల్డ్ కప్ షాట్‌గన్ టోర్నీకి కైనన్



న్యూఢిల్లీ: హైదరాబాద్ సీనియర్ ట్రాప్ షూటర్ కైనన్ చెనాయ్ ఈ సీజన్‌ను వరల్డ్ కప్ టోర్నీతో మొదలు పెట్టనున్నాడు. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో జరిగే సీజన్ మూడో వరల్డ్‌కప్‌లో పాల్గొనే 12 మంది సభ్యులతో కూడిన భారత షాట్‌గన్ జట్టును సోమవారం నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఆర్‌ఏఐ) ప్రకటించింది. సైప్రస్ రాజధాని నికోసియాలో మే 3 నుంచి 12వ తేదీ వరకు ఈ సీజన్‌లోని మూడో షాట్‌గన్ వరల్డ్‌కప్ టోర్నీ జరుగుతుంది. జాతీయ సెలెక్షన్ పాలసీ ప్రకారం భారత ర్యాంకింగ్స్‌లో 4 నుంచి 6 స్థానాల మధ్య ఉన్న షూటర్లను మూడో వరల్డ్‌కప్ టోర్నీకి ఎంపిక చేశారు. 34 ఏళ్ల కైనన్ 2016 రియో ఒలింపిక్స్‌లో ట్రాప్ ఈవెంట్‌లో భారత జట్టు తరఫున బరిలోకి దిగాడు. గత 15 ఏళ్లుగా భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కైనన్ తన కెరీర్‌లో వరల్డ్ కప్ టోర్నీలలో ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యంతో కలిపి 3 పతకాలు... ఆసియా చాంపియన్‌షిప్‌లో మూడు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి 4 పతకాలు సాధించాడు. అర్జెంటీనా, పెరూలలో రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ ఈవెంట్స్‌తో కూడిన రెండు వరల్డ్‌కప్‌లు జరుగుతాయి. అనంతరం సైప్రస్‌లో కేవలం షాట్‌గన్ ఈవెంట్‌లో మాత్రమే వరల్డ్‌కప్ జరుగుతుంది.

భారత షూటింగ్ జట్టు: పురుషుల ట్రాప్ వ్యక్తిగత విభాగం: కైనన్ చెనాయ్, శార్దుల్ విహాన్, భౌనీశ్ మెండిరట్టా. పురుషుల స్కీట్ విభాగం: మేరాజ్ అహ్మద్ ఖాన్, అభయ్ సింగ్ సెఖోన్, రితురాజ్ సింగ్ బుండేలా. మహిళల ట్రాప్ వ్యక్తిగత విభాగం: సబీరా హారిస్, కీర్తి గుప్తా, రాజేశ్వరి కుమారి. మహిళల స్కీట్ విభాగం: యశస్వి రాథోడ్, మహేశ్వరి చౌహాన్, పరినాజ్ ధలివాల్. ట్రాప్ మిక్స్‌డ్ టీమ్: కైనన్ చెనాయ్, సబీరా హారిస్, శార్దుల్ విహాన్, కీర్తి గుప్తా.

మెయిన్ ‘డ్రా’కు నిశేష్ రెడ్డి



అకాపుల్కో: మెక్సికో ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీలో తెలుగు సంతతికి చెందిన అమెరికా ప్లేయర్ నిశేష్ బసవరెడ్డి మెయిన్ ‘డ్రా’కు అర్హత సాధించాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 106వ ర్యాంకర్ నిశేష్ 6–2, 6–4తో అమెరికాకే చెందిన స్టెఫాన్ కొజ్లోవ్‌పై గెలుపొందాడు. 97 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిశేష్ ఒక ఏస్ కొట్టి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. క్వాలిఫయర్ హోదాలో నిశేష్ మెయిన్ ‘డ్రా’ తొలి రౌండ్‌లో తొమ్మిదో సీడ్ షపోవలోవ్ (కెనడా)తో తలపడతాడు. ఈ ఏడాది నాలుగో టోర్నీ ఆడుతున్న నిశేష్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ తొలి రౌండ్‌లో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌కు గట్టిపోటీనిచ్చి ఓడిపోయాడు. అంతకుముందు ఆక్లాండ్ ఓపెన్‌లో సెమీ ఫైనల్లో, బ్రిస్బేన్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లో పరాజయం చవిచూశాడు.



దేశవాళీలో ఆడితే మంచిదే కానీ...

క్రికెటర్లకు విశ్రాంతి అవసరమన్న ధావన్

దుబాయ్: భారత క్రికెటర్లకు దేశవాళీ క్రికెట్ ఆడటం తప్పనిసరి చేయడం సరైన నిర్ణయమేనని మాజీ ఆటగాడు శిఖర్ ధావన్ అభిప్రాయపడ్డాడు. అయితే అంతర్జాతీయ స్థాయిలో ఆడే ప్లేయర్లకు తగినంత విశ్రాంతి కూడా అవసరమనే అంశాన్ని విస్మరించరాదని కూడా అతను గుర్తు చేశాడు. ఈ విషయంలో బీసీసీఐ సమతూకం పాటించాలని శిఖర్ చెప్పాడు. ‘ఇది చాలా చక్కటి నిర్ణయం. నా దృష్టిలో ప్రస్తుత క్రికెటర్లంతా దేశవాళీ మ్యాచ్‌లలో ఆడాలి. అప్పుడే ఆ మ్యాచ్‌లకు ఆకర్షణ వస్తుంది. కోహ్లి ఢిల్లీ తరఫున ఆడితే స్టేడియం ఎలా నిండిపోయిందో మనం చూశాం. అయితే కీలక ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి కూడా అవసరం. వారిపై అధిక భారం వేయరాదు. ఈ జాగ్రత్తలు తీసుకుంటూ సంబంధిత వ్యక్తులు పర్యవేక్షించాలి’ అని ధావన్ వ్యాఖ్యానించాడు. 2013 చాంపియన్స్ ట్రోఫీలో 363 పరుగులతో శిఖర్ ధావన్ ‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’గా నిలిచాడు. తాజా టోర్నీ కోసం ఐసీసీ ఎంపిక చేసిన నలుగురు ఈవెంట్ బ్రాండ్ అంబాసిడర్లలో అతను కూడా ఒకడు. గత ఏడాది ఆటకు రిటైర్మెంట్ ప్రకటించిన ధావన్... ఆటకు దూరమైనందుకు తాను ఏమాత్రం చింతించడం లేదని వెల్లడించాడు. ‘నేను చాలా బాగా ఉత్సాహంగా ఉన్నాను. ఎలాంటి చింతా లేదు. ప్రస్తుతం జీవితాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నాను. నా ఆట గురించి నాకు బాగా తెలుసు. దేవుడు చాలా సుదీర్ఘ కెరీర్ ఇచ్చినందుకు కృతజ్ఞుడను’ అని స్పష్టం చేశాడు. గత కొన్నేళ్లుగా భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌లు ఏకపక్షంగా మారిపోవడంపై కూడా అతను స్పందించాడు.

‘మ్యాచ్‌పై అంచనాలు, ఆసక్తి, మైదానంలో తీవ్రత అలాగే ఉన్నాయి. గతంలో వారు వరుసగా గెలిచేవారు. ఇప్పుడు మనం గెలుస్తున్నాం. అంతే తేడా ఉంది’ అని శిఖర్ విశ్లేషించాడు. ప్రస్తుతం జట్టు వైస్ కెప్టెన్‌గా ఉన్న శుబ్‌మన్ గిల్ ఆ హోదాకు అర్హుడని... ముందు ముందు అతను కచ్చితంగా భారత జట్టుకు నాయకత్వం వహిస్తాడని ధావన్ అభిప్రాయపడ్డాడు.

యు ముంబా హెడ్ కోచ్‌గా రాకేశ్ కుమార్



ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో రెండోసారి చాంపియన్‌గా అవతరించేందుకు యు ముంబా జట్టు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తొలి మూడు సీజన్‌లలో ఫైనల్‌కు చేరుకోవడంతోపాటు ఒకసారి విజేతగా (2015లో), రెండుసార్లు రన్నరప్‌గా (2014, 2016) నిలిచిన యు ముంబా జట్టు ఆ తర్వాత వెనుకబడిపోయింది. గత మూడు సీజన్‌లలో అయితే యు ముంబా జట్టు పూర్తిగా నిరాశపరిచింది. రెండుసార్లు పదో స్థానంలో, ఒకసారి తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ నేపథ్యంలో యు ముంబా మళ్లీ టైటిల్ ట్రాక్‌లో పడాలనే ఉద్దేశంతో ఫ్రాంచైజీ శిక్షణ బృందంలో మార్పులు చేసింది. భారత జట్టు మాజీ కెప్టెన్, మూడు ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత జట్టు సభ్యుడు రాకేశ్ కుమార్‌ను కొత్త హెడ్ కోచ్‌గా నియమించింది. మూడో పీకేఎల్ సీజన్‌లో యు ముంబా జట్టుతో చేరిన రాకేశ్... అంతకుముందు పట్నా పైరేట్స్ తరఫున ఆడాడు. ఆ తర్వాత 2017లో తెలుగు టైటాన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ‘కింగ్ ఆఫ్ కబడ్డీ’గా పేరొందిన రాకేశ్‌ను తమ జట్టుకు హెడ్ కోచ్‌గా నియమించినందుకు ఆనందంగా ఉందని యు ముంబా సీఈఓ సుహైల్ చందోక్ తెలిపారు. ‘ఈసారి హెడ్ కోచ్‌గా యు ముంబా జట్టుతో చేరినందుకు సంతోషంగా ఉంది. వచ్చే సీజన్‌లో యు ముంబాకు మంచి ఫలితాలు అందించేందుకు నా శక్తివంచన లేకుండా కృషి చేస్తా’ అని 41 ఏళ్ల రాకేశ్ వ్యాఖ్యానించాడు. గతంలో హరియాణా స్టీలర్స్ జట్టుకు, ఇండియన్ రైల్వేస్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన రాకేశ్ 2006, 2010, 2014 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు నెగ్గిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.

భారత మహిళల జట్టుకు తొలి ఓటమి

షార్జా: పింక్ లేడీస్ కప్ అంతర్జాతీయ మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. రష్యా జట్టుతో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 0–2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. రష్యా తరఫున గ్లాఫిరా జుకోవా (25వ నిమిషంలో), వాలెంటీనా స్మిర్నోవా (90+2వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉన్న రష్యా జట్టు ఆద్యంతం ఆధిపత్యం చలాయించింది. తొలి మూడు నిమిషాల్లోనే రష్యా గోల్ చేసినంత పని చేసింది. కానీ రష్యా ప్లేయర్లు కొట్టిన షాట్‌లు గురి తప్పాయి. భారత్ తరఫున మనీషా 31వ నిమిషంలో కొట్టిన షాట్‌ను రష్యా గోల్‌కీపర్ కీరా పెతుకోవా నిలువరించింది. రెండో అర్ధభాగంలో భారత జట్టు పక్కా ప్రణాళికతో ఆడి రష్యా జోరుకు అడ్డుకట్ట వేసింది. అయితే ఇంజ్యూరీ సమయంలో మరో గోల్‌ను సమర్పించుకుంది. భారత జట్టుకు ఆడుతున్న తెలంగాణ అమ్మాయి గుగులోత్ సౌమ్య ఈ మ్యాచ్‌లో 68 నిమిషాలు మైదానంలో ఉంది. ఆ తర్వాత సౌమ్య స్థానంలో మౌసుమి ముర్ము సబ్‌స్టిట్యూట్‌గా వచ్చింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 69వ స్థానంలో ఉన్న భారత జట్టు ఈ టోర్నీలోని తొలి మ్యాచ్‌లో 2–0తో జోర్డాన్ జట్టుపై గెలిచింది. భారత జట్టు తమ చివరి లీగ్ మ్యాచ్‌ను బుధవారం దక్షిణ కొరియా జట్టుతో ఆడుతుంది.



కరణ్ ముందుకు



బెంగళూరు: స్వదేశంలో జరుగుతున్న అగ్రశ్రేణి టెన్నిస్ టోర్నమెంట్ బెంగళూరు ఓపెన్ ఏటీపీ–125 చాలెంజర్ టోర్నీలో భారత ఆటగాడు కరణ్ సింగ్ ఒక్కడే మెయిన్ ‘డ్రా’కు అర్హత సాధించాడు. క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో ముగ్గురు భారత ఆటగాళ్లు బరిలోకి దిగారు. కరణ్ సింగ్ ఒక్కడే గెలుపొందగా... ఆర్యన్ షా, శశికుమార్ ముకుంద్ ఇంటిదారి పట్టారు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌ల్లో కరణ్ సింగ్ 6–4, 7–6 (8/6)తో ఆర్యన్ షాపై నెగ్గగా... శశికుమార్ ముకుంద్ 2–6, 6–4, 4–6తో హైనెక్ బార్టన్ (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓడిపోయారు. మెయిన్ ‘డ్రా’ తొలి రౌండ్ మ్యాచ్‌లో ‘వైల్డ్ కార్డు’తో పోటీపడ్డ భారత ప్లేయర్ ప్రజ్వల్ దేవ్ 7–6 (7/2), 3–6, 3–6తో మారెక్ గెంజెల్ (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓటమి చవిచూశారు. భారత్‌కే చెందిన మానస్ ధామ్నె, రామ్‌కుమార్ రామనాథన్‌లకు నేరుగా మెయిన్ ‘డ్రా’కు వైల్డ్ కార్డులు కేటాయించారు.




‘నేను ఆడటం లేదు’

ఇండియన్ వెల్స్ ఓపెన్‌కు వీనస్ దూరం


ఇండియన్ వెల్స్ (అమెరికా): ‘ప్రతిష్టాత్మక డబ్ల్యూటీఏ–1000 టోర్నీ ఇండియన్ వెల్స్ ఓపెన్‌లో మాజీ వరల్డ్ నంబర్‌వన్ వీనస్ విలియమ్స్ బరిలోకి దిగుతోంది. ఆమెకు మేం వైల్డ్ కార్డ్ ద్వారా అవకాశం కల్పిస్తున్నాం’... బుధవారం నిర్వాహకులు చేసిన ప్రకటన ఇది. అయితే ఇప్పుడు దీనిపై వీనస్ స్పందించింది. తాను ఈ టోర్నీలో బరిలోకి దిగడం లేదని, వైల్డ్ కార్డు గురించి కూడా తనకు మీడియా ద్వారానే తెలిసిందని ఆమె చెప్పింది. ‘మీరు చెప్పిన తర్వాతే నాకు వైల్డ్ కార్డ్ ఇస్తున్నట్లు సమాచారం తెలిసింది. నేను ఈ టోర్నమెంట్‌లో ఆడటం లేదు. నాకూ ఇండియన్ వెల్స్ అంటే ఇష్టమే. ఇక్కడ ఆడాలనే ఉంది. అవకాశం ఉంటే వైల్డ్ కార్డ్‌ను అంగీకరించేదాన్ని. కానీ ఆ సమయంలో నేను ఇప్పటికే అంగీకరించిన పలు కార్యక్రమాలు ఉన్నాయి. అసలు నేను దేశంలోనే ఉండటం లేదు’ అని వీనస్ స్పష్టం చేసింది. అనంతరం ఇండియన్ వెల్స్ డైరెక్టర్ టామీ హస్ దీనిని అధికారికంగా ప్రకటించాడు. 7 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ గెలిచిన 44 ఏళ్ల వీనస్ విలియమ్స్ 2024 మార్చిలో మయామీ ఓపెన్ తర్వాత మళ్లీ కోర్టులో అడుగు పెట్టలేదు.

రంజీ ట్రోఫీ ఫైనల్‌కు మార్పుల్లేని విదర్భ జట్టు

ఈనెల 26 నుంచి నాగ్‌పూర్‌లో కేరళతో టైటిల్ పోరు



హర్ష్ దూబే



యశ్ రాథోడ్

నాగ్‌పూర్: మూడోసారి రంజీ ట్రోఫీ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో ఉన్న రెండుసార్లు చాంపియన్ విదర్భ జట్టు ఈనెల 26 నుంచి కేరళ జట్టుతో జరిగే ఫైనల్ కోసం జట్టును ప్రకటించింది. గుజరాత్ జట్టుతో జరిగిన సెమీఫైనల్లో పోటీపడ్డ 17 మంది సభ్యులనే ఫైనల్ మ్యాచ్‌కూ కొనసాగించాలని విదర్భ క్రికెట్ సంఘం (వీసీఏ) సెలెక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. అక్షయ్ వాడ్కర్ జట్టుకు సారథ్యంలోనే విదర్భ ఫైనల్లో బరిలోకి దిగుతుందని వీసీఏ సెలెక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ సీజన్‌లో విదర్భ ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా ఫైనల్‌కు అర్హత సాధించింది. గత ఏడాది 42 సార్లు రంజీ చాంపియన్ ముంబై జట్టు చేతిలో ఫైనల్లో ఓడి రన్నరప్‌గా నిలిచిన విదర్భ ఈసారి మాత్రం ట్రోఫీని సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ సీజన్‌లో యశ్ రాథోడ్ (933 పరుగులు), హర్ష్ దూబే (66 వికెట్లు) నిలకడగా రాణించి విదర్భ జట్టు ఫైనల్‌కు చేరడంలో ముఖ్యపాత్ర పోషించారు. విదర్భ జట్టు 2017–18, 2018–19 వరుస సీజన్‌లలో రంజీ చాంపియన్‌గా నిలిచింది.

విదర్భ రంజీ జట్టు: అక్షయ్ వాడ్కర్ (కెప్టెన్, వికెట్ కీపర్), అథర్వ తైడె, కరుణ్ నాయర్, ధ్రువ్ షోరే, యశ్ రాథోడ్, యశ్ కదమ్, యశ్ ఠాకూర్, హర్ష్ దూబే, అమన్ మొఖాడె, అక్షయ్ కర్నెవార్, అక్షయ్ వఖారె, ఆదిత్య ఠాకరే, దర్శన్ నల్కండే, నచికేత్ భుటె, సిద్ధేశ్ వథ్, దానిశ్ మలెవార్, పార్థ్ రఖాడె.

నియంతలు, యుద్ధోన్మాదులతో
హక్కుల అణచివేత

ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గ్యుటెర్రస్

జెనీవా: నియంతలు, యుద్ధోన్మాదుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా మానవహక్కులు అణచివేతకు గురవుతున్నాయని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గ్యుటెర్రస్ వ్యాఖ్యానించారు. అధికారం, సొంత లాభం కోసం వీరు మానవ హక్కులను అడ్డుగా భావిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. నైతికంగా దిగజారిన ఆర్థిక విధానాలతో భూ పరిరక్షణ కంటే లాభాలవైపే మొగ్గు చూపుతున్నారని విమర్శించారు. కృత్రిమ మేధను దుర్వినియోగం చేస్తూ ప్రజలకు హాని కలిగిస్తున్నారన్నారు. వలసదారులను దుర్మార్గులుగా చిత్రించడంతోపాటు మహిళల హక్కులకు అడ్డంకులను కల్పిస్తున్నారని ఆరోపించారు. సోమవారం ఆయన ఐరాస హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వార్షిక ప్రారంభ సమావేశంలో ప్రపంచం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లపై మాట్లాడారు. మూడేళ్లుగా ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయిలో యుద్ధం సాగిస్తున్న రష్యా వైఖరిని ఆయన తప్పుబట్టారు. అదేవిధంగా, ఇజ్రాయెల్– పాలస్తీనా సాయుధ గ్రూపుల మధ్య శాశ్వత కాల్పుల విరమణ ఒప్పందం జరగాలని ఆకాంక్షించారు. అంతర్యుద్ధం అంచున ఉన్న ఆఫ్రికా దేశం కాంగో ప్రాదేశిక సమగ్రతను కాపాడాలని పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులపై ఆందోళన వ్యక్తం చేశారు. హైతీలో ప్రజలకు భద్రత, మరింత సుస్థిరత కల్పించేందుకు అవసరమైన కొత్త ఆలోచనలను భద్రతా మండలితో పంచుకుంటానని చెప్పారు. మానవ హక్కుల కౌన్సిల్ నుంచి వైదొలుగుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించడం తెలిసిందే. గత బైడెన్ ప్రభుత్వం కూడా తమకు 47 దేశాలతో కూడిన హక్కుల కౌన్సిల్‌లో స్థానం అవసరం లేదని గతేడాదే ప్రకటించింది. ఏడాదికి మూడు పర్యాయాలు కౌన్సిల్ సమావేశాలు జరుగుతుంటాయి. ఈ ఏడాది సమావేశాలు ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగుతాయి.



మూడేళ్లుగా రష్యాతో సాగుతున్న భీకర యుద్ధంలో ప్రాణాలర్పించిన తమ దేశ సైనికుల ఫొటోలతో రాజధాని కీవ్‌లో ఏర్పాటైన మెమోరియల్ వాల్ వద్ద నివాళులర్పిస్తున్న ఉక్రెయిన్ మాజీ జవాను

ఫ్రాన్స్‌లో రష్యా కాన్సులేట్‌పై దాడి!

మార్సెల్లీ: ఫ్రాన్స్‌లోని మార్సెల్లీ నగరంలోని రష్యా కాన్సులేట్‌పై దుండగులు దాడికి యత్నించారు. పెట్రోల్ బాంబులు విసిరి పారిపోయారు. అదృష్టవశాత్తు ఆ పెట్రోల్ బాంబులు కేవలం కాన్సులేట్ ఆవరణలో పడ్డాయి. దీంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. కాన్సులేట్ సమీపంలో ఒక్కసారిగా పేలుడు శబ్దం వినిపించడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. దాడి జరిగిన ప్రదేశానికి సమీపంలో దొంగతనానికి గురైన కారు దొరికిందని, ఈ కారులోనే దుండగులు ఇక్కడికి వచ్చి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనలో ఫ్రాన్స్ అంతర్గత మంత్రిత్వ శాఖ స్పందించింది. దర్యాప్తునకు ఆదేశించింది. తమ కాన్సులేట్‌పై దాడి జరగడంపై రష్యా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇది ఉగ్రవాద చర్యగా కనిపిస్తోందని రష్యా పేర్కొంది.

బంగ్లాదేశ్ వైమానిక స్థావరంపై స్థానికుల దాడి.. ఒకరి మృతి

ఢాకా: బంగ్లాదేశ్‌లోని కాక్స్‌బజార్ జిల్లాలోని వైమానిక స్థావరం ఉన్న ప్రాంతంలో స్థలవివాదం చివరకు ఘర్షణలకు దారితీసింది. వైమానిక స్థావరం ఉన్న స్థలం తమదేనని స్థానికులు ఆందోళన చేపట్టడంతో నిరసనలను అదుపులోకి తెచ్చేందుకు వాయుసేన సిబ్బంది రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సందర్భంగా వాయుసేన సిబ్బందిపైకి స్థానికులు, వ్యాపారులు రాళ్లు రువ్వారు. దీంతో ఆందోళనకారులపైకి వాయుసేన సిబ్బంది కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో స్థానిక వ్యాపారి 30 ఏళ్ల షిమాబ్ కబీర్‌కు బుల్లెట్ గాయాలయ్యాయి. రక్తమోడుతున్న అతడిని వెంటనే కాక్స్ బజార్ జిల్లా సదర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ఈ ఘర్షణల్లో పలువురు గాయపడ్డారని బంగ్లాదేశ్ సాయుధ దళాల ప్రజా సంబంధాల విభాగం ప్రకటించింది.

మాజీ సీజేఐను కాపాడేందుకు
కేసులు వేశా

- ఫీజుగా రూ.కోటి ఇప్పించండి..!
- అలహాబాద్ హైకోర్టులో లాయర్ పిటిషన్

లక్నో: 2017–18 సంవత్సరాల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ దీపక్ మిశ్రాను వేధింపులు, అవమానాలు, పదవీ గండం నుంచి కాపాడేందుకుగాను పలు కేసులు వేసినందుకు గాను తనకు ఫీజుగా రూ.కోటి చెల్లించేలా కేంద్ర న్యాయ శాఖను ఆదేశించాలంటూ అశోక్ పాండే అనే లాయర్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. 2024 ఫిబ్రవరిలో కోర్టు ఖర్చుల కింద తనకు రూ.కోటి ఇప్పించాలంటూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు వినతి పత్రం సమర్పించగా ఆమె దానిని న్యాయశాఖకు రిఫర్ చేశారన్నారు. ఆ శాఖ మాత్రం చట్ట విరుద్ధంగా తన వినతిని తిరస్కరించిందని చెప్పారు. అలా చేయడం, సాక్షాత్తూ రాష్ట్రపతిని అవమానించడమేనని పాండే ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన న్యాయ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారత పౌరుడిగా సీజేఐని కాపాడేందుకు ప్రయత్నించినట్లు చెప్పుకున్న ఆయన అప్పటి సీజేఐ కోసం వేసిన రూ.కోటికి సంబంధించిన కేసుల వివరాలను మాత్రం వివరించలేదు. సీజేఐ మిశ్రాకు వ్యతిరేకంగా ఉన్న కేసులను వాదించే లాయర్లపైనే ప్రధానంగా తాను కేసులు వేసినట్లు అశోక్ పాండే ఆ పిటిషన్‌లో తెలిపారు.

ఆర్జేడీ పాలనలో జంగిల్‌రాజ్

పశువుల దాణా కూడా దోచుకున్నారు

- భాగల్పూర్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం
- పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి విడుదల చేసిన మోదీ

భాగల్పూర్: బిహార్‌లో విపక్ష రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ)తోపాటు ఆ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. ఆర్జేడీ పాలనలో బిహార్‌లో ఆటవిక రాజ్యం నడిచిందని, పశువుల దాణాను కూడా వదిలిపెట్టకుండా దోచుకున్నారని ధ్వజమెత్తారు. బిహార్‌లో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రధాని మోదీ సోమవారం బిహార్‌లోని భాగల్పూర్‌లో పర్యటించారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులను లాంఛనంగా ప్రారంభించారు. 'ప్రధానమంత్రి–కిసాన్ సమ్మాన్ నిధి'19వ విడత సొమ్మును విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 9.8 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.22,000 కోట్లకుపైగా సొమ్ము జమచేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. తొలుత ఓపెన్ టాప్ వాహనంలో ర్యాలీగా సభావేదిక వద్దకు చేరుకున్నారు. సభలో దాదాపు 40 నిమిషాలపాటు మాట్లాడారు. ఆర్జేడీ, లాలూ ప్రసాద్ యాదవ్‌ల పేర్లు నేరుగా ప్రస్తావించకుండానే ఆరోపణలు గుప్పించారు. జంగిల్‌రాజ్‌వాలా మన విశ్వాసాలను కించపరుస్తున్నారని, సమాజంలో విద్వేషాలు సృష్టించడానికి కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. భారతదేశ అతిపెద్ద ఐక్యతా వేడుక అయిన మహాకుంభమేళాను సైతం దూషిస్తుండడం దారుణమని అన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని సైతం జంగిల్‌రాజ్‌వాలా వ్యతిరేకించారని విమర్శించారు. అలాంటి వారిని బిహార్ ప్రజలు క్షమించరని తేల్చిచెప్పారు. బిహార్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్ పాలనలో విధ్వంసమే జరిగింది తప్ప అభివృద్ధి మచ్చుకైనా లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అభివృద్ధి వేగం పుంజుకుందని వివరించారు.

శరవేగంగా వ్యవసాయ రంగ వృద్ధి

తమ ప్రభుత్వం గత పదేళ్లుగా తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న చర్యలతో దేశంలో వ్యవసాయ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తంచేశారు. పీఎం–కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇప్పటిదాకా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.3.5 లక్షల కోట్లు జమ చేశామని వివరించారు. ఈ పథకం అమల్లోకి వచ్చి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఈ మేరకు సోమవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రభుత్వ కృషితో అన్నదాతల గౌరవ ప్రతిష్టలు పెరిగాయని, వారికి నూతన శక్తి లభించిందని పేర్కొన్నారు. కేంద్రం అందిస్తున్న ఆర్థిక సాయంతో కోట్లాది మంది రైతన్నలు లబ్ధి పొందుతున్నారని, వారికి మార్కెట్ సదుపాయం మరింతగా అందుబాటులోకి వస్తోందని, తద్వారా ఆదాయం పెరుగుతోందని మోదీ ఉద్ఘాటించారు. మన అన్నదాతలను చూసి ప్రభుత్వం గర్విస్తోందని వ్యాఖ్యానించారు. వారి జీవితాలను మరింత మెరుగుపర్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.



భాగల్పూర్ సభలో ప్రధాని మోదీ, బిహార్ సీఎం నితీశ్ సరదా ముచ్చట్లు

మఖానా సూపర్ ఫుడ్

మన దేశం నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు భారీగా పెరుగుతున్నాయని, దాంతో రైతులకు మంచి ధరలు లభిస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. బిహార్‌లో సాగవుతున్న మఖానాకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందన్నారు. మఖానా సూపర్ ఫుడ్ అని చెప్పాను. తాను మఖానాను విరివిగా స్వీకరిస్తున్నానని తెలిపారు. సంవత్సరంలో కనీసం 300 రోజులు మఖానా తింటుంటానని అన్నారు. బిహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించామని గుర్తుచేశారు. భాగల్పూర్ సభలో మఖానాలతో రూపొందించిన దండను అభిమానులు మోదీకి బహూకరించారు.

చిన్నారుల సాక్ష్యం చెల్లుతుంది

భార్య హత్య కేసులో భర్తను దోషిగా తేల్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: వయసుతో సంబంధం లేకుండా చిన్నారుల సాక్ష్యం సైతం చెల్లుబాటు అవుతుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. తల్లిని తండ్రి చంపిన కేసులో సాక్ష్యం చెప్పిన ఏడేళ్ల కుమార్తె ఇచ్చిన వాంగ్మూలానికి విశ్వసనీయత ఉందని చెబుతూ, తండ్రికి శిక్ష విధిస్తూ జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ 2010 జూన్‌లో మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కొట్టేసింది. 2003లో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ''చిన్నారుల సాక్ష్యం అనేది ముమ్మాటికీ చెల్లుతుంది. ఏకపక్షంగా వారి వాంగ్మూలాన్ని తోసిపుచ్చకూడదు. సాక్ష్యాధారాల చట్టంలోని 118 సెక్షన్‌లో సాక్షుల కనీస వయసు గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. ఏ వయసు చిన్నారులు వాంగ్మూలం ఇవ్వొచ్చు అనేది కూడా లేదు. వయసులో నిమిత్తం లేకుండా చిన్నారి ఇచ్చే సాక్ష్యాన్నీ చట్టప్రకారం పరిగణనలోకి తీసుకోచ్చు. సాక్ష్యం చెప్పేటప్పుడు చిన్నారులపై ఇతరుల ప్రభావం లేదని, సాక్ష్యాన్ని తారుమారుచేసే ప్రయత్నాలు జరగలేదని స్పష్టమైతే ఆ చిన్నారులు ఇచ్చే సాక్ష్యాలను ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలి ''అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. 2003 జూలై 15వ తేదీ అర్ధరాత్రి బీరేంద్ర కుమారిని ఆమె భర్త బల్వీర్‌సింగ్ చంపాడని కేసు నమోదైంది. అదే సమయంలో ఇంటి గది బయట ఉన్న ఏడేళ్ల కూతురు రాణి ఇచ్చిన సాక్ష్యం చెల్లదని భర్త తరఫు లాయర్లు చేసిన వాదనలతో హైకోర్టు ఏకీభవించడంతో 2010లో అతను నిర్దోషిగా బయటపడ్డారు. ఈ తీర్పును మధ్యప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్‌చేసింది.

కజిరంగాను సందర్శించిన 61 దేశాల రాయబారులు

గువాహటి: భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ 61 దేశాల రాయబారులతో కలిసి సోమవారం అస్సాంలోని ప్రఖ్యాత కజిరంగా జాతీయ వనాన్ని సందర్శించారు. అడ్వాంటేజ్ అస్సాం 2.0 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ మంగళవారం జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు వచ్చిన వివిధ దేశాల రాయబారులు ఆదివారం రాత్రి మంత్రితో కలిసి జోర్హాట్ పట్టణానికి చేరుకున్నారు. తర్వాత సోమవారం ఉదయమే కజిరంగా జాతీయ వనంలోకి సందర్శనకు వెళ్లారు. మొదట కొహోరాలోని పార్క్ సెంట్రల్ రేంజ్‌లో ఉన్న ఏనుగుల సఫారీకి వెళ్లారు. ఈ సందర్భంగా జైశంకర్ ప్రసిద్ధ ఏనుగు ప్రద్యుమ్నపై కూర్చుని అడవిని చూశారు.

ఒబేసిటీ వ్యతిరేక పోరాటం

- ప్రచారకర్తలుగా ఒమర్ అబ్దుల్లా, ఆనంద్ మహీంద్రా, మోహన్‌లాల్..
- 10 మందిని నామినేట్ చేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దేశంలో ఊబకాయం అతిపెద్ద ఆరోగ్య సమస్యగా మారిందంటూ 'మన్‌కీ బాత్'సందర్భంగా ఆదివారం ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ..ఈ బెడదపై పోరాటానికి ప్రచారకర్తలుగా జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా, నటుడు మోహన్‌లాల్ తదితర 10 మంది వివిధ రంగాల ప్రముఖులను నామినేట్ చేశారు. 'ఒబేసిటీ వ్యతిరేక పోరాటాన్ని బలోపేతం చేయడానికి, ఆహారంలో నూనెల వినియోగాన్ని తగ్గించడంపై అవగాహన కల్పించడానికి వీరిని నామినేట్ చేయాలనుకుంటున్నాను. మన ఉద్యమం మరింత విస్తరించేలా ఒక్కొక్కరు 10 మందిని నామినేట్ చేయమని వారిని అభ్యర్థిస్తున్నాను'అని ప్రధాని మోదీ సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రధాని ప్రతిపాదించిన మిగతా వారిలో భోజ్‌పురి గాయని నిరాహువా, ఒలింపియన్లలో షూటర్ మనూ భాకర్, వెయిట్ లిఫ్టర్ మిరాబాయి చాను, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని, నటుడు మాధవన్, గాయని శ్రేయా ఘోషల్, రాజ్యసభ ఎంపీ సుధా మూర్తి ఉన్నారు. ప్రధాని మోదీ ప్రతిపాదనలపై సంతోషం వ్యక్తం చేసిన సీఎం ఒమర్ అబ్దుల్లా..ఈ ఉద్యమంలో పాల్గొనాలంటూ మరో పది మంది పేర్లను నామినేట్ చేశారు. మధుమేహం, గుండెపోటు, శ్వాస సమస్యలను తెచ్చిపెట్టే ఒబేసిటీని దరి చేరనివ్వరాదంటూ సాగే ఈ ఉద్యమంలో పాల్గొనాలని వారిని 'ఎక్స్'లో కోరారు. మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా సైతం వికసిత్ భారత్ కల సాకారమవ్వడానికి బలమైన ఆర్థిక వ్యవస్థతోపాటు ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉండాలంటూ నటుడు అనిల్ కపూర్ సహా పది మంది ప్రముఖుల పేర్లను నామినేట్ చేశారు. సుధా మూర్తి కూడా ఒలింపియన్ పీటీ ఉష, అనిల్ కుంబ్లే, వెంకటేశ్ ప్రసాద్ తదితర పది మందిని ప్రతిపాదించారు. మిరా బాయి చాను కూడా పీవీ సింధు, డి.గుకేశ్ తదితర 10 పేర్లను ప్రతిపాదించారు.

299 అత్యాచారాల నిందితుడిపై మొదలైన విచారణ

వన్నేస్(ఫ్రాన్స్): ఫ్రాన్స్ చరిత్రలోనే చిన్నారులపై అత్యంత దారుణమైన లైంగిక దాడుల పరంపరంగా తీవ్ర వివాదాస్పదమైన జోయెల్ అత్యాచారాల ఉదంతంలో సోమవారం కోర్టు విచారణ మొదలైంది. దాదాపు 25 సంవత్సరాల కాలంలో పది ఆస్పత్రుల్లో 299 మంది రోగులపై లైంగిక దాడి, అత్యాచారాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 74 ఏళ్ల మాజీ వైద్యునిపై వాయవ్య ఫ్రాన్స్‌లోని బ్రిటానీ రీజియన్‌లోని వన్నేస్ సిటీ కోర్టులో విచారణ ప్రారంభమైంది. ఇప్పటికే నలుగురు చిన్నారులపై లైంగికదాడి, అత్యాచారం కేసుల్లో దోషిగా తేలి 15 ఏళ్ల కారాగార శిక్ష అనుభవిస్తున్న ఖైదీ జోయెల్ లీ స్కార్నెక్.. ఈ కేసుల్లోనూ దోషిగా తేలితే మరో 20 ఏళ్ల జైలుశిక్షను అనుభవించాల్సి రావొచ్చు. 1989 నుంచి 2014 వరకు దాదాపు పాతికేళ్లలో 299 మంది చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడ్డాడని జోయెల్‌పై పలు కేసులు నమోదయ్యాయి. బాధితుల్లో 158 మంది అబ్బాయిలు, 141 మంది అమ్మాయిలు ఉన్నారు. ఘటనలు జరిగినప్పుడు బాధితులంతా దాదాపు 12 ఏళ్ల వయసులోపు వాళ్లు. వృత్తిరీత్యా సర్జన్ అయిన జోయెల్ తన వద్దకు వైద్యం, శస్త్రచికిత్స నిమిత్తం వచ్చిన రోగులను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి లైంగికంగా వేధించినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. 2017లో ఆరేళ్ల పొరుగింటి బాలికను పిట్టగోడ మీదుగా అసభ్యంగా తాకడంతో తొలిసారిగా ఇతనిపై కేసు నమోదైంది. ఈ సందర్భంగా పోలీసులు ఇతని ఇంటిని సోదా చేయగా 3,00,000 ఫొటోలు, చిన్నారులకు సంబంధించిన 650 అసభ్య వీడియోలు దొరికాయి. తాను అఘాయిత్యం చేసిన తన రోగుల జాబితాను ఇతను రాసిపెట్టుకోవడంతో 1989 నుంచి పాతికేళ్లుగా నిరాటంకంగా సాగిన ఘోరాల చిట్టా ఒక్కసారిగా బహిర్గతమైంది. రోగులకు మత్తుమందు ఇచ్చి స్పృహలో లేని సమయంలో ఈ లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. అకృత్యాలకు పాల్పడిన ఇతడిని కఠినంగా శిక్షించాలని ఫ్రాన్స్‌లో చిన్నారుల హక్కుల పరిరక్షణా సంఘాలు పెద్ద ఉద్యమం లేవనెత్తాయి. అరెస్ట్ చేసి విచారించగా చాలా కేసుల్లో నిందితుడు తన తప్పును ఒప్పుకోవడం గమనార్హం. అయితే ''ఒక్క రేప్ చేసిన వ్యక్తికి దాదాపు 300 రేప్‌లు చేసిన కామపిశాచికీ ఒక్కటే శిక్ష ఎంత వరకు సబబు?''అని హక్కుల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. 2006లోనే క్వింపెర్లీ పట్టణంలో వైద్యునిగా జోయెల్ పనిచేస్తున్నప్పుడు ఇతని ప్రవర్తనపై అనుమానంతో ఒక మానసిక వైద్యుడు ఫిర్యాదుచేశాడు. ఆ మానసిక వైద్యుని ఫిర్యాదును ఎవరూ పట్టించుకోకపోవడం విషాదం. 2005లో సైతం చిన్నపిల్లల పోర్నోగ్రఫీ ఫొటోలను కల్గిఉన్నాడని ఆరోపణలు వచ్చినా ఇతనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సర్జన్‌గా కొనసాగి ఈ అకృత్యాలు కొనసాగించగలిగాడని పోలీసులు నేరాభియోగాలు మోపారు.

సంభాల్ 'మసీదు' బావి ప్రభుత్వ స్థలంలోనే ఉంది

సుప్రీంకోర్టుకు తెలిపిన యూపీ ప్రభుత్వం

న్యూఢిల్లీ: సంభాల్‌లోని మొఘలుల కాలం నాటి జామా మసీదు పక్కనున్న బావి ప్రభుత్వ భూమిలోనే ఉందని యూపీ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. జనవరి 10వ తేదీన ఇచ్చిన ఆదేశాల మేరకు యూపీ ప్రభుత్వం సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనానికి ఈ మేరకు నివేదికను అందజేసింది. 'ఆ ప్రాంతంలో జిల్లా యంత్రాంగం ప్రజావసరాల కోసం అభివృద్ధి పరిచిన 19 బావుల్లో ఇదొకటి. కానీ, పిటిషనర్లు దీనిని ప్రైవేట్ వ్యక్తులకు చెందిన బావిగా పేర్కొంటున్నారు'అని అందులో వివరించింది. వివాదాస్పద ప్రాంతం లోపల ఉన్న ఈ బావిని స్థానికంగా 'ధరణి వరాహ కూప్'అని పిలుస్తుంటారని తెలిపింది. మసీదులో నుంచి బావి వద్దకు దారి మాత్రం లేదంది. అంతేకాదు, వివాదాస్పద జామా మసీదు ప్రాంతం కూడా ప్రభుత్వ జాగాలోనే ఉందని తెలిపింది. మసీదు ప్రాంతంలో సర్వే చేపట్టాలంటూ జిల్లా కోర్టు ఆదేశాలివ్వడం, గతేడాది నవంబర్‌లో మసీదు వద్ద జరిగిన హింసాత్మక ఘటనల్లో నలుగురు చనిపోగా పలువురు గాయపడటం తెల్సిందే.

నిలకడగానే పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం

రోమ్: పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం నిలకడగానే ఉందని వాటికన్ సిటీ వర్గాలు సోమవారం వెల్లడించాయి. తీవ్ర అనారోగ్యానికి గురైన పోప్ చికిత్స కోసం ఆసుపత్రిలో చేరి పది రోజులవుతోంది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో ఆయన బాధపడుతున్నారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. పోప్ ఆదివారం రాత్రి ప్రశాంతంగా నిద్రించారని, సోమవారం ఉదయాన్నే మేల్కొని తన దినచర్య పూర్తి చేసుకున్నారని వాటికన్ సిటీ వర్గాలు పేర్కొన్నాయి. ఆయన చక్కగా విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపాయి. ఆహారం స్వీకరించడంలో ఇబ్బందులేవీ లేవని వివరించాయి. ఇతరుల సాయం లేకుండానే పోప్ స్వయంగా ఆహారం తీసుకుంటున్నారని వెల్లడించాయి. సాధారణ ఆహారమే భుజిస్తున్నారని తెలియజేశాయి. 88 ఏళ్ల పోప్ ఫ్రాన్సిస్ త్వరలోనే కోలుకుంటారని వాటికన్ సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తంచేశాయి. పోప్ మరికొన్ని రోజులపాటు ఆసుపత్రిలో ఉండాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.



త్రివేణీ సంగమంలో స్నానమాచరిస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్

మహా కుంభ్‌కు మరికొందరు ప్రముఖులు

మహా కుంభ్: ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహా కుంభమేళాకు సోమవారం ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ సహా పలువురు తరలివచ్చారు. త్రివేణీ సంగమంలో స్నానాలాచరించి, పూజలు చేశారు. సీఈసీతో పాటు బాలీవుడ్ స్టార్లు అక్షయ్ కుమార్, కత్రినా కైఫ్, సొనాలి బింద్రే కూడా పుణ్య స్నానాలు చేశారు. మేళాలో ఏర్పాట్లు పక్కాగా ఉన్నాయంటూ సీఎం యోగిపై అక్షయ్ కుమార్ ప్రశంసలు కురిపించారు. కత్రినా కైఫ్ స్థానికంగా ఉన్న పరమత్ నికేతన్ శిబిరానికి వెళ్లి స్వామి చిదానంద సరస్వతి, సాధ్వి భగవతి సరస్వతి నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. సొనాలి బెంద్రే తన కుటుంబంతో కుంభ మేళాకు వచ్చారు. జనవరి 13న మొదలైన ఈ మహా క్రతువు ఈ నెల 26న మహాశివరాత్రితో ముగియనుంది. త్రివేణీ సంగమంలో రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు ఇప్పటికే పుణ్య స్నానాలు చేయడం తెలిసిందే.

ఫిర్యాదుల స్వీకరణకు యంత్రాంగం ఏర్పాటు చేయాలి

- ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఆందోళనకరం
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనల వ్యాప్తి దేశంలో నానాటికీ పెరుగుతుండడం పట్ల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి ప్రకటనలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వెల్లడించింది. డ్రగ్ అండ్ మ్యాజిక్ రెమెడీస్(అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్‌మెంట్స్) చట్టం–1954ను పటిష్టంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. కోవిడ్–19 వ్యాక్సినేషన్ కార్యక్రమానికి వ్యతిరేకంగా పతంజలి సంస్థ, యోగా గురువు రామ్‌దేవ్ బాబా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ 2022లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై మూడేళ్లుగా విచారణ కొనసాగుతోంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. 1954 నాటి చట్టంలోని నిబంధనలను అన్ని రాష్ట్రాలు అమల్లోకి తీసుకురావాలని సూచించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలపై ప్రజలు ఫిర్యాదు చేయాలని కోరుకుంటున్నారని తెలిపింది. అలాంటి ఫిర్యాదులు స్వీకరించడానికి అధికారులతో ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టంచేసింది. తదుపరి విచారణను మార్చి 7వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, ఇదే అంశంపై ఈ ఏడాది ఫిబ్రవరి 10న విచారణ జరిగినప్పుడు ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, జమ్మూకశ్మీర్ తదితర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు సమన్లు జారీ చేసింది.

ఆ ఐదుగురినీ నేనే చంపా.. పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన కేరళ వ్యక్తి

తిరువనంతపురం: ప్రేమ వ్యవహారమో మరే కారణమో తెలియదు కానీ, ఓ 23 ఏళ్ల వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. 13 ఏళ్ల సొంత తమ్ముడు, 80 ఏళ్ల బామ్మతోపాటు మరో ఇద్దరు సన్నిహిత కుటుంబసభ్యులను, అతడి ప్రేమికురాలిగా భావిస్తున్న ఓ యువతిని హతమార్చాడు. ఇతడి దాడిలో తీవ్రంగా గాయపడిన తల్లి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. కేరళ రాజధాని తిరువనంతపురం సమీపంలోని వెంజరమూడులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. నిందితుడు అఫాన్ మూడిళ్లలోని ఐదుగురిని చంపానంటూ వెంజరమూడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి చెప్పేదాకా ఈ ఘోరం ఎవరికీ తెలియక పోవడం గమనార్హం. అంతేకాదు, చచ్చిపోవాలని విషం తాగానంటూ అఫాన్ చెప్పగానే అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఇతర వివరాలను పోలీసులు వెల్లడించలేదు. షాక్‌కు గురిచేసే ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు మాత్రం తెలిపారు.

32 మంది ఆప్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు

పంజాబ్ కాంగ్రెస్ నేత బజ్వా వెల్లడి

చండీగఢ్: పంజాబ్‌లో అధికార పార్టీ ఆప్‌నకు చెందిన 32 మంది ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బజ్వా వెల్లడించారు. 45 ఏళ్ల రాజకీయ అనుభవంతో చెబుతున్నానని, తన అంచనా ఎన్నడూ తప్పుకాలేదని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష కాంగ్రెస్ నేత అయిన బజ్వా సోమవారం మీడియాతో మాట్లాడారు. అయితే, ఈ ప్రభుత్వాన్ని పడగొట్టే ఆలోచన కాంగ్రెస్‌కు ఎంతమాత్రం లేదన్నారు. 'ఆప్ 32 మంది ఎమ్మెల్యేలే కాదు, పలువురు మంత్రులు కూడా నాతో టచ్‌లో ఉన్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అమన్ అరోరాకు సైతం ఈ విషయం తెలుసు'అని బజ్వా చెప్పారు.

ఆస్థాన కవుల హోదా చెల్లదని తీర్పునిచ్చిన కేసు?

సామాజిక జీవనంలో వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన, నమ్మకం, గౌరవం లాంటి వాటిని ఉదాత్తమైన మానవీయ పరిపక్వతా లక్షణాలుగా పేర్కొంటారు. సమాజం ద్వారానే వ్యక్తి అన్ని లక్షణాలను, స్వభావాలను అలవర్చుకుంటాడు. అదేవిధంగా సమాజం నుంచి అనేక ప్రయోజనాలు పొందుతాడు. దీనికి ప్రతిగా సమాజానికి సేవ, సహాయాన్ని అందించాల్సిన కనీస బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉంది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



ప్రాథమిక విధులు

విధి అంటే ఒక వ్యక్తి ఇతరుల కోసం నిర్వర్తించాల్సిన పని లేదా బాధ్యత అని అర్థం. విధులు సమాజ వికాసానికి, దేశాభివృద్ధికి, సామాజిక స్పృహ కల్పించడానికి దోహదం చేస్తాయి. ఇవి దేశ ఐక్యత, సమగ్రతను పెంపొందిస్తాయి. ప్రాథమిక హక్కులనే ఫలాలు విధులుగా పరిపక్వం చెందినప్పుడే సమాజ జీవనం సాఫల్యం అవుతుంది.

విధులు – రకాలు: సాధారణంగా విధులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. **అవి:**

ఎ) నైతిక విధులు

బి) చట్టబద్ధమైన విధులు

నైతిక విధులు అనేవి ప్రజల నైతిక విలువలు, సామాజిక స్పృహపై ఆధారపడి ఉంటాయి. **ఉదా:** పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించడం; అభాగ్యులను, విధివంచితులను ఆదుకోవడం.

చట్టబద్ధమైన విధులు సమాజంతో ఆమోదం పొంది, ప్రభుత్వం గుర్తించిన బాధ్యతలు. వీటిని ఉల్లంఘిస్తే శిక్షార్హులవుతారు.

ఉదా: ట్రాఫిక్ నియమాలు పాటించడం, పన్నులు సక్రమంగా చెల్లించడం.

భారత రాజ్యాంగం – ప్రాథమిక విధులు

ప్రతి పౌరుడు దేశం పట్ల, తన తోటి పౌరుల పట్ల కొన్ని కనీస బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. అందువల్ల వీటిని ప్రాథమిక విధులు అంటారు. వీటిని రష్యా రాజ్యాంగం నుంచి గ్రహించారు. మౌలిక రాజ్యాంగంలో ప్రాథమిక విధుల ప్రస్తావన లేదు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సర్దార్ స్వరణ్ సింగ్ కమిటీ సిఫారసుల మేరకు ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో పొందుపర్చారు. ప్రారంభంలో పది ప్రాథమిక విధులు ఉండేవి. 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొక విధిని రాజ్యాంగంలో చేర్చడంతో వీటి సంఖ్య పదకొండుకు పెరిగింది. ప్రాథమిక విధులు 1977 జనవరి 3 నుంచి అమల్లోకి వచ్చాయి. అందువల్ల ఈ రోజును ప్రాథమిక విధుల దినోత్సవంగా పరిగణిస్తారు.

ప్రాథమిక విధులు – లక్షణాలు:

ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. అవి..

- ప్రాథమిక విధులకు న్యాయ సంరక్షణ లేదు. ఇవి నేరుగా అమల్లోకి రావు. వీటి అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక చట్టాలు చేయాలి.
- ప్రాథమిక విధులు కేవలం పౌరులకు మాత్రమే వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక విధులు నైతికపరమైన బాధ్యతలు, మరికొన్ని పౌర బాధ్యతలు.
- కొన్ని ప్రాథమిక విధులను భారత సనాతన సంప్రదాయాలు, మత విలువలు, పురాణాల ఆధారంగా తీసుకున్నారు.

ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలోని 4–ఎ భాగంలో నిబంధన 51–ఎలో పొందుపర్చారు.

51–ఎ:

ఎ) రాజ్యాంగానికి కట్టుబడి ఉండి దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలి.

బి) జాతీయ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో ఉన్నత ఆదర్శాలను పాటించాలి.

సి) భారతదేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను, సమగ్రతను పరిరక్షించాలి.

డి) దేశ రక్షణకు, జాతీయ సేవకు సదా సన్నద్ధంగా ఉండాలి.

ఇ) భారత ప్రజల మధ్య మత, భాష ప్రాంతీయ, వర్గ వైవిధ్యాలకు అతీతంగా సోదర భావాన్ని, స్ఫూర్తిని పెంపొందించాలి. స్త్రీల గౌరవాన్ని భంగపరిచేవాటిని త్యజించాలి.

ఎఫ్) భారత మిశ్రమ సంస్కృతి, ఔన్నత్యం, సంప్రదాయాలను గౌరవించి, పరిరక్షించాలి.

జి) అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులు సహా ప్రకృతిలోని పరిసరాలను కాపాడాలి, అభివృద్ధి చేయాలి, జీవులపట్ల కారుణ్యాన్ని కలిగి ఉండాలి.

హెచ్) శాస్త్రీయ దృక్పథాన్ని, మానవ జిజ్ఞాసను, పరిశోధన, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందించుకోవాలి.

ఐ) ప్రజల ఆస్తిని సంరక్షించాలి, హింసను ప్రేరేపించే చర్యల్లో పాల్గొనకూడదు.

జె) వ్యక్తిగత, సమష్టి చర్యల ద్వారా ప్రతి కార్యరంగంలోనూ అత్యున్నత స్థానాన్ని పొందడానికి కృషి చేయాలి. తద్వారా దేశ అత్యున్నత అభ్యుదయానికి తోడ్పడాలి.

కె) 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు విద్యావకాశాలను కల్పించే బాధ్యతను తల్లి/ తండ్రి లేదా సంరక్షకుడు నిర్వర్తించాలి.

ప్రాథమిక విధులు – సుప్రీంకోర్టు తీర్పులు

శ్యాం నారాయణ్ చౌక్సీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా

ఈ కేసులో జాతీయ పతాకాన్ని ప్రైవేట్ వ్యక్తుల ప్రచారం కోసం వినియోగించరాదని సుప్రీం కోర్టు పేర్కొంది.

బిజో మాన్యూవల్ Vs కేరళ (1986)

ఈ కేసులో సుప్రీం కోర్టు జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాల్సిన అవసరం లేదని పేర్కొంది. జాతీయ గీతాలాపన అనేది మత విశ్వాసాలకు విరుద్ధమైతే ఈ విషయంలో మినహాయింపు ఉంటుంది. జాతీయ గీతాన్ని ఆలపించినప్పుడు మాత్రం అందరూ గౌరవ సూచకంగా నిలబడాలని పేర్కొంది.

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ Vs స్టూడెంట్ యూనియన్ (2002)

ప్రాథమిక విధులను విస్మరించరాదని, అవి దేశ సమగ్రతకు, సామాజిక జీవనానికి ఆదర్శంగా ఉంటాయని ఈ కేసులో సుప్రీం కోర్టు పేర్కొంది.

డాక్టర్ దాశరథి Vs ఆంధ్రప్రదేశ్

ఈ కేసులో ఆస్థాన కవుల హోదా చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

గ్రామీణ వ్యాజ్యాల హక్కుల కేంద్రం Vs ఉత్తరప్రదేశ్ (1986)

పర్యావరణ పరిరక్షణలో ప్రాథమిక విధులను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.

నవీన్ జిందాల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (2004)

జాతీయ జెండాను ఎగురవేయడం భావ వ్యక్తీకరణ కిందకి వస్తుందని, పౌరులకు స్వేచ్ఛగా జెండా ఎగురవేసే హక్కు ఉంటుందని పేర్కొంది.

ప్రాథమిక విధులు – జస్టిస్ జె.ఎస్.

వర్మ కమిటీ సూచనలు

1999లో నియమించిన వర్మ కమిటీ ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని సిఫారసులు చేసింది. అవి..

- జాతీయ పతాకం, జాతీయ గీతం, భారత రాజ్యాంగ పరిరక్షణకు, గౌరవానికి సంబంధించి 1971లో చేసిన చట్టం సరిపోతుందని పేర్కొంది. అదేవిధంగా భారత శిక్షాస్మృతిలో ఉన్న చట్టాల ద్వారా కొన్ని విధులను అమలు చేయవచ్చని చెప్పింది. ఉదాహరణకు..
  పౌర హక్కుల పరిరక్షణ చట్టం – 1955,
  ప్రజాప్రాతినిధ్య చట్టం – 1951,
  చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం–1967,
  వన్యప్రాణి సంరక్షక చట్టం – 1972,
  అడవుల పరిరక్షణ చట్టం – 1980,
- ఏటా జనవరి 3ను ప్రాథమిక విధుల దినోత్సవంగా పాటించాలి.
- అన్ని విద్యా ప్రణాళికల్లో ప్రాథమిక విధులను పాఠ్యాంశంగా చేర్చాలి.
- అన్ని విద్యా సంస్థల్లో ఎన్‌సీసీలను తప్పక ప్రవేశ పెట్టాలి.
- ప్రసార మాధ్యమాల ద్వారా ప్రాథమిక విధుల గురించి విస్తృత ప్రచారం కల్పించాలి.

ప్రముఖుల వ్యాఖ్యానాలు

ఆదేశిక సూత్రాల అమలు ప్రభుత్వ చిత్తశుద్ధిపై ఆధారపడి ఉన్న విధంగానే ప్రాథమిక విధుల అమలు అనేది వ్యక్తుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుంది – **దుర్గాదాస్ బసు**

ప్రాథమిక విధులు కేవలం అలంకార పూర్వకమైనవి – **జస్టిస్ కె.వి. ముఖర్జీ**

హక్కులు, విధులనేవి ఒకే నాణేనికి ఉన్న పార్శ్వాలు (Two sides of a same coin) – **హెచ్.జె. లాస్కీ**

ప్రాథమిక విధులు అసంబద్ధంగా, గందరగోళంగా ఉన్నాయి – **నానీ పాల్కీవాలా**

విమర్శనాత్మక పరిశీలన

ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చడంపై అనేక విమర్శలున్నాయి.

- దేశంలో భారత పౌరులు సహజంగా చట్ట విధేయులు, క్రమశిక్షణ ఉన్నవారు అయినప్పుడు వారి బాధ్యతలను ప్రత్యేకంగా గుర్తు చేయడం సమంజసం కాదని కొంతమంది అభిప్రాయం.
- అత్యంత ముఖ్యమైన విధులైన సక్రమంగా పన్నులు చెల్లించడం, కుటుంబ నియంత్రణ, ఎన్నికల్లో ఓటు వేయడం లాంటి వాటిని ప్రాథమిక విధుల్లో పొందుపరచలేదు.
- ఈ విధులు కేవలం నైతికపరమైన నియమావళిపైనే ఆధారపడి ఉన్నాయి. వీటిని పాటించకపోతే శిక్షించే ఆస్కారం లేదు.
- ప్రాథమిక విధుల్లో పేర్కొన్న కొన్ని పదాలకు స్పష్టత లేదు. **ఉదా:** శాస్త్రీయ దృక్పథం, మిశ్రమ సంస్కృతి, పరిశోధనా స్ఫూర్తి అనే పదాలకు నిర్దిష్ట అర్థాలు లేవు. వీటిని నాలుగో భాగంలో కాకుండా మూడో భాగంలోనే చేర్చి ఉండాల్సింది.
- సాధారణంగా ప్రాథమిక విధులు ప్రజాస్వామ్య రాజ్యాంగంలో అంతర్భాగంగా ఉండవు. నియంతృత్వ దేశాల రాజ్యాంగంలో మాత్రమే ఇవి ఉంటాయి.
- ఇవి చట్ట నిర్దేశానికి, ఆత్మ ప్రబోధానికి మధ్య వైవిధ్యాన్ని కలిగించవచ్చు.

ప్రాథమిక విధుల ప్రయోజనాలు

- ప్రాథమిక విధులకు న్యాయసంరక్షణ లేకపోయినా, కొన్ని లోపాలున్నా.. వీటిని రాజ్యాంగంలో చేర్చడం సమంజసమే. ఎందుకంటే విధులు లేకుండా హక్కులను మాత్రమే గుర్తిస్తే అది బాధ్యతారాహిత్యానికి దారితీస్తుంది. అదేవిధంగా హక్కులు లేని బాధ్యతలు బానిసత్వానికి ప్రతీక అవుతాయి. కాబట్టి హక్కులు, విధులు, పరస్పర పోషకాలు. అవి ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల లాంటివి.
- ప్రాథమిక విధులు కూడా ఆదేశిక సూత్రాల్లా ప్రభుత్వ విధానాలు, కార్యాచరణను ప్రభావితం చేస్తాయి.
- ఆచరణాత్మకమైనవి కాకపోయినా నిరంతరం పౌరుల నైతిక బాధ్యతలను గుర్తు చేస్తాయి.
- అనేక వైవిధ్యాలున్న భారతదేశంలో పౌరులు చిత్తశుద్ధితో విశాల దృక్పథంతో బాధ్యతాయుత పౌరులుగా దేశ ఐక్యతకు, సమగ్రతకు, కృషి చేసేలా దోహద పడతాయి.
- ప్రాథమిక విధులను, ప్రాథమిక హక్కులపై ఉన్న హేతుబద్ధమైన పరిమితులుగా పరిగణించవచ్చని 1992లో సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.

మాదిరి ప్రశ్నలు

1. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులెన్ని?
   1) 8 2) 9 3) 10 4) 11
2. ఏ కమిటీ సూచనల మేరకు ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చారు?
   1) రాజమన్నార్ 2) సర్కారియా
   3) స్వరణ్ సింగ్ కమిటీ
   4) బల్వంత్ రాయ్ కమిటీ
3. ప్రాథమిక విధులకు సంబంధించి కిందివాటిలో సరైన వాక్యం ఏది?
   1) ప్రాథమిక హక్కులతోపాటే వీటిని ప్రవేశ పెట్టారు
   2) ఆదేశిక సూత్రాల స్థానంలో వీటిని ప్రవేశ పెట్టారు
   3) వీటిని ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు
   4) ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలతో కలిపి ప్రవేశ పెట్టారు

సమాధానాలు: 1) 4 2) 3 3) 3

ప్రకటనకు బలమైన వాదనే సరైంది



ప్రకటనలు - వాదనలు

'ప్రకటనలు – వాదనలు' చాప్టర్‌లోని ప్రశ్నలు ప్రకటనల రూపంలో ఉంటాయి. ప్రకటనల కింద రెండు వాదనలు అవును లేదా కాదు అని ఇస్తారు. ఈ ప్రశ్నలకు జవాబు గుర్తించడానికి సూచనలు..

- ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు జవాబు గుర్తించేటప్పుడు ఆ జవాబు (వాదనలు) ప్రకటనకు సంబంధించి ఉండాలి. కానీ నిజ జీవితానికి సంబంధించి అన్వయించుకోకూడదు.
- బలమైన వాదనే సరైన వాదన అవుతుంది. అవును అని ఉన్నా, లేదా కాదు అని ఉన్నా బలమైన వాదనే సరైంది.
- వాదనల్లో తిరిగి ప్రశ్నించినట్టు ఉంటే ఆ వాదన సరైంది కాదు.
- వాదనలు నిజాలుగా ఉండాలి. కానీ ఊహలుగా ఉండకూడదు.

ఉదాహరణ:

ప్రకటన: భారతదేశంలో రూపాయికే కిలో బియ్యం ఇవ్వొచ్చా?

వాదన –1: అవును, పేదరిక నిర్మూలనకు కేవలం ఇదొక్కటే మార్గం.

వాదన –2: కాదు, ప్రభుత్వంపై ఇప్పటికే అధిక భారం ఉంది.

సమాధానం: 2 మాత్రమే సరైంది

వివరణ: పేదరిక నిర్మూలనకు ఇదొక్కటే మార్గం అని చెప్పడం మిగతా అంశాలను విస్మరించినట్టే అవుతుంది కాబట్టి వాదన 1 సరైంది కాదు. కానీ వాదన 2 మాత్రమే సరైంది, బలంగా ఉంది.

మాదిరి ప్రశ్నలు

కింద ప్రకటనలు, వాటి కింద రెండు వాదనలు ఉన్నాయి. ఆ వాదనలను జాగ్రత్తగా విశ్లేషించి ఏ వాదన బలమైందో, ఏది బలహీనమైందో/ పేలవమైందో గుర్తించాలి. ఆప్షన్‌ను కింది విధంగా ఎంచుకోవాలి.

1. కేవలం వాదన–1 మాత్రమే బలమైంది అయితే.
2. కేవలం వాదన–2 మాత్రమే బలమైంది అయితే.
3. రెండు వాదనలూ సరైనవి కాకపోతే.
4. రెండు వాదనలూ సరైనవి అయితే.

1. **ప్రకటన:** భారత్‌లో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వలస వెళ్లడం నిషేధించాలా?
   వాదన –1: కాదు, ప్రతి పౌరుడు రాజ్యాంగం ప్రకారం దేశంలో ఎక్కడైనా నివసించవచ్చు.
   వాదన –2: అవును, దీని ద్వారా వనరులు సద్వినియోగం అవుతాయి.
2. **ప్రకటన:** కళాశాలల్లో / యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాలు అవసరమా?
   వాదన –1: లేదు, దీనివల్ల క్యాంపస్‌లో రాజకీయ వాతావరణం ఏర్పడుతుంది.
   వాదన –2: అవును. ఇది అవసరం ఎందుకంటే విద్యార్థులే రేపటి రాజకీయ నాయకులు.
3. **ప్రకటన:** ఐక్యరాజ్యసమితిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం అవసరమా?
   వాదన –1: అవును. భారత్ శాంతి సౌభ్రాతృత్వాన్ని కోరుకునే దేశం.
   వాదన –2: కాదు. ఎందుకంటే ముందుగా భారత్‌లో పేదరికాన్ని తొలగించాలి.
4. **ప్రకటన:** పెళ్లికి ముందే కాబోయే జంటకు వైద్య పరీక్షలు అవసరమా?
   వాదన –1: లేదు. అలాంటి ఆలోచన ఊహించలేనిది/ భరించరానిది.
   వాదన –2: అవును. దీనివల్ల జన్యులోపాలతో పుట్టే బిడ్డల సంఖ్య తగ్గుతుంది.
5. **ప్రకటన:** ఎల్పీజీపై సబ్సిడీని విరమించాలా?
   వాదన –1: లేదు. ఇది మామూలు ప్రజలపై భారాన్ని పెంచుతుంది.
   వాదన –2: అవును. దీనివల్ల నిజమైన పేదలు లబ్ధిపొందడం లేదు.
6. **ప్రకటన:** కిరోసిన్‌పై సబ్సిడీ పెంచాలా?
   వాదన –1: అవును. దీనిమూలంగా పేదలకు మేలు జరుగుతుంది.
   వాదన –2: కాదు మన ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా లేదు.
7. **ప్రకటన:** కత్తి కంటే కలం గొప్పదా?
   వాదన –1: అవును. ఎందుకంటే రచయితలు ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తారు.
   వాదన –2: కాదు. ఎందుకంటే కత్తి బలంతో ఒక వ్యక్తి అందరినీ జయించవచ్చు.
8. **ప్రకటన:** ప్రయోగ పరీక్షల కోసం జంతువులను చంపాలా?
   వాదన –1: అవును. అవి చాలా ఎక్కువ సంఖ్యలో ఉంటాయి కాబట్టి.
   వాదన –2: కాదు. మేం అహింసకు సహకరిస్తాం.
9. **ప్రకటన:** సైన్యంలో చేరడానికి 18 ఏళ్ల లోపు వారిని అనుమతించాలా?
   వాదన –1: లేదు. 18 ఏళ్ల లోపు వారికి శారీరక, మానసిక ఎదుగుదల తగినంత ఉండదు. కాబట్టి వారు ఆ భారాన్ని మోయలేరు.
   వాదన–2: అవును. ఎక్కువ కాలం సైన్యంలో సేవ చేయడానికి, దేశంలో ఆర్మీని అభివృద్ధి చేయడానికి ఇది తోడ్పడుతుంది.
10. **ప్రకటన:** ప్రైవేటు రంగంలో కూడా బలహీన వర్గాల వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలా?
    వాదన –1: లేదు. ప్రైవేటు రంగం వారు దీన్ని అంగీకరించరు.
    వాదన –2: అవును. దీనివల్ల ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి ఉపయోగకరంగా ఉంటుంది.
11. **ప్రకటన:** అన్ని పొగాకు ఉత్పత్తులను మనదేశంలో నిషేధించాలా?
    వాదన –1: లేదు. దీనివల్ల నిరుద్యోగం పెరిగే అవకాశం ఉంది.
    వాదన –2: కాదు. దీనివల్ల పొగాకు ఉత్పత్తుల నుంచి వచ్చే ఆదాయం ప్రభుత్వానికి సమకూరదు.
12. **ప్రకటన:** మనదేశంలో ఆదాయ పన్ను రద్దు చేయాలా?
    వాదన –1: అవును. ఎందుకంటే రోజు కూలీ చేసుకునేవారికి ఇది అదనపు భారంగా మారుతుంది.
    వాదన–2: లేదు. ఎందుకంటే రెవెన్యూ శాఖకు ఇది మంచి ఆదాయ వనరు అవుతుంది.
13. **ప్రకటన:** రక్షణ రంగంలా విద్యను కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి తీసుకురావాలా?
    వాదన –1: లేదు. విద్య రాష్ట్రానికి సంబంధించింది. దీన్ని రాష్ట్ర పరిధిలోనే ఉంచాలి.
    వాదన –2: అవును. అన్ని రాష్ట్రాల్లో ఒకే విధమైన విద్యాభివృద్ధి సాధ్యపడాలంటే ఇది ఒక్కటే మార్గం.
14. **ప్రకటన:** వ్యవసాయంలో క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించాలా?
    వాదన –1: అవును. భూగర్భ జలాలు కలుషితం అవకుండా పరిరక్షించవచ్చు.
    వాదన –2: కాదు. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గుతుంది.
15. **ప్రకటన:** ప్రజాస్వామ్యంలో అన్ని వార్తలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలా?
    వాదన –1: అవును. ప్రత్యేకమైన వార్తలు మాత్రమే ప్రజల్ని కలవరపెడతాయి.
    వాదన –2: కాదు. నియంత్రించిన వార్తలు విశ్వాసం కోల్పోతాయి.
16. **ప్రకటన:** ముంబైలో మళ్లీ పెద్ద పరిశ్రమల స్థాపన అవసరమా?
    వాదన –1: అవును. వాటివల్ల కొత్తగా ఉద్యోగావకాశాలు లభ్యమవుతాయి.
    వాదన –2: లేదు. వాటి వల్ల కాలుష్యం స్థాయి మరింత పెరుగుతుంది.
17. **ప్రకటన:** భారత్‌లో అన్ని రంగాల్లో కంప్యూటరీకరణ అవసరమా?
    వాదన –1: అవును. వాటివల్ల పనినాణ్యత, కచ్చితత్వం పెరుగుతుంది.
    వాదన –2: లేదు. దీనివల్ల ఉద్యోగాల్లో అసమానతలు పెరుగుతాయి. మానవ వనరులు నిరుపయోగం అవుతాయి.
18. **ప్రకటన:** విదేశాలతో నదుల అనుసంధానంపై ప్రణాళిక అవసరమా?
    వాదన –1: అవును. ఎందుకంటే అతివృష్టి, అనావృష్టిలను ఎదుర్కొనొచ్చు.
    వాదన –2: కాదు. ఎక్కువ ధనం ఖర్చు అవుతుంది.
19. **ప్రకటన:** మీడియాలో పొగాకు ఉత్పత్తుల ప్రకటనలను నిషేధించాలా?
    వాదన –1: అవును. కేవలం ఇలా మాత్రమే ప్రజలను కేన్సర్ నుంచి రక్షించొచ్చు.
    వాదన –2: లేదు. దీనివల్ల పొగాకు అమ్మకాలు తగ్గుతాయి.
20. **ప్రకటన:** ఎవరైతే డ్రగ్స్‌కు బానిసై ఇతరులను కూడా ఆ దురలవాట్లకు లోను చేస్తారో వారికి కఠిన శిక్షలు అమలు చెయ్యాలా?
    వాదన –1: కాదు. ఎవరూ.. ఎవరి జీవితాన్ని ప్రభావితం చేయరు.
    వాదన –2: అవును. ఎవరైతే వారి జీవితంతోపాటు ఇతరుల జీవితాన్ని కూడా నాశనం చేయాలనుకుంటారో వాళ్లు చాలా ప్రమాదం.
21. **ప్రకటన:** ఐదో తరగతి వరకు ఉండే అన్ని వార్షిక పరీక్షలు రద్దు చేయాలా?
    వాదన –1: అవును. చిన్న వయసులో విద్యార్థులపై అధిక భారం మోపొద్దు. అలాంటి పరీక్షలు వారి శారీరక, మానసిక ఎదుగుదలపై దుష్ప్రభావం చూపుతాయి.
    వాదన –2: కాదు. అలా చేస్తే విద్యార్థులు శ్రద్ధగా చదవలేరు. అయినప్పటికీ పై తరగతులకు వెళతారు. దీనివల్ల భవిష్యత్తులో చదవబోయేది సమస్యగా మారవచ్చు.
22. **ప్రకటన:** భారతదేశంలోని పత్రికలకు పూర్తి స్థాయిలో స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు ఇవ్వాలా?
    వాదన –1: అవును. దీనివల్ల ప్రజలు రాజకీయం గురించి పూర్తిగా తెలుసుకుంటారు.
    వాదన –2: లేదు. దీనివల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి.
23. **ప్రకటన:** మనదేశంలో వైద్యవృత్తిని జాతీయం చేయాలా?
    వాదన –1: లేదు. ఏ దేశం ఇలాంటి ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలు చేపట్టదు.
    వాదన –1: అవును. దీనివల్ల అవినీతి వైద్య ప్రాక్టీషనర్‌లను తొలగించవచ్చు.

సమాధానాలు

1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 1;
6) 1; 7) 1; 8) 3; 9) 1; 10) 2;
11) 3; 12) 2; 13) 1; 14) 2; 15) 2;
16) 4; 17) 4; 18) 4; 19) 3; 20) 2;
21) 2; 22) 1; 23) 3.

టీఎస్‌పీఎస్సీ ఏఈఈ (మెకానికల్) - 2015లో అడిగిన ప్రశ్న

సూచనలు: నిర్ణయాలు తీసుకునే ముందు ఆ నిర్ణయాలకు ఆధారమైన వాదాల్లో ఏవి బలమైనవి, ఏవి బలహీనమైనవి అని తెలిసి ఉండటం అవసరం. బలమైన వాదాలు ప్రకటనలోని అంశానికి నేరుగా సంబంధం కలిగి ముఖ్యమైనవిగా కూడా ఉంటాయి. బలహీనమైన వాదాలు ప్రకటనలోని అంశానికి దూరంగా సంబంధం కలిగి ఉంటాయి. లేదా అల్పప్రాధాన్యం కలిగి ఉంటాయి.

ఈ ప్రశ్నలో భాగంగా ఒక ప్రకటన, రెండు వాదాలు ఇచ్చారు. ఇచ్చిన ప్రకటనను, వాదాలను పరిశీలించి ఇచ్చిన వాదం బలమైందో/ బలహీనమైందో గుర్తించండి.

ప్రకటన: పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం 'ట్యాబ్స్' ఇవ్వాలా?

వాదం–1: అవును. ట్యాబ్స్ వల్ల బాగా నేర్చుకోవడంతోపాటు మోసుకెళ్లే పుస్తకాల బరువు కూడా తగ్గుతుంది.

వాదం–2: లేదు. విద్యార్థులు 'ట్యాబ్స్'ను దుర్వినియోగపరుస్తారు.

1) వాదం–1 మాత్రమే బలమైంది
2) వాదం–2 మాత్రమే బలమైంది
3) రెండు వాదాలూ బలమైనవి కావు
4) రెండు వాదాలు బలమైనవి

జవాబు: 1

విద్య, ఉద్యోగ సమాచారం

రైట్స్ లిమిటెడ్, గుర్గావ్‌లో 14 రెసిడెంట్ ఇంజనీర్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్) రెసిడెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
- **వేతనం:** నెలకు రూ.23,340.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(మెటలర్జికల్, మెకానికల్ ఇంజనీరింగ్), డిప్లొమా(మెకానికల్, సివిల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 11.03.2025 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.03.2025.
- **హాల్‌టికెట్‌ల డౌన్‌లోడ్ తేది:** 12.03.2025.
- **పరీక్ష తేది:** 23.03.2025.
- **వెబ్‌సైట్:** https://www.rites.com

ఎన్ఏఎఫ్ఈడీ, న్యూఢిల్లీలో 10 మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్ఏఎఫ్ఈడీ).. మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్–04, డిప్యూటీ మేనేజర్(అకౌంట్స్)–04, అసిస్టెంట్ మేనేజర్(లీగల్)–01, అసిస్టెంట్ మేనేజర్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్, ఐటీ), ఎల్ఎల్‌బీ, సీఏ, సీఎంఏ, బీకామ్, ఎంబీఏ(ఫైనాన్స్), మాస్టర్స్(బీఏ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 35 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.47,600 నుంచి రూ.1,51,100, డిప్యూటీ మేనేజర్‌కు రూ.53,100 నుంచి రూ.1,67,800.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.02.2025.
- **వెబ్‌సైట్:** www.nafedindia.com

తెలుగు సాహిత్యంలో ఆదికవి పాల్కురికి సోమన

తెలంగాణ కవులు - సాహిత్యం

శాతవాహన పూర్వ యుగం

పాతరాతి యుగం నుంచి తెలంగాణ ప్రాంతం నివాసయోగ్యంగా ఉండి క్రమంగా ఇక్కడ గ్రామాలు, పట్టణాలు, జనపదాలు ఏర్పడ్డాయి. క్రీ.పూ. 6వ శతాబ్దంలో భారతదేశంలో 16 మహా జనపదాలు ఉండేవి.

అవి:
1) కాశీ – వారణాసి
2) అంగ – చెంప (బెంగాల్)
3) మగధ – పాటలీపుత్రం (బిహార్)
4) అవంతి – ఉజ్జయిని (మధ్యప్రదేశ్)
5) ఛేది – శుక్తిమతి
6) వత్స – కౌశాంబి
7) పాంచాల – అహిచ్ఛత్ర
8) శూరసేన – మధుర
9) మత్స్య – విరాటనగరం
10) అస్మక – పోతన(నేటి బోధన్)
11) గాంధార – తక్షశిల
12) కాంభోజ – రాజపురం
13) కోసల – శ్రావస్తి
14) మల్ల – పావాపురి
15) వజ్జి – వైశాలి
16) కురు – ఇంద్రప్రస్థ (ఢిల్లీ).

వీటిలో అస్మక (పాళీ భాషలో అశ్మక, అస్సక, అసక అనే పేర్లతో పిలిచేవారు) జనపదం గోదావరి, మంజీరా తీరాల వెంట కొంత మహారాష్ట్ర, కొంత తెలంగాణాలో ఉండేది. ఈ జనపదంలో, ముళక జనపదంలోని నేటి కొన్ని తెలంగాణా ప్రాంతాల్లో, కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాలలో దొరికిన నాణేల ఆధారంగా శాతవాహనుల కంటే ముందే ఇక్కడ రాజ్యం ఏర్పడిందని తెలుస్తోంది.

మరిన్ని ఆధారాలు:

1. అశోకుడి 13వ శిలాశాసనంలో తెలంగాణ ప్రాంతంలోని అటవీ జాతుల గురించి వివరించారు.
2. సంగం (ప్రాచీన తమిళ కవుల సభ) సాహిత్యంలో కూడా తెలంగాణ ప్రాంత ప్రజల ఆహార, సామాజిక విషయాల గురించి ప్రస్తావించారు. శాతవాహనులు మొదట తమ రాజ్యాన్ని తెలంగాణ (కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలు)లో స్థాపించారు.

శాతవాహన యుగానికి చెందిన కవులు – గ్రంథాలు:

గుణాఢ్యుడు: ఇతడు పైశాచీ ప్రాకృత భాషలో 'బృహత్‌కథ' రచించాడు. పైశాచీ అంటే వాడుక భాష. ఇతడు తెలంగాణ వాడుక భాషలో ఈ గ్రంథాన్ని రచించాడని చరిత్రకారులు భావిస్తున్నారు. పైశాచీ భాషపై ప్రాకృతం, ప్రాకృతంపై సంస్కృతం ఆధిపత్యం చూపాయి. ప్రాచీన తెలుగు భాషనే దేశీ భాష అని డాక్టర్ దినేశ్ చంద్ర సర్కార్ అనే పండితుడి అభిప్రాయం.

గుణాఢ్యుడిని తెలంగాణ మొదటి లిఖిత కవిగా పేర్కొంటారు. ఇతడు 'బృహత్‌కథ' గ్రంథాన్ని మెదక్ జిల్లాలోని కొండాపురంలో రచించాడని చరిత్రకారులు భావిస్తున్నారు. బృహత్‌కథను మూలకథగా తీసుకొని క్షేమేంద్రుడు 'బృహత్ కథామంజరి', సోమదేవసూరి 'కథా సరిత్సాగరం' రచించారు.

హాలుడు: శాతవాహన వంశానికి చెందిన 17వ రాజైన హాలుడు స్వయంగా కవి. ఇతడు 'గాథా సప్తశతి' గ్రంథాన్ని ప్రాకృత భాషలో రాశాడు. ఇందులో సుమారు 700 గ్రామీణ శృంగార కథలను సంకలనం చేశాడు. ఈ గ్రంథాన్ని శివస్తుతితో ప్రారంభించాడు. తెలంగాణలోని 350 కవుల గురించి కూడా వివరించాడు. తెలంగాణ శాసనాల్లో లభించిన తొలి కంద పద్యాలకు, గాథాసప్తశతిలోని పద్యాల చంధస్సుకు దగ్గరి పోలికలు ఉన్నాయి.

ఇక్ష్వాకులు (క్రీ.శ. 225-300)

శాతవాహన సామంత రాజుల్లో ఇక్ష్వాకులు ఒకరు. ఇక్ష్వాక వంశానికి చెందిన వాసిష్ఠీపుత్ర శాంతామూలుడు మరికొంత మంది సామంత రాజులతో కలిసి శాతవాహన చివరి రాజైన మూడో పులోమావిని ఓడించి స్వతంత్ర రాజ్య స్థాపన చేశాడు. ఈ రాజ్యాన్ని విజయపురి (నాగార్జునసాగర్)లో స్థాపించాడు. వీరి రాజ్యభాగాల విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. గుంటూరు, ప్రకాశం, కడప, కర్నూలు, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, తూర్పు గోదావరి జిల్లాలు వీరి పాలనా కేంద్రాలని డాక్టర్ కృష్ణారావు పేర్కొన్నారు.

ఇక్ష్వాకుల ప్రాధాన్యం

1. దేవాలయాలు నిర్మించిన తొలి రాజులు.
2. సంస్కృతంలో శాసనాలు ముద్రించిన తొలి దక్షిణ భారత రాజులు.
3. వీరు ప్రాకృతాన్ని పోషించినప్పటికీ తెలుగు భాష కూడా వాడుకలో ఉంది. వీరు మహాతలవర, సిరి, ఖండ, చలికి, బాపి, అంక తదితర పదాలను ఉపయోగించినట్లు ఆధారాలున్నాయి.

వాకాటకులు (క్రీ.శ. 250-550)

వాకాటకుల తొలి రాజ్యం బీరార్ (విదర్భ). వీరు ఉత్తర తెలంగాణ జిల్లాలను పాలించారు. ఈ రాజ్యస్థాపకుడు వింధ్యశక్తి. వాకాటక పాలకులు పండిత పోషకులే కాకుండా స్వయంగా గొప్ప కవులు. గుప్తుల్లో ఏకైక రాణి ప్రభావతి గుప్త (రెండో చంద్రగుప్తుడి కుమార్తె) ఈ ప్రాంతాన్ని పాలించారు.

కాళిదాసు: ఇతడు నవరత్నాల్లో ఒకడు. కాళిదాసు మొదట వాకాటక రాజ్యంలో నివసించాడు. ఇతడు మేఘదూతం (మేఘ సందేశం) నాటకాన్ని వాకాటక రాజ్యంలో రాంటెక్ (కరీంనగర్ జిల్లా రామగిరి)లో రచించాడు.

రెండో ప్రవరసేనుడు: ఇతడు 'సేతుబంధం' (సంస్కృతం) రచించాడు. ఇది శ్రీరాముడు లంకా నగరంపై చేసిన దాడిని ఇతివృత్తంగా చేసుకొని



రచించిన గ్రంథం. గాథాసప్తశతిలో ఉన్న అనేక గాథల్ని ఇందులో రచించాడు.

వాకాటకుల అజంతా, ఎల్లోరా గుహల్లో 16వ, 17వ నంబరు విహార గుహలను, 19వ నంబరు చైత్య గుహను నిర్మించారు. వీరి రాజధాని వత్సగుల్మ గొప్ప సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లింది.

విష్ణుకుండినులు (358-575)

ఈ రాజ్యస్థాపకుడు ఇంద్రవర్మ. ఏలేశ్వరం, మిర్యాలగూడ, నల్లగొండ, భువనగిరి, కీసర, ఇంద్రపాలనగరం ప్రాంతాలను ఆక్రమించి ఇంద్రపాలనగరం రాజధానిగా క్రీ.శ. 358లో రాజ్యం స్థాపించాడు. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలోని రామన్నపేట సమీపంలో ఉన్న తుమ్మలగూడెమే నాటి ఇంద్రపాలనగరం.

మాదవ వర్మ: 'జనాశ్రయ చంధో విచ్ఛిత్తి' గ్రంథం రచించాడు. ఇందులో ద్విపద, త్రిపద పద్యాలతో పాటు వివిధ జాతుల పద్యాలు ఉన్నాయి.

బాదామి చాళుక్యులు (546-755)

జయసింహవల్లభుడు: ఇతడు బాదామి లేదా వాతాపి చాళుక్య వంశ స్థాపకుడు. చాళుక్యులు కృష్ణా – తుంగభద్ర నదుల అంతర్వేదికి చెందినవారని భావిస్తున్నారు. వీరు మొదట ఇక్ష్వాకుల వద్ద అధికారులుగా, సామంతులుగా ఉన్నారు. తర్వాత వాకాటక రాజ్యంలో ఉండి, ఆ రాజ్యం విష్ణుకుండినుల రాజ్యంలో విలీనమైన తర్వాత విష్ణుకుండినులకు సామంతులుగా వ్యవహరించారు. అనంతరం పశ్చిమ దిశలో బాదామి వైపు పయనించి అక్కడ స్వతంత్ర రాజ్యం స్థాపించారు.

భవభూతి: ఇతడు 'మాలతీమాధవం' అనే గ్రంథాన్ని సంస్కృతంలో రచించాడు. భవభూతి నాడు తెలంగాణ ప్రాంతంలో సుప్రసిద్ధ కవి. ఇతడు కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో నివసించాడు. ఇతడు కాళప్రియనాథుడి భక్తుడు. కృష్ణయజుర్వేద తైత్తరీయశాఖకు చెందినవాడు. ఇతడి కీర్తి ప్రతిష్ఠలను విని యశోవర్మ తన ఆస్థానకవిగా నియమించుకున్నాడు. కాళిదాసు, భారవి లాంటి మహాకవులకు సమానంగా ప్రశంసలు పొందిన గొప్ప వ్యక్తి. ఇతడు ఉత్తర రామ చరిత, మహావీర చరిత్ర అనే నాటకాలు కూడా రచించాడు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

తెలంగాణ చరిత్ర

సంస్కృతి - వారసత్వం

రాష్ట్రకూటులు

ఈ రాజ్యస్థాపకుడు దంతిదుర్గుడు. వీరు బాదామి చాళుక్యులకు సామంతులుగా ఉండి ఆ తర్వాత స్వతంత్ర్య రాజ్య స్థాపన చేశారు. తెలంగాణ ప్రాంతం కూడా రాష్ట్రకూటుల పాలనలోకి వచ్చింది. వీరి రాజధాని మాన్యఖేటం. ఈ వంశంలో చివరి రాజైన రెండో కర్కరాజు (1972-73)ను కల్యాణి చాళుక్య రాజైన రెండో తైలపుడు ఓడించడంతో రాష్ట్రకూట రాజ్యం అంతమైంది.

రాష్ట్రకూటుల సాహిత్యం:

అమోఘవర్షుడు కన్నడ భాషలో 'కవిరాజమార్గం' గ్రంథాన్ని రచించాడు. ఇతడు 'రత్నమాలిక' అనే చంధోవిచ్ఛిత్తి గ్రంథాన్ని కూడా రచించాడు.

ముదిగొండ చాళుక్యులు

మూడో కుసుమాయుధుడు: ఇతడికి 'వినేత జనాశ్రయుడు' అనే బిరుదు ఉంది. కొరివి శాసనం నిర్మాత ఇతడే. ఇది తెలుగులో తొలి గద్య శాసనం. ఇందులో వచన రచన మృదుమధురంగా ఉంది.

వేములవాడ చాళుక్యులు

మొదటి హరికేసరి: ఇతడు వేములవాడ శాసనం నిర్మాత. రాష్ట్రకూట రాజైన ధ్రువుడికి సామంతుడు.

రెండో హరికేసరి: ఇతడు కన్నడ భాషను పోషించిన వేములవాడ చాళుక్యరాజు. ఇతడి ఆస్థానంలో పంప మహాకవి ఉన్నాడు. పంపకవి 'విక్రమార్జున విజయం' రచించాడు. ఇతడు ఆదిపురాణం, తెలుగులో జినేంద్రపురాణం కూడా రచించాడు. రెండో హరికేసరి ఇతడికి 'ధర్మపురం' గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చి సత్కరించాడు.

సోమదేవసూరి: ఇతడు 'కథా సరిత్సాగరం' గ్రంథం రచించాడు. ఇతడు మూడో హరికేసరి ఆస్థానంలో ఉన్నాడు. సోమదేవసూరికి 'శద్వాద చల సింహ' అనే బిరుదు ఉంది. ఇతడు మూడు తరాల జైనగురువుగా ఉన్నాడు. ఇతడు 'యశస్తిలక చంపువు' అనే సంస్కృత కథా కావ్యం రచించాడు.

బద్దెన: 'నీతిశాస్త్ర ముక్తావళి' గ్రంథకర్త.

రేచన: 'కవిజనాశ్రయం' గ్రంథ రచయిత.

కల్యాణి చాళుక్యులు

నల్లగొండ జిల్లాలోని కొలనుపాక వీరి సైనిక కేంద్రం. వీరు వీరశైవాన్ని ఆదరించారు. వీరి కాలంలో సంస్కృతం స్థానంలో దేశభాషలు క్రమంగా గౌరవం, రాజాదరణ పొందాయి.

కందూరి చోళులు

వీరి కాలంలో తెలుగు, కన్నడ భాషలకు ఒకే లిపి ఉండేది. వీరి శాసనాలు తెలుగు, కన్నడ లిపుల్లో ఉన్నాయి. వీరు గొప్ప కవి పోషకులు.

ఒకటో గోకర్ణుడు: 'గోకర్ణ చంధస్సు' అనే లక్షణ గ్రంథం రచించాడు.

ఉదయాదిత్యుడు: 'ఉదయాదిత్యాలంకారం' అనే లక్షణ గ్రంథం రచించాడు.

విరియాల కామసాని: గూడూరి శాసనం వేయించారు. నన్నయకు ముందే వృత్త పద్యాలు వాడిన తొలి శాసనం ఇదే.

నరహరి: ప్రసిద్ధ లాక్షణికుడు మమ్మటుడు రచించిన కావ్య ప్రణాళికకు ఇతడు 'బాల చిత్తానురంజన' పేరుతో వ్యాఖ్యానం చేశాడు. 'స్మృతి దర్పణం', 'తర్కరత్నం' ఇతడి రచనలు.

కాకతీయులు

కాకతీయులు రాష్ట్రకూట వంశానికి చెందినవారు. వీరు మొదట తూర్పు చాళుక్యులకు సామంతులుగా ఉన్నారు. తెలంగాణా ప్రాంతానికి వచ్చి స్వతంత్ర రాజ్య స్థాపన చేశారు. ఆ తర్వాత యావదాంధ్రకు విస్తరించారు.

రెండో ప్రోలరాజు: మాటేడు శాసనం రచించాడు. కాకతీయుల మొదటి తెలుగు గద్య, పద్యాత్మక శాసనం ఇదే.

రుద్రదేవుడు లేదా ప్రతాపరుద్రుడు: ఇతడు తెలుగులో 'నీతిసారం' గ్రంథాన్ని రచించాడు. మానవల్లి రామకృష్ణ సంస్కృతంలో 'నీతిసారం' రచించాడు. ఇందులోని 111 పద్యాలను మడికి సింగన 'సకల నీతి సమ్మతం'లో ఉదహరించాడు.

అచింతేంద్రయతి: వేయి స్తంభాల గుడిలోని శాసనం (హన్మకొండ శాసనం) నిర్మాత ఇతడే. 1163లో ప్రతాపరుద్రుడు హన్మకొండలో వేయి స్తంభాల గుడి నిర్మించి, రుద్రేశ్వరాలయంగా పిలిచాడు. ఇందులో త్రికూటశైలి ప్రవేశపెట్టాడు. ఈ గుడి 2013లో 850 ఏళ్లు పూర్తి చేసుకుంది.

పాల్కురికి సోమనాథుడు (1160-1240): ఈయన 'పండితారాధ్య చరిత్ర' రచించాడు. ఏ సంస్కృత పురాణంలో లేని స్వతంత్ర ఇతి వృత్తాన్ని తీసుకొని, పూర్తిగా దేశీయమైన భాషను ఉపయోగించాడు.

పాల్కురికి రాసిన గ్రంథాలు:
1) అనుభవసారం
2) చతుర్వేద సార సూక్తులు
3) సోమనాథభాష్యం
4) రుద్రభాష్యం
5) బసవరగడ
6) గంగోత్పత్తి రగడ
7) శ్రీ బసవాద్య రగడ
8) సద్గురు రగడ
9) చెన్నమల్లు సీసములు
10) మల్లమదేవి పురాణం (అలభ్యం)
11) శీల సంపాదన (కన్నడ)
12) బసవపురాణం
13) బెజ్జమహాదేవికథ

జాయపసేనాని (1199-1259): ఇతడు నృత్త రత్నావళి, గీత రత్నావళి, నాట్య రత్నావళి గ్రంథాలను సంస్కృతంలో రచించాడు. పాకాల చెరువు శాసనం, కలువ కొలను శాసనం రచించాడే. నృత్యానికి సంబంధించిన లక్షణ గ్రంథం రాసిన తెలుగు వారిలో మొదటివాడు ఇతడే. కవి పోషకుడైన కాకతి గణపతిదేవుడికి ఇతడు బావమరిది. జాయపసేనాని గజ సైన్యాధ్యక్షుడిగా కూడా పని చేశాడు. గణపతి దేవుడు ఇతడి సోదరిని వివాహం చేసుకొని చిన్నతనంలోనే ఇతడిని తీసుకెళ్లి గుండమాత్యుని దగ్గర చేర్పించాడు. గుండమాత్యుడు ఇతడిని గొప్ప సాహిత్య, సంగీత విద్వాంసుడిగా తీర్చిదిద్దాడు. జాయపసేనాని.. భరతుడి నాట్య శాస్త్రం మొదలు కొని తన కాలం దాకా వచ్చిన అనేక నాట్య, నృత్య, శాస్త్ర గ్రంథాలను కూలంకషంగా పరిశీలించి స్వతంత్ర ప్రతిపత్తితో ప్రామాణిక గ్రంథాన్ని రచించాడు. ఇతడు తన గ్రంథాల్లో పేరిణి నాట్యం గురించి కూడా వివరించాడు. ఇతడు 'కవి చక్రవర్తి'గా ప్రసిద్ధి చెందాడు.

Number of messages used per person?

MODEL QUESTIONS

Directions (Q. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The number of people (1)/ who fail each year (2)/ is now in (3)/ single figure. (4)/ no error (5)
2. The experiments (1)/ were carried out (2)/ under simulation (3)/ examination conditions. (4)/ no error (5)
3. The game will be (1)/ broadcasted (2)/ simultaneously (3)/ on TV and radio. (4)/ no error (5)
4. He seemed sincere (1)/ enough when (2)/ he said he (3)/ wants to help. (4)/ no error (5)
5. My teaching style (1)/ is similar (2)/ to that of most (3)/ other teacher. (4)/ no error (5)
6. A report showing (1)/ the company's current situation shows (2)/ how people are influenced by (3)/ TV advertisements. (4)/ no error (5)
7. Market research has shown (1)/ us people want quality, (2)/ not just (3)/ low prices. (4)/ no error (5)
8. Candidates which are (1)/ shortlisted for interview (2)/ will be contacted by the end (3)/ of the week. (4)/ no error (5)
9. If I was asked (1)/ to work (2)/ on Sundays, (3)/ I should resign. (4)/ no error (5)
10. Though many companies know the fact (1)/ that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ no error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.



11. In order that training should be ______ it must be planned ______.
   1) affected…thoroughly
   2) affective…periodically
   3) executed…properly
   4) effective…systematically
   5) complete…beforehand
12. Terrorist groups ______ responsibility for the shootings and bomb ______.
   1) charged…blasts
   2) levied…plants
   3) claimed…attacks
   4) withdraw…pits
   5) involved…calls
13. She is very ______ to other people's feelings.
   1) sensible 2) sensibility
   3) sensation 4) sensitive
   5) sensitize
14. Paying children too much ______ when they misbehave can be self ______.
   1) pampering…appealing
   2) negligence…destruction
   3) attention…defeating
   4) care…appease
   5) love…developing
15. Market researches often segment the population on the ______ of age and ______ class.
   1) grade…economy
   2) rate…affluent
   3) unit…security
   4) track…wealthy
   5) basis…social

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

BANK EXAMS
GENERAL ENGLISH

A) If you knew the improved card deal is better than other cards you have, you may want to consider keeping it and cancelling the other card instead. Otherwise, cancel the card that you had decided to give up.
B) The first step in cancelling a card is to contact the card issuer. Some issuers let you cancel an account by phone. You may be transferred to a customer care officer who will try to convince you to keep the card.
C) Be sure to ask your issuer to record that the account was "closed at customer's request."
D) Make a note of the day and time you called and the person you talked to for your records. A written confirmation that an account has been closed should be sent to you from the card issuer.
E) Go ahead and listen. They may be willing to lower your interest rate, waive an annual fee or upgrade your card. Some issues have been known to offer plane tickets or travel vouchers to customers who want to cancel a card.
F) Keep this notice carefully for your records. If anything goes wrong with the account at a later date, you've got proof that you closed it.

16. What is the LAST sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
   1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
   1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21 - 25): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. We are concrete seeking new ways of expanding our membership.
   1) evidence 2) fastly
   3) purposely 4) currently
   5) no correction required
22. Rumours that he have flown from the country were promptly scotched by his wife.
   1) had to flow 2) had been flew
   3) had fled
   4) had been flowing
   5) no correction required
23. Coal is a natural resource, which constitutes approximately 85% of the total fossil fuel reservation in the world.
   1) reserves 2) reserved
   3) reserve 4) reserving
   5) no correction required
24. Even among the native users of English, plain and direct language is regarded as a virtue in communication.
   1) between a native
   2) between an native
   3) among a native
   4) among nativity
   5) no correction required
25. Professional person at the work place frequently dealing in material which he must understand and also remember for future use.
   1) dealt with material
   2) deal in material
   3) deals with materials
   4) deal among material
   5) no correction required

Directions (Q. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

The first commercial SMS message was sent over the Vodafone GSM network in the United Kingdom on 3 December 1992, from Neil Papworth of Sema Group to Richard Jarvis of Vodafone. The text of the message was "Merry Christmas." The first SMS typed on a GSM phone is claimed to have been sent by Riku Pihkonen, an engineer student at Nokia in 1993.

Initial growth was slow, with customers in 1995 sending on an average only 0.4 messages per GSM customer per month. By the end of 2000, the average number of messages per user reached 35.

Short message services are developing very rapidly throughout the world. In 2000, just 17 billion SMS messages were sent; in 2001 the number was up to 250 billion and 500 billion SMS messages in 2004. At an average cost of USD 0.10 per message, this generates revenues in excess of $50 billion for mobile telephone operators and represents close to 100 text messages for every person in the world.

SMS is particularly popular in Europe, Asia - excluding Japan, Australia and New Zealand. Popularity has grown to a sufficient extent that the term texting has entered the common lexicon. In China, SMS is very popular, and has brought service providers significant profit; it is also a very influential and powerful tool in the Philippines, where the average user sends 10-12 text messages a day. The Philippines alone sends on the average 400 million text messages a day, more than the annual average SMS volume of countries in Europe, and even China. SMS is hugely popular in India, where youngsters often exchange lots of text messages, and companies provide alerts, infotainment, news, cricket scores, railway/airline booking, mobile billing and banking services on SMS. In India, metropolitan media outlets often take real-time polls and audience opinion through SMS, via reserved 4-digit numbers that redirect the information to the respective aforementioned outlets based on designated prefix codes.

26. The Asian country where SMS is not very popular is
   1) Philippines 2) Japan
   3) Australia 4) China
   5) Europe
27. The number of messages that an average user sends in the Philippines is
   1) more than the annual average SMS volume of countries in Europe, and even China
   2) more than the annual average SMS volume of countries in India, and even China
   3) more than the annual average SMS volume of countries in Europe, Australia and even China
   4) more than or equal to the annual average SMS volume of countries in Europe, and even China
   5) less than the annual average SMS volume of countries in Europe, and even China
28. Services provided by SMS to Indian users include
   1) emergency services
   2) fire services
   3) mobile billing
   4) 108 services
   5) counseling
29. Average number of messages used per person
   1) 10-12 messages a day
   2) 400 million text messages a day
   3) 100 text messages
   4) 500 messages
   5) 2000 messages per day
30. Lexicon means
   1) glossary 2) glossy
   3) lustrous 4) inventory
   5) catalog

Key

1) 4 2) 3 3) 2 4) 4 5) 4
6) 5 7) 2 8) 1 9) 1 10) 3
11) 4 12) 3 13) 4 14) 3 15) 5
16) 5 17) 5 18) 2 19) 1 20) 1
21) 4 22) 3 23) 1 24) 5 25) 3
26) 2 27) 1 28) 3 29) 1 30) 1